జూన్ - 2019


DECCAN LAND, HYDERABAD

82

₹30

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక







- ఆధునికతకు ఆద్యుడు షంషుల్ ఉమ్రా
- కళాఖండాల సృష్టికర్త సూర్యప్రకాశ్
- సినిమాపై ఎగిరేసిన జెండా-రిత్విక్ ఘటక్
- డా॥ కూరెళ్ళ విఠలాచార్య.. పలకరింపు








Artist:

**SURYA PRAKASH**

విశాలమైన మైదానాలకు రంగులద్ది ఎండిపోయిన ప్రకృతికి జీవం పోసిన మేటి కళాకారుడు సూర్యప్రకాశ్. పచ్చని ప్రకృతిని కళ్లముందు ఆవిష్కరింపజేయడమే కాదు చిత్రకళకు నడకలు నేర్పిన కళాపిపాసి. ఆయన ప్రకృతి దృశ్యాలను బ్రష్‌స్ట్రోక్‌లతో సృష్టించిన తీరు అంతర్జాతీయ యవనికపై వైవిధ్యతను సంతరించుకుంది. పనికిరాని వస్తువులే కాదు పారవేసిన చెత్తాచెదారం నుంచి కళా సృజన చేయడం ఒక్క సూర్యప్రకాశ్‌కే చెల్లింది. మృత్యువు కూడా విశ్వంలో ఒక జీవితమే అని నమ్మిన గొప్ప కళాకారుడు. ప్రకృతి నుంచి ప్రేరణ పొందిన సూర్యప్రకాశ్ ప్రకృతిని అనుసరించాడు, ప్రకృతిని ప్రేమించాడు, ప్రకృతిని ఆదరించాడు.
































## అబ్‌స్ట్రాక్ట్ చిత్రకళలో చెరిగిపోని ముద్ర సూర్య ప్రకాశ్

అబ్‌స్ట్రాక్ట్ చిత్రకళలో చెరిగిపోని ముద్ర సూర్య ప్రకాశ్. రంగులు చిలకరించడమేకాదు, ప్రకృతి అందాలను అత్యద్భుతంగా ఆవిష్కరింపజేయడంలో దిట్ట. అందమైన అడవులు, విశాలమైన మైదానాలను సృష్టించడంలో ఆరితేరిన గొప్ప కళాకారుడు. ఇరుకు గల్లీలను వాస్తవిక ధోరణిలో చిత్రీకరించి అంతర్జాతీయ యవనికపై ఓలలాడించిన అపురూప కళాకారుడు. అందమైన పూలు, నీటి మడుగులే కాదు, విరబూసిన వనాలు, పచ్చికమైదానాలు ఆయన కాన్వాస్‌పై చిత్రించబడ్డాయి. సీసీఎంబీలో రెసిడెన్షియల్ ఆర్టిస్టుగా, ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రిలో రెసిడెంట్ ఆర్టిస్టుగా పనిచేసి ఎన్నో అపురూపమైన చిత్రకళా ఖండాలకు జీవం పోశారు. ప్రకాశ్ ఇప్పటి వరకు 55కిపైగా సోలో ఎగ్జిబిషన్లు, 100కిపైగా గ్రూఫ్ షోలలో పాల్గొని ఔరా అనిపించారు.

TELANGANA RESOURCE CENTRE

**"CHANDRAM"** 490, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com







## జానపద కథా పుట్టినిల్లు భారతదేశం

ప్రపంచ జానపద కథా సాహిత్యంలో భారతదేశానిది అగ్రస్థానం అన్నది సత్యం. దానికి కారణం ప్రపంచానికి కథాభిక్ష పెట్టింది భారతదేశమేనని అనేక మంది అభిప్రాయం. ఈ భూమి మీద పుట్టిన మానవుడు తన మనసులోని ఊహలను, అభిప్రాయాలను ఏనాడు వ్యక్తం చేయడం మొదలుపెట్టాడో ఆనాడే పుట్టింది కథ. మానవుడు సంఘజీవి, కాబట్టి తన అనుభవాలను, అనుభూతులను, ఆశలను,ఆకాంక్షలను మరొక వ్యక్తికి చెప్పుకోవడం మొదలైన నాటినుండే కథ ఉందనే చెప్పవచ్చు. మూడు లక్షల సంవత్సరాల క్రితం ఏర్పడిన మానవ జాతి ఇటీవలి వరకు మూగబోయి ఉండటం సమంజసం కాదు. అంటే అనుభవాలను, అనుభూతులను, వేదనలను వేరొకరితో పంచుకోకుండా ఉండగలరా? అంటే ఏదో ఒక రకంగా వ్యక్తం చేసి ఉన్నట్లే కదా! డాక్టర్ భట్టు సుధాకర్ వెలువరించిన అభిప్రాయాలు ఆదర్శప్రాయమైనవి.

– **సత్యనారాయణ,** వరంగల్

❖ ❖ ❖

## జీవితాన్ని కవిత్వంలోకి వొంపిన యుద్ధభూమి

అస్థిత్వ ఉద్యమమేదైనా ఉవ్వెత్తున ఎగిసిపడే కవిత్వ కెరటం, వెలివాడ వెతలను కథలుగా మలిచి ప్రపంచానికి చాటి చెప్పిన కథకుడు, తెలంగాణ ఉద్యమంలో అలుగై పొంగిన పాటగాడు, ఆధునిక దళిత కవిత్వ అడుగుజాడ పసునూరి రవీందర్. టెక్నాలజీ పరంగా ప్రపంచంతో పోటీపడుతున్న తరుణంలో కూడా ఊరుకు దూరంగా దారిద్ర్యం అనుభవిస్తున్న దళిత జీవితాలను కవిత్వపు కుప్పలుగా పోయడం రవీందర్ కవిత్వానికి నిదర్శనం. కుల పునాదులను కూకటివేళ్లతో పెకిలించివేయాలని అనాదిగా ఉద్యమాలు జరుగుతున్నాయనే అంశాన్ని తన కవిత్వంలో వెలుగెత్తి చాటడం శుభ పరిణామం. "కలిసి తినే తావు కలిసి బతికే రేవు" అంటూ భాగ్యనగరం మీద పావురం అక్షరాలతో ఆవిష్కరించారు. వెలివాడ నన్ను వీడని నెట్‌వర్క్, కులం నా వెంట నడిచే వైపై అని ఒక చోట అంటాడు. ఇట్లాంటి వెంటాడే వాక్యాలు ఈ కవిత్వం నిండా ఎన్నో ఉన్నాయి. ఇట్లా ఈ తరం కవుల్లో బలమైన గొంతుక పసునూరి అంటే అతిశయోక్తి కాదేమో.

– **పవన్,** కరీంనగర్

❖ ❖ ❖

## సాగర మథనం పరిచయం

కీ.శే. సుబ్రమణ్యంగారి 'సాగర మథనం' గురించి నారాయణదాసు మంజుల విశ్లేషణ అద్భుతంగా ఉంది. సుబ్రమణ్యంగారు 29 సంవత్సరాల వయస్సులోనే మరణించారు. తన 19వ ఏట నుంచి పది సంవత్సరాల కాలంలో రాసిన కవితా సంపుటాలు ఈ నాలుగు. వీటిని ఒకే సంపుటంగా ప్రచురించిన వారి కుటుంబీకులు అభినందనీయులు. ఆనాటి కవిని ఈ నాటి పాఠకులకు పరిచయం చేసిన మంజుల గారికి ధన్యవాదాలు.

– **రావూరి వెన్నెల,** తెనాలి

## ఆన్‌లైన్ ద్వారా దక్కన్ ల్యాండ్ చందా చెల్లింపు

**దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరాలు**

Name : DECCAN LAND,
Kotak Account No: 7111218829
Bank: KOTAK MAHINDRA BANK
IFSC Code: KKBK0007463
Branch Code : 007463

## త్వరలో మీ ముందుకు 'బాలచెలిమి'

చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ ఆధ్వర్యంలో మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాస పత్రికను రంగులతో 48 పేజీలు ఆగస్టు మాసం నుండి అందచేస్తామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. బాలలలో సృజనాత్మకతను పెంచి విజ్ఞాన, వినోదాలను అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగే 'బాల చెలిమి'ని త్వరలో మీ ముందుకు తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రతి నెలా రెండవ శనివారం నిర్వహిస్తున్న **'బాలచెలిమి–ముచ్చట్ల'**లో ప్రసిద్ధ రచయితలు, మేధావులు, ఆర్టిస్ట్‌లు, ఫోటోగ్రాఫర్‌లు, పబ్లిషర్స్, ప్రింటర్స్ పాల్గొని తమ సూచనలు, సలహాలు అందిస్తున్నారు. బాల రచయితల నుండి బాలల కథలు, గేయాలు, కవితలు, స్కెచ్‌లు, వ్యాసాలు, పొడుపుకథలు, సామెతలు, జాతీయాలు బాలచెలిమిలో ప్రచురణ కోసం ఆహ్వానిస్తున్నాం. బాలచెలిమిని www.balachelimi.com వెబ్‌సైట్‌లో కూడా చూడవచ్చు.

**–చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ**

బాల చెలిమి

**మీ రచనలు మాకు పంపవలసిన చిరునామా:**
ఎడిటర్, "బాలచెలిమి", చంద్రం, 3–6–712/2, స్ట్రీట్ నెం:12, హిమాయత్‌నగర్, హైదరాబాద్–500029, తెలంగాణ.
Mobile: 9030626288
E-Mail: desk.chelimi@gmail.com
Website: www.balachelimi.com

ISSN 2581-3188

విషయసూచిక

# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 7 సంచిక: 10 పేజీలు: 68

జూన్ - 2019

# లోపలి పేజీల్లో...




| | | |
|---|---|---|
| తెలంగాణ ఉద్యమ మాష్టారు.. జయశంకరు సారు | డా॥ తిరుమలేష్ | 6 |
| రాష్ట్రాలకు సమాన హక్కులుండాలి (ఎడిటోరియల్) | ఎం. వేదకుమార్ | 7 |
| ఆధునికతకు ఆద్యుడు షంషుల్ ఉమ్రా | సంగిశెట్టి శ్రీనివాస్ | 9 |
| "తెలంగాణ సాహిత్య అకాడమీ" | దక్కన్ న్యూస్ | 12 |
| సంస్థానాల్లో సాంస్కృతిక దివిటీ: ఆదిపూడి ప్రభాకరరావు | డా॥ జె. విజయ్‌కుమార్జీ | 13 |
| ఒక సత్య పథికుడి తాత్విక యానం | పరవస్తు లోకేశ్వర్ | 17 |
| ఎర్మేదల యనమాదల కాదు వెల్మజాల | ప్రొ. హరగోపాల్ | 19 |
| భూగర్భ సిరి.. సర్వే ఆఫ్ ఇండియా | కట్టా ప్రభాకర్ | 21 |
| రాచకొండ రాజ్యం - పాలకులు | సంగనభట్ల నర్సయ్య | 23 |
| తోటి గిరిజన కళారూపం - ప్రదర్శనలో వైవిధ్యాలు | డా॥ శ్రీమంతుల దామోదర్ | 25 |
| అమరుల త్యాగాలతో పల్లవించిన నీరుడి దుర్గేష్ పాటలు | అంబటి వేకువ | 27 |
| రుద్రమదేవి శిల్పాలు | ద్యావనపల్లి సత్యనారాయణ | 29 |
| సృజనశీలురు పకిడే అరవింద్ | అనిల్ | 31 |
| కళాఖండాల సృష్టికర్త సూర్యప్రకాశ్ | రామకృష్ణ కాంపాటి | 33 |
| రిత్విక్ ఘటక్ | హెచ్. రమేష్‌బాబు | 37 |
| రాచకొండ సాహిత్యం | ప్రొ॥ తంగెడ కిషన్‌రావు | 40 |
| తెలుగు జాతి వైతాళికులు సురవరం ప్రతాపరెడ్డి | జుగాష్‌విలి | 43 |
| ఆచార్య కూరెళ్ళ విఠలాచార్య.. జ్ఞాపకాలతో పలకరింపు | కె. రామదాసు | 45 |
| సాహిత్యమే బాలలకు బంగారు భవిష్యత్ | నీరజ | 49 |
| సరికొత్త కవిత్వానికి చిరునామా 'మెద' | డా॥ కృష్ణ కౌండిన్య తండు | 51 |
| 'గమనం' సాహిత్య సంపుటి ఆవిష్కరణ | దక్కన్ న్యూస్ | 53 |
| 'తొవ్వ ముచ్చట్లు' నాలుగవ భాగం ఆవిష్కరణ | ఆర్. పురుషోత్తం నాయుడు | 55 |
| శిక్ష | డా॥ సిద్దెంకి యాదగిరి | 57 |
| బాలసాహిత్యం - నా అనుభవాలు - సూచనలు | ఆర్. పురుషోత్తం నాయుడు | 59 |
| గల్మ గుండా కవన జలాలు! | డా॥ నాళేశ్వరం శంకరం | 63 |
| పుస్తకాలు | దక్కన్ న్యూస్ | 66 |


సంపాదకులు
**మణికొండ వేదకుమార్**
9848044713
editordeccan@gmail.com

సహాయ సంపాదకులు
**జుగాష్ విలి**

స్పెషల్ కరస్పాండెంట్
**కె. ప్రభాకర్**
8106721111

సర్క్యులేషన్
**హెచ్. మోహన్‌లాల్**

వాణిజ్య ప్రకటనలు
**నీరజ**
9030626288

ఫొటోగ్రాఫర్
**టి.స్వామి**
8374995555

కవర్‌పేజీ ముఖచిత్రం
**సూర్య ప్రకాశ్**

చిత్రాలు
**కూరెళ్ల శ్రీనివాస్**

layout & composing @
CHARITHA IMPRESSIONS

printed @ DECCAN PRESS
ఆజామాబాద్, హైదరాబాద్-500 020.

కార్యాలయ చిరునామా
TELANGANA RESOURCE CENTRE
DECCAN LAND
"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA
Mobile: 9030626288 Fax: 040-27635644
E-mail: desk.deccan@gmail.com
website : www.deccanland.com

**కృతజ్ఞతలు**
దక్కన్ ల్యాండ్ మాసపత్రిక సాహిత్యం విభాగంలో సలహాలు, సూచనలు అందించిన **డా॥ ఎస్. రఘు**కు మా కృతజ్ఞతలు.

**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చువుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను ప్రజాస్వామిక అభిప్రాయ వేదికగా, ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక సాహిత్య విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, సమస్యలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# తెలంగాణ ఉద్యమ మాష్టారు..

# జయశంకరు సారు

తెలంగాణ ఉద్యమ నేతగా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు శ్వాసగా, ఆశగా, స్వప్నంగా, లక్ష్యంగా జీవించారు జయశంకర్ గారు. తెలంగాణ భావవ్యాప్తిని వినిపించిన మేధావి జయశంకర్ గారు. ఈ సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ ఆయన గురించి కొన్ని జ్ఞాపకాలు..

ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారు 1934 ఆగస్టు 6వ తేదీన నాటి వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామంలో మహాలక్ష్మి, లక్ష్మీకాంతారావు దంపతులకు జన్మించారు. ఆయన బెనారస్, అలీగఢ్ విశ్వవిద్యాలయంలో చదివారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్ డి చేశారు. ఉపాధ్యాయులుగా జీవితం ప్రారంభించిన జయశంకర్ గారు 1975లో సీకేఎం కాలేజీ ప్రిన్సిపల్‌గా, కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా, ఉపాధ్యక్షులుగా పనిచేశారు. అంచలం చెలుగా స్వయం కృషితో ఎదిగిన జయశంకర్ గారు ఆంధ్ర పాలకుల అవమానం, పెత్తందారితనం చూసి ఈ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని బాల్యంలోనే గుర్తించి వాటిని చదువుతో ఎదిరించాలని నిర్ణయానికి వచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకొరకై అనేక ఉద్యమాలలో పాల్గొని, తుదిశ్వాస వరకు తన విజ్ఞానాన్ని తెలంగాణ చరిత్రకు ధారపోసిన మేధావి, చారిత్రక పురుషుడు జయశంకర్ గారు. ఈయనకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషలలో మంచి ప్రావీణ్యం ఉంది.




పాఠశాల దశలోనే నాయకుడుగా ఎదిగిన జయశంకర్ గారు ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ అని నినాదాలు చేశారు. 1952లో తెలంగాణ నాన్ ముల్కి ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. 1954లో విశాలాంధ్ర ప్రతిపాదనను ఎండగట్టిన ధీశాలి. 1969లో జై తెలంగాణ ఉద్యమంలో తనదైన పాత్ర నిర్వహించిన వీరుడు. తరువాత 1995 లోని మలి దశ తెలంగాణ ఉద్యమానికి దిక్సూచిగా, మార్గదర్శిగా నిలిచిన అపర మేధావి.

2001 ఏప్రిల్ 27 న టీఆర్ఎస్ పార్టీ ఏర్పడిన తరువాత తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధనకు సరైన నాయకుడిగా శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారిని గుర్తించి పార్టీలకు అతీతంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్లాలన్నారు.

తరువాత 2004 లో టీఆర్ఎస్ పార్టీ నుండి లోక్‌సభకు ఎన్నికైన కె. చంద్రశేఖర్ రావు గారు 2006 సెప్టెంబర్ 12 న పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు .తరువాత 2009 సాధారణ ఎన్నికలలో అధిక స్థానాలు గెలిచిన కాంగ్రెస్ పార్టీ నుండి ముఖ్యమంత్రిగా వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు ఉన్నారు. 2009 సెప్టెంబర్ 2న రాజశేఖర్ గారి మరణంతో కె.రోశయ్య గారు, తరువాత కిరణ్ కుమార్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా చేశారు.

ఈ దశలోనే 2009 నవంబర్ 29 న కె.సి.ఆర్ గారు ఆమరణ నిరాహార దీక్ష, 2009 డిసెంబర్ 4న శ్రీకాంతాచారి ఆత్మాహుతి తెలంగాణ ప్రజలను కలిచివేసింది. 2009 డిసెంబర్ 9 నాడు కేంద్ర హోంమంత్రి చిదంబరం గారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన చేయడం, తరువాత ఆంధ్ర వారి ఒత్తిళ్లకు తలొగ్గి 2009 డిసెంబర్ 23న అసెంబ్లీ తీర్మానం తరువాత రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తాం అని ప్రకటించడంతో తెలంగాణలో ఆందోళనలు మొదలయ్యాయి.

దీనితో జయశంకర్ సార్ గారు ఆందోళన చెంది తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను పార్టీలకతీతంగా అందరికి తెలియచేసి ఒక ప్రణాళికను రచించి అందరినీ కలుపుకుపోయి ఉద్యమాన్ని ఉధృతం చేస పల్లె పల్లెను ఉద్యమ పట్టాల పైకి రప్పించి, సామూహిక రాజీనామాలు, చలో అసెంబ్లీ, ఉద్యమ కార్యక్రమాలకు ఊపిరిగా నిలిచారు.

జయశంకర్ గారు శాంతియుతంగా తెలంగాణ ఉద్యమాన్ని నీళ్లు, నిధులు ,నియామకాల పరిణామాలు తెలంగాణకు ముందు తెలంగాణ తరువాత ఎలా ఉంటాయో ప్రజలకు, మేధావులకు వివరించిన మహనీయుడు. ఆయన విశ్లేషణ, కె.సి.ఆర్ నాయకత్వాన ప్రజలు, యువకులు, మేధావులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, కవులు, కళాకారులు, రచయితలు, జర్నలిస్టులు, ఉద్యోగస్తులు మేల్కొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకై, ఉద్యమం కొరకై ఆజన్మ బ్రహ్మచారిగా ఉండిపోయారు. తన ప్రసంగాలతో దేశ, విదేశాలలో తెలంగాణ ఆవశ్యకత గురించి వివరించిన సాధికారిక స్వరం జయశంకర్ గారు. అదును చూసి అడుగులు ముందుకు వేయాలన్న ముందు చూపున్నవాడు.

(మిగతా 8వ పేజీలో)

# రాష్ట్రాలకు సమాన హక్కులుండాలి

భారత పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయి. నూతన ప్రభుత్వం కొలువుదీరింది. మళ్లీ రెండోసారి నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. యావత్ దేశ ప్రజానీకం సమస్యలను మోసేందుకు ప్రభుత్వం సిద్ధం అంటుంది. దేశంలో ఉన్న 29 రాష్ట్రాలకు సమాన హక్కులుంటాయి. అన్ని రాష్ట్రాలను ఒకేరీతిలో చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. తాము అధికారంలో ఉన్న రాష్ట్రంలో ఒకలా, అధికారంలో లేని రాష్ట్రంలో మరోలా వ్యవహరించకూడదు. పార్టీలకతీతంగా, వివక్షతలేని విధంగా రాష్ట్రాల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి సాధించాలంటే గొప్ప విజన్‌తోపాటు మంచి నాయకత్వం కూడా ఉండాలి. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజలో ఉందని కేంద్రం కితాబిచ్చింది. ఆ దిశగా తెలంగాణ విషయంలో కేంద్రం అడుగులు వేయాలి. తెలంగాణకు గుండెకాయ అయిన కాళేశ్వరానికి జాతీయ హోదా ప్రకటించాలి. తెలంగాణలో మంచి పథకాలు అమలవుతున్నాయి. వాటికి కేంద్ర ప్రభుత్వ చేయూత అవసరం. రాష్ట్రాలు ప్రగతిపథంలో పయనించాలంటే కేంద్రం వివక్షతలేని పాత్ర పోషించాలి. ఫెడరల్ వ్యవస్థ మౌలిక భావనలను నిరంతరం కాపాడుకోవాలి.




నేడు ప్రపంచవ్యాప్తంగా పర్యావరణానికి పెద్ద ప్రమాదం పొంచి ఉంది. మానవుల రూపంలో ప్రకృతి ధ్వంసమవుతుండటం ఆందోళన కలిగించే పరిణామం. తెలంగాణ సమాజానికి పచ్చలహారం హరితహారం. సమాజ నిర్మాణంలో పర్యావరణం కీలకభూమిక పోషిస్తుంది. చెట్లు మన చుట్టూ ఉన్న మౌన నేస్తాలు అంటే అతిశయోక్తి కాదు. నాడు నాటిన మొక్కే నేడు చెట్టై సమాజానికి జీవితాంతం రక్షణ కవచంలా ఉంటుంది. తెలంగాణలో అడవులను 33 శాతం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుంది. హరితహారంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతోపాటు సమాజంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవుతారని ఆశిద్దాం.

భారతీయ భూవిజ్ఞాన సర్వేక్షణ శిక్షణ సంస్థ ప్రపంచ దేశాలకు ఆదర్శప్రాయంగా నిలవడం దేశం యొక్క కీర్తిని తేటతెల్లం చేస్తుంది. అంతర్జాతీయ భూగర్భ శాస్త్రవేత్తలతోపాటు భూగర్భ, భూభౌతిక, రసాయన, ఇంజినీరింగ్ విభాగాల్లో కొత్తగా నియమించిన అధికారులకు శిక్షణ ఇవ్వడం గర్వకారణం. భూవిజ్ఞాన సర్వేక్షణ శిక్షణ సంస్థలో దాదాపు 32 వేల మంది శిక్షణ తీసుకొని సమాజ సేవలో నిమగ్నమయ్యారు. దేశంలో ఇలాంటివి ఎన్నో గొప్ప సంస్థలున్నాయి. సమాజహితం కోసం, ప్రజలబాగు కోసం పాటుపడే సంస్థలను నిలుపుకునే బాధ్యత మనందరిపై ఉంది.

అవధులు లేనిది..ఆనందం కలిగించేది సాహిత్యం. బాలసాహిత్యమే పిల్లలను బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దుతుంది. సమాజ గమనాన్ని మార్చివేసేది నేటి బాలలే. పిల్లల నవ్వులన్నీ వచ్చే కాలానికి సూర్యోదయమై వెలుగునివ్వాలి. పిల్లలకు ఆదర్శవంతమైన మంచి కథలు చెప్పడం ద్వారా వారిని ఆదర్శప్రాయంగా మలచవచ్చు. పిల్లల్లో సాహిత్య చైతన్యం తీసుకురావాలంటే కవులు, రచయితలు, తల్లిదండ్రులు చొరవచూపాలి. పిల్లలు ప్రపంచమార్గదర్శకులుగా ఎదగాలంటే చిన్నప్పటి నుండే బాలసాహిత్యంపై అభిరుచి కల్పించాలి. ఉత్తమ సాహిత్యాభిలాష ఉన్న బాలలు చక్కటి భవిష్యత్‌కు బాటలు వేస్తారు. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ, 'బాల చెలిమి ముచ్చట్లు', బాల చెలిమి పత్రిక ద్వారా ఈ బాధ్యతను నెరవేర్చేందుకు కృషి చేస్తుంది.

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్





(6వ పేజీ తరువాయి)

'పుట్టుక నీది... చావు నీది... బ్రతుకంతా దేశానిది' అని చెప్పిన కాళోజి మాటలను నిజం చేసిన తెలంగాణ వైతాళికుడు.మూడు తరాల తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర వహించారు. రాష్ట్ర సాధన ధ్యేయంగా పనిచేశారు. నేను ఉద్యమకర్తను కాదు... నేను కేవలం ఉద్యమ స్వచ్ఛంద కార్యకర్తను మాత్రమే అని ప్రకటించుకున్న విశాల హృదయుడు, నిరాడంబరుడు జయశంకర్ గారు.

జయశంకర్ గారు కె.సి.ఆర్ గారికి రాజకీయ సలహాదారుగా నిలిచి ఉద్యమము ముందుకు సాగడానికి దోహదపడ్డారు. అరవై ఏళ్ళుగా సాగిన ఉద్యమానికి నాయకుడిగా తెలంగాణ నావకు చుక్కానిలా నిలిచిన తెలంగాణ భాస్కరుడు. తెలంగాణ వస్తే ఏమొస్తుందో వివరించిన తెలంగాణ దార్శనికుడు ఆయన. అనేక పదవులలో ఆయనకు అవకాశం వచ్చినప్పటికీ వాటన్నిటినీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు తృణప్రాయంగా వదిలిపెట్టిన తెలంగాణ త్యాగమూర్తి.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఎదురైన వందల ప్రశ్నలకు తానొక్కడినే సమాధానం అని చెప్పారు. 2010 ఫిబ్రవరి 3న కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు శ్రీకృష్ణ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీకి రాష్ట్ర ఏర్పాటు ప్రయోజనాలకు సంబంధించిన విషయాలను వివరించిన విజ్ఞానశీలి ఆయన. బాధితులు గళం విప్పినప్పుడు... మేధావులు కలం కదపాలి అని తెలియచేసిన సాహితీ వేత్త జయశంకర్ గారు.

మా తెలంగాణ మాగ్గావాలి! యాభై ఏళ్లుగా ఇదే ఆకాంక్ష, ఇదే శ్వాస, ఇదే లక్ష్యం, ఇదే జీవితం, ఇందులోనే మా జీవితం ఉందని చెప్పిన ఆదర్శ గురువు. తెలంగాణ ప్రాంతానికి కేసీఆర్ గారి నాయకత్వం బాగుంటుందని గుర్తించిన వ్యక్తి. తెలంగాణ రాష్ట్రం రావాలి... అప్పుడే నేను చనిపోవాలి అని చెప్పిన ఆశాజీవి.

అమరుల త్యాగాలను, బలిదానాలను, ఉద్యమ భావాలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం 2014 మార్చి 4న ఒక ప్రకటనను విడుదల చేసింది. అది జూన్ 2వ తేదీని తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంగా జరుపుకోండి అని చెప్పి 29వ రాష్ట్రంగా గుర్తించడం జరిగింది.

మూడు తరాల తెలంగాణ సుదీర్ఘ ఉద్యమంలో పోరాటం చేసిన జయశంకర్ గారు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని చూడకుండానే 2011 జూన్ 21 వ తేదీన అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. మనకోసం, మన పిల్లల కోసం,జాతి వెలుగు కోసం నిరంతరం ఉద్యమమే ఊపిరిగా చేసుకున్న, జయశంకర్ సారు, తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరులందరూ తెలంగాణ చరిత్ర ఉన్నంతకాలం చిరంజీవులుగా నిలిచిపోతారు. జయశంకర్ గారు అందరికీ ఆదర్శనీయులుగా, స్ఫూర్తిగా, చిరస్మరణీయులుగా నిలిచిపోయారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జయశంకర్ గారి సేవలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన పేరుమీద అగ్రికల్చర్ యూనివర్శిటీ మరియు ఒక జిల్లాకు (జయశంకర్ భూపాపల్లి జిల్లా) పేరు పెట్టారు. ప్రభుత్వం చేపట్టే అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన పేరు పెట్టడం అభినందనీయం.

ఆయన జ్ఞాపకాలతో ఈ అక్షరాంజలి.

జోహార్... జయశంకర్ సార్.. జోహార్... జోహార్.

-డా॥ తిరుమలేష్, m : 9908910398
e : ttm.amc1982@gmail.com

DECCAN
దక్కన్
CHANNEL
సామాజిక, సాంస్కృతిక ఛానల్

# ఆధునికతకు ఆద్యుడు షంషుల్ ఉమ్రా

హైదరాబాద్, తెలంగాణ చరిత్ర చాలా విషయాల్లో విస్మరణకు, వివక్షకూ, పక్షపాతానికి బలయ్యింది. అందులో అసఫ్‌జాహీల చరిత్ర అంటే అంతా పీడన, దోపిడి అనే భావనను అధిక భాగం చరిత్రకారులు, అకడమిషియన్స్, వ్యాఖ్యాతలు, విశ్లేషకులు, జర్నలిస్టులు ముఖ్యంగా తెలుగు మాత్రమే తెలిసిన వారిలో స్థిరపరిచారు. ఇందులో ఎక్కువభాగం రచనలు ముస్లింలు అంటే చులకన ప్రదర్శించాయి. తెలుగు మాత్రమే తెలిసిన వారికి ఇంగ్లీషు, ఉర్దూ, పర్షియన్ భాషల్లో నిక్షిప్తమైన విలువైన సమాచార నిధి అందుబాటులో లేదు.

ఆధునిక తెలంగాణ చరిత్రను తెలుగులో ప్రణాళిక బద్ధంగా రాసినవారు చాలా తక్కువ. వీళ్లు కూడా ప్రయిమరీ వనరుల నుంచి గాకుండా సెకండరీ వనరుల నుంచి సమాచారాన్ని సేకరించి ఈ వివరాలు రాసింద్రు. ప్రయిమరీ వనరులు అంటే సెక్రెటేరియట్, రాష్ట్ర అభిలేఖాగారము, ఢిల్లీ నెహ్రూ మ్యూజియమ్ లైబ్రరీ, లండన్‌లోని బ్రిటీష్ లైబ్రరీలలో ఉన్న పత్రాలు, పుస్తకాలు, రికార్డులు, కైఫియత్ తదితరాలు. వీటిని చాలా మంది ఆధునిక చరిత్రకారులు దాదాపు వినియోగించుకోలేదు. దానికి ప్రధాన అడ్డంకి తెలుగులో రాసేవారికి ఉర్దూ, పర్షియన్ భాషలు తెలియక పోవడం. రెండోది దూరాభారం, దానికి తోడు ఆర్థిక భారం. అందుకే ఈ చరిత్రకారులు ఇప్పటికే ఇంగ్లీషులో వెలువడ్డ 'హైదరాబాద్ ఫ్రీడమ్ స్ట్రగుల్' సంపుటాలు, సరోజిని రేగాని, షీలారాజ్, వైకుంఠం తదితరులు రాసిన చరిత్ర ఆధారంగానే వ్యాఖ్యానిస్తున్నారు. విషయాలను విశ్లేషిస్తున్నారు. వీళ్లలో చాలా మంది దాదాపు బ్రిటిష్ రెసిడెంట్లందరూ రాసిన స్వీయ/జీవిత చరిత్రలను, రికార్డులను, బ్రిగ్స్, లా, మెట్కాఫ్ తదితరులు రాసిన ప్రయిమరీ ఆధారాలను పట్టించుకోలేదు. దీని వల్ల తెలంగాణ చరిత్రకు ముఖ్యంగా అసఫ్‌జాహీ చరిత్రకు, హైదరాబాద్ ముస్లిం రాజ్య చరిత్రకు తీరని అన్యాయం జరిగింది. వీరి రచనల మూలంగా అసఫ్‌జాహీల పాలన పట్ల ప్రజలకు తప్పుడు అభిప్రాయం స్థిరపడింది. చరిత్రలో పీడన, దోపిడి అనేది ఎవరు రాజ్యమేలిన ఉండేదే! అట్లాంటిది అది ఒక్క అసఫ్‌జాహీలకు మాత్రమే పరిమితం అన్నట్టుగా ప్రచారం చేయడం బాధ్యతా రాహిత్యం. ఇన్నాళ్ళు అసఫ్‌జాహీ యుగ చరిత్రలో న్యాయమైన స్థానానికి నోచుకోని నవాబులు 'పయిగా' వంశస్థులు. ('పయిగా' అంటే ఉన్నతస్థాయి అని అర్థం) మొదటి నిజాం పాలన నాటి నుండే అత్యంత ఆప్తులుగా, నమ్మకస్తులుగా పనిచేసిన వారిలో ఈ 'పయిగా' వంశస్థులు ముఖ్యులు. మొదటి నిజామ్‌తో పాటు దక్కన్‌కు వచ్చిన మొదటి పయిగా నవాబు అబ్దుల్ ఖైర్ ఖాన్ ఆయన అంతరంగికుడిగా సైన్యాధికారిగా పనిచేసిండు. అనంతరం ఆయన కొడుకు తేజ్ జంగ్ నిజాం రాజ్య రక్షణ కోసం సొంత పటాలాన్ని నిర్మించి, నిర్వహించిండు. ఈ 'పయిగా' వంశంవారికి సంబంధించిన సమాధులు ఇప్పటికీ హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్, పిసల్‌బండ ప్రాంతంలో ఎందరో విదేశస్తులను ఆకర్షిస్తున్నాయి. 'పయిగా' సమాధులు రాజస్థాన్ మార్బుల్‌తో 'డోమ్' పద్ధతిలో నిర్మించారు. ప్రతియేటా ఈ సమాధుల వద్ద ఉర్సుని కూడా నిర్వహిస్తారు. ఈ నవాబులు హైదరాబాద్‌లో నిర్మించిన ఫలక్‌నుమా ప్యాలెస్, అస్మాన్ ప్యాలెస్, ఖుర్షీద్‌జా దేవిడి తదితరాలు వారి ఆసక్తిని తెలియజేస్తాయి. తేజ్ జంగ్ ఏకైక కుమారుడు 'పయిగా' వంశస్థుల్లో ప్రముఖుడైన నవాబ్ ఫక్రుద్దీన్ ఖాన్ 'షంషుల్ ఉమ్రా' గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



ఫక్రుద్దీన్ ఖాన్ తన పదో ఏట అంటే 1791లో తండ్రి తేజ్ జంగ్‌ని కోల్పోయిండు. తనకు అత్యంత ఆప్తుడుగా, సైన్యాధికారిగా పనిచేసిన తేజ్ జంగ్ మృతికి నివాళి అర్పిస్తూ నిజాం నలభై రోజులు సంతాపదినాలుగా ప్రకటించాడు. ఈ కాలంలో నిజాం రాజ భవనంలో ఎలాంటి వేడుకలు నిర్వహించలేదు. నిజాం రాజు ఇదే సమయంలో 'ఖుర్షీదుద్దౌలా', 'ఖుర్షీదుల్ ముల్క్', 'ఇమామ్ జంగ్-3' మొదలైన బిరుదుల్ని ఫక్రుద్దీన్‌ఖాన్‌కు ఇచ్చి సత్కరించిండు. ఐదో నిజాం నసీరుద్దౌలా కాలంలో అంటే 1834లో 'పయిగా' వంశ జాగీరు గ్రామాల లెక్క తేలింది. అప్పుడే వాటిపై పూర్తి అధికారాన్ని షంషుల్ ఉమ్రాకు బదలాయించారు.

హైదరాబాద్ రాజ్యంలో ఇంగ్లీషు రచనలను మొదటిసారిగా ఉర్దూ పాఠకులకు అందుబాటులో తెచ్చి, ప్రజల్లో ఆధునికత పట్ల మక్కువ ఏర్పడడానికి కృషి చేసిన మొదటి వ్యక్తి షంషుల్ ఉమ్రా (అంటే.. 'నవాబుల బిడ్డ' అని అర్థం). హైదరాబాద్‌లో మొట్టమొదటి ముద్రణా యంత్ర స్థాపకుడిగా పేరొందిండు. ఈయన తన సొంతపేరుతో గాకుండా బిరుదనామము 'షంషుల్ ఉమ్రా' తోనే ప్రసిద్ధి. స్వయంగా ఇంగ్లీష్, ఫ్రెంచ్ భాషల నుంచి సైన్స్, విజ్ఞాన రంగాలకు సంబంధించిన రచనలను అనువదించడమే గాకుండా అందుకోసం ఒక సంస్థనే ఏర్పాటు చేసిండు. దార్శనికుడిగా, ఆలోచనాపరుడిగా, జ్ఞాన సంపన్నుడిగా ఈయనకు నిజాం రాజ్యంలో మంచి పేరుండింది. ఆధునిక పద్ధతుల్లో నడిచే పాఠశాలను ప్రజల కోసం నడిపించిండు. నిజామ్ అలీఖాన్ (రెండో అసఫ్‌జాహీ రాజు), సికిందర్ ఝా (మూడో అసఫ్‌జాహీ రాజు), నసీరుద్దౌలా (నాలుగో అసఫ్‌జాహీ రాజు) ఈ ముగ్గురి రాజులకు అత్యంత దగ్గరగా మెలి

గిండు. కీలక సమయాల్లో ముఖ్యంగా సికిందర్ ఝా, నసీరుద్దౌలాలు తమకు అత్యంత ఆప్తుడైన షంషుల్ ఉమ్రా సలహాలు, అభిప్రాయాన్ని పాటించేవారు. వీరిద్దరూ షంషుల్ ఉమ్రా పట్ల ఎంతో గౌరవంగా ఉండేవారు. అందుకే నసీరుద్దౌలా తాను రాజుగా ఉన్నప్పుడు 'అమీర్ ఎ కబీర్' బిరుదుని షంషుల్ ఉమ్రాకు ఇచ్చిండు. వివిధ రాజకీయ, పాలన విషయాల్లో ముఖ్య సలహాదారుగా గౌరవాన్ని అందుకున్నాడు. అంతే కాదు తనకు ఇష్టం లేకున్నా నిజాం కోరికను కాదనలేక ఐదు నెలల పాటు దివాన్‌గా అంటే నిజాం రాష్ట్ర ప్రధానమంత్రిగా పనిచేసిండు. 1849 జనవరి నుంచి మే వరకు ఈ బాధ్యతలను నిర్వహించిండు. నిజాం అలీ ఖాన్ కూతురు, సికిందర్ ఝా సోదరి అయిన బషీరున్నీసా బేగమ్‌ని 1797లో వివాహమాడిండు. దీంతో మొట్టమొదటి సారిగా 'పయిగా' వంశస్థులు, నిజాం రాజుల మధ్యన వివాహ సంబంధాలు ప్రారంభమయ్యాయి. తర్వాత ఈ పరంపర కొనసాగింది. సికిందర్ ఝా కూతురు హష్మతున్నీసాని 'పయిగా' నవాబు వికారుల్ ఉమ్రా పెళ్ళి చేసుకుండు. ఆ తర్వాత అఫ్జలుద్దౌలా (ఐదో నిజామ్) కూతురు హుసేనున్నీసా బేగమ్‌ని ఖుర్షీద్ జా బహదూర్ వివాహ మాడిండు. అలాగే అఫ్జలుద్దౌలా మరో కూతురు పర్వరున్నీసా బేగమ్‌ని (ఆరో నిజామ్ మహబూబ్ అలీఖాన్ సోదరి) అస్మాన్ ఝా పెళ్ళి చేసుకుండు. ఇట్లా ఈరెండు కుటుంబాల మధ్య మరిన్ని వివాహాలు జరిగాయి.



'షంషుల్ ఉమ్రా' తన తండ్రి తర్వాత 'పయిగా'వంశ సొంత సైనిక పటాలానికి నాయకత్వం వహించిండు. 1863లో ఈ పటాలంలో 4369 అశ్వికులు, 2395 సైనికులు ఉండేవారు. ఈ సైన్యం అవసరమైనప్పుడు నిజాం ప్రభుత్వానికి అండగా నిలిచేది. ఈ సైన్యం నిర్వహణ కోసం ఏడు వేల సొంత జాగీరు గ్రామాలుండేవి. ఈ గ్రామాలను నిజాం ప్రభుత్వం ఆయనకు కేటాయించింది. ఇట్లా కేటాయించిన గ్రామాలకు షంషుల్ ఉమ్రా మునసబ్‌దార్‌గా ఉండేవాడు. ఈ జాగీరు గ్రామాల నుండి ప్రతి సంవత్సరం 30,39,544 రూపాయల ఆదాయం వచ్చేది. ఇందులో 29,57,301 రూపాయలను సైన్య నిర్వహణ కోసం మిగతా 82,423 రూపాయలను సొంత ఖర్చులకు వాడుకునేవాడు. తర్వాతి కాలంలో ఈ జాగీరు గ్రామాల సంఖ్య పదివేలకు, పటాలం సైన్య సంఖ్య కూడా పదివేలకు పెరిగింది. ఈ జాగీరు గ్రామాలు ఎక్కువగా గుల్బర్గా జిల్లాలో ఉండేవి. వీటి నిర్వహణ అంతా ఆయన మేనమామ అమ్జద్‌ల్ ఉమ్రా చూసేవాడు. ఈయన 1813లో చనిపోవడంతో జాగీరు నిర్వహణలో కొంత ఇబ్బంది ఏర్పడింది. అయితే అనంతర కాలంలో దాన్ని షంషుల్ ఉమ్రా అధిగమించిండు. ఈ జాగీరుల నుంచి వచ్చే ఆదాయంతోనే ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలను ఆయన నిర్వహించిండు.

1815 ఆగస్టులో మూడో నిజాం కొడుకు ముబారిజుద్దౌలా బ్రిటీష్‌వారితో యుద్ధానికి తలపడగా ఆయన్ని కాపాడే సత్తా కేవలం ఒక్క 'పయిగా'వంశ పటాలానికే ఉందని షంషుల్ ఉమ్రా గర్వంగా చెప్పుకున్నాడు. అయితే నిజాం రాజు సికిందర్ ఝా బ్రిటీష్ వారితో యుద్ధానికి సిద్ధంగా లేకపోవడంతో 'పటాలం' సత్తా చూపించే అవకాశం దక్కలేదు. నిజాం ప్రభుత్వ పాలసీని అనుసరించి 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటీష్ వారికి మద్ధతుగా నిలిచిండు. బ్రిటీష్ రెసిడెన్సీపై జరిగిన దాడిని ఎదుర్కొనేందుకు, మిగతా ప్రదేశాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకున్నందుకు గాను యుద్ధం అనంతరం షంషుల్ ఉమ్రాను అభినందించారు. అభినందనలతో పాటుగా అప్పటి బ్రిటీష్ గవర్నర్ జనరల్ షంషుల్ ఉమ్రాకు 30వేల రూపాయల నజరానాను కూడా చెల్లించుకున్నారని కృష్ణస్వామి ముదిరాజ్ తన 'పిక్టోరియల్ హైదరాబాద్' గ్రంథంలో రాసిండు.

1834లో హైదరాబాద్ రాజ్యంలో మొట్టమొదటిసారిగా ముద్రణాయంత్రాన్ని ఏర్పాటు చేసింది షంషుల్ ఉమ్రా. తాను సొంతంగా ఇంగ్లీషు, ఫ్రెంచ్, అరబిక్ భాషల నుంచి విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను ఉర్దూ, పర్షియన్ భాషల్లోకి తర్జుమా చేసి ప్రచురించిండు. వాటిలో 'షంషుల్ హింద్', 'సీతా సమస్య', 'రిసాల ఖరాతుల్ అర్జ్', 'రిసాలా గుగ్రాఫియా' (జాగ్రఫీ), 'రిసాలా కీనియా' తదితరాలున్నాయి. ఈయనకు సైన్స్ విషయాల పట్ల మక్కువ ఎక్కువ. ఇంజనీరింగ్, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, మాథమెటిక్స్, జాగ్రఫీ, అస్ట్రానమీ, మాగ్నటిజమ్, డైనమిక్స్ తదితర విషయాలపై ఎన్నో పుస్తకాలను సొంతంగా రాసిండు. 'మద్రాస ఎ ఫకీనా' పేరిట అన్ని ఆధునిక వసతులు కలిగిన విద్యా సంస్థను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిండు.

హైదరాబాద్‌లో అన్ని ఆధునిక వసతులతో అబ్జర్వేటరీ (నక్షత్ర శాల)ను ఏర్పాటు చేసిండు. ఇందుకు సంబంధించిన అన్ని పరికరాలను యూరప్ నుంచి తెప్పించిండు. అంతేగాకుండా ఎప్పటికప్పుడు యూరప్‌లో కనుక్కున్న కొత్త యంత్రాలను కూడా తన అబ్జర్వేటరీ కోసం తెప్పించేవాడు. వీటిని ఎలా ఉపయోగించాలనే విషయంలో పూర్తి జ్ఞానం షంషుల్ ఉమ్రాకు ఉండింది. ఈయనకు వివిధ రకాల వస్తువులను సేకరించే హాబీ కూడా ఉండింది. తాను వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన వస్తువులను, కొత్త యంత్రాల ప్రదర్శన కోసం 'జహా నుమా' పేరిట ఒక మ్యూజియాన్ని ఏర్పాటు చేసిండు.

హైదరాబాద్ రాజ్యంలో మెడికల్ విద్య పాదులూనుకోవడానికి షంషుల్ ఉమ్రా కృషి గణనీయమైనది. డాక్టర్ మెక్లీన్ హైదరాబాద్‌లో మెడికల్ పాఠశాలను స్థాపించిన సమయంలో అందులో చదువుకునేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో షంషుల్ ఉమ్రా స్వయంగా విద్యార్థులకు హామీ, ప్రోత్సాహకాలను ఇచ్చి ఆ పాఠశాల కొనసాగేందుకు తోడ్పడ్డాడు. "నవాబ్ షంషుల్ ఉమ్రా దగ్గర వకీల్‌గా పనిచేస్తున్న గులామ్ మొహియుద్దీన్ ఖాన్ విద్యార్థులను చేర్పిస్తానని (డాక్టర్ మెక్లీన్‌కు) మాటిచ్చాడు. ఆ మేరకు షంషుల్

ఉమ్రా పోషణలో చదువుకుంటున్న నాలుగు వందలమంది ఉర్దూ, పర్షియన్ బాగా తెలిసిన విద్యార్థుల నుంచి 30 మంది తెలివైన విద్యార్థులను తీసుకొని రావాల్సిందిగా అక్కడి అధ్యాపకులను ఆదేశించారు. అందులో నుంచి షంషుల్ ఉమ్రా తానే స్వయంగా ఒక పదిమంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి కౌన్సిలింగ్ ఇచ్చాడు. మీ భవిష్యత్తు బాగుంటుంది, దానికి నాది భరోసా అంటూ వారికి ధైర్యాన్నిచ్చాడు. వైద్య విద్య చదవడం ద్వారా సేవ చేయడమే గాకుండా, ఆర్థికంగా కూడా బలపడవచ్చని వారిని ప్రోత్సహించాడు. అంతేగాకుండా ఎంపికైన విద్యార్థులందరికీ ఒక 'ఇంక్‌పాట్', 'నైఫ్', పేపర్ బండిల్స్ తానే స్వయంగా అందించి వారి వైద్య విద్యకు అండగా నిలిచాడు". (దక్కన్ లాండ్, 2018) ఈ విధంగా విద్యారంగంపై ఆయన ఆసక్తిని గమనిస్తే ఆయన చేసిన సేవలను అంచనా వేయొచ్చు.

కెప్టెన్ సీడెన్‌హామ్, హెన్రీ రసెల్, మెట్కాఫ్, లా, తదితర బ్రిటీష్ రెసిడెంట్లతో షంషుల్ ఉమ్రా స్నేహపూర్వకంగా ఉండేవాడు. వారి ద్వారా యూరప్‌లో జరుగుతున్న ఆవిష్కరణల గురించి, ఇంగ్లీషులో ప్రచురితమయ్యే శాస్త్ర, విజ్ఞాన గ్రంథాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేవాడు. అట్లా ఏర్పడిన ఆసక్తితోనే హైదరాబాద్‌లో తొలి ముద్రణా యంత్రాన్ని స్థాపించాడు.

షంషుల్ ఉమ్రా 1862లో తన 82వ యేట మరణించిండు. ఈయనకు ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. అయితే కుమారుల్లో ముగ్గురు తన కన్నా ముందే మరణించారు. మిగిలిన ఇద్దరు కుమారులు రఫియుద్దీన్ ఖాన్, రషీదుద్దీన్ ఖాన్‌లు తర్వాతి కాలంలో అఫ్జలుద్దౌలా, మహబూబ్ అలీఖాన్ కాలాల్లో వారికి చాలా దగ్గరగా మెలిగారు. ఆరో నిజామ్ మహబూబ్ అలీఖాన్ మూడో ఏట అధికారంలోకి వచ్చాడు. ఈ సమయంలో హైదరాబాద్ రాజ్య పాలన వ్యవహారాలను చూసేందుకు సాలార్‌జంగ్‌తో పాటుగా రఫియుద్దీన్ కూడా కో–రెజెంట్‌గా వ్యవహరించిండు. 'పయిగా' వంశస్థుల గౌరవాన్ని పెంచిండ్రు. తర్వాతి కాలంలో 'పయిగా' జాగీర్లను మూడు భాగాలుగా విభజించారు. అందులో ఒకటి షంషుల్ ఉమ్రా, రెండోది ఖుర్షీద్ జా బహదూర్, మూడోది వికారుల్ ఉమ్రా పేరిట ఈ జాగీర్లను విభజించారు. వీటి ద్వారా ఏడాదికి 80 లక్షల రూపాయాల ఆదాయం వచ్చేది. ఈ ఆదాయంతో విద్య, వైద్య, ఇతర ప్రజోపయోగ కార్యక్రమాలను తమ జాగీరు ప్రాంతాల్లో నిర్వహించేవారు. ఈ జాగీరు గ్రామాల్లోని రెవిన్యూ, జ్యుడిషియల్ అధికారాలన్నీ 'పయిగా' నవాబులకే ఉండేవి. ఇందులో ప్రభుత్వం జోక్యం ఏమాత్రం ఉండేది కాదు.

ప్రజలను జ్ఞానవంతులుగా, తార్కికంగా ఆలోచన చేసే వారిగా తీర్చిదిద్దడంలో ఆయన కృషి ప్రశంసనీయమైనది. సైన్స్ ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని భావించిండు. అట్లాంటి వ్యక్తికి తెలంగాణ చరిత్రలో న్యాయమైన, సరైన స్థానం దక్కాలి.

–సంగిశెట్టి శ్రీనివాస్, m:98492 20321
e: sangishettysrinivas@gmail.com

## పాఠకులకు మనవి : దక్కన్ ల్యాండ్ మాసపత్రిక ధర పెంపు

దక్కన్‌ల్యాండ్ మాస పత్రిక 80 నెలలుగా క్రమం తప్పక వెలువడుతూ పాఠకాదరణ చూరగొంటున్నది. సుమారు ఆరు సంవత్సరాలుగా ఆర్థికంగా భారమే అయినప్పటికీ తెలంగాణ గొంతుకను బలంగా విన్పించాలనే సంకల్పంతో ఎంతో శ్రమకోర్చి దక్కన్‌ల్యాండ్ మాస పత్రికను తీసుకువస్తున్నాం. ముద్రణ వ్యయం ఎక్కువ కావడం వలన పత్రిక ధరను ఏప్రిల్ 2019 ప్రస్తుత పత్రిక ధర రూ. 20/– నుండి విడిప్రతి రూ. 30/– పెంచడమైనది. కావున పాఠకులు సహకరించవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

చందాదారుల చందాలే పత్రికకు ఊపిరి. దక్కన్‌ల్యాండ్ అభిమానులంతా తాము చందా కట్టడంతోపాటుగా నూతనంగా చందాదారులను చేర్పించాల్సిందిగా కోరుతున్నాం.

ఇప్పటివరకూ ఎంతోమంది ఈ మహత్తర కార్యక్రమానికి సహకరిస్తు వచ్చారు. వారందరికీ మా ధన్యవాదములు. 2012 నుండి చందాదారులుగా ఉన్న వారికి విన్నపం ఏమనగా మీరు కట్టిన చందా కాల పరిమితి ముగిసినచో మీరు మీ సంవత్సర చందా రూ॥ 300/ను, రెండు సంవత్సరాలుగాను రూ॥600/–లుగా రెన్యువల్ చేసుకోవలసినదిగా కోరుచున్నాము.

గౌరవ చందాదారులు ఎం.ఓ/ ఆన్‌లైన్/ డిడి/ చెక్/ పేటీఎం ద్వారా కానీ, వ్యక్తిగతంగాకానీ కట్టవచ్చును. మీ సహకారంతో మరింతమందిని పాఠకులుగా మరియు చందాదారులుగా చేర్చి పత్రికను ప్రోత్సహిస్తారని ఆశిస్తున్నాము. చందాపరంగా, ప్రకటన పరంగా చేయూతనిచ్చి పది కాలాలపాటు పత్రిక నిరాటంకంగా కొనసాగేందుకు మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము. మీ అందరి సహకారంతో పత్రికను ముందుకు తీసుకువెళతామని తెలియజేస్తూ, కృతజ్ఞతలతో....

**వేదకుమార్.యం**
ఎడిటర్, దక్కన్ ల్యాండ్ మాస పత్రిక

**దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరములు:**

| | |
|---|---|
| Name | : DECCAN LAND |
| Bank | : KOTAK MAHINDRA BANK |
| A/c No | : 7111218829 |
| IFSC Code | : KKBK0007463 |
| Branch Code | : 007463 |



# నవతరానికి దిశానిర్దేశం చేసే వేదిక.. "తెలంగాణ సాహిత్య అకాడమీ"

"తెలంగాణ సాహిత్య అకాడమీ"ని ఏర్పాటు చేయడం ఆహ్వానించదగ్గ పరిణామం. ప్రాచీన, ఆధునిక సాహిత్య వికాసానికి అకాడమీ ఓ గొప్ప వేదికగా ఉపయోగపడుతుంది. విశ్వవిద్యాలయాల్లో పరిశోధన అనేది ఓ సర్టిఫికేట్ కోర్సుగా మారిపోయింది. అంతకంటే విస్తృతస్థాయిలో పరిశోధనలు చేపట్టడానికి అకాడమీల ద్వారా వీలవుతుంది. ముఖ్యంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆదాన ప్రధానాలు జరగడానికి, తెలంగాణ సాహిత్య ఔన్నత్యం ప్రపంచానికి చాటడానికి అకాడమీ వారధిగా పనిచేస్తుంది. తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడిగా నందిని సిధారెడ్డి వ్యవహరిస్తున్నారు.

అకాడమీని దేశంలోనే అత్యున్నత సాహితీ సంస్థగా రూపొందించి నవతరానికి దిశానిర్దేశం చేసే వేదికగా తయారు చేయడం జరుగుతుంది. 34 ఏండ్ల క్రితం కోల్పోయిన సాహిత్య అకాడమీ కీర్తిప్రతిష్టలను మరోసారి వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. పూర్వ కవుల అపురూప గ్రంథాలను ప్రచురించేందుకు ప్రయత్నాలు జరగాలి. ప్రత్యేకంగా వర్తమాన తరానికి దిశానిర్దేశం చేసేందుకు సాహిత్య అకాడమీ వేదికగా ఉండాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ సాహిత్య అకాడమీ ఓ సాహితీ క్షేత్రం. ఇందులోని సాహితీ పరిమళాలను రాష్ట్రం నలుదిక్కులా వెదజల్లుతూ ఎందరెందరో కృషీవలులకు మెరుగులద్దుతున్నది. శిథిలావస్థకు చేరుకున్న, కనుమరుగైపోయిన తెలంగాణ కథలు, కథానికలు, సాహితీ సంపదను తిరిగి పునర్నిర్మించేందుకు, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2017 మే 2 వ తేదీన తెలంగాణ సాహిత్య అకాడమీ ఏర్పాటు జరిగింది. సృజనాత్మక శక్తి గల కలాలకు పదును పెడుతూ.. ఎన్నో రకాల సాహితీ ప్రక్రియలపై యువతను ప్రోత్సహించి, పాత కలాల రచనా, కవిత్వ ధోరణులపై సమావేశాలు నిర్వహిస్తూంది. పలువురు సాహితీవేత్తలకు సాహిత్య అకాడమీ అందుబాటులో ఉంటూ ఎన్నెన్నో కొంగ్రొత్త కార్యకమ్రాలను నిర్వహిస్తోంది. మే 2వ తేదీన రవీంద్రభారతిలో తెలంగాణ సాహిత్య అకాడమీ మొట్టమొదటిసారిగా ఎంతో ప్రతిష్టాత్మకమైన సాహితీ పురస్కారాలను అందించింది. తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి, కార్యదర్శి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి. 2019 సంవత్సరానికి గాను కవిత్వం, వచన రచనల విభాగాల్లో ఈ పురస్కారాలను అందించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాహిత్య అకాడమీ పురస్కారాలను ఇచ్చే సంప్రదాయముందని, కేంద్ర సాహిత్య అకాడమీ కూడా ప్రత్యేకంగా సాహిత్య పురస్కారాలను అందిస్తోందని నందిని సిధారెడ్డి తెలిపారు. తెలంగాణ సాహిత్య అకాడమీ ఆవిర్భావ అనంతరం ఎన్నో సాహిత్యాభ్యున్నతి కార్యక్రమాలు చేపట్టి పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పురస్కారాలను గానూ 2014 నుంచి ప్రచురణ అయిన గ్రంథాలను పరిగణలోకి తీసుకుని వాటిని అన్ని కోణాల్లో క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని శాస్త్రీయమైన పద్ధతిలో మూడు దశల్లో వడపోత చేపట్టిన అనంతరం పురస్కారాలను ఎంపిక చేసినట్లు తెలిపారు.

తెలంగాణ సాహిత్య అకాడమీ 2019 సంవత్సరానికి ప్రదానం చేసిన సాహితీ పురస్కారాల్లో కవిత్వం విభాగంలో నల్గొండ జిల్లా చిన్నరావుల పల్లెలో జన్మించిన ప్రముఖ కవి సిద్ధార్థ కవితా సంపుటి 'బొమ్మలబాయి'కి, వచన రచనల విభాగంలో 1955 లో దేవరయాంజాల్‌లో జన్మించిన ఉప్పల నరసింహం కథల సంపుటి 'మట్టి మనిషి'కి పురస్కారాలను అందజేశారు. ఒక్కొక్క పురస్కారం కింద లక్షా నూటపదహారు రూపాయల నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక, శాలువాతో పురస్కార గ్రహీతలను సత్కరించారు. ఇదే సమయంలో సాహిత్య అకాడమీ మాసపత్రిక 'పునాస' 3వ సంపుటిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, సాహితీవేత్త బాలశ్రీనివాసమూర్తి, ప్రముఖకవి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

2017 మే మాసం నుంచి ఏప్రిల్ 2019 వరకు అకాడమీ ఆధ్వర్యంలో ఎన్నో సాహితీ చర్చలు, సదస్సులు, సమావేశాలు, పుస్తకాల ప్రచురణలు జరిగాయని నందిని సిధారెడ్డి తెలిపారు.పలు సాహితీ ప్రక్రియలకు సంబంధించి ఇప్పటికి 85కు పైగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. గత సంవత్సరం ఏప్రిల్ 13 నుంచి ఇప్పటివరకూ 12 కావ్య పరిమళాల ప్రసంగాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా నవలా వికాసం, శైలి తీరుతెన్నులపై ప్రత్యేకంగా 'నవలా స్రవంతి' అని సరికొత్త కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అకాడమీ స్థాపించిన రెండేండ్ల కాలంలో 50 పుస్తకాలకు పైగా ప్రచురించామన్నారు. మరుగున పడ్డ సాహిత్యాన్ని, వెతికి వాటికి ఒక రూపం ఇచ్చి ప్రాణం పోస్తున్నట్లు తెలిపారు. 'రసార్ణవ సుధాకరము', 'కాకతీయ రాజుల చరిత్ర', 'సిద్ధేశ్వర చరిత్ర' మొదలైన తెలంగాణ అరుదైన గ్రంథాలను ఎన్నింటినో పునర్ముద్రణ చేయించామన్నారు.

-ఆర్. పురుషోత్తం నాయుడు, m : 9573041226
e : janata.rpnaidu@gmail.com

# సంస్థానాల్లో సాంస్కృతిక దివిటీ : ఆదిపూడి ప్రభాకరరావు

సీ॥ "హూణ భాషాభ్యాస మొనరించి యాంగ్లేయ
దొరలతో నొకయొత్తు తూగినాడ
నవరసాస్పదముగాc గవనమల్లుటనేర్చి
యవనీశ సభలc బేరందినాడ,
గన్నడంబొక యింత గఱచి తత్సాంప్రదా
యముc గూడ గొలcగాన
సంస్కృతంబందును సాధారణ ప్రజ్ఞ
గలిగి తత్సంగతి వెలసినాడ,
గీ॥ ప్రబల గద్వాల రామభూపాల భుమి
పాల పాలిత కవితాలతాలవాల
సాహితీహిత సురాసురపోషకcడ నేను,
ఆదిపూడి ప్రభాకరాఖ్య కవివరుcడ"

అంటూ తన అనువాద గ్రంథం "ఆంధ్ర పరాశర స్మృతి"లో తనను తాను పరిచయం చేసుకున్న ఆదిపూడి ప్రభాకరరావు (ప్రభాకరామాత్యులు) తెలుగు సంస్థానాల్లో సాంస్కృతిక వికాసానికి దోహద పడ్డారు. గద్వాల సంస్థానంలో విద్యాధికారిగా, ఆంతరంగిక కార్యదర్శిగా, ఆస్థాన విద్వాంసుడిగా పనిచేసిన. ఆయన తెలుగు, సంస్కృత, కన్నడ, ఆంగ్ల భాషల్లో పండితుడుగా రచనలు చేసారు. ఈ నేలపై సాహిత్యం, నాటకం, కళల వికాసానికి ప్రధాన భూమిక పోషించారు. ఎందరో కవి పండితులు కళాకారులు సంస్థానాధీశుల ముందు వారి ప్రతిభను ప్రదర్శించేందుకు, సముచిత సత్కారాలు పొందేందుకు ఆయన వారధిగా నిలిచారు.



కీ.శే. ఆదిపూడి ప్రభాకరామాత్య కవి

తెలంగాణ భూభాగంలో కృష్ణానదికి సమీపంలో విస్తరించబడిన గద్వాల సంస్థానానికి ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. నిజాం ప్రభువుల ఏలుబడి ఒకవైపు సాగుతున్నప్పటికీ వారికి అనుబంధంగా ఉంటూ గద్వాల సంస్థానం 200 ఏళ్ళుగా స్వతంత్ర రాజ్యంగా తన ఉనికిని నిలుపుకుంది. ఇక్కడి సంస్థానాధీశులు ప్రజారంజకమైన పాలన అందిస్తూనే సాహిత్య, సాంస్కృతిక రంగాలు అభివృద్ధి చెందేలా ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఇక్కడ 17వ శతాబ్దం పూర్వార్థం నుండి ఒకవైపు సాహిత్యం, మరోవైపు కళలు గొప్పగా వర్ధిల్లాయి. తెలుగు భాషా కవి, పండితులే కాకుండా ఇతర భాషల్లోని సాహిత్య, సాంస్కృతిక ప్రతిభామూర్తులు ఎందరో గద్వాల సంస్థానంలో కొలువుతీరినవారే. వారందరూ ఈ గడ్డపై భాషా సంస్కృతులు పరిఢవిల్లేలా తమదైన పాత్రను పోషించారు. వారిలో ఆదిపూడి ప్రభాకరామాత్యులు ప్రముఖులు. ఆయన 1871జనవరి 4న పండిత వంశంలో రామలక్ష్మమ్మ, బుచ్చి వెంకయ్య దంపతులకు జన్మించారు. వారి స్వస్థలం గుంటూరు అయినప్పటికీ ఆయన జీవన ప్రస్థానమంతా తెలంగాణ గడ్డపైనే కనిపిస్తుంది. తండ్రి బుచ్చి వెంకయ్య మైసూరు రాష్ట్రంలో తహసిల్దార్‌గా పనిచేసి ప్రఖ్యాతి పొందారు. ప్రభాకరరావు చిన్న వయస్సులో ఉన్నపుడే తండ్రి మరణించడంతో పినతండ్రి సుబ్బారావు వద్ద వుండి చదువుకున్నారు. 1890లో మెట్రిక్యులేషన్ పూర్తిచేసిన ఆదిపూడి నిజాం ప్రభుత్వ విద్యాశాఖలో పాఠశాల పర్యవేక్షకునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. 1890-91 ప్రాంతంలో భారత స్వాతంత్ర్యోద్యమ కెరటాలు తెలంగాణ నేలను తాకుతున్న సమయమది. గోపాలకృష్ణ గోఖలే, బాల గంగాధర తిలక్ వంటివారెందరో కీలక భూమిక పోషిస్తూ ఉద్యమ భావజాలాన్ని దేశంలోని అన్ని ప్రాంతాలకు వ్యాప్తిచేసేవారు. దేశభక్తి భావం మెండుగా కలిగిన ఆదిపూడి స్వాతంత్రోద్యమ ప్రభావంతో బానిసత్వ విముక్తి నినాదంతో నిజాం క్రింద పనిచేయరాదని నిర్ణయించుకున్నారు. ఆ తర్వాత 1892లో తన ఉద్యోగానికి రాజీనామా చేసారు.

గద్వాల సంస్థానాధీశులు శ్రీ రామభూపాలుడు ఆదిపూడి ప్రభాకరామాత్యుడి రాజీనామా గురించి తెలుసుకుని అతని దేశభక్తిని మెచ్చుకున్నారు, ఆయనను స్వయంగా ఆహ్వానించి తమ సంస్థానంలో విద్యాధికారిగా నియమించారు. ఆయన 1892 నుండి 1896 వరకు సంస్థానంలో విద్యావ్యాప్తికి ప్రత్యేకంగా కృషి చేశారు. ఆ సమయంలో ఎందరో గొప్ప పండితులను సంస్థానానికి ఆహ్వానించి వారి ప్రతిభా ప్రదర్శనకు వేదికను కల్పించి సముచిత రీతిలో సత్కారం పొందేలా ఆయన దోహదపడ్డారు. వాస్తవానికి ఇక్కడ 17వ శతాబ్దం నుండే సంస్కృత సాహిత్యం, నాటకం వంటి కళలు వ్యాప్తిచెందేలా కృషి జరిగింది. గద్వాల సంస్థానాధీశులు స్వయంగా సంస్కృత పండితులు కావడంతో కవులను ఆహ్వానించి కావ్యావిష్కరణకు ప్రోత్సహించేవారు. ఈ క్రమంలో బుక్కపట్టణం శ్రీనివాసాచార్యులు, కాణదం సోమయాజి, పోకూరి కాశీపతి, గాథేపల్లి వీర రాఘవులు, పూలగుమ్మి శ్రీనివాసాచార్యులు, పురాణం దీక్షితాచార్యులు, బీరంపల్లి తిరుమలరాయకవి, అనంత రాఘవాచార్యులు, పూలగుమ్మి వేంకటచార్యులు వంటి వారు కావ్యాలను రచించి సంస్కృత భాషా వ్యాప్తికి కృషి చేశారు.

గద్వాల సంస్థానంలో మొదటి సోమనాద్రి కాలం నుండి ఆఖరి సంస్థానాధీశురాలు రాణీ లక్ష్మీ దేవమ్మ వరకు ప్రతిఏటా కార్తీక పౌర్ణమి, మాఘ పౌర్ణమి మరియు చెన్నకేశవ స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేవారు. కార్తీక పౌర్ణమి ఉత్సవాలలో పండిత విద్వత్ సభలు

నిర్వహిస్తే, మాఘ పౌర్ణమికి మరియు చెన్నకేశవ స్వామి ఉత్సవాల్లో సంస్కృత, దేశీ నాటక, జానపద కళా ప్రదర్శనలు జరిగేవి. ఈ ఉత్సవాల్లో మహా పండితుల నుండి మామూలు కళాకారులు సైతం తమ ప్రతిభను ప్రదర్శించి బహుమానాలు (నజరానాలు), సత్కారాలు అందుకునేవారు. సంస్థానంలో ఒకసారి తమ పాండిత్యాన్ని, కళలను ప్రదర్శించిన వారికి సైతం ప్రతి ఏటా పారితోషికం అందించడం సాంప్రదాయంగా కొనసాగింది. సంస్కృత, తెలుగు పండితులే కాదు ఉత్తర దక్షిణ భారతదేశం నుండి వచ్చిన పండితులు కూడా తమ ప్రతిభను ప్రదర్శించి సంస్థానాధీశుల గౌరవాన్ని పొందారు. అందుకే గద్వాల సంస్థానం "విద్వద్గద్వాల"గా ఖ్యాతి పొందింది.

ఇంతటి గొప్ప ఖ్యాతి పొందిన సంస్థానంలో ఆదిపూడి ప్రభాకరామాత్యులు విద్యాధికారిగా ఈ ప్రాంతంలో విద్యా వ్యాప్తికి ఎనలేని సేవలందించారు. సంస్థానాధీశులు స్వయంగా సంస్కృతాంధ్రంలో అభిలాష కలిగినవారు పండితులు కావడంతో ఆదిపూడి వారితో కావ్య చర్చలు జరిపేవారు. మహారాజావారి సందర్శనార్థం వచ్చే కవి, పండిత, కళాకారుల స్వాగత సత్కారాలు, విడిది ఏర్పాట్లు ఆయన పర్యవేక్షించేవారు. గద్వాల సంస్థానానికి దగ్గరలో ఆత్మకూరు సంస్థానం ఉండేది. ఈ రెండు సంస్థానాల్లోను పండితులకు గౌరవ సత్కారాలు జరిగేవి. పండితులు తొలుత గద్వాల సందర్శన తర్వాతే ఆత్మకూరు సంస్థానంలో వారి ప్రతిభను ప్రదర్శించేవారు. తెలుగునాట సుప్రసిద్ధ కవి పండితులైన తిరుపతి వేంకట కవులు దేశ పర్యటన చేస్తూ రాజాస్థానాల్లో తమ పాండిత్యాన్ని ప్రదర్శించేవారు. ఈ కవులు గద్వాల సంస్థానానికి తొలిసారి 1895 మాఘమాసంలో వచ్చారు. ఆ సమయంలో రాజు దర్శనం దొరకలేదు. రెండవసారి 1896లో గద్వాలకు వచ్చారు. అప్పటి గద్వాల ధర్మాధికారి ప్రభువుల దర్శనం కాకుండా అడ్డుకుంటున్నారని భావించిన తిరుపతి వేంకట కవులు తమ బాధను ఆదిపూడితో వ్యక్తపరిచారట. సంస్కృతాంధ్రంలో ప్రఖ్యాతిగాంచిన పండితులకు అవమానం జరుగకూడదని భావించిన ఆదిపూడి ప్రభాకర రావు సంస్థానాధీశులతో ఆశువుగా

**గొప్ప ఖ్యాతి పొందిన సంస్థానంలో ఆదిపూడి ప్రభాకరామాత్యులు విద్యాధికారిగా ఈ ప్రాంతంలో విద్యా వ్యాప్తికి ఎనలేని సేవలందించేవారు. సంస్థానాధీశులు స్వయంగా సంస్కృతాంధ్రంలో అభిలాష కలిగినవారు కావడంతో వారిలోని అనుమానాలు నివృత్తి చేస్తూ ఆదిపూడి కావ్య చర్చలు జరిపేవారు.**

సీ॥ కనకాభిషేకమ్ము గావింపుమనలేదు
వెయారులిమ్మని వేడలేదు
భోగాలనిచ్చి యూరేగింపుమనలేదు
సింహాసనమ్ము లాసింపలేదు
పల్లకీ లిచ్చి సంభావింపుమనలేదు
పడగలిమ్మనియైన నొడవలేదు
గండపెండేరమ్ము గావలెననలేదు
మాన్యమ్ములిమ్మను మనవి లేదు
సీ॥ ఒక్క సభ చేసి తోచిన వక్కలాకు
లిచ్చి పంపించుమనుటకే యింతలాయె
నిలఁ గవీశ్వరులనుట పవ్వులకుఁ జేటు
కాక యోమున్నదయ్య యీ కాలమందు?


అంటూ తిరుపతి వేంకటకవుల తరపున వాదించి వారికి గౌరవ మర్యాదలు దక్కేటట్లు చేశారు. సంస్థానాధీశులు ఆదిపూడి మాటను గౌరవించి రాజ దర్బార్‌లో తిరుపతి వేంకట కవులచే 1896లో ఫిబ్రవరి 21న శతావధానం చేయించారు. వారి అవధానానికి మెచ్చిన ప్రభువుల వారు కవులను గూర్చి 'గద్వాలకు తగిన కవిచంద్రులు' అని ప్రశంసించారు. వారికి గజారోహణ సన్మానంతో సత్కరించి, పారితోషికాన్ని అందించి గౌరవించారు. అంతేకాదు గద్వాల సంస్థాన మొహరుతో జయపత్రికను బహుకరించారట.

గద్వాల రాజాస్థానంలో ఆదిపూడి వారు ఒక ఉద్యోగిగా ఉన్నప్పటికీ అవసరమైన సమయంలో సంస్థానాధీశులను మెప్పించి పండితులకు గౌరవం దక్కేలా చూసేవారు. ఈ క్రమంలో తిరుపతి వేంకట కవులకు ఆయన ఆత్మీయులయ్యారు. ఆదిపూడి 1896లో "కంద రామాయణం" రచించి గద్వాల రాజు శ్రీరామ భూపాలునకు అంకిత మిచ్చారు. ఈ గ్రంధాన్ని చదివిన తిరుపతి వేంకట కవులు రచయితను ఎంతో మెచ్చుకుని "అభినవ తిక్కన" అనే బిరుదుకు ఆదిపూడి తగువారని ప్రశంసించారు.

1897లో ఆదిపూడి గద్వాల సంస్థానం నుండి నిష్క్రమించి కొంతకాలం రైల్వేలో ఉద్యోగం చేశారు. ఈ ఉద్యోగంతో సాహిత్యానికి దూరమవుతున్నానని భావించిన ఆయన పిఠాపురం సంస్థానంలో చేరారు. అక్కడ 1900 నుండి 1908 వరకు ముఖ్య లేఖరిగా, ఠానేదారుగాను పనిచేశారు. ఇక్కడ విధులను నిర్వహించిన కాలంలో అనేక సారస్వత సమావేశాల్లో పాల్గొంటూ ఉపన్యాసాలిస్తూ సాహిత్యాన్ని వ్యాప్తి చేశారు. "ఆంధ్ర భాషోదంతము" అనే ఉపన్యాస పరంపర ఆయనకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. అయితే అక్కడ అసిస్టెంట్ దివాను నిరంకుశత్వాన్ని ప్రతిఘటించి ఉద్యోగానికి రాజీనామా చేసారు. ఆ తర్వాత కొంతకాలం పోలవరం జమిందారు 'రాజా కొచ్చెర్లకోట వెంకట కృష్ణారావు వద్ద ఆంతరంగిక కార్యదర్శిగా పనిచేసారు. పోలవరం జమిందారు 1918 మరణించడంతో సంస్థాన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఈ విషయం తెలుసుకున్న గద్వాల సంస్థానాధీశులు మహారాజ సీతారామభూపాలుడు ఆదిపూడి ప్రభాకర రావును 1920లో ఆహ్వానించి వారి ఆంతరంగిక కార్యదర్శి పదవితో పాటు ఆస్థాన కవిగా, రైల్వేశాఖ సంస్థానమునకు చెల్లించవలసిన పరిహారములను నిర్దేశించు అధికారిగా నియమించారు. రెండవ పర్యాయము సంస్థానంలో అధికారిగా చేరిన తర్వాత సాంస్కృతిక వికాసానికి ఆయన ఎంతో శ్రమించారు. గద్వాల ప్రభువులు ఇతర సంస్థానాల అధికారిక పర్యటనలో ఆదిపూడి తప్పనిసరిగా ఉండేవారు. ఆ క్రమంలో ప్రతిభ కలిగిన పండితులను, కళాకారులను గద్వాలకు ఆహ్వానించి ఈ

ప్రాంతానికి పరిచయం చేసేవారు. కళాప్రపూర్ణ మహామహోపాధ్యాయ, వేదము వేంకటరాయ శాస్త్రి, కొప్పరపు సోదర కవులను, నెమలి వేంకట శాస్త్రి వంటి వారు సంస్థానాన్ని సందర్శించిన వారిలో ఉన్నారు. సంగీత సామ్రాజ్ఞి బెంగుళూరు నాగరత్నమ్మ వంటి విద్వన్మణులను ఆయన ఆహ్వానించి సంగీత కచేరీలు నిర్వహించారు.

ఆదిపూడి స్వయంగా సంస్కృత పండితులు కావడంతో సంస్కృత నాటకాలను ప్రదర్శించేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. గద్వాల మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న గుండేరావు హర్కారీ వంటివారు ఆయనకు తోడయ్యారు. కాళిదాసు వ్రాసిన 'అభిజ్ఞాన శాకుంతలం', 'మాళవికాగ్నిమిత్రం', శ్రీహర్షుడి 'రత్నావళి' వంటి సంస్కృత నాటకాలు గద్వాల కోటలో ప్రదర్శింపచేశారు. ఆదిపూడి అక్కడ ప్రదర్శించే సంస్కృత నాటకాల్లో నటుడిగా ప్రధాన పాత్రలను పోషించారు. ఆయనతోపాటు గొబ్బూరి సంజన్న, నంకాపూర్ కిషన్‌రావు నాయక పాత్రలను పోషిస్తే, పూర్ణచందర్ రావు విధూషక పాత్రను ధరించేవారు. శ్రీనివాసాచార్య, వీరన్న, కృష్ణప్ప వంటి కళాకారులు ఇతర పాత్రల్లో నటించేవారు




ఆదిపూడి ప్రభాకరామాత్యులు గద్వాలలో పనిచేస్తున్న కాలంలోనే "పుండరీకాశ్వాసం" కావ్యాన్ని రచించారు. మహారాజు కోరిక మేరకు 'భారతము-దృశ్య ప్రబంధము" రచనను ప్రారంభించి సీతారామ భూపాలుడి నిర్యాణం అనంతరం 1924లో గ్రంథాన్ని పూర్తి చేసారు. అదేవిధంగా "గద్వాల ప్రభాకరము" గ్రంథాన్ని రచించారు. దోమకొండ సంస్థానాధీశుల కోరిక మేరకు 'ఉమాభ్యుదయము' కావ్యాన్ని వ్రాశారు. దీనిని 1909లో సుజనరంజనీ ముద్రాక్షరశాల ప్రచురించింది. ఈ గ్రంథానికి తెలుగులో తిరుపతి వేంకట కవులు ఆంగ్లంలో "రాజా కొచ్చెర్ల వేంకట కృష్ణారావు బహదూరు" పీఠికలు వ్రాశారు. గ్రంథ రచన కోసం దోమకొండ రాజావారు ఆదిపూడి వారిని ప్రత్యేకంగా ఆహ్వానించి వ్రాయించారు. ఆయన చేసిన అనువాద రచనలో 'ఆంధ్ర పరాశర స్మృతి' ప్రత్యేకమైంది. అధికారిక పర్యటనలో భాగంగా ఆదిపూడి ఏలూరు సంస్థానాధీశులైన 'రాజా మంత్రిప్రగడ భుజంగరావు' ను సందర్శించారు. సాహిత్య చర్చల సందర్భంలో ఆదిపూడి పాండిత్యాన్ని గుర్తించిన రాజావారు సంస్కృతంలోని 'పరాశర స్మృతి' గ్రంథాన్ని తెలుగులోకి అనువదించమని కోరారు. దీనికి సమ్మతించిన ఆయన ఈ సంస్కృత గ్రంథాన్ని తెలుగులోకి పద్యరూపంలో ఆవిష్కరించారు.

ఆదిపూడి ప్రభాకరరావు జీవన ప్రస్థానాన్ని గమనిస్తే కుదురుగా ఒకచోట ఉండకపోయినా తన అవసరమున్న చోట సాహిత్య, సాంస్కృతిక సమాజ అభ్యుదయానికి అంకితమై పనిచేశారు. గద్వాల, దోమకొండ, పోలవరం వంటి సంస్థానాల్లో ఉన్నత పదవులు అలంకరించిన ఆదిపూడి ప్రభాకరరావు సంస్థానాధీశులతో అత్యంత సన్నిహితుడుగా మెలిగారు. ఆయనలోని కార్యదక్షతే వారికి దగ్గరయ్యేలా చేసింది. భిన్న భాషల్లో పండితుడిగా రాణిస్తూనే గొప్ప కార్యనిర్వా హకుడిగా సేవలందించి సంస్థానాల ఖ్యాతిని ఇనుమడింపజేశారు. ఆరోజుల్లో మహారాజులకు సన్నిహితంగా ఉంటూ పొగడ్తలతో ముంచెత్తి కావలసిన భూములను, ధనాన్ని పొందినవారెందరో చరిత్రలో మనకు కనిపిస్తారు. కానీ ఆదిపూడి ఆయన జీవన ప్రయాణంలో వాటికి తావు లేకుండా నిఖార్సైన మనిషిగా కనిపిస్తాడు.

1924లో గద్వాల సంస్థానాధీశులు రాజా సీతారాంభూపాల్ మరణంతో ఆయన ఒకింత నిర్వేదంలోకి వెళ్ళారు. తనకు గొప్ప స్థానాన్నిచ్చి, స్నేహితుడిగా ఆదరించిన రాంభూపాల్ లేకపోవడంతో ఆదిపూడి గద్వాల సంస్థానాన్ని వీడాల్సివచ్చింది. ఆతర్వాత హైదరాబాద్ చేరుకున్న ఆయన సాహిత్య వ్యాసంగాలకు దూరంగా గడిపారు. ఆదిపూడి జీవిత చరమాంకంలో ఆర్థిక సమస్యలను ఎదిరించలేక 1933 జనవరి 27న సికింద్రాబాద్‌లో తుది శ్వాస విడిచారు. 33 ఏళ్ళ సాహిత్య ప్రస్థానంలో గద్వాల నేల ఆయనను గొప్పగా ఆదరించింది. గద్వాల సంస్థానంలో సాంస్కృతికరంగ పోషకునిగా ఆదిపూడి వారు చేసిన సేవలు తెలంగాణ సాహిత్య చరిత్రలో శాశ్వతమై కనిపిస్తాయి.

- డా॥ జె. విజయ్‌కుమార్జీ,
m: 9848078109
e: vijay.kumarji@rediffmail.com

చందదారులుగా చేరండి! **దక్కన్ ల్యాండ్** చందదారులను చేర్పించండి!

'ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో ప్రజాఉద్యమాల వేదికగా ఆరంభమైన 'దక్కన్‌ల్యాండ్' తెలుగు సామాజిక రాజకీయ మాసపత్రిక అనతికాలంలోనే అన్ని వర్గాల ఆదరణ పొందింది. తెలంగాణ ఉద్యమకారులకు కరదీపికగా మారింది. ఈ పత్రిక మరిన్ని వర్గాలకు చేరడంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.


**మా చిరునామా**
DECCAN LAND
**"CHANDRAM"** 490, St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029. Mob: 9030626288
E-mail:desk.deccan@gmail.com, www.deccanland.com

**చందా వివరాలు:**

| | | |
|---|---|---|
| వార్షిక చందా | : | రూ. 300 |
| 2 సం॥లకు | : | రూ. 600 |

'దక్కన్ ల్యాండ్' పేరిట ఎం.ఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.

With Best Compliments from :



CENTRAL
BOOK SHOP

**ABIDS :** 5-9-186, Behind SBH (H.O.), Gunfoundry, Hyderabad - 1. Ph : 6646 8646, 2320 3108


**AMEERPET :** Lane Opp. Green Park Hotel, Hyderabad. Ph : 2340 0789

# ఒక సత్య పథికుడి తాత్విక యానం

**"వైష్ణవజనతో తేనె కహియే – జో పీడపరాయే జాణేరే"**

పేద ప్రజల బాధలను పట్టించుకోనివాడు నిజమైన వైష్ణవుడు కాదని దీని అర్థం. మహాత్మాగాంధీజీకి ఇది ఇష్టమైన పాట. 15వ శతాబ్దంలో దీనిని నర్సిమెహతా అనే గుజరాతీ వైష్ణవ కవి స్వయంగా రచించి గానం చేసాడు. ఈ నవలలోని ప్రధాన పాత్ర వరకవి భూమగౌడు జీవితం సాంతం ఈ పాట అంతస్సూత్రంతో విడదీయలేని బంధంగా ముడిపడి ఉంది.

వరకవి భౌమగౌడు నవల చదువుతున్నంతసేపూ నాకు గతంలో చదివిన ఉన్నవ లక్ష్మీనారాయణ గారి 'మాలపల్లి', వట్టికోట ఆళ్వారు స్వామి 'గంగు', దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్ళు' జ్ఞాపకం వచ్చాయి. ఆ కోవలో ఆ స్థాయిలో నిలబడగలిగే నవల అని స్ఫురించింది. అందుకు ప్రప్రథమంగా ఈ నవలా సృష్టికర్త వేముల ప్రభాకర్ గారికి నా హృదయపూర్వక అభినందనలు.




నవలలో నేను సత్యపథంలో భూమగౌడ్ సాగించిన తాత్విక జీవనయానాన్ని కళ్ళకు కట్టినట్లు దర్శిస్తుంటే నాకు గాంధీజీ 'హిజ్రత్' సిద్ధాంతం జ్ఞాపకం వచ్చింది. హిజ్రత్ సిద్ధాంతాన్ని గాంధీజీ మహమ్మద్ ప్రవక్త జీవితం నుండి స్వీకరించాడు. ప్రతికూల పరిస్థితులలో మహమ్మద్ మక్కాను వదిలి మదీనాకు వలస వెళ్లాడు. ఆ సంవత్సరాన్ని గీటురాయిగా తీసుకుని ఇస్లాం 'హిజ్రీ' శకాన్ని ప్రవేశపెట్టింది. దుర్మార్గుడైన శత్రువు బలంగా ఉన్నప్పుడు, కాలం కలిసి రానపుడు, ప్రజలలో చైతన్యం పరిపక్వ దశకు చేరుకోనప్పుడు కొండను గుద్దిగా ఢీ కొనటం కంటే ఆ ప్రాంతాన్ని లేదా గ్రామాన్ని వదిలి దూరంగా వెళ్లటమే శ్రేయస్కరం. ఇదే 'హిజ్రత్'.

నవలలో వరకవి భూమగౌడు పుష్కర కాలంపాటు అజ్ఞాతవాసం, వనవాసం ఇలాగే చేసి ఈ స్థావర జంగమాత్మక ప్రపంచంలో ఒక జంగమదేవరగా లోక సంచారం చేస్తూ అడుగడుగునా, ప్రతి ఊళ్లో 'మానవ సేవే మాధవసేవ' అన్న సూత్రాన్ని అక్షరాలా ఆచరించి అంతరంగపు ఆత్మలోకంలో కూడా నిరంతరంగా సంచరించి తనను తాను ఆవిష్కరించుకున్నాడు. అనేకమంది సాధువులు, సంతులు, సూఫీయోగుల మాదిరిగానే విద్య (కవిత్వం) వైద్యం ద్వారా ప్రజలకు చేరువైనాడు.

ఈ నవల చదువుతున్నంత కాలం నేను అనేకానేక చారిత్రక అంశాల ప్రభావాలలో తలమునకలుగా కొట్టుకపోయాను.

ఈ నవల కేంద్ర బిందువు, ప్రధాన తాత్వికాంశం వైష్ణవంలోని విశిష్టాద్వైతం లేదా రామానుజ తత్వం. వర్ణ వ్యవస్థకు, బ్రాహ్మణాధిపత్యానికి వ్యతిరేకంగా రెండున్నర వేల సంవత్సరాల క్రింద బుద్ధుడు ఉద్యమించి బహుజనులను దళితులను ఎలా సమీకరించి సంఘ నిర్మాణం చేశాడో సరిగ్గా అట్లాగే వేయి సంవత్సరాల క్రితం శ్రీ పెరంబుదూరులో జన్మించి, తిరుపతి, కంచి, శ్రీరంగాలను కార్యక్షేత్రాలుగా చేసుకున్న రామానుజులు కూడా వైష్ణవాన్ని బ్రాహ్మణాధిపత్యం నుండి విడదీసి, శ్రీరంగం ఆలయ గోపురాన్ని అధిరోహించి 'అష్టాక్షరీ' బీజమంత్రాన్ని బహుజన సముదాయానికి ఉపదేశించి, వారి ముక్తి కోసం తాను నరకానికి వెళ్ళాలన్నా సిద్ధమేనని పీఠాధిపతుల్ని ధిక్కరించి, బ్రాహ్మణ్యానికి సంకేతాలైన జంధ్యాన్ని, పిలకను విసర్జించి "శాత్తాద" (సాతాని) అయినాడు. ఈనాటి మార్క్సిస్టు పరిభాషలో 'డిక్లాస్' అయినాడు. తన తదనంతరం వైష్ణవ ప్రచారం కోసం గతంలో బుద్ధుడు చేసిన సంఘ నిర్మాణాలలాగే రామానుజులు కూడా దక్షిణ భారతదేశంలో అనేక పీఠాలను ఏర్పరచి వాటిని డెబ్బై నలుగురు ప్రియ శిష్యులకు అప్పగించాడు. దీని ప్రభావం వలన తర్వాత కాలంలో మహారాష్ట్రలో నామ్‌దేవ్, ఏక్‌నాథ్, తుకారాం, రామదాస్‌లు పంజాబ్‌లో గురునానక్, బెంగాల్‌లో జయదేవుడు, కృష్ణచైతన్యులు భక్తి ఉద్యమానికి దారులు ఏర్పరిచారు.

నవల చదువుతున్నప్పుడు కాకతాళీయంగానే అయినా నాకు వరకవి భూమగౌడుకు, రామానుజాచార్యకు కొన్ని సామీప్యతలు కనిపించాయి. రామానుజుడి సమకాలంలో రాజు కులోత్తుంగ చోళుడు. ఇతను శైవుడు, వైష్ణవ మతద్వేషి, రామానుజుడ్ని హత్య చేయటానికి అనేక ప్రయత్నాలు చేసి చివరికి విఫలమై కసి తీర్చుకోవటానికి అతని ప్రియ శిష్యులైన కూరేశులు, పెరియ నంబిల కండ్లను పెరికించి వారిని గుడ్డివారిగా చేశాడు. శిష్యుల సలహా మేరకు రామానుజుడు శ్రీరంగాన్ని వదిలి (హిజ్రత్) పన్నెండేళ్ల కాలం కర్నాటకలో ప్రవాసం చేసాడు. కులోత్తుంగ చోళుడికి కంఠంలో రాచపుండు సోకి (అతని మరోపేరు క్రిమికంఠుడు అనగా అతని కంఠాన్ని క్రిమి తినేసింది) మరణించిన తర్వాత రామానుజులు శ్రీరంగం చేరుకున్నాడు.

భూమగౌడు కాలంలో దొరవారు లక్ష్మారెడ్డి కులోత్తుంగ చోళుడిలాంటివాడే. భూమగౌడ్‌ను సర్వనాశనం చేయాలని విఫల ప్రయత్నం చేసి చివరికి అతని ప్రియ శిష్యులైన కిష్టయ్య, వెంకటిలను నానా హింసల పాల్జేసాడు. సన్నిహితుల సలహాపై భూమగౌడు కూడా

రామానుజుల లాగే రావికల్ గ్రామాన్ని వదిలి (హిజ్రత్) పన్నెండేళ్ళకాలం దేశ సంచారం చేసాడు. బయటికి అది బాహ్యప్రపంచపు యాత్రే అయినా సూక్ష్మంగా పరిశీలిస్తే అంతర్లోకాలకు సంబంధించిన ఆధ్యాత్మిక యాత్ర కూడా! క్రిమికంఠుడి మరణం తర్వాత రామానుజుడు శ్రీరంగం ప్రవేశించినట్లుగానే లక్ష్మారెడ్డి వ్యాధిగ్రస్తుడయ్యాక భూమగౌడు రావికల్‌లో పన్నెండేళ్ళ లోకసంచారం ముగించుకుని అడుగు పెట్టినాడు. ఇట్లా రామానుజ కాలంలో భూమగౌడు జీవితంలో నాకు అనేక సామీప్యతలు, పోలికలు కనిపించాయి.

'మ్యాన్ ఈజ్ ఎ ప్రొడక్ట్ ఆఫ్ టైం' అన్నట్లు భూమగౌడు 'కాలం కన్న బిడ్డ'. కాలానికి అనుగుణంగానే అతని ఆలోచనలు, ఆచరణ, తాత్విక జీవన విధానం కొనసాగింది. నవలా కాలం అంటే కథా ప్రారంభ నేపథ్యం, వర్తక సంఘాలు, గ్రంథాలయ ఉద్యమం, ఆంధ్ర మహాసభల ఆవిర్భావానికి కొంచెం ముందు కాలం. అప్పటికి దొరల జులుం పతాక స్థాయిలోనే ఉన్నా, సంఘ నిర్మాణాలలోకి సమీకరించబడి వ్యక్తులు శక్తులుగా మారనటువంటి కాలం. కేవలం సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతోనే కాలం నూతనోద్యమాల కోసం పురుటినొప్పులు పడుతున్న కాలం. ఆనాటి కాలం ఒక 'మూగవాని పిల్లనగ్రోవి' లాంటిది. 1930–1940 మధ్య కాలంలో నవల మొదలైతే భూమగౌడు సాహిత్య సాంస్కృతిక కేంద్రమైన ఆంధ్రమహాసభ నుండి 'గుత్పల సంగం'లోకి ప్రవేశించి కాలానుగుణంగా సంజ కెంజాయ రంగుల ఎర్రబావుటా ధగధగలలో సాయుధుడై లక్ష్మారెడ్డి దొరవారిని ఎదిరించేవాడు. అప్పుడు అతని జీవితం ఆధ్యాత్మికం, సంచారం నుండి విప్లవ రాజకీయాలవైపు మళ్లేది. కాలం కలిసి రానందున 'హిజ్రత్' సిద్ధాంతాన్ని ఆచరించాడు, అది అతని చేతకానితనం కాదు.

ఫ్రెంచి విప్లవానికి ముందు సాంస్కృతిక విప్లవం, పునరుజ్జీవన ఉద్యమాలు ఒక నేపథ్యంగా రాజకీయ రంగాన్ని సిద్ధం చేసినట్లుగానే తెలంగాణాలో భూమగౌడు ఇంకా మరెందరో చేపట్టిన సాహిత్య – సాంస్కృతిక ఉద్యమాలే 1946–51లలో రైతాంగ సాయుధ పోరాటంగా, 1978–79లలో జగిత్యాల జైత్రయాత్రలుగా పరిణామం పొందినాయి. దీనికి మంచి ఉదాహరణ మన జాతీయోద్యమంలోని అతివాద ఉద్యమమే. జాతీయ కాంగ్రేసులోని అతివాదులైన 'లాల్ బాల్ పాల్'లు (లాలా లజపతిరాయ్, బాల గంగాధర తిలక్, బిపిన్ చంద్రపాల్) పంజాబ్, మహారాష్ట్ర, బెంగాలు రాష్ట్రాలకు చెందినవారు. ఈ మూడు రాష్ట్రాల నుండే తర్వాత కాలంలో భగత్‌సింగ్, వాసుదేవ్ బలవంత్ పాడ్కే, సూర్యసేన్ లాంటి విప్లవకారులు తదనంతరం కమ్యూనిస్టులు, సోషలిస్టులు, నక్సలైట్లు ఆవిర్భవించారు. కారణం? ఒకప్పుడు ఈ మూడు రాష్ట్రాలు భక్తి ఉద్యమాలకు కేంద్రాలుగా ఉండేవి. ఆ భక్తి ఉద్యమాలు, ఆ నేలను, నేలపుత్రులను వారి మేధస్సులను, హృదయాలను సారవంతం, సంపన్నం చేసి విప్లవోద్యమాల వైపు మళ్లించి కొత్తపుంతలు తొక్కించాయి.

ఈ దృక్పథంతోనే భూమగౌడు పాత్రను పరిశీలించాలి. అంచనా వేయాలి. ఆయన జీవితంలో కవిత్వము, కృషి, ఆధ్యాత్మిక యాత్రలు కేవలం వ్యక్తిగతంగా కాక కాలం పడే పురుటి నొప్పులకు దోహదపడే ఉత్తరోత్తరా ఉత్తర తెలంగాణలని అనేక ఉద్యమాలకు నేలను సారవంతం చేశాయని నా అభిప్రాయం.

ఒక మంచి చారిత్రక, పర్యాటక నవలను అందించిన వేముల ప్రభాకర్‌కు మళ్ళీ మరోసారి నా అభినందనలు, కృతజ్ఞతలు.

–పరవస్తు లోకేశ్వర్, m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com

# పెట్టుబడి



మన బతుకేదో
మనం బతుకుదామన్నా
బతకనీయని
పెట్టుబడి

ఒక పెట్టుబడి
రోగాన్ని సృష్టిస్తే
ఒక పెట్టుబడి రోగానికి
మందుబిళ్ళ తయారు చేస్తుంది

మనం భూమిపై
పడటమే
మనకు తెలియకుండానే
పెట్టుబడి కోరల్లో చిక్కుకున్నాం

తినే బువ్వ
చదివే చదువు
అందుకునే వైద్యం
పెట్టుబడి ఆడే కపట నాటకంలో
విలవిల

ప్రజాస్వామ్య నాలుగో స్తంభం
వ్రాసే నాలుగు మాటల్లో
పెట్టుబడి విషం కక్కుతుంటే
నిజం చచ్చిపోతుంది

–గిరిప్రసాద్ చెలమల్లు
m : 9493388201
e : gpchelamallu@gmail.com

## విష్ణుకుండిన గోవిందవర్మ తామ్ర దాన శాసనం :

# ఎర్మేదల యనమాదల కాదు వెల్మజాల

విష్ణుకుండినుల రాజధాని పట్టణం ఇంద్రపాలనగరం లేక ఇంద్రపురి ఒకప్పటి పాతపేరు తుమ్మలగూడెం, యాదాద్రి-భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో వుంది ప్రస్తుతం. మహబూబ్ నగర్ జిల్లా, అచ్చంపేట సమీపంలోని అమ్రాబాద్ (అమరపురి, అమరావతి) విష్ణుకుండినుల తొలి రాజధానిగా వుండేది. రాజ్య విస్తరణ అనంతరం గోవిందవర్మ రాజధానిని ఇంద్రపాల నగరానికి మార్చాడు. ఇక్కడి ఇంద్రపాల గుట్ట మీద దుర్భేద్యమైన కోట నిర్మించాడు. తెలంగాణలో కొండల మీద కోట నిర్మాణాలు ప్రారంభదశలో వున్నకాలమది. ఇంద్రపాల గుట్టను స్థానికులు శంకరం గుట్ట అని కూడా పిలుస్తారు. ఈ గుట్టకు ఉత్తర వాహినిగా మూసీ(ముచికుంద)నది ప్రవహిస్తున్నది. ఉత్తరవాహినులను పవిత్రంగా భావించడం ఈ దేశం నదులను పూజించే సంప్రదాయంలోనిది. ఎక్కువచోట్ల బౌద్ధ క్షేత్రాలు ఉత్తర వాహినుల దక్షిణం ఒడ్డున నిర్మించారు. ఇక్కడ కూడా మూసీనది దక్షిణం ఒడ్డున, శంకరం గుట్టకు పడుమట ఒక శిథిల బౌద్ధ(స్థూప) క్షేత్రం వున్నది. ఇక్కడ విష్ణుకుండినుల కాలంనాటి ఇటుకలతో కట్టిన స్థూపనిర్మాణం ఆనవాళ్ళు కనిపిస్తున్నాయి. ఇంద్రపాల గుట్ట మీద కూడా బౌద్ధ ఉద్దేశిక స్థూపాల అవశేషాలు అగుపించాయి. గుట్ట కింది ఆ విశాల బౌద్ధక్షేత్రం శిథిలాలు గోవిందవర్మ రాణి పరమ మహాదేవి పేరన కట్టించిన 'మహాదేవి మహావిహారం' గా మా చరిత్ర బృందం గుర్తించింది. ఈ విహారానికి తన 37వ రాజ్యపాలన సంవత్సరాలు నిండిన సందర్భంగా గోవిందవర్మ చేసిన దాన శాసనమే విష్ణు కుండినుల చరిత్రకు ఇంద్రపాలనగర సాక్ష్యం. 'బౌద్ధ మతానురక్తుడైన గోవిందవర్మ తన సంపదలన్ని 'భిక్షు, ద్విజ, అనాథ, యాచక, వ్యాధిత, దీన, కృపణ జనోపభుజ్యం'గా భావించినవాడు. ఈ శాసనంలో బౌద్ధాచార్యుడు దశబలబలి ఈ మహా విహారానికి నిర్వాహకుడుగా వుండగా గోవిందవర్మ విహార నిర్వహణలో దీప, ధూప, గంధ, పుష్ప, ధ్వజ, పాన, భోజన, శయనాసన, గ్రాస, భైషజ్య, ఖండస్ఫుటిత శీర్ణ సంస్కారాదుల కొరకు 'పేణ్కపర' అనే గ్రామాన్ని చేసాడని వుంది.



**గోవిందవర్మ ఇంద్రపాల నగర తామ్ర శాసనం**

మూడవ రేకు- మొదటి పక్క

1. బుద్ధస్య మార్గదభిప్రపన్నం నిర్విద్విరాగశీల శిక్షాధ ౄ(ధ్ధు)త గుణాఢ్యయన శ్రవణ చి
2. న్తన భావనాధ్యానసమాధి సమాపత్త్యాదిభిగుణగణైరనుత్తరం పుణ్యక్షేత్రం త్రియానయాయినం చతుర్ధ
3. శమార్య సజ ముద్దిశ్య త్యాగపరిభోగాన్వయోమోపధిక(చో) పుణ్యక్రియావస్వభినర్వర్త
4. ుుమ్యతావామతాపిత్రోః సర్వ సత్వానామ్ఒ నిఖిల దారిద్ర్య దుఃఖోపశమహేతోః స్వస్యా అగ్ర
5. మహిష్యా పరమమహాదూవ్యా విహారస్య దీప ధూప గన్ధ పుష్ప ధ్వజ పాన భోజన శయనాసన గ్రాస
6. భైషజ్య చేణ్డ స్ఫుటిత శీర్ణ సంస్కారాది కుశల మూలాను పర్చేందార్థం "ద్వావేర్మేదల పేణ్కపఱ"

నిజానికి రాజు గోవిందవర్మ చేసింది ఒక గ్రామం కాదు, రెండు గ్రామాల దానం. శాసనంలో 'ద్వావేర్మేదల పేణ్కపరః' అని వుంటుంది. (గోవిందవర్మ ఇంద్రపాల నగర తామ్ర శాసనం 3వ రేకు, 6వ పంక్తి) ఇందులో పేర్కొన్న ఎర్మేదల అనే గ్రామం విజయవాడ దగ్గరలోని 'యనమదల'గా చరిత్రకారులు వివరించారు.

కాని, ఇటీవల నేను చదివిన వెల్మజాల (ప్రస్తుతం జనగామ జిల్లా లోని గ్రామం) రెండో రాష్ట్రకూట శాసనంలో 6వ, 9వ పంక్తుల్లో రెండుసార్లు 'ఎర్మేదల' పేర్కొనబడ్డది. అందువల్ల ఎర్మేదల అంటే ఆంధ్రప్రదేశ్ లోని యనమదల కాదు తెలంగాణాలోని వెల్మజాల అని స్పష్టమౌతున్నది. ఇప్పటిదాకా ఎర్మేదల అంటే యనమదల అని చేసిన తీర్పులు శాసనబద్ధమైనవి కావు అని తేటతెల్లమైంది.

వెల్మజాలలోని ఈ శాసనం పాత నల్గొండ జిల్లాలో రాష్ట్రకూటుల ఐదవశాసనం. ఇది వెల్మజాలలోని పాతవూరు (పాటిగడ్డ) అడుగులో లభించిన పెద్ద శాసన స్తంభం. ఈ స్తంభానికి 3వైపుల శాసనం చెక్కివుంది. తెలుగు లిపిలో సంస్కృత భాషలో రాయబడిన శాసనం రాష్ట్రకూట చక్రవర్తి రెండో కృష్ణుని కాలంలో వేయబడింది.



తొలి వెల్మజాల శాసనంలో పేర్కొనబడిన రాజ ప్రతినిధి రావి చంద్రయ్య కొడుకు విక్రమల్లదేవవర్మ కారవయ్య అక్కడున్న జైన బసదికి కొంత భూమిని దానం చేసినట్లు ఈ రెండవ శాసనంలో తెలుపబడింది.

**శాసనపాఠం:**

1. 'స్వస్తి కృష్ణ భూపేంద్ర
2. తన్త్రపతి ప్రభు సశ్రీ వత..
3. త్ర జినాలయ మకరయ
4. హరశ్చయత్ర్యమ్మ విక్రమల్ల దే(వ)
5. వర్మ కారువయ్య స్తత్యను మన్త
6. ఎర్మేదలే పశ్చిమ దిశి రావిచన్ద్ర జి
7. నేన్ద్రచవ సమేత స్మైగుభతుల వ
8. ల్లభోపా న్నివర్తన షడ్డత్గ్ర దా
9. రభ్య ఎర్మేదల గ్రామస్తిత రా
10. విచన్ద్ర జినేన్ద్ర వినుత చ వగాస్థిం..
11. ...దాత్థమిఖ సుతన్త్రే గొమ్య ఱ
12. శాలి పాదవర'

- ప్రొ. శ్రీ రామోజు హరగోపాల్
m : 9949498698
e: akshara25@gmail.com

## గంట చప్పుడు

గంట శబ్దం
విన్నప్పుడల్లా...
ఏదో ఉద్వేగం
మనసులో వెతుకులాట

తనువంత తండ్లాట
అది చర్చిలో కావొచ్చు
గుడిలో కావొచ్చు
బడిలోనూ కావొచ్చు

గంట చప్పుడు
చెవిన సోకినప్పుడల్లా
ఎద తలుపులు విచ్చుకుంటయి
ఎదురు చూపులకు
గురుశిష్యుల్లో అంతరాలుండవు

గంట టంగు టంగున
మ్రోగిందంటే చాలు
హృదిలో మరేదో అనుభూతి
గంట గణ గణమని మ్రోగితే
లేగదూడలోలె ఉరుకులాట



చర్చిలో గంట మ్రోగితే
మదిలో శాంతి గీతాలు
గుడిలో మ్రోగిందంటే
భక్తజనవాహిని గుండెల్లో
పొంగిపొరలే భక్తి పారవశ్యం

గంట బడిలో మ్రోగితే చాలు
పసి గొంతుల్లో వినబడే
ప్రార్థనా గీతాలు

జీవిత పాఠాల కోసం
పసి పిల్లల ఎదురుచూపులు
ఏ సారొచ్చిండని, మా సార్రాల్లేదని
గుసగుసల పలకరింపులు

ఇసురాంతి బెల్లు కొట్టంగనే
ఆవరణంత తన్మయత్వంతో
సీతాకోక చిలుకల్లా అందరి
కళ్ళల్లో ఆనందం దుంకుతుంది.
పిల్లల పెదవుల్లో రోజంత
నవ్వుల జల్లు కురుస్తుంది.

-కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655
e : komatireddy.arunabuchireddy@gmail.com

# భూగర్భ సిరి.. సర్వే ఆఫ్ ఇండియా

**• 1767లో స్థాపన • 30 వేల మందికి శిక్షణ • పలు దేశాలకు ఆదర్శం**

సర్వే ఆఫ్ ఇండియా నేషనల్ మ్యాపింగ్ ఏజెన్సీ. బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీలో భాగంగా ఈ సంస్థ 1767లో స్థాపించబడింది. సుమారు 252 సంవత్సరాలు పూర్తి చేసుకొని ప్రపంచ సర్వేక్షణ సంస్థలకు ధీటుగా నిలిచింది. గత రెండున్నర శతాబ్దాలలో దేశం మొత్తం సరిహద్దులు, 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మ్యాప్‌లను తయారుచేసి అటు కేంద్ర ప్రభుత్వానికి, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేసింది. ఒక ప్రత్యేకమైన సర్వేయర్లచేత అత్యంత అంకితభావంతో అద్భుతమైన మ్యాప్‌లను తయారు చేసి ఔరా అనిపించింది. స్వాతంత్ర్యానంతరం 1967లో హైదరాబాద్ కేంద్రంగా భారతీయ భూవిజ్ఞాన సర్వేక్షణ శిక్షణ సంస్థను స్థాపించారు.




**శాస్త్రవేత్తలు, విద్యార్థులకు భూగర్భ పరిజ్ఞానం :**

దేశంలోని నేషనల్ సర్వే అండ్ మ్యాపింగ్ ఆర్గనైజేషన్ ప్రభుత్వానికి చెందిన ప్రముఖ భారీ సంస్థ. దేశం యొక్క ప్రధానమైన మ్యాపింగ్ ఏజెన్సీగా కీర్తిగడించింది. అప్పటి నుంచి హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా భూగర్భ సంబంధిత విషయాలపై విశేషమైన కృషిచేస్తూ శాస్త్రవేత్తలకు చేదోడువాదోడుగా నిలుస్తుంది. శాస్త్రవేత్తలు, విద్యార్థులకు కావాల్సిన భూగర్భ పరిజ్ఞానం, పరిశోధన అంశాలపై సమగ్రంగా సమాచారం అందించేందుకు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. ఈ సంస్థ అందించే సేవలకుగానూ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ, ఇస్రో సంస్థలు సంయుక్తంగా జాతీయ సహజ వనరుల నిర్వహణ వ్యవస్థ అనే కార్యక్రమం పేరు మీద సాంకేతిక, ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాయి.




**సంస్థ అనుబంధ కేంద్రాలు :**

భారతీయ భూవిజ్ఞాన సర్వేక్షణ శిక్షణ సంస్థకు అనుబంధంగా నాగపూర్, కోల్‌కతా, లక్నో, జైపూర్, షిల్లాంగ్‌తోపాటు మరో నాలుగు క్షేత్రస్థాయి శిక్షణ కేంద్రాలు కర్ణాటకలోని చిత్రదుర్గ, రాజస్థాన్‌లోని జూవార్ చత్తీస్‌గడ్‌లోని రాయపూర్, జార్ఖండ్ లోని కుజు ప్రాంతాల్లో ఉన్నాయి. అయితే ఈ ఒక్కో క్షేత్రస్థాయి శిక్షణ కేంద్రం ఒక్కో ప్రత్యేకమైన భూవిజ్ఞాన క్షేత్ర విషయ సంబంధిత అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు నెలకొల్పారు. వీటిలో అత్యున్నత అర్హతలతోపాటు అపార అనుభవం గల 50 మంది భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు బోధనా సిబ్బందిగా సేవలందిస్తుంటారు. దీంతోపాటు సంస్థ ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రయోగశాలలు, వివిధ శిక్షణ విభాగాలైన శిలాశాస్త్రం, భూసమాచార, నిర్వహణ శిక్షణ కేంద్రం (సీజీఎంటీ), ఫొటోజియాలజీ, రిమోట్ సెన్సింగ్, భూభౌతిక శాస్త్రం, రసాయన ఇంజినీరింగ్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి.

క్షేత్రస్థాయిలో శిక్షణ..భూగర్భ శాస్త్రానికి సంబంధించిన ఈ సంస్థ క్షేత్రస్థాయిలో శిక్షణ కల్పిస్తుంది. ప్రధాన కార్యాలయంలో ఉన్న ప్రయోగశాలల్లో శిక్షణ అందిస్తారు.

**భూగర్భ శాస్త్రవేత్తల అవసరాలకు అనుగుణంగా కోర్సులు :**

భూగర్భ శాస్త్రవేత్తల అవసరాలకు తగిన విధంగా కోర్సులను రూపకల్పన చేసి క్షేత్రస్థాయి కేంద్రాల్లో శిక్షణను అందిస్తుంది. ఈ శిక్షణను వివిధ సంప్రదాయ, శాస్త్రీయ, ఆధునిక పద్ధతుల్లో ఎక్స్‌రే, ఫోరెన్సిక్, ఎక్స్‌రే నిక్షేపం, ఐసీపీ-ఎంస్, ఎలక్ట్రాన్ మైక్రో విశ్లేషణ, ఏఏఎస్‌లతో విశ్లేషించగలిగే స్థాయిలో శిక్షణను అందిస్తున్నారు. ఇలా సాంకేతిక శిక్షణతోపాటు పరిపాలన, నిర్వహణపరమైన కోర్సులను జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో అనుసంధానం చేసే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. ఇవేగాక ఆధునిక సాఫ్ట్‌వేర్ ఆధారిత, రిమోట్ సెన్సింగ్, భౌగోళిక సమాచార వ్యవస్థలకు సంబంధించిన అంశాల్లోనూ తర్ఫీదునిస్తున్నారు.

**వేలాది మందికి శిక్షణ :**

భారతీయ భూవిజ్ఞాన సర్వేక్షణ శిక్షణ సంస్థలో ఇప్పటివరకు దాదాపు 32 వేల మంది శిక్షణ తీసుకున్నారు. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 62 దేశాలకు చెందిన 433 మంది అంతర్జాతీయ విద్యార్థులు హైదరాబాద్‌లో శిక్షణ సంస్థ నుంచి శిక్షణ పొందారు. ప్రస్తుతం వారందరూ ఆయా దేశాల్లో భూగర్భ సంబంధిత సంస్థల్లో అత్యున్నత స్థాయిలో సేవలందిస్తున్నారు. మరికొద్దిమంది ఆయా ప్రభుత్వాల్లో ఉన్నత పదవుల్లో కొనసాగుతున్నారు. విశ్వవిద్యాలయాలు, ప్రముఖ సంస్థలు సుమారు వందకు పైగానే సర్వేక్షణ శిక్షణలో భాగస్వాము లయ్యారు.



**పలు దేశాలకు ఆదర్శం :**

భారతీయ భూవిజ్ఞాన సర్వేక్షణ శిక్షణ సంస్థ పనితీరును గమనించిన పలు ప్రపంచ దేశాలు తమ దేశం యువతకు మరింతమందికి శిక్షణ ఇవ్వాల్సిందిగా ప్రతిపాదనలు పంపుతున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. అయితే భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ భూగర్భ శాస్త్రవేత్తలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రధానంగా ఈ సంస్థ నిర్వహిస్తుంది. భూగర్భ, భూభౌతిక, రసాయన, ఇంజినీరింగ్ విభాగాల్లో కొత్తగా నియమించిన గ్రూప్-ఎ, గ్రూప్-బి అధికారులకు ప్రవేశ శిక్షణతోపాటు సాంకేతిక, సాంకేతికేతర సిబ్బందికి శిక్షణ అందిస్తున్నారు. అయితే ఇటీవలకాలంలో అంతర్జాతీయంగా విద్యార్థులు ఆసక్తి కనబరుస్తుండడంతోపాటు డిమాండ్‌కు అనుగుణంగా పరిమితికి మించి ఎక్కువ మందికి శిక్షణ ఇస్తున్నారు.

**విద్యార్థులకు వరం :**

దేశవ్యాప్తంగా పలు విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, విద్యార్థులకు భూగర్భ సంబంధిత విషయాలపై శిక్షణతోపాటు పూర్తి అవగాహన తరగతులు నిర్వహిస్తు న్నారు. ఇందుకోసమే ప్రత్యేకంగా భూ విసంవాద్ పేరుతో కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగానే ఇప్పటివరకు దాదాపు 2500 మంది విద్యార్థులు, అధ్యాపకులు శిక్షణ పొందారు.

**శాస్త్రవేత్తలకు పీహెచ్‌డీ చేసుకునే అవకాశం:**

దీనికితోడు భూగర్భ సర్వేక్షణ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలకు పీహెచ్‌డీ చేసేందుకు దన్‌బాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్ (ఐఎస్ఎం)తో ఒప్పందం చేసుకునే అవకాశం కల్పించారు. అందులో భాగంగా 43 కోర్సుల్లో 20 విశ్వవిద్యాలయాలకు చెందిన 1441 మంది విద్యార్థులు, 11 కాలేజీలకు చెందిన 626 మందితోపాటు మరికొంతమందికి గత ఆరు నెలల కాలంలో శిక్షణ అందించారు.

– కట్టా ప్రభాకర్, m : 8106721111
e: akumarkatta@gmail.com



# యుద్ధం చేయాల్సిందే

అతడిని
కొన్ని పువ్వుల్ని ప్రేమించుమని పంపాను
వాటి భాష అర్థం కావడంలేదని తిరిగొచ్చాడు

పోనీ
తన గుమ్మం ముందు అటు ఇటు కదలాడుతు
అరుస్తున్న పిచుక గొంతును వినుమన్నాను
దాని భాష అర్థం కావడంలేదని అన్నాడు

కనీసం
కుండీలో ఒక్కొక్కటిగా ఆకుల్ని రాల్చుతున్న
పూలమొక్క ముందు కాసేపు మోకరిల్లుమన్నాను
కూర్చున్నంతసేపు ఏమీ అర్థం కాలేదని చెప్పాడు

ఐతే
ఇప్పుడిక నీతో నువ్వు
యుద్ధం చేయాల్సిందేనంటూ వెళ్ళిపోయాను

x x x

ఒకానొకరోజు
తన గుమ్మం ముందునుంచి వెళ్ళిపోతున్నప్పుడు
కొన్ని ఏపుగ పెరిగిన మొక్కల మధ్య పువ్వులా నిలబడ్డ
అతడి అరచేతిలో ముదిపెంగా పిచుక!!

–బిల్ల మహేందర్, m : 9177604430
e : billamahisari@gmail.com

# రాచకొండ రాజ్యం - పాలకులు

సుమారు 6 శతాబ్దాల క్రితం దేదీప్యమానంగా వెలిగిన దుర్గం రాచకొండ. ఇది పర్వత పంక్తుల మధ్య ఒక అభేద్య గిరిదుర్గంగా నిలిచింది. తెలంగాణలో ఆనాడు ఇది సువిశాల సామ్రాజ్య రాజధాని. తెలంగాణలో కాకతీయుల తరువాత ఇది పెద్ద రాజ్యం. నల్గొండ జిల్లాలోని ఈ దుర్గాన్నుండి రేచర్ల పద్మనాయక రాజులు పాలించారు.

క్రీ.శ.1323లో ఓరుగంటిని ఉలుగ్‌ఖాన్ గెలిచి, ముస్లిం పాలకులను నియమించి, తండ్రి ఘియాసుద్దీన్‌ను వధించి మహమ్మద్ బిన్ తుగ్లక్ పేరుతో ఢిల్లీ సింహాసనాన్ని క్రీ.శ.1326లో ఆక్రమించిన రోజుతో హిందూ రాజ్యం అంతరించి హిందువులు చాలా కష్టాలు పడ్డారు. కాకతీయ ప్రతాపరుద్ర రాజు కాలంలో ఓరుగల్లు కటకం (కోట నగరం) పాలించిన నాగయ గన్నయ కాకతీయ రాజ్య పతనానంతరం మతం మారి మాలిక్ మక్బూల్ పేరిట ఓరుగల్లుకు వజీర్ అయినాడు. నిరవద్యపురం, రాజమహేంద్రం ముస్లింల వశం ఐనాయి. ఈ కాలంలో హిందువుల అష్టకష్టాలగూర్చి ప్రోలయ నాయకుని విలస శాసనం విస్తారంగా పేర్కొంది. కాకతీయుల సేనానులైన రెడ్డి, వెలమ నాయకులు సామంతుల కూడగట్టుకొని తిరిగి తురక రాజ్యాలను హిందూ రాజ్యాలుగా మలచుకొన్నారు. వాటిలో రేచర్ల సింగమనాయకుడు నిర్మాణం ప్రారంభించిన రాచకొండ తరువాత బలమైన దుర్గంగా మారింది.


రాచకొండ రాజమార్గం

సింగమనాయకుడు ప్రతాపరుద్రుని కొలువులో సేనాని. అతని కుమారుడు అనపోత నాయకుడు రాజధానిని ఆమనగల్లు నుండి రాచకొండకు క్రీ.శ.1361లో మార్చినాడు. తరువాత పద్మనాయకులు బహమనీలకు, ఆపై కళింగ (ఒరిస్సా) అధీశులకు స్నేహ హస్తాన్ని చాచినారు. క్రీ.శ.1325 నుండి సుమారు నూటయాభై సంవత్సరాలుగా సాగిన ఈ రాజవంశంలో సింగమ, అనపోత, రెండవ సింగమ, రెండవ అనపోత, రావుమాధవ, మూడవ సింగమలు ఒకరి తరువాత ఒకరు పాలించారు. వీరి ఈ రాజవంశం క్రమం దేవలమ్మ నాగారం చెరువుగట్టు శాసనం (క్రీ.శ.1429)లో ప్రస్తావించబడింది. సింగమనాయకుని తండ్రి ఎరదాచా నాయకుడు దీంట్లో మూలపురుషుడుగా పేర్కొబడ్డాడు. దేవరకొండ రాజ్యంలో వీరి సోదర వంశం కొనసాగించింది. మొదటి అనపోతా నాయకుడు తన తమ్ముడు మాదానాయకుణ్ణి ఈ రాజ్యంలో ప్రతిష్ఠించాడు.

రాచకొండ పద్మనాయక రాజులది రేచర్ల గోత్రం. వీరు వెలమలుగా ప్రసిద్ధులు. పలనాటి యుద్ధానంతరం రేచర్ల వంశీకులు కాకతీయుల ప్రాపు సంపాదించినారు. రేచర్ల ఎరదాచానాయకుడు ప్రతాపరుద్రునికి కుడిభుజం ఐనవాడు. అతనికి 'పంచపాండ్య దళవిభాళ' అని బిరుదు. తమిళనాట పాండ్యులను పారదోలుటలో ప్రతాపరుద్రునకు సాయపడినాడు. గణపతిదేవుని కాలంలో దామనాయకుడు, రుద్రచమూపతి, రుద్రమ కాలంలో తిరుగుబాట్లనణచిన ప్రసాదాదిత్యనాయకుడు ఎరదాచానాయనికి పితరుల స్థానంలోని వారు. సింగమ నాయకుడు కూడా ప్రతాపరుద్రునికి సాయపడి అతని నుండి ఆశీతి వరాలు (80 వరాలు) పొంది 'ఆశీతి సింగమ' అయినాడు.


ఓరుగల్లు కాకతీయుల తర్వాతి రాజు కాపయ బహమనీలతో యుద్ధాలు చేస్తుండగా అవకాశం చూసి రేచర్ల సింగమ నాయకుడు అంతర్వేది, ఏలేశ్వరాలు ఆక్రమించి, తన రాజ్యం విస్తరింప చేసికొని జల్లిపల్లిపై దండెత్తి సోమ వంశీకుల చేతిలో మోసంతో చంపబడ్డాడు. వీరుడైన ఇతని కుమారుడు అనపోతనాయకుడు ఆమనగల్లు రాజ్యాధికారం చేపట్టి, మొదట జల్లిపల్లిని గెలిచి సోమ వంశాన్ని, రెడ్డి రాజులను అంతం చేసి, 'సోమకుల పరశు రాము' బిరుదు పొంది, క్రీ.శ.1367లో కళింగపై యుద్ధము చేసినట్లు అతని సింహాచల శాసనం చెప్తోంది. ఆ పిదప ఓరుగల్లు, భువనగిరి, శృంగారం దుర్గాలు జయించి 'ఆంధ్రదేశాధీశ్వర' అని ప్రశంసింపబడ్డాడు. శ్రీపర్వతము (శ్రీశైలం) వద్ద కృష్ణానదికి సోపానములు కట్టించినాడు. తమ్ముడైన మాదానాయుని దేవరకొండ దుర్గాధిపతిని చేసినాడు. ఈ అన్నదమ్ముల సంతతులు చివరిదాకా సోదర భావంతో నడిచాయి. అందుకే రాచకొండ దేవరకొండ రాజ్యాలని చరిత్రకారులు కలిపి చెప్తుతారు.

అనపోతనాయకుని పెద్దకొడుకు రెండవ సింగమనాయకుడు (క్రీ.శ.1384-99) కళ్యాణదుర్గ విజేత అని 'చమత్కార చంద్రిక' వివరించింది. ఈతడు రెడ్డిరాజుల ఏలుబడిలోని పెదవేగి, బెండపూడి మొదలైన దుర్గాలు జయించి సామ్రాజ్యం విస్తరించినాడు. విజయనగర రాజులతో యుద్ధాలు చేసినాడు. ఈతడు కుమారసింగమగా, సర్వజ్ఞ సింగభూపాలుడుగా పేర్కొబడ్డ గొప్ప కవి, కవిపండిత పోషకుడు.

రెండో అనపోతానాయకుడు (1399-1421) ఈ రాచకొండ పద్మనాయకులలో మహా పరాక్రమశాలి. అద్దంకి రెడ్డి రాజ్యం, కొండవీటి రెడ్డి రాజ్యాలుగా రెడ్డిరాజులు ప్రసిద్ధులు. కొండవీటిరెడ్డి రాజ్యం రాజమహేంద్ర రెడ్డి రాజ్యంగా కొమరగిరి రెడ్డి కాలంలో చీలింది. ఈ

సమయంలో విజయనగర రాజ్యానికి రాచకొండ రాజులు సన్నిహితులైనారు. రెండో అనపోత సోదర దేవగిరి రాజ్యపు లింగమనేడుతో కలిసి కొండవీటి పెదకోమటి వేమారెడ్డిని వధించినాడు. ఈతని తమ్ముడు మాదానాయుడు (1421-30) రాజ్యమేలుతుండగా బహమనీల దాడులవల్ల రాజ్యాధికారం శిథిలమైంది. బహమనీ రాజ్యాధీశుడు అహ్మద్‌షా సేనాని అజీంఖాన్‌తో ఓడిపోయి క్రీ.శ.1425లో సుల్తాన్‌తో సంధి చేసికొన్నాడు. ఓరుగల్లు జారి బహమనీ రాజ్యంలో కలిసింది. ఈతని భార్య నాగాంబిక రాచకొండకు పశ్చిమోత్తరాన ఉన్న దేవలమ్మ నాగారం వద్ద నాగసముద్రమనే గొప్ప చెరువు తవ్వించి శాసనం (క్రీ.శ.1429) వేయించింది. ఈ శాసనంలో మాదానాయుడు రామాయణానికి వ్యాఖ్య రాసి రామునికే అంకితమిచ్చాడు అని ఉంది.

వినతండ్రి మాదానాయుని మరణానంతరం రెండో అనాపోతానాయని కుమారుడు మూడో సింగమనాయుడు రాజ్యాధికారం (క్రీ.శ.1430-1475) చేపట్టాడు. ఈతని కాలంలో రాచకొండ దుర్గం చేజారింది. బహమనీ సుల్తాన్ అల్లాఉద్దీన్‌షా సేనాని సంజర్‌ఖాన్ చేతిలో సింగమనాయుడు ఓడిపోగా సుల్తాన్ తమ్ముడు మహమ్మద్‌ఖాన్ రాచకొండకు స్థానిక పాలకుడైనాడు. అల్లాఉద్దీన్ మరణానంతరం హుమాయూన్ రాజు కాగా (క్రీ.శ.1457) అతనిని గెలిచేందుకు వీరికి సాయంగా వచ్చిన కళింగ రాజు కపిలేశ్వరజగవతి కుమారుడు కుమార హంవీరుడు వచ్చి తెలంగాణను బహమనీలనుండి విడిపించినాడు. రాచకొండ, భువనగిరి, ఓరుగల్లు దుర్గాలను హంవీరుడు పట్టుకున్నాడు (క్రీ.శ.1464). ఈ సంవత్సరం రాచకొండ తిరిగి పద్మనాయకుల ఏలుబడిలోనికి వచ్చింది. సర్వజ్ఞ సింగమనాయకుని తమ్ముడు రామధర్మానాయుడు వరంగల్ జిల్లాలోని శాయంపేటలో 1464లో చంద్రగ్రహణ సమయాన వేంకటేశ్వరునకు దానంగా ముచ్చెర్ల, ముందు పల్లెలు దానం చేసినాడు. అంటే అప్పటికి వారికి అధికారం తిరిగి స్థిరపడిందన్నమాట.



కపిలేశ్వరుని మరణంతో కళింగాధీశుల సహాయం అందక బహమనీల ఆధిక్యత కారణంగా రాచకొండ ప్రభువుల పద్మనాయక రాజ్యం క్రీ.శ.1475 వరకు అస్తమించింది. పెదవీటి యుద్ధంలో విజయనగర రాజుల సామంతునిగా మూడవ సింగమనాయుడు చేసిన యుద్ధంలో మరణించాడని ఉషాభ్యుదయ కావ్యం చెప్తోంది. దీంతో పద్మనాయక రాచకొండ చరిత్ర చీకటిలో కలిసిపోయింది.

రాచకొండ ప్రభువులు తొలుత ముసునూరి వారితో, తరువాత బహమనీలతో, రెడ్డి రాజులతో, ఆపై విజయనగర రాజులతో, కటకాధీశులతో సందర్భావసరాలను బట్టి యుద్ధాలు చేసినారు. ఈ రాజ్యానికి శాశ్వత శత్రువులుకాని, మిత్రులుకాని లేరు.

రాచకొండ ప్రభువుల తరువాత ఈ దుర్గమును ఓరుగల్లు ప్రభువు షితాబ్‌ఖాన్ (సీతాపతిరాజు) ఏలినాడు. క్రీ.శ.1503 నాటి అతని ఓరుగల్లు శాసనములో అతడు రాచకొండను (రాజాద్రి) ఏలినట్లు కలదు. దీని తరువాత ఈ దుర్గం క్రీ.శ.1536లో గోల్కొండ కుతుబ్షాహి రాజు కులీ కుతుబ్షా వశం అయినట్లు తెలుస్తోంది.


**రాచకొండ దుర్గం:**

ఎటునుంచైనా మూడు ద్వారాలు దాటి పర్వతాగ్రానికి వెళితే రాజుగారు నివసించిన సువిశాల మందిరం పునాదులతో పైకి వెళ్లేందుకు మెట్లతో కనిపిస్తుంది. ఈ రాచ భవనానికి ఉత్తరాన కాపలావాని మంటపమో లేదా ఆలయమో ఉంది. రాచ భవనానికి తూర్పున సంకెళ్ళ బావి అనే పేరుతో ఉన్న ఒక సొరికెలో నీరు ఉంది. పర్వతం మీద బల్ల పరుపు బండపై పడ్డ వర్షపు జలాలు ఈ సంకెళ్ల బావిలో పడేలా చిన్న చిన్న కాలువలను తొలిచారు. నిర్మాణాలకెత్తిన రాయి అంతా పర్వతాలదే.

దక్షిణాన అవతలి పర్వత పంక్తిలో భోగందాని మంచం పేరుతో మంటపాలున్నాయి. ఈ మంటపాలను పూర్వం భోగ మంటపాలు అనేవారేమో. వ్యాహ్యాళికి వెళ్లి రాజు విశ్రాంతి తీసుకునే మంటపాలు అన్నమాట.

ఈ గిరిదుర్గం కనీసం 10 మైళ్ల చుట్టు కొలతలతో మూడు లేదా నాలుగు పర్వత పంక్తుల్లో విస్తరించింది. లంబాడీ తండాల వైపున్న ఏనుగుల ద్వారం గుండా ప్రవేశం చేసి, రాచకొండ తండా వైపు సాగే సప్తద్వారాల ద్వారా ఈ దుర్గం చూడవచ్చు. రాచకొండ తండా ప్రారంభంలో రామాలయం ఉంది. ఇది గుహలో ఉంది. దానికే ఆలయ నిర్మాణం చేసినారు. ఏనుగుల ద్వారం వైపున్న మూడవకోట ద్వారం పైకప్పుకు శిథిల చిత్రలేఖనం కనబడుతోంది.

ఇంతటి వైభవోపేతమైన చరిత్రగల రాచకొండ దుర్గం సాంస్కృతికంగా, పర్యావరణం దృష్ట్యా కూడా ఘనమైన దుర్గం. దీన్ని అటవీ, పర్యాటక, పురావస్తు శాఖలు సంయుక్తంగా అభివృద్ధి చేయవలసిన అవసరం ఉంది. చక్కగా అభివృద్ధి చేస్తే హైదరాబాద్‌కు 50 కిలోమీటర్ల దూరంలోనే ఉన్న ఈ దుర్గం ఒక పెద్ద చారిత్రక పర్యాటక స్థలం కాగలదు.



*(2014-రాచకొండను కాపాడుకొందాం పుస్తకం నుంచి)*

- సంగనభట్ల నర్సయ్య,
m : 9440073124
e : drsnarsaiah@gmail.com



# తోటి గిరిజన కళారూపం-ప్రదర్శనలో వైవిధ్యాలు

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న గిరిజన తెగల్లో 'గోండ్' తెగ అతిపెద్ద గిరిజన సమూహం. ఈ తెగకు ఆశ్రితులుగా పర్ధాన్, 'తోటి' రెండు గిరిజన తెగలవారు గోండ్ తెగ వ్యుత్పత్తి. గోండ్ రాజుల చరిత్రలను ప్రదర్శనపూర్వకంగా కథాగానం చేస్తారు. 'తోటి' గిరిజనులు వీటితోపాటు గోండు గిరిజనులకు సంబంధించిన పెళ్ళిళ్ళు, కర్మకాండలు, పండుగలకు సంబంధించి సాంప్రదాయక, చారిత్రక, సాంస్కృతిక విలువలను కీకిరి, కుజ్జీ, దక్కి, ప్రేపేర్ కాలికొమ్ము, డోలు వంటి వాద్యాలను వాయిస్తూ తెలియజేస్తారు.

పూర్వం ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న గోండ్ గిరిజనులు 4,5,6,7 సగాలకు సంబంధించినవారు మాత్రమే నివసిస్తున్నారు. ఒక్కొక్క సగాకు సంబంధించి మళ్ళీ వారికి ఇంటిపేర్లు ఉంటాయి. వీరికి ప్రత్యేక దేవతలు ఉంటారు. ఈ సగాలు అటు 'పర్ధాన్' తెగ, 'తోటి' తెగ వారికి కూడ ఉంటూ, అవే ఇంటిపేర్లు కలిగి ఉంటాయి. గోండ్ గిరిజనులు ఏ సగావారో ఏ ఇంటిపేరు గలవారో అదే సగా అదే ఇంటిపేరు గలవారు 'తోటి'వారు మాత్రమే ఆశ్రితులుగా ఉంటారు. వీరినే గోండ్‌వారు అంగీకరిస్తారు. 'తోటి'వారు చెప్పిన కథలను పాటగా సంబోధిస్తారు.

గోండు తెగవారికి వంశపారపర్యంగా 'తోటి' వారు చెప్పే కథల్లో 'సానపాట' ఇది మూడు రోజులపాటు చెపుతారు. ఇందులో శూన్యం నుండి కలియుగం వరకు భూమి ఎలా పుట్టిందో చెబుతారు. ఈ కథను గోండ్ వారు చనిపోయిన సందర్భంలో ఆరోజు రాత్రి మొత్తం కళాకారులు కూర్చొని కథలు చెప్పడం వీరి సంప్రదాయం.

'సదర్‌బేడి' కథలో వీరికి సంబంధించిన 4,5,6,7, సగాలు ఎలా ఉద్భవించాయి, ఒక్కొక్క సగాకు దేవతలు, ఆచారాలు ఎలా పాటించాలి, ఏ సగా వారితో పెండ్లిళ్ళు చేసుకోవాలి... ఇలాంటి పూర్తి విషయాలు ఇందులో చెపుతారు. ఒక్కొక్క సగాకు ఒక రోజు చొప్పున 4 రోజులు చెప్తారు. 'అన్నోరాణి పాట' ఈ కథను మూడు రోజులు చెప్తారు. ఇందులో అన్నం ఎలా పుట్టింది, దానిని ఏవిధంగా వాడుకోవాలి?, అదే బతుకు ఆధారం కాబట్టి దాని గొప్పతనం గురించి ఉంటుంది. తర్వాత 'వంశబేడి' కథలో ఒక్కొక్క వంశం (సగా) ఎలా పుట్టింది, వారి ప్రత్యేకతలు గురించి ఇందులో రెండు రోజులు చెప్తారు. ఈ కథలన్నీ గోండు, తోటి గిరిజనుల సంస్కృతిని తెలియజేస్తారు.



వీటితో 'గోండురాజుల చరిత్రకు సంబంధించిన కథలు రెండు రోజులు చెప్తారు. రాజుల పరిపాలన, వీరత్వం వంటివి ఇందులో వస్తాయి. వీరు పూజించే దేవతల గొప్పతనాన్ని తెలియజేస్తూ చెప్పే కథల్లో పెర్సాపేన్, జల్లిదేవర దేవతల గురించి చెప్తారు. మహాభారత కథలు, భీమదేవ కథ లాంటివి కూడా ప్రదర్శిస్తారు.

తోటి వారు గోండి భాషలో మాత్రమే కథలు చెప్తారు. ప్రధాన కథకుడు 'కీకిర' వాద్యం వాయిస్తూ కథ చెప్తుంటే వంతలు డక్కి వాయిస్తుంటారు. ఐదుగురు వరకూ ఉండే కళాకారుల ప్రదర్శన రాత్రులు, పగలు తేడా లేకుండా గంటల తరబడి ప్రదర్శన ఇస్తూ ఒక ప్రవాహంలాగా వారి ముందు కూర్చున్న ప్రేక్షకులు తమ సంస్కృతిని గురించి వింటూ ఆనంద సమయంలో హాస్యం, బాధ సమయంలో కరుణరసాభరితంగా ఉద్రిక్తులౌతారు.

గోండువారు ఏ కార్యక్రమం చేసినా 'తోటి' వారు లేనిదే ఆ కార్యక్రమం పూర్తికాదు. దీనికి సంబంధించిన వాద్య విశేషాలతో వారిని మెప్పించి వారి దగ్గర నుండి డబ్బులు, ధాన్యం, పశువులు, ఆభరణాలను హక్కుగా పొందుతారు.



'తోటి' గిరిజనులు కొంతమంది అటవీ ప్రాంతం నుండి మైదాన ప్రాంతాలకు వలస వచ్చి జీవనం సాగిస్తున్నారు. అలా వచ్చిన 'తోటి' వారు వరంగల్, కరీంనగర్ తదితర ప్రదేశాలలో నివాస మేర్పరచుకున్నారు. గతంలో వీరు గోండుకు సంబంధించిన కథలు చెప్పిన అనుభవంతో మైదాన ప్రాంతంలో గోండు గిరిజనులు లేకపోయేసరికి మైదాన ప్రాంతాల్లో అన్ని కులాలవారికి మహాభారత కథలు చెప్పడం అలవాటు చేసుకున్నారు. సొరకాయ బుర్రతో ఒక వాద్యాన్ని తయారు చేసుకుని దానిని వాయిస్తూ ప్రధాన కథకుడు కథ చెపుతుంటే మిగతా ఇద్దరు మద్దెల, హార్మోనియం వాయిస్తూ వంత పాడుతుంటారు. దీనిని 'తోటి' బుర్రకథ అని, 'కిన్నెర' కథ అనే పేర్లతో పిలిచేవారు. ఇలా చాలా సంవత్సరాలుగా వీరు జీవనోపాధి కోసం ప్రదర్శనలు ఇస్తూ ఈ ప్రాంతంలో ఉన్న ఇతర కళారూపాలకు సంబంధించిన హాస్యపు కథలను బుర్రకథ ద్వారా చెప్పేవారు.

వరంగల్ జిల్లాలో నకాషి వాళ్ళతో బొమ్మలు వేయించి, పటం ద్వారా కుల పురాణాలకు సంబంధించిన కథలను చెప్పే పటం కళాకారులు ఎక్కువగా ఉన్నారు. ఆ కళాకారులతో 'తోటి' కళాకారులు వాద్య సహకరులుగా, వంతలుగా ప్రదర్శన ఇచ్చేవారు. ఇలా వీరికి పటం కథల మీద, పటం కథలపై ప్రేక్షకులకు ఉన్న అభిమానాన్ని ఆసరాగా చేసుకొని 'తోటి' వారిలో కొన్ని బృందాలవారు 'కొర్రాజుల' పేరుతో దగ్గరలో ఉన్న 'నాయకపోడు' గిరిజనులకు 'పద్మనాయక వృత్తాంతం' అనే గిరిజనుల తెగ వ్యుత్పత్తి కథలను పటంలోని బొమ్మలు చూపిస్తూ కథ చెప్తారు. పటం కథలు తెలంగాణలో పన్నెండు ఉన్నాయి. ఇవి వారివారి కుల పురాణాలను తెలియజేస్తాయి. తెల్లటి పొడవాటి గుడ్డ మీద నకాషి వారిచేత కుల పురాణాలకు సంబంధించిన వృత్తాంతాన్ని, ముఖ్యమైన సంఘటనలను బొమ్మల రూపంలో గీస్తారు. వీటిని గుండ్రటి కర్రకు చుట్టుకొని ప్రదర్శన సమయంలో వేలాడదీస్తారు. కథను చెప్పే సన్నివేశంకు సంబంధించిన బొమ్మలు చూపిస్తూ వివరిస్తాడు. ఇలా ఒకవైపు నుండి పటం చూపిస్తూ, మరొకవైపు దానిని చుట్టుతారు. ప్రేక్షకులు పాత్రల బొమ్మలు చూసి కథ మీద ఆసక్తి పెంచుకుంటారు. ఇలా పటం కథలు నేటికీ ప్రజల ఆదరణ పొందుతూ ఉన్నాయి.

ఇలాంటి సమయంలో గిరిజనేతరులకు ఆశ్రితులైనవారే పటం కథల ద్వారా కుల పురాణాలు ప్రదర్శిస్తున్నపుడు ఆ ప్రేక్షకుల స్పందనబట్టి 'తోటి' గిరిజనులు దగ్గరలో ఉన్న నాయకపోడు గిరిజనులకు సంబంధించిన కథను చెప్పడం, దానితో వారు 'కొర్రాజుల వాళ్ళు'గా పిలవబడటం మనకు వరంగల్ జిల్లాలో కనబడుతుంది. దీనికి ప్రధాన కారకడు జ్ఞానం కనకయ్య (తోటి) వారి తండ్రి, వీరు సంప్రదాయంగా వస్తున్న గోండి భాషను కూడ వాడకపోవడంవల్ల నేటి 'తోటి'వారి పిల్లలకు గోండి భాష రాకుండాపోయింది. దీనికి కారణాలేంటి అని అదే కళాకారుడిని అడిగితే గోండి భాషలో మేం మాట్లాడితే ఇక్కడి ప్రజలు అదోరకంగా చూసేవారు. దానితో మేం మా భాషలో మాట్లాడుటలేదు. దానిద్వారా మా పిల్లలకు ఆ భాష రాకుండాపోయింది అని ఆవేదన వ్యక్తం చేశాడు.

మీ పూర్వం ప్రదర్శనను మాని ఇన్నిరకాల ప్రదర్శనలు రావటానికి కారణమేమిటి అనే ప్రశ్నకు 'బతుకుదెరువు కోసం బహురూప విద్యలు' అని సమాధానం ఇచ్చాడు.

ఒక గిరిజన కళారూపం, సంప్రదాయసిద్ధంగా ఉన్న ప్రదర్శన పద్ధతిని వారి పరిస్థితులు, సామాజిక అవసరాల దృష్ట్యా ఏవిధంగా మార్పులు చేసుకుని జీవనం సాగిస్తున్నారనేదానికి నిదర్శనమే 'తోటి' కళారూపం.

భాషను, వాద్య విశేషాలను, దాతలను, ప్రదర్శన విధానాన్ని మార్చుకుని బతుకు పోరాటంలో తమ సంస్కృతిని తామే కోల్పోయే స్థితిలో ఉన్నారు. ఇలాంటి కనుమరుగైపోతున్న జానపద, గిరిజన కళారూపాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా మనం సంస్కృతిని కాపాడినవాళ్ళం అవుతాం.

-డా॥ శ్రీమంతుల దామోదర్
m : 9989139136
e : damodarsrimantula@gmail.com

### మార్క్సిస్టు దృక్పథాన్ని కాదని తెలంగాణ కోసం గొంతెత్తిన పాటగాడు

# అమరుల త్యాగాలతో పల్లవించిన నీరుడి దుర్గేష్ పాటలు

కూలినాలి బతుకుల వలపోత ఈ పాట. అంటరానితనంతో వెలివాడల దు:ఖాన్ని మోసుకొచ్చిన పాట. గుండె రగిలి నెత్తుటి జెండాను అందుకున్న పాట. మార్క్సిస్ట్ దృక్పథంతో ప్రజల బాధని కైగట్టిన పాట. సామాజిక చైతన్యాన్ని పాదుగొల్పిన పాట. శ్రామిక హక్కుల సాధన కోసం చెలరేగిన పాట. అంబేద్కర్ ఆశయాలను చిగురింపజేసిన పాట. సుతిమెత్తని గుండెల్ని సైతం ప్రజాపోరాటాల వైపు పురిగొల్పిన పాట. తెలంగాణ ఆకాంక్షను రంగరించుకున్న పాట. సమైక్యవాద పార్టీలను కాలదన్ని ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షతో పదాల విల్లంబులను ఎక్కుపెట్టిన పాట. అది అమరుల త్యాగాలతో పల్లవించిన నీరుడి దుర్గేష్ పాట. "అంటరానితనమే నాలో మంటలు రేపింది" అంటూ ఆత్మగౌరవ జెండాను ఎగరేసిన కవి, గాయకుడు నీరుడి దుర్గేష్ గురించి నేటి మన 'అలుగెల్లిన పాట'లో...



మెదక్ జిల్లా సంగారెడ్డి మండలం ఎర్దనూరు గ్రామంలో నిరుపేద దళిత కుటుంబానికి చెందిన నీరుడి చంద్రమ్మ – లింగమయ్య దంపతులకు ముగ్గురు పిల్లలు. లక్ష్మయ్య, దుర్గేష్, మంజుల. వీరిలో దుర్గేష్ ఆగష్టు 20, 1978లో జన్మించిండు. కుటుంబాన్ని పోషించడం కోసం లింగమయ్య బ్యాండ్ మేళానికి పోయేది. కూలినాలి జేసేది. అయినా ఇల్లు గడువక అనేక బాధలు పడ్డడు. ఒక పూట తింటే మరోపూట పస్తులతో గడిపిండు. కనీసం పిల్లల్ని చదివించలేని దయనీయ స్థితి దాపురించింది. దీంతో దుర్గేష్ చిన్నప్పుడు కలివేములలోని అమ్మమ్మ ఇంటికాడ ఉండి 7వ తరగతి వరకు చదువుకుండు. ఆ తర్వాత 8వ తరగతి తుర్కలఖానాపూర్‌లోని ప్రభుత్వ హాస్టల్‌లోను, 9,10వ తరగతులు హత్నూర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుండు. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా కేంద్రంగా ఆవిర్భవించింది.

పాఠశాల దశ లోనే ఎన్నో పాటలు పాడి ఉపాధ్యాయుల చేత శభాష్ అనిపించుకున్న నీరుడి దుర్గేష్ ఇంటర్‌లో ఎస్.ఎఫ్.ఐలో చేరి విద్యార్థి ఉద్యమాల వైపు మొగ్గుచూపిండు. వామపక్ష భావజాలంతో పాటలు పాడడంతో ప్రజానాట్యమండలిలో సభ్యుడయ్యిండు. ఈ క్రమంలోనే ప్రజానాట్యమండలి శిక్షణా తరగతులు విశాఖపట్నంలో జరిగినపుడు రాష్ట్ర బాధ్యులు దేవేంద్ర, నిసార్‌ల ప్రోత్సాహంతో పాటలు రాసిండు. 1996 ప్రాంతంలో అసంఘటిత కార్మికుల జీవన విధానం అస్తవ్యస్థంగా ఉండేది. పార్టీ ఈ అంశం మీద దృష్టి సారించి అందుకు సంబంధించిన పాటలు ప్రచారం చేయాలని సంకల్పించింది దీంతో నీరుడి దుర్గేష్ మొట్టమొదట అసంఘటితరంగ కార్మికుల బాధల మీద స్పందించి

***"మున్సిపాలిటి జీతగాడ ఓరన్న ముద్దుముద్దుగ ఊడ్చెటోడ***

***మురికినంతా బాపి పట్నాల మెరిపించె నీ బతుకె మసిబట్టెరన్నా***

***బస్తీ బస్తీకి మురికి రోత రొచ్చు అంత డ్రైనేజి కాల్వల్లో పూడుకున్నప్పుడు***

***నిండిన మురుగుల్లో నిలువునా మునిగి సాపుజేసి నువ్వు బయటికి రాంగనే***

***నీ ఒంటి నిండా రోతరా చూసి కళ్ళు మూసుకున్నరా"*** అంటూ సఫాయి కార్మికుల అధ్వాన్న స్థితిని అక్షరీకరించి అంతే ఆర్ద్రత నిండిన స్వరంతో గానం చేసిండు. అదేవిధంగ ***"హోటలు కార్మికులం మేము ఈ పట్టణాల్లో పొట్టకోసం ఎట్టిజేసేము"*** అంటూ చిన్నచిన్న హోటల్లలో పనిచేసే కార్మికుల బాధల్ని కైగట్టి పాడిండు. ***"రెక్కలమ్ముకునేటోడ ఓ కార్మికన్నా లెక్కలేని తిప్పాలోడా"*** అంటూ నీరుడి దుర్గేష్ రాసిన పాటలు నాటి మార్క్సిస్టు ఉద్యమానికి ఎంతో తోడ్పాటును అందించినయి. ఇట్ల పాటలు, ప్రజా ఉద్యమాల పట్ల ఆకర్షితుడైన నీరుడి దుర్గేష్ చదువుకు అనేక ఆటంకాలు ఏర్పడినయి. దీనికితోడు పేదరికం. వీటన్నింటి ఫలితంగ దుర్గేష్ చదువు ఇంటర్‌లోనే ఆగిపోయింది. ప్రజానాట్యమండలిలో రాష్ట్రకమిటీ సభ్యుడిగా పూర్తికాలం పనిచేసిండు. పాటగాడిగా, ప్రజా ఉద్యమకారుడిగా మంచి పేరును సంపాదించుకున్న నీరుడి దుర్గేష్ మెదక్‌జిల్లా చౌడిపల్లి మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన సదగార్‌పెల్లి పెంటయ్య – దుర్గమ్మల బిడ్డ సుజాతను మే19, 2006న పెండ్లి చేసుకుండు. నీరుడి సుజాత – దుర్గేష్ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు. ప్రస్తుతం సిరివెన్నెల 7వ తరగతి, అంజన 5వ తరగతి చదువుతున్నారు. పార్టీ హోల్‌టైమర్‌గా మారిన నీరుడి దుర్గేష్ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడిగాను, పార్టీ ఆందోల్ ఇంచార్జ్‌గాను నియోజకవర్గంలో అనేక కార్యక్రమాలు చేపట్టిండు. దుర్గేష్‌కు ఊహ తెలిసిన నాటి నుంచి అంటరానితనంతో తన తండ్రి ఎదుర్కొన్న అవమానాలు కలిచివేసినయి. తాను ప్రత్యక్షంగా చూసిన ఎన్నో సంఘటనలకు స్పందించిన నీరుడి దుర్గేష్ ***"అమ్మా నీ ముందే చెబుతున్నా***

***నీ మీదొట్టమ్మా రేగిన గుండెలో బాధమ్మా***

***ఈ అంటరానితనమే నాలో మంటలు రేపింది***

***నా సిగ్గుదీసెటోల్ల నే బుగ్గిని జేస్తానే...***

***ఎల్లి ఎంకీ అసె ఒసే అని బూతులు తిడుతుండే***

***లేనిదానికి రోషమెందుకని మీసం దువ్వెండే***

***నా తండ్రి దిట్టలేదు నా మొగడు కొట్టలేదు***

***ఆ తిట్లు విన్న సంది తిండి నోట్ల బోతలేదు...***

***కొత్తబట్టలు కట్టుకుంటె వాళ్ళ కండ్లు మండబట్టే***

***బజారెంట నే నడుస్తువుంటే అట్లిట్ల వాగుతుండె***

***గుండె ఆగినట్టుఆయే రాయితొ గుద్దినట్టు ఆయే***

***వాళ్ళకు చెల్లె తల్లి లేరా ఆ కండ్లకు కావరమెట్టొచ్చె"*** అంటూ తల్లిని అమాయకంగ అడిగినట్టు కనిపిస్తున్నా ఆత్మగౌరవ జెండా రెపరెపలు ఈ పదాల నిండా పరుచుకొని పౌరుషాన్ని రగిలిస్తయి. క్రమంగ నీరుడు దుర్గేష్ ఫూలే, అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని

భుజానికెత్తుకుంటడు. స్వతంత్ర భారతదేశంలోను దళిత బహుజనులు ఎదుర్కొంటున్న వివక్షను చూసి

*"చూస్తు ఉందామా చూస్తూనే ఉందామా*
*బహుజనుల భవిత కొరకు బాటలు వేద్దామా*
*దగాపడ్డ పేదోల్ల దండును గడుదామా*
*అంబేద్కర్ బాటలోన అడుగులు వేద్దామా"* అంటూ ఉద్బోదిస్తడు.

రాజ్యాంగబద్దంగ రావాల్సిన హక్కులు కొల్లగొట్టబడుతుంటే చేతులు ముడుచుకోవడం ఏందని గొంతెత్తి నినదిస్తడు. మనువాద శక్తులను దునుమాడుతడు. అగ్రవర్ణ అరాచకాలను ఏకరవు పెడతడు. దళిత బహుజనుల స్వాతంత్ర్యాన్ని హరిస్తున్న పాలకులను ప్రశ్నించకుండ ఇంకా ఇట్ల ఎంతకాలం బానిసలుగా పడి ఉందాం అనే ఆలోచనను తట్టిలేపే ప్రయత్నం చేస్తడు.

నీరుడి దుర్గేష్ మార్క్సిస్టు దృక్పథంతో బహుజన చైతన్యం కోసం పనిచేస్తున్న క్రమంలోనే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం విస్తరించింది. శ్రీకాంతాచారి ఆత్మబలిదానం మొదలు అనేక మంది విద్యార్థులు అసువులుబాస్తున్న సాహసోపేతమైన సంధర్భాన్ని చూసి చలించిన నీరుడి దుర్గేష్‌లో స్వరాష్ట్ర కాంక్ష బలంగా నాటుకుంది. సమైక్య పార్టీని విభేధించి, తెలంగాణ జెఏసిలో చేరిండు. తాను కొత్తగా పాటలు రాయనప్పటికీ, అప్పటికే వందలాదిగా పుట్టుకొచ్చిన ఉద్యమ పాటలనే గొంతెత్తి పాడిండు. దరువు ఎల్లన్న, అంజన్నల వెంట తెలంగాణ పల్లెపల్లెల్లో పదాల ధూంధాం చేసిండు. పార్టీలకు అతీతంగా తెలంగాణ ఆకాంక్షతో పనిచేసిండు.



నీరుడి దుర్గేష్ స్వయంగ తెలంగాణ కోసం రాసిన పాటలు తక్కువే అయినప్పటికీ దరువు ఎల్లన్న రాసిన ***"వీరులారా వందనం విద్యార్థి అమరులారా వందనం"*** పాట మొదలు అందెశ్రీ ***"జయజయహే తెలంగాణ"*** నందిని సిధారెడ్డి ***"అమరులకు జోహార్ వీరులకు జోహార్"*** వంటి ఎన్నో పాటల్ని లయబద్ధంగ ఆడి, పాడి తెలంగాణ గోసపడుతున్న తీరును కండ్లకు కట్టించెటోడు. నీరుడి దుర్గేష్ అప్పటికప్పుడు వేదికల మీద ఆయా సందర్భాలకు తగ్గట్టుగా పదాలందుకొని సభలను రక్తి కట్టించెటోడు. సకలజనుల ఆకాంక్షల మేరకు ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం ఇయ్యాల అనేక సంక్షేమ పథకాలతో బంగారు తెలంగాణగా రూపుదిద్దుకుంటోంది. తెలంగాణ సాంస్కృతిక సారథిలో సభ్యుడైన నీరుడి దుర్గేష్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారం చేయడంలో భాగంగ ఆసర పెన్షన్‌లు, హరితహారం, కళ్యాణలక్ష్మి, రైతుబంధు వంటి ఎన్నో ప్రభుత్వ సంక్షేమ పథకాల మీద అద్భుతమైన పాటలు రాసిండు.

*"మానవాళి మేలు కోసం ఈ నేలతల్లి రుణం కోసము*
*మొక్కలు నాటుదము మనము చెట్లను పెంచుదము*
*మంచి చెట్లను పెంచుదము మన జీవితాలు మార్చుకుందము"*

చెట్ల అవసరాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దమనసుకు దండం పెడతడు. అవసరానికి మించి చెట్లను నరకొద్దని అంటడు. చెట్లు మానవాళి మనుగడకు ఎంతో ఉపయోగపడుతున్నాయనే సందేశాన్ని తన పాట ద్వారా అందిస్తడు. నీరుడి దుర్గేష్ రైతన్న మీద రాసిన పాట ఈ మధ్యకాలంలో ఎంతో ప్రాచుర్యం పొందింది.

*"రైతన్న నీ ఇంట సిరుల పంటేనంటా*
*తెలంగాణ సర్కారు సాయమే మనకంటా*
*రైతన్న నీ ఇంట ధాన్యరాసుల పంట*
*చక్కని పంటలతో పల్లె మురవాలంట*
*రైతు రాజ్యం తెచ్చెనో సియం కేసియారుకు దండమో*
*బంగారు పంటల్ని పండిద్దమో చంద్రుని వెలుగుల్లో పయనిద్దమో.."*

అంటడు. సమైక్యపాలనలో పడి నలిగిపోయిన తెలంగాణ రైతుల జీవన ముఖచిత్రాన్ని మార్చి ఆ రైతుల ముఖాల్లో ఆనందాన్ని నింపుతున్న ఘనత తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌దే నని అంటడు. "రైతుబంధు, రైతుబీమా" వంటి పథకాలు గత పాలకులకు కనీసం ఊహకు కూడ అందలేదని అంటడు. ఇయ్యాల తెలంగాణలో చెరువుకుంటలు తేటగై, ప్రాజెక్టులన్ని ఒక్కటొక్కటిగా పూర్తవుతుంటే ప్రజలు, రైతులు చెప్పలేని ఆనందంతో గడుపుతున్నరని అంటడు. నీళ్ళు, నిధులు, నియామకాలంటూ మొదలు పెట్టిన తెలంగాణ ఉద్యమం ఒక్కటొక్కటిగా అన్నింటిని అధిగమిస్తుందని అంటడు. నియామకాల మీద దృష్టి సారిస్తే నిరుద్యోగులైన యువకులు సంతోషిస్తారని ఇన్ని చేసిన ప్రభుత్వం అదికూడా చేస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తడు.

నీరుడి దుర్గేష్ రాసిన కొన్ని పాటలు ఆనాటి "జనగానం" పత్రికలో అచ్చయినయి. మరికొన్ని పాటల్ని దుర్గేష్ స్వయంగా "బహుజన గీతాలు" అనే శీర్షికన రెండు పాటల క్యాసెట్లు రికార్డు జేసిండు. శ్రామిక జన హక్కుల కోసం కాలికి గజ్జెకట్టి కంఠాన్ని సవరించుకున్న నీరుడి దుర్గేష్ క్రమంగా తెలంగాణ రాష్ట్రం కోసం అంతే చిత్తశుద్ధితో పనిచేసిండు. నీరుడి దుర్గేష్ మొదటినుంచి వామపక్ష, విప్లవ భావజాలంతో పనిచేసిన కారణంగా అవార్డులు, రివార్డులు, శాలువాలు, సన్మానాలకు కొంత దూరంగా ఉన్నప్పటికీ తన సాహిత్య, సాంస్కృతిక కళారంగ సేవల్ని గుర్తించిన భారతీయ దళిత సాహిత్య అకాడెమీ వారు నీరుడి దుర్గేష్‌కు "అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు"ను 2018లో ఢిల్లీలో బహూకరించినారు.

నిస్వార్థంగ తన పని తాను చేసుకుంటూ సామాన్య జన చైతన్యం కోసం, బంగారు తెలంగాణ దిశలో అడుగులు వేస్తున్న నీరుడి దుర్గేష్ తన పాటకు మరింత పదును పెట్టాలని, మరెన్నో మంచి అవకాశాలు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం.

నీరుడి దుర్గేష్:
సెల్: 8919336850

**-అంబటి వేకువ,**
m: 94927 55448
e: varji.ambati@gmail.com

# రుద్రమదేవి శిల్పాలు

తెలుగు రాజ్యాన్ని సుమారు మూడు దశాబ్దాల పాటు (క్రీ.శ.1262-1289) ఏకఛత్రాధిపత్యంగా పరిపాలించిన ఏకైక తెలుగు రాణి రుద్రమదేవి. అయితే, ఆనాడు దేశంలోని రాజులు, సామంతులు అందరూ పురుషులే. వారంతా ఒక మహిళ రాజ్యమేలడాన్ని భరించలేకపోయారు. 'స్త్రీ రాజరికాన్ని' జీర్ణించుకోలేక పోయారు. కొందరు ఆమె రాజ్యానికి వాయువ్య దిశనున్న ప్రస్తుతపు మహారాష్ట్రలోని దేవగిరి రాజ్యపు యాదవ రాజైన మహాదేవుడిని ఓరుగల్లుపై దండెత్తడానికి ప్రోత్సహించారు. ఆ రాజు ఓరుగల్లు కోటను ముట్టడించాడు కూడా. కానీ రుద్రమదేవి సాహసానికి ఆ రాజు సేనలు చిత్తయి పారి పోయాయి. రుద్రమదేవి అతడి శత్రు సైన్యాలను తరుముకుంటూ పోయి ప్రస్తుతం కర్ణాటకలో ఉన్న బీదరు కోటను వశపర్చుకుంది. తన విజయాన్ని ప్రస్తావిస్తూ అక్కడ కన్నడ భాషలో శిలాశాసనాన్ని కూడా వేయించింది. అందులో రుద్రమదేవి తన తండ్రి గణపతి దేవుని బిరుదు 'రాయగజ కేసరి'ని తాను ధరించినట్లుగా ఉంది. 'రాయగజ కేసరి' అంటే, ఏనుగుల వంటి శత్రురాజులకు సింహం వంటిది' అని అర్థం. రాణి రుద్రమదేవి బీదరు కోటను వశపర్చుకున్నది మొదలు 'రాయగజ కేసరి' శిల్పాలను దేవాలయ స్తంభాలపైన చెక్కించింది. అదే నమూనాను నాణేలపై కూడా ముద్రింపజేసింది. అలా చెక్కించడం వెనుక రుద్రమ అహంభావం కాదు, ఆమె ఆత్మవిశ్వాసమే వ్యక్తమౌతుంది. వీటిద్వారా శత్రువులను గెలవగలనన్న ధీమాను కూడా ఆమె వ్యక్తం చేసిందనుకోవచ్చు. వీటన్నింటినీ ఆనాటి స్త్రీలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచే చర్యలుగానూ చూడవచ్చు.



### రాయగజకేసరి శిల్పాలు

చాలా నునుపైన, అందమైన నల్ల శానపు 'రాయగజ కేసరి' శిల్పం ఒకటి రామప్ప గుడి దక్షిణ ద్వారపు స్తంభంపైన చూరును మోస్తున్నట్లుగా ఉంది. ఈ శిల్పంలో ఏనుగు పైన దాన్ని అణగదొక్కుతున్న సింహం, మరొక స్త్రీమూర్తి చెక్కబడ్డాయి. ఈ శిల్పం రాయగజ కేసరి శిల్పం కాబట్టి, ఈ శిల్పంలోని స్త్రీ కాలివేళ్ళకు మెట్టెలు కూడా ఉన్నందువల్ల ఈ శిల్పం రుద్రమదేవిదే అని, పైగా ఆమెనే ఆ శిల్పాన్ని చెక్కించిందని ఘంటాపథంగా చెప్పవచ్చు. అదే అభిప్రాయాన్ని కాకతీయ చరిత్రకారులు డా॥ పి.వి.పరబ్రహ్మ శాస్త్రిగారు కూడా వ్యక్తం చేశారు. "రామప్ప గుడి నిర్మాణం క్రీ.శ.1213లో పూర్తయినా ఇలాంటి శిల్పాలు, అలంకరణ శిల్పాలు ఎన్నో మరో శతాబ్దం పాటు కూడా చేర్చబడ్డాయి" అని అన్నారాయన.

మరో మూడు రకాల 'రాయగజ కేసరి' శిల్పాలు ఓరుగల్లు కోటలోని స్వయంభు దేవాలయ శిథిల శిల్పాల్లో ఉన్నాయి. ఒక శిల్పంలో సింహం తన ముందటి కుడి కాలును ఎత్తి గర్జిస్తూ ముందుకు ఉరుకుతున్నట్లుగా ఉండగా దానిపైన ఒక వీరవనిత తన కుడి చేత్తో కత్తి, ఎడమ చేతితో డాలు పట్టుకుని కుడికాలునెత్తి యుద్ధరంగంలోకి దూకుతున్నట్లుగా ఉంది. ఈ వీర వనిత ఎవరో కాదు రుద్రమదేవే.

రుద్రమ దేవగిరి యాదవ రాజుపైన గెలిచిన తరువాత తన రాజధాని ఓరుగల్లు కోటలో ఉన్న స్వయంభు దేవాలయంలో ఒక శిల్పాలంకృత మంటపాన్ని కట్టించి, ఆ మంటపం నాలుగు స్తంభాలకు పైన పేర్కొన్నటువంటి నాలుగు 'రాయగజ కేసరి' శిల్పాలను చెక్కించింది. వాటిని ఇప్పటికీ మనం చూడవచ్చు.

రెండవ రకం 'గజకేసరి' శిల్పాల్లో ఏనుగుపైన విజృంభించిన సింహం వీపుమీద ఒక స్త్రీ కూర్చుని, వెనుకకు వాలి ఆ సింహం తోకను కత్తితో కోయడానికి సిద్ధమవుతున్నట్లుంది. ఈ శిల్పం కూడా రుద్రమదేవిదే. ఆమె చెక్కించిందే. ఇందులో ఆమె శత్రు రాజులకు చేస్తున్న హెచ్చరిక కన్పిస్తుంది.

పైన చెప్పిన శిల్పానికి ఆనుకుని కన్పించే మరో శిల్పం మూడవ రూపుది. ఇందులో 'రాయగజ కేసరి' పైన ఒక బాలుడు పడుకుని ఆడుతున్నట్లు ఉంది. ఆ బాలుడు ప్రతాపరుద్రుడు. రుద్రమదేవి బిడ్డ కొడుకు. ఇతడే రుద్రమ దత్త పుత్రుడుగా ఆమె తర్వాత కాకతీయ రాజు అయ్యాడు. రుద్రమదేవి తన తర్వాత రాజు కాబోయేవాడు కూడా 'రాయగజ కేసరి' వంటి వీరుడే అని శత్రురాజులను హెచ్చరిస్తూ ఆ శిల్పాన్ని చెక్కించిందని అర్థం చేసుకోవచ్చు.

అయితే, ఇంకో సంగతి కూడా ఉంది. రుద్రమకు కొడుకులు లేరు కాబట్టి, ప్రతాపరుద్రున్ని అల్లారు ముద్దుగా ఆడిస్తూ పెంచింది. దీనికి నిదర్శనంగా మనకు రామప్ప దగ్గరి కటాక్షపురం దేవాలయంలో మరో శిల్పం కనిపిస్తుంది. అందులో రుద్రమ ప్రతాపున్ని తనతో పాటు హంస మీద కూర్చోపెట్టుకుని ఆడిస్తున్నట్లుగా ఉంది. అలాగే, రామప్ప గుడి ఉత్తరపు గోడపైన - కామ శిల్పాల పక్కన - ఖడ్గధారిణియైన రుద్రమ శిల్పం పక్కనున్న మరో శిల్పంలో రుద్రమతోపాటు బాల ప్రతాపుడు కూడా కనిపిస్తాడు.

### నాణేలపై ముద్రలు

రుద్రమదేవి తన బిరుదైన 'రాయగజ కేసరి'ని శిల్పాల్లోనే కాకుండా అదే బిరుదుతో కూడిన తన రూపాన్ని బంగారు నాణేలపై కూడా చెక్కించింది. అలాంటి ఆమె రూప నాణేలు కొన్ని హనుమకొండలోని పద్మాక్షి గుట్టపైన దొరికాయి. ఆ నాణేల్లో కొన్ని 'మండ మండని' అనే అక్షరాలు చెక్కినవి కూడా ఉన్నాయి. 'మండ

మండని' బిరుదు కూడా రుద్రమకే వర్తిస్తుంది. ఆ నాణెంపై ఆమె గుర్రం మీద ఎక్కి చేతుల్లో బల్లెం, డాలు పట్టుకుని నలువైపులా సైన్యం తోడు రాగా యుద్ధరంగంలో విహరిస్తున్నట్లుగా చిత్రించబడింది.

అలాగే, రామప్పగుడి గోడపైన ఉన్న ఒక శిల్పంలో రుద్రమదేవి కాలును ఒక ఏనుగు తొండంతో పట్టుకోగా మరో ఏనుగు ఆమె పైకి గదను ఎత్తుతున్నట్లుండగా ఆ ఏనుగులను రుద్రమ కత్తి డాలుతో ఎదుర్కొంటున్నట్లుగా చిత్రితమైంది.

### సంక్షేమ కీర్తి శిల్పాలు

తన తండ్రిలాగే రుద్రమదేవి కూడా ప్రజలను తన కన్న బిడ్డల్లాగా చూసుకునేది అనడానికి నిదర్శనంగా ఆనాటి శాసనాలు, కావ్యాలు ఎన్నో కనిపిస్తున్నాయి. తన రాజ్యంలో ఏ మూలన, ఏ ఒక్కరికి బాధ కలిగినా తనకు తెలిస్తే వీలు చూసుకుని అక్కడికి వెళ్ళి మరీ వారి బాధలను తీర్చేదనడానికి నిదర్శనమైన 'హృదయశల్యం' అనే మాడపాటి హనుమంతరావుగారి వందేళ్ళ నాటి వాస్తవికాధార కథను కొందరు చదివి ఉంటారు. ఇలాంటి ఆత్మీయమైన వ్యక్తిత్వం వల్ల రుద్రమకు ప్రజలు నీరాజనాలు పట్టారు. ఆమెను 'అంబ' (అమ్మ) అని పిలిచారు. అంబతో సమానంగా... అంటే, దేవతతో సమానంగా కొనియాడారు. ఈ భావనలను తెలిపే శిల్పాలు కూడా ఆనాడే చెక్కబడ్డాయి. (అయితే ఇలాంటి దేశ విహార శిల్పాలు రాజస్థాన్‌లోని ఒక విశాలమైన రాతి బావిలో కూడా ఉన్నాయి. అవి రుద్రమ కాలం కంటే ముందువి).

ఇలాంటి శిల్పాల్లో ప్రధానంగా చూడవలసిన శిల్పం ఒకటి రామప్ప గుడిలోని మంటపం నైరుతి మూలలో ఉంది. ఇది ఎర్ర రాతి శిల్పం. ఈ శిల్పంలో రెండు ఏనుగులపైన ఎక్కిన ఇద్దరు స్త్రీలు రెండు రాజఛత్రాలను (గొడుగులను) ఎత్తి పట్టుకోగా వారి మధ్యన ఏనుగుపైన రుద్రమదేవి కత్తి ధరించి ఊరేగుతున్నట్లుంది. ఇలాంటి శిల్పమే మరొకటి మంథని దగ్గర గోదావరి నదిలోని లంజ మడుగు పైనున్న గుహాలయ గోడపై చెక్కి ఉంది. ఈ శిల్పంలో సేవకుల నీరాజనాల మధ్య రుద్రమదేవి సేవికతో సహా గుర్రం పైన తన రాజ్యంలో విహరిస్తున్నట్లు చెక్కి ఉన్నది.


### 'కంచుకోటను రక్షిస్తున్న అశ్వయుత రుద్రమ' చిత్రాలు

రుద్రమ్మను ఇంతగా శిల్పాల్లో ప్రేమించిన ప్రజలు, కళాకారులు ఆమెను చిత్రాల్లో కూడా ప్రేమించకుండా ఉంటారా? ఆనాడు ఓరుగల్లులో వేల సంఖ్యలో చిత్రశాలలుండేవని సమకాలీన సాహిత్యాధారాలు తెలుపుతున్నాయి. కానీ, దురదృష్టవశాత్తు మనకు రుద్రమ చిత్రం ఆనాటిది ఒక్కటి కూడా అందుబాటులో లేదు. కారణం ఆనాటి చిత్రాలు గోడలు, పత్రాలపైన వేసినవి కావడం, అవి కాలగర్భంలో కలిసిపోవడం. అయితే, మన నిస్పృహను కొంత వరకు ప్రముఖ తెలంగాణ చిత్రకారులు కీ.శే.కొండపల్లి శేషగిరిరావుగారు తీర్చారు. ఆయన 18-2-2000 నాడు 'తను కట్టించిన కంచుకోటను సంరక్షిస్తున్న అశ్వయుత రుద్రమదేవిని చిత్రించారు. ఆయన వేసిన బొమ్మమీద ఆయనకే తనివి తీరక 25.03.2000 నాటికి అదే బొమ్మను మరింత రాజసంగా అందంగా తీర్చి చిత్రించారు. మరింత సమగ్రంగానూ ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. తొలి చిత్రంలో రుద్రమ రుమాలు ధరించి ఉండగా ఈ మలి చిత్రంలో రుమాలుతో పాటు కిరీటాన్ని ధరించి ఉంది.

### హైదరాబాద్‌లో రుద్రమ

ఆనాటి రాణి రుద్రమ్మ కీర్తికి సంక్షిప్త తార్కాణాలుగా తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోని టాంక్‌బండ్‌పై కూడా మూడు దృష్టాంతాలు కనిపిస్తాయి. ఒకటి, సికింద్రాబాద్ నుంచి వస్తూ ఉండగా టాంక్‌బండ్ ప్రారంభంలో ఉన్న సిమెంట్ తోరణం. ఇది ఓరుగల్లు కోటలో రుద్రమ్మ కట్టించిన నిజమైన తోరణాలకు నకలు. రెండు, టాంక్‌బండ్ ప్రారంభంలో తోరణం పక్కనే ఉన్న అశ్వారూఢ ఖడ్గయుత రుద్రమదేవి విగ్రహం, మూడు, టాంక్‌బండ్ చివరన అంటే హైదరాబాద్ ప్రారంభంలో ఉన్న సిమెంట్ తోరణానికి ఇరుపక్కలా ఉన్న 'రాయగజ కేసరి' సిమెంట్ శిల్పాలు.

-ద్యావనపల్లి సత్యనారాయణ,
m : 9490957078
e : tribalmuseumcurator@gmail.com




('తెలంగాణ కొత్త విహార స్థలాలు'
పుస్తకం నుంచి

**ప్రతులకు:** తెలంగాణ రిసోర్స్ సెంటర్,
చంద్రం 490, వీధి నెం.12,
హిమాయత్ నగర్, హైదరాబాద్-29,
తెలంగాణ. వెల: రూ.100





# సృజనశీలురు పకిడే అరవింద్

## తెలంగాణలో చారిత్రక ప్రదేశాలను వెలుగులోకి తీసుకొచ్చిన చరిత్రకారుడు

తెలంగాణలో చారిత్రక ప్రదేశాలను వెలుగులోకి తీసుకొచ్చిన ప్రముఖ చరిత్రకారుడు పకిడే అరవింద్. జనగామ జిల్లాలోని రఘునాథపల్లి మండలం కంచనపల్లి మారుమూల గ్రామానికి చెందినవారు అరవింద్. మార్చి 15, 1995లో లీల, సత్యనారాయణ దంపతులకు మొదటి సంతానంగా జన్మించారు. తల్లిదండ్రులిద్దరూ వ్యవసాయదారులు. వారిది సాధారణ మధ్య తరగతి కుటుంబం.

**అరవింద్ బాల్యం :**



అరవింద్ బాల్యమంతా స్వగ్రామమైన కంచనపల్లిలోనే గడిచింది. కంచనపల్లిలోని జేసుతిరు హృదయ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు చదివారు. ఐదవ తరగతి చదువుతున్న కాలంలోనే పద్మ మేడం, అల్లం అనిల్ రెడ్డి సార్‌ల సోషల్ స్టడీస్ బోధన వల్ల అరవింద్‌కు సోషల్ సబ్జెక్టు మీద ఆసక్తి ఏర్పడింది. ఎనిమిదవ తరగతి చదువుతున్నప్పటి నుండి గ్రంథాలయానికి వెళ్లడం, పుస్తకాలు చదవడం అలవాటయ్యింది. 2005 నుండి పత్రికా పఠనం కూడా అలవడింది. పదవ తరగతి తర్వాత హనుమకొండలోని ఏకశిలా జూనియర్ కాలేజీలో ఎంపీసీ కోర్సులో చేరారు. అరవింద్‌కు చిన్నప్పటి నుంచి పురాతన కట్టడాలు, చారిత్రక ప్రదేశాలు అంటే ఎంతో ఇష్టం. ఈ క్రమంలోనే అరవింద్ ఇంటర్మీడియెట్ చదువుతున్న కాలంలోనే వరంగల్ జిల్లాలోని చారిత్రక ప్రాంతాలకు తరుచుగా వెళ్తుండేవారు. దీంతో వాటిపై ఆయనకు ఇంకా ఆసక్తి పెరిగింది. తదనంతర కాలంలో ఆ ఆసక్తి కాస్తా పరిశోధనగా మారింది. అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పురాతన కట్టడాలు, చారిత్రక ప్రదేశాల గురించి తెలుసుకోవడం మొదలు పెట్టారు. ఇంటర్మీడియెట్ తర్వాత హన్మకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బి.ఎ. (జర్నలిజం)లో చేరారు. ఆ కోర్సులో జర్నలిజం మెళకువలు నేర్చుకొని తన పరిశోధనలను ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా జనప్రాచుర్యంలోకి తీసుకురావడం మొదలుపెట్టారు.

**చరిత్రకారుడిగా కృషి :**

వరంగల్లో ఉన్న అత్యంత పురాతన చారిత్రక ప్రదేశాల గురించి తెలిసిన అతి కొద్ది మందిలో అరవింద్ ఒకరు. ప్రాచీన దేవాలయాలు, చెరువులను సందర్శించి అక్కడ లభించిన శాసనాలను గమనించారు. విలువైన సమాచారాన్ని సేకరించారు. అప్పటి నుండే పురావస్తు శాస్త్రవేత్తలు, చరిత్రకారులు అరవింద్‌కు పరిచయమయ్యారు. తన పరిశోధనా క్రమంలోనే క్రమక్రమంగా అరవింద్ జన ప్రాచుర్యంలో లేని 100కు పైగా పురాతన కట్టడాలను, చారిత్రక ప్రదేశాలను గుర్తించారు. అందుకోసం ఎన్నో పుస్తకాలు చదివేవారు. కొంత మంది ఆర్కియాలజిస్టుల, ఇంటర్నెట్ సహాయం తీసుకునేవారు.

**వెలుగులోకి పురాతన గోడ :**

జయశంకర్ జిల్లా మంగపేట మండలం మల్లూరు కొండప్రాంతంలో అరవింద్ 8 కిలోమీటర్ల పొడవున్న ఓ పురాతన గోడను కనుగొన్నారు. 2016లో వరంగల్ అర్బన్ జిల్లాలోని శివసాగర్ ప్రాంతంలో మరుగున పడిపోయిన ఓ కాకతీయుల కాలంనాటి అంతస్తుల మెట్లబావిని గుర్తించి వెలుగులోకి తీసుకొచ్చారు. అరవింద్ కృషిని చూసి జిల్లా కలెక్టర్ కాట ఆమ్రపాలి తన సహకారాన్ని అందించారు. దీంతో ఆ బావిని పునరుద్దరించి, పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేశారు. వరంగల్ ప్రాంతంలో ఏడు కోటలు ఉన్నాయనే విషయాన్ని ప్రపంచానికి వెల్లడించారు. ఇలాంటి కట్టడాలు, ప్రదేశాలు, ఇంకా ఎన్నింటినో అరవింద్ గుర్తించి












వెలుగులోకి తీసుకురావడం ప్రముఖులను ఆశ్చర్యపరిచింది.

**పలు జిల్లాల్లో పరిశోధనలు :**

తన పరిశోధనల నిమిత్తం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 573 ప్రదేశాల్లో అనేక పర్యాయాలు పర్యటించారు. ముఖ్యంగా వరంగల్ (గ్రామీణ జిల్లా, వరంగల్ (పట్టణ) జిల్లా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనగామ జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లా, కరీంనగర్ జిల్లా, నల్గొండ జిల్లా, యాదాద్రి జిల్లా, ఖమ్మ జిల్లా మొదలగు జిల్లాల్లో అతని పరిశోధనలు విరివిగా కొనసాగాయి. వరంగల్ ప్రాంత వాసి కావడం, ఎక్కువగా కాకతీయులకు సంబంధించిన చరిత్రను అధ్యయనం చేసిన వ్యక్తి కావడం మూలంగా కాకతీయులు ఏలిన ప్రాంతాల్లో పర్యటించి కాకతీయుల కట్టడాలను, చారిత్రక విశేషాలను వెలుగులోకి తీసుకొచ్చారు.

**ప్రముఖ కార్యక్రమాలు :**

'వరంగల్ సందర్శిని' అనే శీర్షికతో వరంగల్ ఆకాశవాణి కేంద్రం నుండి 15కి పైగా రేడియో ప్రసంగాలు చేసారు. వరంగల్ కేంద్రం 93.5 రెడ్ ఎఫ్‌ఎంలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని తన అనుభవాలతో పాటు చారిత్రక అంశాలను వెల్లడిస్తూ ఇంటర్వ్యూ ఇచ్చారు. 2017లో T-SAT టీవీ చానల్ Interaction With Young Historian శీర్షికతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని చారిత్రక అంశాలను వెల్లడిస్తూ, తన పరిశోధనా యాత్రలోని అనుభవాలను, అనుభూతులను పంచుకుంటూ ఇంటర్వ్యూ ఇచ్చారు. అనేకచోట్ల తెలంగాణ పురావస్తు శాఖ, పర్యాటక శాఖలు నిర్వహించిన సెమినార్‌లలో వక్తగా పాల్గొన్నారు. అంతేకాకుండా అనేక స్వచ్ఛంద సంస్థలు నిర్వహించిన రక్తదాన శిబిరాలు, వన సంరక్షణ, బుక్ ఫెయిర్, ఉచిత పుస్తకాల పంపిణీ మొదలగు సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు.

**వైవిధ్యభరితంగా వ్యాసాలు :** వివిధ పత్రికలలో అరవింద్ రాసిన వ్యాసాలు ఎంతో వైవిధ్యభరితంగా ఉన్నాయి. వాటిలో నమస్తే తెలంగాణ బతుకమ్మ సంచికలో ప్రచురితమైన కొండపర్తి గ్రామ చారిత్రక కథనం. సాక్షి దినపత్రికలో ప్రచురితమైన భూపాలపల్లి జిల్లా ప్రాంతంలోని డాల్మన్ సమాధుల గురించిన కథనం. ఇవి ప్రముఖుల మన్ననలు పొందడం విశేషం. అంతేకాకుండా అరవింద్ 'వరంగల్ ముచ్చట' పేరుతో స్వీయ వెబ్‌సైట్‌ను నిర్వహిస్తూ ఇప్పటివరకు దాదాపు 220కిపైగా కథనాలను ప్రచురించారు. వాటిలో మహనీయులు, చరిత్ర, సంస్కృతి, సాహిత్యం మొదలగు అంశాలకు సంబంధించిన 300 కథనాలున్నాయి.

**ప్రముఖ ప్రాజెక్టులు :**

వరంగల్ అంటే ఆలయాల నగరం (City of Temples) అని, 'కాకతీయులంటే నీళ్లకు నడకలు నేర్పినవారు' అని భావించే అరవింద్ వరంగల్ అర్బన్ జిల్లాలో మరుగున పడిపోయిన కాకతీయుల కాలంనాటి 50 ఆలయాలు, మెట్లబావులను గుర్తించి, అనేక పర్యాయాలు ఆయా ప్రదేశాలను సందర్శించి వాటి పునరుద్ధరణకు అయ్యే ఖర్చులు, అవసరమైన పర్యాటక సౌకర్యాల వివరాలతో ఒక నివేదిక రూపొందించి అధికారులకు అందజేశారు. 2019 ఫిబ్రవరి నెలలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఐసీసీఆర్ ఆర్ట్ గ్యాలరీలో తెలంగాణ రాష్ట్రంలోని చారిత్రక కట్టడాల, ప్రాంతాల ఛాయచిత్రాలతో The Untold Telangana అనే ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. మార్చి నెలలో వరంగల్‌లోని హరిత కాకతీయ హోటల్‌లో 3 రోజులపాటు జరిగిన తెలంగాణ ఫొటోగ్రఫీ అకాడమీ కన్వెన్షన్‌లో ఛాయాచిత్ర ప్రదర్శన నిర్వహించి పలువురి మన్ననలు పొందారు.


**-అరవింద్ పకిడే,** m : 7097 270 270

e : aravindarya.pakide@gmail.com

**- అనిల్,** m : 9030 6262 88

e: desk.deccan@gmail.com







# కళాఖండాల సృష్టికర్త సూర్య ప్రకాశ్

**● నిజాం స్టేట్‌లో ఆర్టిస్టుగా ప్రస్థానం ● తెలంగాణ రాష్ట్రంలో గుర్తింపు**

అతని కుంచె అద్భుతం. శిశిరం లాంటి కాన్వాస్‌పై వసంతమై చిగురిస్తుంది. అతని ఆలోచన మహాద్భుతం. ఆ రెమ్మల పువ్వులపై శరత్‌కాలపు వెన్నెలను అద్దుతాడు. రంగులు చిలకరించి ప్రకృతి అందాలను ఆవిష్కరించే నైరూప్య (అబ్‌స్ట్రాక్ట్) చిత్రకళలో చెరిగిపోని ముద్ర సూర్య ప్రకాశ్. విలక్షణమైన శైలితో ఆధునిక చిత్రకళను సమున్నతంగా ఆవిష్కరించిన మేటి చిత్రకారుడు. ప్రకృతిని కళ్లముందు ఆవిష్కరింపజేయడంలో దిట్ట.. పొడవైన చెట్లు, రకరకాల పొదలు, అందమైన అడవులు, విశాలమైన మైదానాలను సృష్టించడంలో ఆరితేరిన గొప్ప కళాకారుడు. ఎండిపోయిన ఆకులకు జీవం పోసి ఔరా అనిపించారు. ఆ జీవవే ఆయనను అంతర్జాతీయ చిత్ర పటంలో నిలిపి విశేషమైన కీర్తిని ప్రసాదించి పెట్టింది. హైదరాబాద్ కళావేదికకు మూలస్థంభం ప్రకాశ్ అంటే అతిశయోక్తి కాదేమో. తెలంగాణలో కళకు కీర్తిని ప్రసాదించిన కళాకారుడిగా సూర్యప్రకాశ్‌ను అభివర్ణిస్తారు. "ఒక వ్యక్తికి అపరిమితమైన ఉత్సాహం ఉన్నట్లయితే దేనిలోనైనా విజయవంతం కావచ్చు" అని అమెరికన్ స్టీల్ మాగ్నెట్ చార్లెస్ ఎం.ష్వాబ్ అంటారు. మాస్టర్ పేయింటర్ సూర్య ప్రకాశ్ ప్రతిరూపం కూడా అచ్చం అలాగే ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.




**ఖమ్మం జిల్లాలో 1940లో జననం :**

తెలుగు రాష్ట్రాల్లోనే అద్భుతమైన కళాకారులలో సూర్య ప్రకాశ్ ఒకరు. అతను తన రంగు కుండలతో మరియు మాయ ప్రకృతి దృశ్యాలను బ్రష్‌స్ట్రోక్‌లతో సృష్టించినతీరు అమోఘమైంది. సున్నితమైన చుక్కలతో తనకంటూ ఒక సముచిత స్థానాన్ని దక్కించుకున్నారు. ఖమ్మం జిల్లాలోని మధిర పట్టణంలో సూర్య ప్రకాశ్ 1940లో జన్మించారు. నిజాం స్టేట్‌లో చెరుకుమల్లి కుటుంబంలో మూడవ సంతానంగా ప్రకాశ్ జన్మించారు. ఆయన తండ్రి అనుమయ్యకు సినిమాలంటే అమితాసక్తి ఉండేది. హైదరాబాద్‌లో గవర్నమెంట్ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ ఆర్కిటెక్చర్‌లో చేరారు. 1961లో హైదరాబాద్ జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో చిత్రకళలో డిప్లొమా పొందారు. అనంతరం ఆయన ఏపీ లలిత కళా అకాడమీ నుండి స్కాలర్ షిప్ పొందారు. ప్రిలాన్స్ ఆర్టిస్టుగా లక్ష్మాగౌడ్ అండ్ దాకోజీ దేవరాజ్ వద్ద పనిచేశారు. సూర్య ప్రకాశ్ ప్రకృతి, పొడవైన చెట్లు నుండి ప్రేరణ పొంది అనేక అద్భుతమైన కళాఖండాలకు జీవం పోశారు. ప్రకాశ్ ఇప్పటి వరకు 55కిపైగా సోలో ఎగ్జిబిషన్లు, 100కిపైగా గ్రూప్ షోలలో పాల్గొన్నారు. మరికొన్ని అందమైన కళాఖండాలను సృష్టించారు. ఎంతో వైవిధ్యభరితమైన చిత్రాలను గీసిన ప్రకాశ్ 22 మే 2019న హైదరాబాద్‌లోని స్వగృహంలో గుండెపోటుతో మరణించారు.

**సీసీఎంబీతో మొదలు :**

మొదట సీసీఎంబీకి రెసిడెన్షియల్ ఆర్టిస్టుగా ప్రకాశ్ పనిచేశారు. ఎన్నో అపురూపమైన చిత్రకళా ఖండాలను గీయడంతోపాటు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రిలో రెసిడెంట్ ఆర్టిస్టుగా చేరారు. జేఎన్టీయూలో చదువుకునే రోజుల్లో హైదరాబాద్‌లోని ఇరుకు గల్లీలను వాస్తవిక ధోరణిలో చిత్రీకరించేవారు. ప్రముఖ చిత్రకారులు లక్ష్మాగౌడ్, తోట వైకుంఠం, దేవరాజ్‌లకు ఆయన సీనియర్.





చదువు పూర్తయ్యాక అప్రెంటీస్ కోసం ఢిల్లీలో ఉండే ప్రముఖ చిత్రకారుడు శ్రీరాం కుమార్ వద్దకు వెళ్లారు. ఆయన వద్ద కొంతకాలంపాటు శిక్షణ తీసుకున్నారు. ఆయన శిష్యరికంలో తనలో దాగి ఉన్న అసలు సిసలు చిత్రకళ వెలుగులోకి వచ్చింది. ఆ రోజుల్లోనే పనికిరాని వస్తువులు, పారవేసిన చెత్తాచెదారం నుంచి కళా సృజన చేయడం ఎంతో మందిని ఆకర్షించింది. ఢిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చాక తనని ఆటోమొబైల్ స్క్రాప్ ఎంతగానో ఆకర్షించినట్లు చెప్పారు. అదే తనకు దేశవ్యాప్తంగా ఎంతో పేరు తెచ్చిపెట్టింది. 'లలిత కళా అకాడమీ' పురస్కారం అందుకునేలా చేసింది. అవశేషం, శిథిలం అనేవి సహజ ఉనికి అన్న భావన ఆయనలో స్థిరపడటం, అక్కడి నుంచి ఆయన స్థిరంగా తనను తాను అన్వేషించుకునిపోయేలా చేసింది. ఆటోమొబైల్ తర్వాత స్క్రాప్ ఆయనను వదలి పోయిన, రాలిపోయిన ఆకులు ఎంతగానో ఆకర్షించాయి. వాటిని 'డెడ్ లీవ్స్' అని, అన్నప్పటికీ, ఆయనకు అవి మృత ప్రాయం కాదు. మృత్యువు కానే కాదు, 'మృత్యువు కూడా విశ్వంలో ఒక జీవితమే' అని చెప్పేవారు.

**చిత్రకళ కోసం ఉద్యోగానికి రాజీనామా :**

ల్యాండ్‌స్కేప్ పెయింటింగ్స్‌ని చిత్రకారుడు అంజయ్య సూర్యప్రకాశ్‌కు పరిచయం చేశారు. అబ్‌స్ట్రాక్ట్ శైలిలో గీయడం ఒంటబట్టించుకుని, తనకు తానే మెరుగులు దిద్దుకుని దేశ, విదేశాల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. ఇలా మొదలైన సూర్య ప్రకాశ్ ప్రస్థానం కొత్త రంగులద్దుకుంటూ సరికొత్త హంగులను సంతరించుకుంది. బీఎఫ్ఏ పూర్తయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ సమాచార, పౌరసంబంధాల శాఖలో ఉద్యోగంలో చేరారు ప్రకాశ్. చిత్రకళ కోసం ఆ ఉద్యోగానికి రాజీనామా చేశారు. కశ్మీర్ పర్యటన సూర్యప్రకాశ్ ఆలోచనలను పూర్తిగా మార్చేసి సరికొత్త వ్యక్తిగా తయారు చేసింది. చిత్రకళ అంటే ఎంతో ఇష్టపడే ఆయన నిత్యం దానిగురించే పరితపించేవారు.

**సాధించాలనే తపనే అత్యున్నత స్థాయిలో నిలబెట్టింది :**

ఏదో సాధించాలనే తపనే సూర్యను చిత్రకళా ప్రపంచంలో అత్యున్నత స్థాయిలో నిలబెట్టింది. చిత్రకళనే ప్రేమించి, చిత్రకళలో జీవించి, చివరకు తన చివరి స్వాస వరకు చిత్రకళ కోసమే తపించిన మేధావి సూర్యప్రకాశ్. హిమాయత్‌నగర్‌లోని ఒక చిన్న గ్యారేజీలో సూర్యప్రకాశ్, లక్ష్మాగౌడ్, దేవరాజ్ ఒక స్టూడియోని ప్రారంభించారు. దీంతో నెమ్మదిగా వారికి గుర్తింపు లభించడం, తద్వారా వారి చిత్రాలకు మార్కెట్ కూడా భారీగా పెరిగింది. విశాలమైన మైదానాలను విశాలమైన కాన్వాస్‌పై అద్భుతంగా గీసేందుకు భిన్నమైన శైలిని అనుసరించేవారు. అందమైన పూలు, నీటి మడుగులే కాదు, విరబూసిన వనాలు, పచ్చికమైదానాలు ఆయన కాన్వాస్‌పై చిత్రించ బడ్డాయి. ప్రకాశ్ కుంచె నుండి జాలువారిన ఎన్నో అద్భుత కళాఖండాలు ప్రేమికుల ఇళ్లలో కొలువుదీరడం ఆయన సృజనకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఆరు దశాబ్దాల కళా ప్రస్థానంలో ప్రకాశ్ కళాఖండాలు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. చిట్టడువుల చిత్తరువులు వివిధ దేశాల్లో గ్యాలరీలో కొలువైనాయి. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా మొక్కవోని ధైర్యంతో చిత్రకళలో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు.

**ఎగ్జిబిషన్స్ :**

- 1981లో ఐదుగురు ఇండియన్ ఆర్టిస్టులతో కలిసి వెస్ట్ జర్మనీలో ఎగ్జిబిషన్ ఏర్పాటు
- 1982లో మోడ్రన్ ఇండియన్ ఆర్ట్ ఎగ్జిబిషన్, కన్‌స్టేల్ దర్మ్‌స్టడ్ వెస్ట్ జర్మనీలో ఎగ్జిబిషన్ ఏర్పాటు
- 1979లో 20 మంది ఇండియన్ ఆర్టిస్టులతో కలిసి ఫ్రాంక్‌పోర్టులో ఎగ్జిబిషన్ ఏర్పాటు
- 1975లో వెస్ట్‌జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లాండ్, నార్వే, స్వీడన్, డెన్మార్క్, బ్రిటన్ తదితర దేశాల మ్యూజియమ్‌లను సందర్శించారు.

**అవార్డ్స్ :**

- 1962, 65, 66లలో హైదరాబాద్‌లో ఆర్ట్ సొసైటీ ఆల్ ఇండియా వార్షిక అవార్డు
- 1963లో గోల్డ్‌మెడల్, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో
- 1962, 65, 68, 72లలో ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడమీ స్టేట్ యానువల్ ఎగ్జిబిషన్
- 1966 గోల్డ్‌మెడల్, స్టేట్ లలిత కళా అకాడమీ
- 1966లో నేషనల్ అవార్డ్ లలిత కళా అకాడమీ, న్యూఢిల్లీ
- 1975లో అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, కలకత్తా


**సూర్య ఆర్ట్ గ్యాలరీ :**

1993లో హైదరాబాద్‌లో సూర్య ఆర్ట్ గ్యాలరీని ప్రకాశ్ ప్రారంభించారు. ఎనిమిది సంవత్సరాలపాటు ప్రకాశ్ పెద్ద కూతురు గ్యాలరీని నడిపించడం విశేషం. హైదరాబాద్ అవతల జరిగిన అన్ని ఆర్ట్ ఈవెంట్స్‌కు వెళ్తూనే సూర్య ఆర్ట్ గ్యాలరీని కూడా ప్రకాశ్ చూసుకున్నారు. హైదరాబాద్ పెయింటింగ్ ప్రపంచానికి చుక్కానిలా ఉన్న సూర్య ప్రకాశ్ తన ప్రతిభను సానబెట్టుకుంటూ అనేక వర్క్‌షాపులు నిర్వహించి ఔరా అనిపించారు. అనేక మంది చిన్న ఆర్టిస్టులకు మార్గదర్శకుడుగా ఉంటూనే ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడిగా ఎదిగారు.

**ఆప్తమిత్రుడు సూర్యప్రకాశ్ : సీనియర్ ఆర్టిస్టు కె.లక్ష్మాగౌడ్**

కారు గ్యారేజీలో ఇద్దరం కలిసి 15 సంవత్సరాలు గడిపిన రోజులు ఇంకా గుర్తుకొస్తున్నాయి. భోజనం చేయకుండానే పనిచేసిన రోజులు కళ్లముందు కదలాడుతూనే ఉన్నాయి. తాము సొంతంగానే పైకి ఎదిగేందుకు తీవ్రంగా శ్రమించినట్లు చెప్పారు. ఒక కళాకారుడుగా సూర్యప్రకాశ్ సేవలు స్ఫూర్తిదాయకం అన్నారు. ప్రకాశ్ సృష్టించిన ప్రతిదీ తన సొంత భావోద్వేగాలు మరియు అనుభవాల నుండి పుట్టినవి. ప్రకాశ్ జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ





స్థాయిలో వైవిధ్యమైన చిత్రాలను సృష్టించి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. ఆయన చేసిన కృషి మూలంగానే మన దేశంలో ముఖ్యమైన సంస్థలు అనేక సందర్భాల్లో ఆయనను వివిధ హోదాల్లో నియమించారు. డైరక్టర్ పి.భార్గవ కాలంలో సీసీఎంబీలో కళ యొక్క వాతావరణాన్ని సృష్టించడానికి ఆయన చేసిన సహకారం కళాప్రపంచంలో అత్యంత ఆదర్శప్రాయమైన విజయాలలో ఒకటి అని చెప్పవచ్చు. సూర్యప్రకాశ్ దాదాపు మూడు దశాబ్దాలుగా ఎల్వీప్రసాద్ నేత్రవైద్యాలయానికి రెసిడెంట్ ఆర్టిస్టుగా పనిచేయడం కళాకారుడుకి దక్కిన గౌరవంగా భావిస్తున్నాము.

**సూర్యప్రకాశ్ ఎమినెంట్ ఆర్టిస్టు : ప్రముఖ డైరెక్టర్ బి.నర్సింగ్‌రావు**

సూర్యప్రకాశ్ ఇండియన్ గ్రేట్ ఆర్టిస్టు. పాత జనరేషన్ ఆర్టిస్టులు అయిన పీటి.రెడ్డి, కాపు రాజయ్య, కొండపల్లి శేషగిరిరావు తర్వాత లక్ష్మణ్‌గౌడ్, సూర్యప్రకాశ్, దేవరాజ్, వైకుంఠం, డీఎల్.ఎన్.రెడ్డి ప్రస్తుత జనరేషన్ గొప్ప ఆర్టిస్టులు. ఇందులో సూర్యప్రకాశ్ తన వైవిధ్యమైన కళ అబ్‌స్ట్రాక్ట్‌తో కళాప్రపంచాన్ని మైమరిపించారు. అబ్‌స్ట్రాక్ట్, లీవ్స్, లోటస్‌పాండ్, నేచర్.. ఇలా 60 ఏళ్ల జర్నీ చిత్రకళా రంగంలో ప్రకాశ్‌కు అనుభవం ఉండటం గర్వకారణం అన్నారు. సామాజికంగా ఎంతో కృషి చేసి పెయింటింగ్ వర్క్‌పై ఆసక్తి కల్పించారు. రూ.15 నుంచి 20 లక్షల వరకు ఆయన పేయింటింగ్స్ అమ్ముడుపోవడం ఆయన కృషికి నిదర్శనం. నాకు చాలా దగ్గర మిత్రుడు. మా కుమారుడు అజిత్‌నాగ్ డాక్యుమెంటరీస్ తీసినప్పుడు కలిసి పనిచేయడం మరిచిపోలేనిది. సూర్యప్రకాశ్ మృధుస్వభావి. చాలా నిజాయితీపరుడు. చాలా ఉన్నతమైన కళాకారుడు. ఏదైతే నమ్ముతాడో అదే చేస్తాడు. అందరినీ ఇష్టపడతాడు. ఎవరిని నొప్పించని గ్రేట్ పర్సనాలిటీ సూర్యప్రకాశ్. యంగ్‌స్టర్స్‌ను ఎంతో ఎంకరేజ్ చేశారు. తమకు పెద్ద సపోర్టు పోయింది. ఇండియా చాలా పెద్ద ఆర్టిస్టును కోల్పోయింది.

**సూర్యప్రకాశ్ నా గురువు:**
**ఇండియా ఫైన్ ఆర్ట్ వ్యవస్థాపకుడు మన్వీందర్ డావర్**

సూర్యప్రకాశ్ నా మొట్టమొదటి గురువు. 2001లో ప్రకాశ్‌ను హైదరాబాద్‌లోని పంజగుట్టలోని సూర్య ఆర్ట్ గ్యాలరీలో కలిశాను. ఎన్నో అవార్డులు, మరెన్నో ప్రశంసలు పొందిన కళాకారుడు అయినప్పటికీ ప్రకాశ్‌కు ఎలాంటి గర్వం లేకుండా చాలా నెమ్మదిగా ఉండేవారు. కేవలం ఆయనవల్లే హైదరాబాద్‌లో ఎంతో మంది కళాకారులకు గుర్తింపు వచ్చింది. సూర్య ప్రోత్సాహంతోనే తన మొట్టమొదటి ఆర్ట్ షో హైదరాబాద్ విత్ లవ్ హోస్ట్ చేసినట్లు చెప్పారు. తోట వైకుంఠం, లక్ష్మాగౌడ్, లక్ష్మణ్ ఏలే, నందినిగౌడ్‌లతో పాటు ఆయన చిత్రాలను పలు ప్రదేశాల్లో ప్రదర్శించడం మర్చిపోలేని అనుభూతి అన్నారు. ఎక్కడో మారుమూల పల్లెలో పుట్టి ప్రపంచ స్థాయిలో తన చిత్రకళను ప్రదర్శించడం తెలుగుజాతికే గర్వకారణం.

**అరుదైన చిత్రకారుడు సూర్యప్రకాశ్ : ఆర్టిస్టు ఏలే లక్ష్మణ్**

హైదరాబాద్‌లో ఉన్న ప్రాక్టిసింగ్ ఆర్టిస్టులతో పెద్ద ఆర్ట్ క్యాంప్ చేయాలనుంది. నువ్వు ఆర్టిస్టులతో కోఆర్డినేషన్ చేయాలి అని మే 21న సాయంత్రం సూర్య ప్రకాశ్ నాకు ఫోన్ చేశారు. రేపు స్టూడియోకి రా అన్ని వివరాలు మాట్లాడుకుందాం అని చెప్పారు. అదే రాత్రి 9 గంటలకు కొన్ని వివరాలతో మెసేజ్ పెట్టాను. మే 22న ఉదయం 10.30 గంటలకు రమేష్ బాబు (సూర్య ప్రకాశ్ అన్న కొడుకు) సూర్య సర్ పాస్‌డ్ అవే పీస్‌ఫుల్లీ.. అని మెసెజ్ పెట్టారు. ఆ వార్త విని నేను షాక్ అయ్యాను. నిన్ననే సార్‌తో చాలాసేపు మాట్లాడాను. అన్ని విషయాలు మాట్లాడుకున్నాం. సడెన్‌గా ఇలా అయ్యిందేంటి అని వెంటనే ఫోన్ చేసి కన్‌ఫామ్ చేసుకున్నా. ఏం చేయాలో తోచలేదు. ఎవరికి ముందుగా చెప్పాలి అనుకొని ముందుగా లక్ష్మాగౌడ్ సర్, వైకుంఠంకు ఫోన్‌లో విషయం చెప్పాను. వారు హుటాహుటిన సూర్య సర్ ఇంటికి చేరుకున్నారు. అందరి ఆర్టిస్టులకు, మీడియా అందరికీ మెసేజ్ పంపించాను. సూర్య సర్ జెంటిల్‌మెన్ ఆర్టిస్టు. ఎప్పుడు ఫార్మల్స్‌లో ఉండే డాక్టర్ లాగనో, కంపెనీ సీఈవో లాగనో ఉండేవారు. నా జీవితంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాను. వాటన్నింటిలో ప్రకాశ్ సపోర్టు ఉంది. సూర్య ఆర్ట్ గ్యాలరీ శ్రీనగర్ కాలనీలో ఉండేది. గ్రూప్ షోలలో కూడా నా పెయింటింగ్స్‌ను ఎగ్జిబిషన్‌లో ఇన్‌క్లూడ్ చేసేవారు. హైదరాబాద్ విత్ లవ్, మన్వీందర్ దావర్ (ఇండియా ఫైన్ ఆర్ట్ గ్యాలరీ ముంబాయి) కురేటి హైదరాబాద్, మరియు ముంబయి ఎగ్జిబిషన్‌లలో సూర్య సర్‌తోపాటు లక్ష్మాగౌడ్, వైకుంఠం, భైరు రఘురాం, నందిని గౌడ్‌తోపాటు నేను కూడా పాల్గొన్నాను. హైదరాబాద్ ఎల్‌వీ.ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌లో జరిగింది. అట్లాగే 2005లో సీసీఎంబీలో మొదటిసారి ఆర్ట్ క్యాంప్‌లో నాకు అవకాశం ఇచ్చారు. కృష్ణకన్న, ధీరజ్ చౌదరీ, సునీల్ దాస్, యూసఫ్ అరక్కల్, శంషద్ హుస్సేన్, ప్రభాకర్ కోల్టే.. ఇంత మంది గ్రేట్ ఆర్టిస్టులతో పాటు నేను పేయింట్ వేయడం సూర్య గారివల్లే సాధ్యమైంది. నాతోపాటు హైదరాబాద్‌లో ఉన్న చాలా మంది ఆర్టిస్టులను ప్రోత్సహించారు.

కళకే అందం తెచ్చిన గొప్ప ఆర్టిస్టు సూర్యప్రకాశ్ అంటే అతిశయోక్తి కాదు. తన అమ్ములపొదిలో నుండి జాలువారిన 33 కళాకృతులను అంతర్జాతీయంగా ఆన్‌లైన్‌లో అమ్మకాలకు ఉంచారంటే తన శక్తియుక్తులు ఏపాటివో ఇట్టే అర్థమవుతుంది అన్నారు. నైరూప్య ప్రకృతి దృశ్యాలకు పేరుగాంచిన కళాకారుడు ప్రకృతి పట్ల తనకున్న ప్రేమను ఎక్కువగా ఆకర్షించడం, పాఠశాలలో చేసిన స్కెచ్‌ల నుండి అంతర్జాతీయ యవనికపై అందమైన ప్రపంచాన్ని సృష్టించే స్థాయికి రావడం అద్భుతమనే చెప్పాలన్నారు.






# తెలుగుజాతి గొప్ప ఆర్టిస్టు సూర్యప్రకాశ్‌ను కోల్పోయింది:

## దస్‌పల్లా హోటల్లో సంతాప సభ (25-5-2019)

అరుదైన చిత్రకారుడు సూర్యప్రకాశ్‌ను కోల్పోవడం జీర్ణించుకోలేక పోతున్నట్లు ప్రముఖులు పేర్కొన్నారు. దస్‌పల్లా హోటల్లో ప్రముఖ ఆర్టిస్టు సూర్య ప్రకాశ్ సంతాప సభ జరిగింది. ఈ సభకు రాష్ట్రంలో ప్రముఖ ఆర్టిస్టులు లక్ష్మీగౌడ్, వైకుంఠం, ప్రముఖ దర్శకులు బి.నర్సింగరావు, బాల సుబ్రమణ్యం, అంజు పోదార్, చుక్కపల్లి సురేష్, మణికొండ వేదకుమార్, బోస్‌బాబు, కేఎస్ఎన్ ప్రసాద్, అమితా తల్వార్, ఫ్రాంకే ఖాదర్, అజిత్‌నాగ్ తదితర్లు పాల్గొన్నారు. ప్రతిభకు సవాళ్లు అడ్డుకావు అనే లక్ష్యంతో పనిచేసి అంచెలంచెలుగా ఎదిగినతీరును ప్రతి ఒక్కరూ ప్రశంసించారు. ఆర్టిస్టుల ప్రపంచానికి సూర్యప్రకాశ్ ఆదర్శ ప్రాయులుగా నిలవడం గర్వకారణం అన్నారు. సూర్యప్రకాశ్‌లేని లోటు పూడ్చలేనిదని, ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సమాజంలో ఆర్టిస్టులకు ఆదర్శప్రాయులుగా నిలవడం తెలుగుజాతి గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. తెలుగుజాతి గొప్ప ఆర్టిస్టును కోల్పోయిందన్నారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ చిత్రపటానికి పలువురు ప్రముఖులు, ఆర్టిస్టులు నివాళులర్పించారు.

– రామకృష్ణ కాంపాటి, m : 9866168863
e: ramakrishna.praja@gmail.com













# భారతీయ సినిమారంగంపై ఎగిరిన తిరుగుబాటు జెండా

# రిత్విక్‌ఘటక్

అతను గొప్ప మేధావి. భారతదేశంలో తొలి రాజకీయ సినిమా తీసినవాడు. గొప్ప ప్రతిభా సంపన్నుడు. వ్యక్తిగా వట్టి తాగుబోతు. రికామిగా తిరిగే బికారి. కలకత్తా వీధులవెంట తిరిగిన ఓ సాదాసీదా మధ్యతరగత జీవి. వాస్తవిక సినిమా ప్రియులకు అంతర్జాతీయంగా సుపరిచితుడు. అంతటి మహానుభావుని పేరు "రిత్విక్ ఘటక్". రిత్విక్ ఘటక్ భారతదేశ ఆధునిక, అభ్యుదయ, నవ్య సినిమాకు తొలితరం దర్శకులలో ఒకరు. సత్యజిత్ రే, తపన్‌సిన్హా, మృణాల్‌సేన్ ఆయన సమకాలికులు.

రిత్విక్ ఘటక్ జీవితకాలంలో పొందవలసిన పేరు ప్రఖ్యాతులు పొందలేదు. మరణానంతరమే ఆయన సినిమాల్లో ఉన్న వాస్తవికతను చూసి గుర్తింపునిచ్చారు. "సినిమా కళ కేవలం వినోదం కోసం కాదు – సమాజం కోసం" అనే సిద్ధాంతాన్ని నమ్మిన ఘటక్ ఉత్తమ దర్శకుడే కాదు, నటుడు, నిర్మాత, ఎడిటర్, ప్రయోక్త కూడా. 1925 నవంబర్ 4న ఢాకాలో జన్మించారు. ఆయన తల్లి ఇందుబాలాదేవి, తండ్రి రాయ్ బహదూర్ సురేశ్ చంద్ర ఘటక్ డిప్యూటీ మేజిస్ట్రేట్‌గా పనిచేసేవారు. ఆదివాసీల కోసం జీవితాంతం పనిచేసిన ఆయన కవి, నాటక రచయిత. రచయిత్రి మహాశ్వేతాదేవి స్వయాన ఆయన మేనకోడలు. చిన్నతనంలో రిత్విక్ అవనీంద్రనాథ్ ఠాగూర్, గగనేంద్రనాథ్ ఠాగూర్‌ల ప్రభావంతో చిత్రకళ, సంగీతాల పట్ల ఆసక్తి పెంచుకున్నారు. బిభూతిభూషణ్ బంధోపాధ్యాయ, తారాశంకర్ బంధోపాధ్యాయ, మాణిక్ బెనర్జి, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, అబ్రహాంలింకన్, లెనిన్‌ల సాహిత్య ప్రభావంతో తనను తాను రూపొందించుకున్నారు. రిత్విక్ ఘటక్ మొదట మార్క్సిజంవైపు ఆకర్షితులై 1946లో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించాడు. 1948లో బెర్హంపూర్ కాలేజీ నుండి డిగ్రీ పొందిన ఆయన ఆ తరువాత ఇప్టాలో చేరి నాటకాలు రాసి, ప్రదర్శించారు. అవన్నీ బహిరంగ ప్రదర్శనలు కావడం విశేషం.



ఉస్తాద్ అల్లావుద్దీన్ ఖాన్, పాశ్చాత్య సంగీతకారులు బీథోవెన్, పాల్‌రాబ్సన్‌లను ఆరాధించిన రిత్విక్ ఎస్.డి.బర్మన్, అబ్బాసుద్దీన్‌ల సంగీతంతో ప్రభావితులైనారు. రవీంద్రుడు, సుకాంత భట్టాచార్యల కవితల ప్రభావం ఆయనపై చాలా ఉండింది. సుకాంత కవిత 'చీల్'ను తన 'బరీథేకే పతియే', 'కోమల్‌గాంధర్'లో వినిపిస్తారు. 1948లో కలకత్తా విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. డిగ్రీ తీసుకున్నాడు. విద్యార్థి దశ ఉండే రచనా వ్యాసాంగాన్ని ప్రారంభించి 'దలీల్', 'జ్వాలా', 'సంఖో', 'గెలీలియో' మొదలైన నాటకాలను రచించి, సమర్పించి వాటిలో నటించాడు. 'ఇప్టా'లో చేరి మొదట సాహిత్యం, తదుపరి నాటకం, ఆ తదుపరి సినిమా... ఇలా ఒకదాన్నుండి మరోదాంట్లోకి ప్రవేశించడం కేవలం ప్రజలకు సన్నిహితం కావడానికే. ఇలా తన ఆశయాలను ప్రకటించేందుకు, ప్రజలకు చేరువయ్యేందుకు ఘటక్ వీలైనంత కృషి చేశాడు. కాని ఆ కృషికి జీవించి వున్న కాలంలో రావలసినంత గుర్తింపు రాలేదు. కారణం వ్యాపార సినిమా ప్రేక్షకుని తప్పుదోవ పట్టించడమే.

ఘటక్ సినిమా నిర్మాణాన్ని సొంతంగా తనకు తానే నేర్చుకున్నాడు. తనదైన శైలిని ఏర్పరచుకున్నాడు. ఆయన నిర్మించిన చిత్రాలను చూసి ఎందరో ప్రభావితులై ఆదర్శంగా తీసుకున్నారు. పూనా ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో వైస్-ప్రిన్సిపల్‌గా ఉన్నపుడు ఆయనవద్ద శిష్యరికం చేసిన శ్యామ్ బెనెగల్, సత్యదేవ్ దూబె, జాన్ అబ్రహం, మణికౌల్, కుమార్ సహాని వంటివారు ఎందరో ఆ తరువాత న్యూ సినిమా రంగంలో ఉన్నత దర్శకులై వెలుగు వెలుగారు. రిత్విక్ ఘటక్ 1953లో రెండేళ్ళపాటు రాజకీయ ఖైదీగా జైలులో ఉంచబడిన సురమను 1955లో వివాహం చేసుకున్నారు. ఆమె 'ఇప్టా'లో పనిచేసేవారు. నిమాయ్‌ఘోష్ 'చిన్నముల్' (1950) సినిమాతో నటుడు, సహాయ దర్శకునిగా రిత్విక్ సినీరంగ ప్రవేశం జరిగింది.

సినిమా కళ అధిక సంఖ్యాకులను త్వరితంగా ప్రభావితం చేస్తుంది. కుల, మత బేధాల ప్రసక్తి లేకుండా అన్ని రకాల ప్రజా బాహుళ్యాన్ని ప్రభావితం చేయగలిగే శక్తి సినిమాకుంది. సినిమా దర్శకుడు, రచయిత తన భావాలను మాత్రమే చూపుతాడు. కానీ చూపిన ఆ భావాలకు సార్థకత చేకూర్చేవారు ప్రేక్షకులే అని అంటాడాయన. ఈ భావనలో ఘటక్‌ను సత్యజిత్‌రే కన్నా ఉన్నతుడుగా చెప్పుకోవచ్చు. అయితే 'రే' ని మనం భారతీయ వాస్తవిక సినిమాకు ఆద్యుడని చెప్పుకుంటున్నాం. కాని ఆయనకన్నా ముందుగానే ఘటక్ న్యూ సినిమాకు అంకురార్పణ చేశాడన్న విషయం అందరికీ తెలీదు. కలకత్తాకు వచ్చి అందులో భాగమైపోయిన తూర్పు బెంగాల్ శరణార్థుల దయనీయ స్థితిని, శ్రమజీవులైన కార్మిక, కర్షకుల పోరాటాన్ని 1953లోనే 'నాగరిక్' సినిమాలో చూపారాయన. కానీ దురదృష్టవశాత్తు ఈ సినిమా



అజాంతరిక్ (1958)లోని ఓ సన్నివేశం, మేఘదక్‌తార (196)లోని సన్నివేశాలు

విడుదలకు నోచుకోకపోవడంతో రే 'పథేర్ పాంచాలి'కి (ఇదీ గొప్ప చిత్రమే) 'నాగరిక్' క్రెడిట్ దక్కింది.

ఘటక్ తొలి చిత్రం 'నాగరిక్' కన్నా ముందుగా 'బెదెవి' (1950) సినిమా మొదలుపెట్టాడు. కాని ఇది అసంపూర్తిగానే మిగిలిపోయింది. ఆయన తదుపరి చిత్రం 'అజాంతరిక్' 1958లో విడుదలైంది. విడుదలైన ఘటక్ తొలి చిత్రమిది. ఈ సినిమా ఆయనకు 'రే'ని మించిన దర్శకునిగా పేరు తెచ్చిపెట్టింది. 'అజాంతరిక్' విడుదల తర్వాత భారతీయ సినీరంగంలో కొత్తతరహా సినిమాల నిర్మాణానికి ఘటక్ హేతువైనాడు. ఒక కారు డ్రైవర్ తన కారు పట్ల ప్రదర్శించే అభిమానం, ప్రేమలను చూపుతాడు. కారు డ్రైవరే ఈ సినిమాలో నాయికా నాయకులుగా కనిపిస్తారు మనకు.

సామాజిక సమస్యలను సున్నితంగా చిత్రీకరిస్తూనే తిరుగుబాటుతనాన్ని చూపడం ఘటక్ సినిమాల్లోని ప్రత్యేకత. నమ్మినదాన్ని అంతే నిజంగా తెరకెక్కించాడాయన. ఆయన ఆలోచనలు, అభిప్రాయాలన్నీ ఆయన సినిమాల్లో ప్రతిబింబి స్తాయి. 'అజాంతరిక్' తదుపరి 'బారీ తేకే పాలియే'లో పెద్దల ప్రపంచం గురించి ఒక పిల్లవాని ఆలోచనలను చిత్రీకరించాడు. ఈ ప్రయోజనాత్మక చిత్రాన్ని సగటు ప్రేక్షకుడు చూసి ఆనందించలేక పోయినా డెనీస్, ఫ్రాన్స్ దేశాల్లో ప్రదర్శితమై విమర్శకుల ప్రశంసలందుకుంది.

బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించిన తొలి ఘటక్ చిత్రం 'మేఘదక తార' (1960), ఆర్ట్ సినిమా. ప్రేక్షకులెవరూ ఈ చిత్రాన్ని మరువలేరు. వివాహానికి దూరంగా వుండి, తన కుటుంబాన్ని పోషించే బాధ్యతలలో ఒక స్త్రీ ఎదుర్కొనే సంఘర్షణల నేపథ్యమే ఈ చిత్రం. అంతగా సేవ చేసిన తన కుటుంబమే ఆమెను ఈసడించుకుంటుంది. చివరగా బ్రతుకు కోసం ఆమె నిస్సహాయంగా అరిచే అరుపులను వినేవారే కరువవుతారు. ఈ సినిమా కొనసాగింపుగా మరో రెండు సినిమాలు తీశాడు. వీటిని మేఘదకతార ట్రయాలజీగా చెప్పుకుంటాడు. రెండో చిత్రం 'కోమల్ గాంధార' (1961), బెంగాల్‌లో ప్రగతిశీల కళా ఉద్యమాల్లో దర్శకుని అనుభవాలు, నాయిక ఎదుర్కొనే కష్టనష్టాలు ఇందులో చూపాడు. ఈ చిత్రంలో నాయకా నాయికలు చివరి దృశ్యంలో ఒక నదీ తీరాన కూర్చుని ఉంటారు. అప్పుడు బీడు భూమిని తాకుతూ నది పారుతుంది. ఇది ఘటక్ ఆశావాదాన్ని తెలుపుతుంది.

ఈ ట్రయాలజీలో మూడో చిత్రం 'సుబర్ణరేఖ'. ఒక శరణార్థురాలిని వ్యభిచార నరకకూపంలోకి ప్రవేశించే దుస్థితికి దిగజార్చిన సమాజంపై ఘటక్ తీవ్రంగా ధ్వజమెత్తాడు. అసలే భయంతో కంపించిపోతున్న ఆ అమ్మాయి దగ్గరికి విటుడిగా వచ్చిన మొదటివాడామె సోదరుడే కావడంతో ఆ యువతి ఆత్మహత్య చేసుకుంటుంది. ఈ మూడు చిత్రాలతో ఘటక్ మహాదర్శకుడన్న విషయం ప్రపంచ సినిమా ప్రజలకు తెలిసిపోయింది. బెంగాలీల జీవితాలనే చిత్రించినా, ఘటక్ చిత్రాలు విశ్వమానవాళి భావాలకు నిదర్శనంగా నిలుస్తాయి. 'బబూ' జాతి జలారీల జీవితాలపై చిత్రించిన 'టిటాస్ ఎక్తీ నదీర్ నామ్' లో జీవిత పరమార్థం జీవించడమే అన్న సత్యాన్ని చాటుతాడు.

ఘటక్ ఆఖరి సినిమా 'జాక్తీ తక్కో గొప్పో' (1974). ఈ సినిమా నక్సలిజానికి విషాదాంతం తప్పదని చెబుతుంది. అరవయ్యవ దశకం ఆఖర్లో 70 దశకం ఆరంభంలో మావోయిస్ట్ (నక్సలైట్ల) ఉద్యమం ఈ కథా నేపథ్యం. భ్రమలు తొలిగిన ఒక నక్సలైట్ కథ ఇది. ఫిలిం ఫైనాన్స్ కార్పొరేషన్ వారి ఆర్థిక సాయంతో తయారైన ఈ చిత్రం 1971–72లో చెలరేగిన రాజకీయ కల్లోలాన్ని బ్యాక్‌గ్రౌండ్‌గా తీసుకుని ఒక త్రాగుబోతు దృష్టిలో చూపించాడు. ఈ కాలంలోనే ఘటక్ తాగుడుకు బానిసవడం జరిగింది. అందుకే ఈ సినిమా ఆయన మానసిక స్థితిని ప్రతిబింబిస్తుంది.

అనంతరం ఘటక్ మరో మూడు చిత్రాలు ప్రారంభించి ఆపివేశాడు. మూడు లఘుచిత్రాలు కూడా తీశాడు. వీటిలో 'అమర్ లెనిన్' అనే చిత్రం రష్యాలో 'మైలెనిన్' పేర విడుదలై విజయం సాధించింది. మిగతా లఘుచిత్రాలు 'సీజర్స్, ఫియర్' అనేవి కూడా మంచి పేరు తెచ్చిపెట్టాయి.

చివరి రోజుల్లో ఫార్ములా చిత్రాల విజృంభణలో సైతం తన ఉన్నత ఆశయాలను వీడలేక పేద ప్రజల అండ కోసం తానెప్పుడూ సిద్ధమేనని వారిని మరువలేనని అనేవాడు. చివరి రోజుల్లో క్షయ

వ్యాధితో బాధపడుతూ ఊపిరితిత్తులు కన్నాలుపడి నాటుసారా వల్ల లివర్ దెబ్బతిని అత్యంత విషాదభరితమైన జీవితాన్ని చవిచూసి కన్నుమూసాడు. ఆయన భార్య మాటల్లోనైతే 'ఘటక్ వైరుధ్యాలతో కొట్టుమిట్టాడిన ఒక తిరుగుబోతు'.

భారతీయ చిత్ర జగత్తులో నేనందరిలాంటి వాణ్ణి కాదని నిరూపిస్తానని చెప్పుకున్న రిత్విక్ ఘటక్ మాటలు ఆయన మరణానంతరం నిజమైనవి. దేశ దేశాల్లో ఆయన చిత్రాలు చూసిన పాశ్చాత్యులు 'రే'ని మించిన దర్శకుడని కొనియాడారు.

రిత్విక్ ఘటక్ సినిమా దర్శకుడు, నటుడు, రచయిత మాత్రమే గాకుండా హిందీలో 'ముసాఫిర్', మధుమతి చిత్రాలకు మరికొన్ని బెంగాలీ చిత్రాలకు స్క్రీన్‌ప్లేలు రాశారు. సినిమా విమర్శకులు, అభిమానులు ఘటక్ జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన దేశవిదేశీ దర్శకులతో పోల్చిన సందర్భాలున్నాయి. అయితే నిజానికి ఆయన ఎవరితోనూ సరిపోల్చదగిన వాడు కాదనేది నిర్వివాదాంశం. ఆయన ఎవరినీ అనుకరించలేదు. ఒక దేశపు కళా లక్ష్యాన్ని అదుపు చేయగలిగిన జీనియస్ ఆయన బ్రతుకులో అరాచకత్వం వల్ల ఆయన పని విధానాల్లో తగిన సమయంలో ముందుకు తీసుకెళ్ళలేకపోయాడు.

పాశ్చాత్య సినిమాకారుడు 'లుయిమారే' రిత్విక్ ఘటక్‌ను 'మోస్ట్ ఒరిజినల్ డైరెక్టర్ ఆఫ్ వరల్డ్ సినిమా' అనడంలో ఇసుమంతైనా అతిశయం లేదు. రిత్విక్ తన జీవిత కాలంలో 8 కథా చిత్రాలు, 4 షార్ట్ ఫిలింలు, 4 డాక్యుమెంటరీలు, ఒక వ్యాపార చిత్రం తీశారు, 6 సినిమాలకు స్క్రీన్‌ప్లే రాశారు.

రిత్విక్ ఘటక్ కలకత్తాలోని ఎస్.ఎస్.కె.ఎం. హాస్పిటల్‌లో 1976 ఫిబ్రవరి 6న 50వ యేట కాలం చేశారు. బెంగాల్ సమాజంలో తిరుగుబాటుదారులుగా గుర్తింపునొందిన సృజనాత్మకకారులు కవి మీఛెల్ మధుసూదనదత్, సినిమాకారుడు పి.సి.బారువా, రచయిత మాణిక్ బంధోపాధ్యాయ వంటి వారి కోవకు చెందిన రిత్విక్ ఘటక్ స్మశానంలో అంత్యక్రియల తరువాత మిగిలిన బూడిదలోంచి ఫీనిక్స్ పక్షిలా జీవం పోసుకుని తిరిగి లేస్తాడని భావించారు ఆ తరంవారు.



ఝుక్తీ టోక్కొ ఆర్ గప్పో (1974)

**రిత్విక్ ఘటక్ సినిమాలు:**

నాగరిక్ (1952), అజాంతరిక్(1958) బరీ తేకే పాలియే (1959), మేఘదకేతార(1960), కోమల్ గాంధార (1961), సుబర్ణరేఖ(1962) టిటాస్ ఏక్తీ నదీర్ నామ్(1973) ఝుక్తీ టక్కో ఆర్ గప్పో(1974).

**డాక్యుమెంటరీలు:** ఒరాన్(1955), సైంటిస్ట్స్ ఆఫ్ టుమారో (1967), ఛౌదాన్స్ ఆఫ్ పురూలియా (1970), రాంభిన్ కర్(1975).

**షార్ట్ ఫిలింస్:** ఫియర్ (1964-65), అమర్ లెనిన్ (1970), ఏ క్యాం (1970) దర్బార్ గతి పద్మ (1971).

యాడ్ ఫిలిం: సీజర్ (1962)

**స్క్రీన్‌ప్లేలు:** ముసాఫిర్ (హిందీ-1955), మధుమతి (హిందీ-1955) స్వరలిపి (బెంగాలి-1960), కుమారి మోన్ (బెంగాలి-1962), ద్వీపేర్ నామ్ టోయారాంగ్ (బెంగాలి-1963), రాజ్ కన్య (బెంగాలి-1965)

**అవార్డులు:** రిత్విక్ ఘటక్ 1970లో పద్మశ్రీ అందుకున్నారు. ఝుక్తీ టక్కో ఆర్ గప్పో' రజత కమలం అందుకున్నది. ఇదే చిత్రం బంగ్లాదేశ్ సినీ జర్నలిస్ట్స్ అసోసియేషన్ పురస్కారం, అజాంతరిక్' వెనీస్ ఫిలిం ఫెస్టివల్‌కి ప్రత్యేక ఎంట్రీగా ఎంపికైంది.

రిత్విక్ ఘటక్ భారతీయ సినిమాను ఒక ఇసుక తుఫానులా ఢీకొట్టి నిలబడ్డాడు. ఎంత త్వరగా తన సినిమాలతో సంచలనం సృష్టించాడో అంతే త్వరగా ఆయన కనుమరుగైపోయాడు. ఆయన మరణం తరువాతనే ఆయన సినిమాలు అంతర్జాతీయ ఖ్యాతినొందినవి. ఫ్రాన్సు, ఇటలీ, కెనెడాలు ఆయనను ప్రపంచ సినిమారంగంలో ఉన్నత స్థానంలో నిలబెట్టి నివాళి ఘటించినవి.

ఘటక్ సినీ దర్శకుడు మాత్రమే కాదు, ఆయన గొప్ప కథా, నాటక రచయిత. ఎన్నో వ్యాసాలు రాశారు. అవన్నీ గ్రంథరూపంలో వెలువడినవి. ఒక సందర్భంలో ఆయనే స్వయంగా ఇలా చెప్పుకున్నారు. "The ideological base of my work is fundamentally Marxism"

రిత్విక్ ఘటక్ సమాజ గతిని దృశ్యబద్ధం చేసిన దర్శకుడు. తను సినిమా తీయాలను కున్నప్పుడే సినిమాలు తీశారు. కానీ సినిమా తీయాలని తీసిన సినిమాలు కావవి. ప్రజల జీవనాన్ని, అందులో కనిపించని కోణాలను చిత్రీకరించారు. ఇవన్నీ నాటి వర్తమాన చలనచిత్రకారుల ధోరణికి వ్యతిరేకమైన సినిమాలు. ఆవిధంగా రిత్విక్ ఘటక్ భారతీయ సినిమా రంగంపై ఎగిరిన తిరుగుబాటు జెండా.

చివరగా - సత్యజిత్‌రే అన్నట్లుగా 'రిత్విక్ ఖచ్చితంగా బెంగాలీ దర్శకుడు, బెంగాలీ కళాకారుడు, నాకన్నా హెచ్చుగా బెంగాలీవాడు...'

- హెచ్.రమేష్‌బాబు, m: 7780736386
e: hrameshbabu5@gmail.com



# రాచకొండ సాహిత్యం

రాచకొండ పద్మనాయక రాజులు - సమరాంగణ సార్వభౌములై, కవులై, పండితులై, కవిపండిత పోషకులై, లలితకళా పరిపోషకులై శతాధిక వత్సరాలు (క్రీ.శ.1361-1475) తమ సుపరిపాలనలో, చరిత్రలో తెలుగువారి కీర్తిని సంస్కృత, తెలుగు భాషాసాహిత్యాల ద్వారా విశేషంగా ప్రతిష్ఠింపజేశారు.

**1. మొదటి అనపోతానాయక కాలం (క్రీ.శ.1361-1384)**

**1.1. మొదటి అనపోతానాయుడు:**

రాచకొండ రాజ్యాన్ని సామ్రాజ్య స్థాయికి విస్తరింపజేసిన మహావీరుడు. 'ఆంధ్ర దేశాధీశ్వర' బిరుదాంకితుడు, కవి పండిత పోషకుడు, స్వయంగా కవి. 'అభిరామ రాఘవం' అనే నాటకం రాశాడు.

**1.2. పశుపతి నాగనాథుడు:**

విశ్వేశ్వర కవి శిష్యుడు. ఈ గురుశిష్యులు అనపోతానేని ఆస్థానంలో చేరిన తొలి విద్వాంసులు. ఈ నాగనాథుడు సంస్కృతంలో 'మదనవిలాసం' అనే భాణం (రూపక భేదం) రచించడంతో పాటు సంస్కృత 'విష్ణుపురాణం'ను తెలుగులోనికి అనువాదం చేశాడు. తెలుగు, సంస్కృత భాషల్లో శాసనాలు కూడా రాశాడు. పద్మనాయక చరిత్రకు ముఖ్య శాసనమైన 'అయ్యనవోలి శాసనం' ఇతడు రాసిందే. ఇది శాసనమే అయినా కవితా సౌందర్యాన్ని వ్యక్తీకరిస్తుంది.

**2. రెండవ సింగభూపాలుని కాలం (క్రీ.శ.1384-1399)**

**2.1. రెండవ సింగభూపాలుడు:**

స్వయంగా కవి, పండితుడు. నాట్య, గాన, సంగీత, సాహిత్య సమరాంగణములందు సాటిలేని బహుముఖ ప్రజ్ఞాశాలి. సర్వజ్ఞ, లక్ష్య లక్షణవేది, సాహిత్య శిల్పావధి - అనే బిరుదులు కలవాడు. ఇతనికి సర్వజ్ఞ నామధేయం సార్థకమైనదని తెలిపే చాటువు చూడండి.

కం. సర్వజ్ఞ యన్న బిరుదము
శర్వునకే రావు సింగభూపాలునకే
ఉర్వింజెల్లును తక్కొరు
సర్వజ్ఞుడనుట కుక్క సామజమనుటే.

ఇతడు విజయనగర సామ్రాజ్యాధీశుడైన శ్రీకృష్ణదేవరాయలకు సుమారు ఒకటిన్నర శతాబ్దాలకు ముందే పుట్టి, అతనికి అన్నిటిలోనూ ఆదర్శంగా నిలిచినవాడు.

రసార్ణవ సుధాకరం, సంగీత రత్నాకరం, రత్నపాంచాలిక, కందర్ప సంభవం అనే సంస్కృత గ్రంథాలను రాసినవాడు. రసార్ణవ సుధాకరం - నాట్యాలంకార శాస్త్ర గ్రంథం, దీనికి 'సింగభూపాలీయం' అనే పేరు కూడా ఉంది. ఈ గ్రంథంలో పూర్వకవుల కావ్యాలు, నాటకాలు, సమకాలికుల రచనల ఉదాహరణలు పేర్కొనబడినాయి. వ్యాఖ్యానబ్రహ్మ మల్లినాథసూరి ఈ గ్రంథాన్ని ప్రామాణికంగా గ్రహించాడు. సంగీత సుధాకరం సారంగదేవుని 'సంగీత రత్నాకరా'నికి సుధానిధి పేరుతో వెలువడిన వ్యాఖ్యాన గ్రంథం. రత్న పాంచాలికకి కువలయావళి అనే పేరు కూడా ఉంది. ఇది నాలుగు అంకాల నాటకం. స్వతంత్ర రచన. శ్రీకృష్ణుడు కువలయావళిగా అవతరించిన భూదేవిని వివాహమాడటం ఇందులోని వృత్తాంతం. రాచకొండ రాజులు నిర్వహించే ప్రసన్న గోపాలుని వసంతోత్సవాల్లో ఈ నాటకం విరివిగా ప్రదర్శింపబడేది. కందర్ప సంభవం రూపక భేదాల్లో ఒకటైన భాణం. మన్మథుని జననం ఇందులోని వృత్తాంతం.

'సింగభూపాలునికి వివిధ శాస్త్రాల్లో అపారమైన పాండిత్యం ఉంది' అనేందుకు అతని కావ్యాలే ప్రమాణాలు.

**2.2. విశ్వేశ్వర కవి:**

రెండవ సింగభూపాలుని ఆస్థాన కవి చమత్కార చంద్రిక, వీరభద్ర విజృంభణం, కరుణాకందళం ఇతని రచనలు.

చమత్కార చంద్రిక సుప్రసిద్ధమైన గ్రంథం. ఇందులో ఉదహరింపబడిన శ్లోకాలు ఆశ్రయదాత అయిన సింగభూపాలుని కీర్తిని ప్రశంసిస్తాయి. ఈ కావ్యం ఆనాటి చారిత్రక విషయాలను ఎన్నిటినో తెల్పుతోంది. 'శ్రీ సింగభూపాల విలోకనార్థం/వైదుష్యమేకం విదుషాం సహాయమ్' అనే అత్యంత ప్రచారంలో ఉన్న శ్లోకం ఈ గ్రంథంలోనిదే. ఈ శ్లోకానికి 'శ్రీ సింగభూపాలుడు తన దర్శనార్థం వచ్చే కవులలో పాండిత్యాన్ని మాత్రమే దర్శిస్తాడు తప్ప వారి వేషభూషణాదులను

పట్టించుకోదు' అని అర్థం.

'వీరభద్ర విజృంభణం' డిమం అనే రూపక భేదం. దీనిలోని కొన్ని శ్లోకాలు 'రసార్ణవ సుధాకరం'లో ఉదాహరింపబడినాయి. 'కరుణాకందళం' అంకం అనే రూపక భేదం. దీనిలోని శ్లోకాలు కూడా 'రసార్ణవ సుధాకరం'లో ఉదాహరింపబడినవి.

**2.3. బొమ్మకంటి అప్పయాచార్యులు:**

సింగభూపాలుని ఆస్థానాన్ని అలంకరించిన మరొక సంస్కృత పండితుడు. అమరకోశమునకు 'అమరపారిజాతము' అనే వ్యాఖ్యాన గ్రంథాన్ని తన శిష్యుల కొరకు రాశాడు. ఇది చారిత్రక విశేషాలుగల కావ్యం. అన్నమయ్య వంశపు కవి తిరువెంగళప్ప తను అప్పయార్యుని వ్యాఖ్యానం 'కావ్యప్రకాశం' చదివి తన వ్యాఖ్యను రాస్తున్నానని చెప్పినట్లు తిరుపతిలోని ఒక శాసనంలో ఉంది.

**2.4. హరిహరుడు:**

అప్పయాచార్యుని శిష్యుడు. సంస్కృతంలో ఒక కవి రాసిన 'అనర్ఘరాఘవము' అను నాటకానికి వ్యాఖ్యానకర్త. శబ్దశాస్త్రం, పూర్వోత్తర మీమాంస, తర్కములందు తాను పరిశ్రమ చేసినవాడినని తనను గూర్చి తాను తెలియజేసుకుంటూ తనకు ఆ వైదుష్యమును కల్గించిన వాడు తన గురువైన అప్పయాచార్యుడు అని పేర్కొన్నాడు.

**3. రావు మాధవనాయని కాలం (క్రీ.శ.1421-1430)**

**3.1. రావు మాధవనాయుడు (రావు మాదానేడు):**

వాల్మీకి రామాయణానికి 'రాఘవీయం' అనే సంస్కృత వ్యాఖ్యానం రాసి, శ్రీరామునికి అంకితమిచ్చాడు క్రీ.శ.1427లో.

**3.2. మాధవనాయుని భార్య నాగాంబిక:**

దేవలమ్మనాగారం అనే సమీప గ్రామంలో తటాకాన్ని నిర్మింపజేస్తూ, శాసనం వేయించింది. శాసన లేఖకుడు 'శంభునాధకవి'. ఈ శాసనం కావ్యశైలి(నక్షత్రమాల)లో కన్పిస్తుంది. మాధవనాయని రాజ్యవైభవాన్ని ఈ శాసనం తెలియజేస్తుంది.

**3.3.** శ్రీశైల ఉత్తర ద్వారక్షేత్రమైన ఉమామహేశ్వరంలో బృహత్ శిలామండపాన్ని మరియు అచటి నుండి శ్రీశైలమునకు సోపానములు నిర్మింపజేసిన మాధవనాయుడు 'మాయిభట్టోపాధ్యాయుడు' అను పండితునిచే ఒక శాసనం రాయించినాడు. 28 శ్లోకాలున్న ఈ శాసనంలోని చివరి శ్లోకంలో చక్రబంధం కనబడుతుంది. ఇందులో మాధవనాయని శౌర్య పరాక్రమాలు వర్ణింపబడినాయి. అయితే ఈ మాధవనాయుడు దేవరకొండ నుంచి పాలన చేసినాడు.

**4. మూడవ సింగభూపాలుని కాలం (క్రీ.శ.1430-1475)**

మూడవ సింగభూపాలుడు సర్వజ్ఞ బిరుదాంకితుడు.

**4.1. శాకల్యమల్లభట్టు:**

మూడవ సింగభూపాలుని ఆస్థాన విద్వాంసుడు 'నిరోష్ఠ్య రామాయణం', 'ఉదారరాఘవం' అనే కావ్యాలను, 'అవ్యయ సంగ్రహం' అనే నిఘంటువును సంస్కృతంలో రాశాడు. ఈ నిఘంటువు, అక్షరం - రెండక్షరాలు - మూడక్షరాలు - నాలుగక్షరాలుగా విభజింపబడింది. ఈ గ్రంథారంభంలో భద్రాద్రిలో నివాసం ఉన్న 'హరి' వర్ణన ఉన్నది. 'చరుర్భాషాపితామహ' అనేది ఇతని బిరుదనామం.

**4.2. శాకల్య అయ్యలార్యుడు:**

శాకల్యమల్లభట్టు మనుమడు. భాస్కర రామాయణం - యుద్ధకాండలోని శేష భాగం పూరించాడు.

**4.3. వేదాంత దేశికుడు:**

దక్షిణాది వైష్ణవ మతాచార్యుడు. సుభాషితనీతి, తత్వ సందేశం, రహస్య సందేశం అనే గ్రంథాలను మూడవ సింగభూపాలుని కోరిక మేరకు రచించాడు.

**4.4. మల్లినాథసూరి:**

సర్వజ్ఞ సింగభూపాలుని సత్కారాన్ని అందుకున్న మహాపండితుడు. మేఘ సందేశం, కిరాతార్జునీయం, శిశుపాలవధ,



శృంగార నైషధం వంటి మహా కావ్యాలతో పాటు, ఏకావళి అనే అలంకార శాస్త్ర గ్రంధానికి వ్యాఖ్యానాన్ని రాసి యావత్ భారతదేశానికి కీర్తిని ప్రసాదించి సర్వదా శ్లాఘనీయుడైనాడు ఈ మల్లినాధసూరి.

**4.5. కొలిచెలమ పెద్దిభట్టు:**

మల్లినాధసూరి పుత్రుడు ఈ పండితుడు. సింగభూపాలునిచే కనకాభిషేక గౌరవాన్ని పొందడం విశేషం.

**4.6. బమ్మెర పోతనామాత్యుడు:**

మూడవ సింగభూ పాలుని ఆస్థాన నర్తకి మరియు ప్రేయసి అయిన భోగినిపై భోగినీ దండకం అనే కావ్యాన్ని వెలువరించిన కవి. ఇదొక శృంగార రసగుళిక మాత్రమే కాదు, సరస్వతీ దేవి స్తవం కూడా. అంటే? ఇదొక ద్వ్యర్థి దండక కావ్యం. రాజు పరంగా భోగిని శృంగార వర్ణన, కవి అయిన తనపరంగా సరస్వతీ దేవిస్తుతితో రెండర్థాలను మేళవించి ఒక సమన్వయ కావ్యాన్ని రాశాడు- మహాకవి పోతన.



ఈ రచన కూడా ఆనాటి చారిత్రక విశేషాలెన్నిటినో తెలియజేస్తుంది. పోతన ఇతర రచనలు: వీరభద్ర విజయం, తెలుగు మహాభాగవతం, నారాయణ శతకం.

**4.7. శ్రీనాథ మహాకవి:**

రాజకవి అయిన మూడవ సింగభూపాలుని ఆస్థానాన్ని దర్శింపబోయే సందర్భంలో శ్రీనాథుడు సరస్వతిని ఈ విధంగా ప్రార్థిస్తాడు.

'దీనారటంకాల తీర్థమాడించితివి, దక్షిణాధీశు ముత్యాలశాల / పలుకుతోడైతివి ఆంధ్ర భాషా మహాకావ్య, నైషధ గ్రంధ సందర్భమునను / పగులగొట్టించితివి ఉద్భట వివాద ప్రౌఢి, గౌడ డిండిమ భట్టు కంచుఢక్క / చంద్ర భూషక్రియా శక్తి రాయలయొద్ద, పాదుకొల్పితివి సార్వభౌమ బిరుదు / ఇంత కాలమువలెగాదు వింతరీతి / ఎట్లు మెప్పించెదో కదా ఇంక మీద / రావు సింగమహీపాల ధీవిశాలు / సకల సద్గుణ నికురంబ శారదాంబ'.

ఈ చాటువు ఒక్కటి చాలు... రాచకొండరాజుల కీర్తిని, వైభవాన్ని, పాండిత్యాన్ని, వారు కవుల పట్ల చూపించే గౌరవాదరాభిమానాలను చాటి చెప్పేందుకు, వారి సంస్థాన విద్వత్ ప్రతిభను వ్యక్తం చేసేందుకు.


**5. ఈ కాలంలోని మరికొందరు కవులు:**

సింహాసన ద్వాత్రింశిక అనే సుప్రసిద్ధమైన కథాకావ్యాన్ని రాసిన కొరవి గోపరాజు పూర్వీకులు రాచకొండ రాజుల వద్ద మంత్రులు. ఆంధ్ర కవితా పితామహా' అనే బిరుదాంకితుడు, రామాయణ కృతికర్త అయిన కొరవి సత్యనారాయణ ఇతని పినతాత. పెదతాత కుమారులైన బాచన, సింగనలు అతపోతానేని వద్ద మంత్రులు.

**గౌరన కవి:**

లక్షణ దీపిక అనే ప్రామాణిక లక్షణ గ్రంధంతో పాటు హరిశ్చంద్ర చరితము, నవనాధ చరితములను ద్విపదా ఛందస్సులో రాసి పాల్కురికి సోమన తర్వాత సుప్రసిద్ధుడైనాడు. ఇతని కుటుంబం రాచకొండ మంత్రులకు చెందినట్టిది. గౌరన పెద్ద తండ్రి పోతరాజు, గౌరన తండ్రి అయ్యన మంత్రి పదవులను నిర్వహించి నారు. రెండవ సంగభూపాలుని రసార్ణవ సుధాకరం నుండి, విశ్వేశ్వర కవి చమత్కార చంద్రిక నుండి తన 'లక్షణ దీపిక'కు ఉదాహరణలు తీసుకొన్నాడు గౌరన. మహారాజు నుండి శ్మశాన పాలకుని వరకు ఉండే మానవ స్వభావ చిత్రణను, వారి వేషభాషలను వర్ణించడంతోపాటు, నక్షత్రకుడు, కలహకంది, సుబుద్ధి పాత్రలను సృష్టించి సమాజానికి అర్పించింది ఈ గౌరనయే. గౌరన పుత్రుడైన భైరవ కవి శ్రీ రంగ మహాత్మ్యం, కవిగజాంకుశం, రత్న పరీక్ష వంటి కృతులను వెలువరించి తండ్రికి తగిన తనయుడని పించుకున్నాడు.

"సమర తంత్రమున వీరెంతటి కుశలురో సాహిత్య వ్యాసంగమున అంతటి ప్రవీణులు. కవి పండిత పోషకులు, దానధర్మ నిరతులు" అని శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు ఆంధ్రవిజ్ఞాన సర్వస్వంలో రాచకొండ రాజులను ప్రస్తుతించడంలో ప్రత్యక్షర సత్యం ఉంది.



*(2014-రాచకొండను కాపాడుకొందాం పుస్తకం నుంచి)*

**- ప్రొ॥ తంగెడ కిషన్‌రావు,** m : 800820892
e : tkishens1950@gmail.com

## పుస్తక పరిచయం

పుస్తక పరిచయం శీర్షిక ద్వారా వివిధ పుస్తకాలను పాఠకులకు పరిచయం చేసే ప్రయత్నం ఇది. ఈ వేదిక ద్వారా పాఠకులకు తమ పుస్తకాలను పరిచయం చేయాలనుకునే రచయితలు, ప్రచురణ సంస్థలు తమ పుస్తకాలు రెండు కాపీలను దిగువ చిరునామాకు పంపించవచ్చు. వీలు వెంట వాటిని ప్రచురిస్తాం. సమకాలీన సామాజిక అంశాలతో కూడిన కొత్త పుస్తకాలకు ప్రాధాన్యం.

పుస్తకాలు పంపించాల్సిన చిరునామా:

TELANGANA RESOURCE CENTRE


**DECCAN LAND : "CHANDRAM"** 490, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com

# తెలుగు జాతి వైతాళికులు సురవరం ప్రతాపరెడ్డి

## రవీంద్ర భారతిలో 123వ జయంతి సభ

## వెయ్యి చేతులతో పనిచేసిన గొప్ప వ్యక్తి సురవరం : దేశపతి శ్రీనివాస్

చీకటిలో దివ్వ అతడు... ఆకాశమున అరుంధతడు.. అతడాంధ్రుల హృదయాంతరాన దాగిన మహాదాస్యము సురవరం ప్రతాప్‌రెడ్డి.. తెలుగు జాతి వైతాళికులు శ్రీ సురవరం ప్రతాపరెడ్డి 123వ జయంతి సభ రవీంద్ర భారతిలో ఘనంగా జరిగింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో జయంతి సభ జరిగింది. కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కవి, ఓఎస్‌డీ, దేశపతి శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక మండలి అధ్యక్షులు గంటా జలంధర్‌రెడ్డి, తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ పాపిరెడ్డి, ప్రముఖ రచయిత నందిని సిధారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురవరం 123వ జయంతి సందర్భంగా పలువురికి పురస్కారాలు ప్రదానం చేశారు.



ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ సురవరం ప్రతాప్‌రెడ్డి వనపర్తికి ప్రాతినిధ్యం వహించారని, తాను కూడా అదే నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలవడం యాదృచ్ఛికం అన్నారు. నీళ్లు లేని ప్రాంతం నుండి సురవరం ప్రాతినిధ్యం వహించారని, అలంపూర్‌లో నీళ్లు లేకపోవడంతో సురవరం ఎంతో బాధపడ్డారని, కానీ ఈ రోజు సురవరం ఆశయాలను, ఆకాంక్షలను తాను నెరవేర్చనున్నట్లు తెలిపారు. ఆయన న్యాయవాదిగా జీవితం ప్రారంభించి కూడా దాన్ని వదిలేసినట్లు తెలిపారు. మాదిగ దండోరా సంస్థకు సురవరమే పేరును ఖారారు చేయడం అభినందనీయం అన్నారు. సాంఘిక పరివర్తనలో తనదైన ముద్రవేయడం ఆయనకే చెల్లిందన్నారు. సురవరం అనారోగ్యంతో మరణించినట్లు వార్తలు వచ్చాయి. కానీ ఆయన ఆనాటి పరిస్థితులవల్ల తీవ్ర మనోవేదనకు గురై మరణించినట్లు తెలిపారు. వచ్చే జయంతి నాటికి తన మూడు నెలల వేతనాన్ని విరాళంగా ఇచ్చి సురవరం ప్రతాప్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని తన నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రముఖ కవి, ఓఎస్‌డీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ వెయ్యి చేతులతో పనిచేసిన గొప్ప వ్యక్తి సురవరం ప్రతాప్‌రెడ్డి అని కొనియాడారు. దానికి కారణం నాటి తెలంగాణ సమాజంలో నెలకొన్న పరిస్థితులు అన్నారు. ఆ సమాజానికి ఉన్న పరిమితులు, అవసరాలు వాటన్నిటిరీత్యా కాలం తన మీద పెట్టిన కర్తవ్యాన్ని చాలా నిష్ఠతో ఆచరించిన గొప్ప వ్యక్తి సురవరం అన్నారు. ఆధునిక యుగ పరివర్తనకు సంబంధించి పురిటినొప్పులు పడుతున్నపుడు ఆ జాడలను గుర్తించి కొత్త ప్రభాతం కోసం కోడిపుంజై ఎలుగెత్తి ప్రభావగీతం ఆలపించినవాడు సురవరం అన్నారు. ఒక్క రంగం అని కాదు.. కవి, కథకుడు, పండితుడు, చరిత్రకారుడు, రెడ్డి హాస్టల్ వ్యవస్థాపకుడు, వివిధ కుల సంఘాల నిర్వాహణలో పాత్రుడు, పత్రికా సంపాదకుడు.. ఇలా అన్ని కోణాల్లో ఉత్తముడు. ఒక మనిషి జీవిత కాలంలో ఇన్ని పనులు చేయగలుగుతారా.. అనేలా ఆయన కష్టపడటం తెలంగాణ సమాజానికే గర్వకారణం అన్నారు. అనేక కోణాల నుండి ప్రామాణికమైన పనులు చేసేవారు చాలా అరుదు అని చెప్పారు. తెలంగాణ ప్రాంతంలో అక్షరాస్యత లేక సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు వికాసం కోసం బీజాలు వేసిన గొప్ప ఘనుడు సురవరం. తెలంగాణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సురవరం ఎంతో ముందుచూపుతో వ్యవహరించారు. ఆనాటి కాలంలోనే గ్రంథాలయంను ఏర్పాటు చేయడం గర్వకారణం. ఇప్పుడు గ్రంథాలయం పెట్టడం చాలా సులభం అని, కానీ ఆనాడు గ్రంథాలయం పెట్టడం అనేది చాలా సంక్లిష్టంగా ఉండేది. ఆ పరిస్థితుల్లో కూడా గ్రంథాలయ ఉద్యమంలో విశేషంగా కృషి చేసినట్లు తెలిపారు. ఆంధ్ర ప్రాంతంలో బ్రిటీష్‌వాళ్లు రావడం వల్ల సంస్కరణలు వచ్చి ఆధునికమైన భవనాలు వెలసినట్లు తెలిపారు. ఆ పరివర్తనకు 60, 70 సంవత్సరాలకు దూరంగా తెలంగాణ ప్రాంతం వెనుకబడి ఉంది. దానికి అనుగుణంగానే తెలంగాణలో కూడా మార్పు రావాలని సురవరం లాంటి గొప్పవాళ్లు కృషి చేసినట్లు తెలిపారు. తక్కిన ప్రపంచంతో తెలంగాణ అనుసంధానం కావాలి. ఆంధ్రప్రాంతంలో వీరేశలింగం, గురజాడ అప్పారావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ ఇలా ఎంతో మంది చేసిన పనిని సురవరం ప్రతాప్‌రెడ్డి ఒక్కరే తెలంగాణలో చేయడం గర్వకారణం. వనపర్తికి మొట్టమొదటి ఎమ్మెల్యే సురవరం ప్రతాప్‌రెడ్డి కావడం గర్వకారణం. తెలంగాణ పౌరుషానికి ప్రతీక సురవరం. గోల్కొండ సంచిక తెలంగాణ కవుల ఔన్నత్యాన్ని చాటిందని, ఈ పత్రికలో అన్ని బాధ్యతలు తీసుకున్న వ్యక్తి సురవరం అని

కొనియాడారు. ఆ కాలంలో పౌరహక్కుల గురించి మాట్లాడిన మేధావి అని, ఒక కొత్త దారిని సమాజానికి చూపించిన ఘనుడు అన్నారు. సాంఘిక చరిత్రను ఎలా రాయాలనే విషయాన్ని ఆ రోజుల్లోనే ప్రచురించడం శుభపరిణామం అన్నారు. సమాజ వికాసం కోసం సురవరం కృషి చేయడం గర్వకారణం. నిద్రలో సురవరం ప్రతాప్‌రెడ్డి గుర్తుకు వచ్చినా లేచి దండం పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక మండలి అధ్యక్షులు గంటా జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ ఆనాడు ఎమ్మెల్యేగా సురవరం ప్రతాప్‌రెడ్డి గెలిచారని, మంత్రి పదవి వస్తుందని ఎంతోమంది ఆశించినట్లు చెప్పారు. తెలంగాణ ప్రాంత పండుగలు, సంస్కృతిపై విశేషంగా కృషి చేసినట్లు తెలిపారు. పలు విద్యా సంస్థల స్థాపనకు కృషి చేసిన ఘనుడు అని కొనియాడారు. సురవరం పాత్రికేయ రంగానికి మూలస్థంభంగా నిలిచినట్లు చెప్పారు.

తెలంగాణ ప్రజల్లో వచ్చిన చైతన్యానికి ప్రతీక ప్రత్యేక రాష్ట్ర సాధన అని మంద జగన్నాథం అన్నారు. సురవరం లాంటి ఎంతో మంది సాహితీవేత్తలు తెలంగాణలో ఉన్నారని, వారు వెలుగులోకి రాకపోవడం దురదృష్టకరమన్నారు. ఆ రోజుల్లో సహపంక్తి భోజనాలు, కులతత్వంపై పోరాడిన గొప్ప వ్యక్తి అన్నారు. జాతిరత్నం అయిన సురవరం జీవిత చరిత్రను పాఠ్యాంశాలుగా చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ పాపిరెడ్డి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలుగా ఏర్పడిన తర్వాత కూడా ఉమ్మడి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. తెలుగు విశ్వవిద్యాలయాన్ని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంగా ఆనాటి ప్రభుత్వం పేరు పెట్టిందన్నారు. ఇది రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయం కాబట్టి 10వ షెడ్యూల్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం అయిన వెంటనే తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చుకునే అవకాశం ఉందన్నారు. ఆచార్య జయశంకర్ పేరును అగ్రికల్చర్ యూనివర్సిటీకి, కాళోజీ నారాయణ రావు పేరును హెల్త్ యూనివర్సిటీకి పెట్టినట్లు వివరించారు. కాబట్టి తప్పకుండా సురవరం ప్రతాప్‌రెడ్డి పేరునే తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టే అవకాశం ఉందన్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన పొట్టి శ్రీరాములు పేరును ఆ రాష్ట్రంలో పెట్టుకునే అవకాశం ఉందన్నారు.

– జుగాష్‌విలి,
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# ఎందుకు?

అతను ఏం తప్పు చేశాడని బంధించారు
భయంతో వణుకుతున్న నేలకు
చలినెగళ్ల వేడి రాజేసినందుకే కదా!

అతను చేసిన నేరమేంటని ఖైదు చేశారు
సహచరులు నడుస్తున్న బాటకు
కొత్త చూపును పరిచి నిత్య గొంతుకయి
యుద్ధగానం చేశాడు అంతే కదా!

కవిని బోనులో ఎందుకు నిలిపారు
అడవి సిగ నుండి రాలిన
పున్నాగపూల త్యాగ పరిమళాన్ని
అక్షరీకరించినందుకే కదా!

ఆ కంఠం చేసిన ద్రోహం ఏమిటి
చీమలు పెట్టుకున్న దేశీపుట్టలో
బహుళజాతి అనకొండల ఖబ్జా మీద
అగ్గి పిడుగయినందుకే కదా!

అతనంటే ఖాకులకు ఎందుకు కళ్ల మంట
ప్రజల నెత్తురు తాగే పులుల్ని తరిమిన
గొర్రెలకు పోరు పాఠాలు నేర్పినందుకే కదా!



అడవే బతుకయిన
ఆదివాసులపై యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ
గ్రీన్‌హంట్ ఆపాలన్నందుకే కదా!

కలాలకు సంకెళ్ళు ఎందుకు
గోముఖ వ్యాఘ్ర మనువాదుల
ముసుగుల్ని బహిర్గతం చేస్తూ
ఉన్నదేదో ఉన్నట్టుగా మాట్లాడినందుకే కదా!

కలం సిపాయి మీద కుట్రలెందుకు
తన దేశ భవిష్యత్ చిత్రపటం కోసం
అలసిపోకుండా స్వేచ్ఛాగానం
చేస్తున్నాడనే కదా!

సముద్రుడి చిరునవ్వుల అలల తాకిడికి
జైళ్లు బద్దలవక తప్పదు
విప్లవ కవి పాద ధూళికి
కుట్ర కేసులు గాలికి ఎగిరి పోవాల్సిందే

ఎనభైఏళ్ల యువకుడయి
ఉద్వేగ స్వప్నాల ఉరేగింపులోకి
బిగి పిడికిలెత్తి మన కోసం మళ్ళీవస్తాడు
నిన్ను నన్ను మనందర్నీ
రగలే కవిత్వమయి నడిపిస్తాడు

(కవి వరవరరావుపై భీమాకోరేగావ్ కుట్ర కేసుకు నిరసనగా)

– కోడం కుమారస్వామి, m : 9848362809
e : presskks@gmail.com

## విశిష్ట గ్రంథాలయంతో కరచాలనం

# ఆచార్య కూరెళ్ళ విఠలాచార్య... జ్ఞాపకాలతో పలకరింపు



పొద్దున్నే 8 గం॥లకు కవి, రచయిత తెలంగాణ స్వాప్నికుడు జూలూరి గౌరీశంకర్ నుంచి వచ్చిన సెల్‌ఫోన్ "మనం వెల్లంకి ఊరు వెళ్ళాలి, కూరెళ్ళ విఠలాచార్య గారి గ్రంథాలయాన్ని సందర్శించి రావాలి. పన్నెండున్నరకల్లా భోజనం చేసి రెడీగా ఉండు" అని అవతలి నుంచి సహజమైన గంభీర స్వరం. నేను సరే అనే లోగానే మాజీ సి.ఎం. వెంగళరావు గారి ఫోనులాగే వెంటనే ఆయన పెట్టేయడం జరిగింది. అనుకున్నట్లుగానే జూలూరి, ఆయనతో పాటు ఉస్మానియా తెలుగు శాఖ అధ్యాపకులు డా॥ ఎస్. రఘు, కూరెళ్ళ ఫౌండేషన్ వైస్ చైర్మన్ "మాల్ ప్రభుత్వ పాఠశాల" ప్రధానోపాధ్యాయులు చిత్రకారుడు కూరెళ్ళ శ్రీనివాస్‌తో కలిసి కారులో రెండు గంటలకల్లా బయలుదేరాం. రామోజీ ఫిల్మ్ సిటి, చౌటుప్పల్ మీదుగా 'వెల్లంకి' గ్రామానికి మూడు గంటలకల్లా చేరుకున్నాం.

రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామ జనాభా సుమారు ఐదు వేల దాకా ఉంటుంది. ఊరు ఊరంతా చేనేత మగ్గాలే... 90 శాతం జనాభా చేనేత కార్మికులతో వెల్లంకి గ్రామం అంతా పచ్చటి పసుపు చీరలా ఉంటుంది. ఆ గ్రామంలోని ప్రతి వీధిలో పరిచి ఉంచిన రంగురంగుల నూలు దారాలు మాకు స్వాగతం పలుకు తున్నట్లుగా అనిపించింది.

మేము కారు దిగి కూరెళ్ళ గ్రంథాలయంలోకి అడుగు పెడుతున్నప్పుడు సాక్షాత్తు విఠలాచార్య గురువుగారే ఎదురువచ్చి మమ్మల్ని సాదరంగా తోడ్కొని గ్రంథాలయంలోకి తీసుకెళ్ళారు. ఆయన ఇల్లు మొత్తాన్ని గ్రంథాలయంగా చేసిన తీరు మా తొలిచూపులోనే ఆకట్టుకుంది. మా అందరిలో కూడా ఆయనపట్ల గౌరవభావం - ఈ 82 ఏళ్ళ వయసులో కూడా అవిశ్రాంతంగా శ్రమిస్తూ గ్రంథాలయాన్ని అపురూపంగా తీర్చిదిద్దిన దృశ్యం మాకందరికి అద్భుతంగా అనిపించింది. దాదాపు ముప్పై అయిదు బీరువాలు... ఒక్కొక్క బీరువాలో ఉన్న గ్రంథ సముదాయాల గురించి విఠలాచార్య గారే వివరిస్తూ వెళ్ళారు. వాస్తవానికి ఆయనకు 40 ఏళ్ళ క్రితమే గ్లాకోమా వ్యాధితో ఎడమ కన్ను పూర్తిగా పోయింది. కుడికన్ను సైతం ఛాయా మాత్రంగానే కనిపిస్తుంది. ఆ పరిస్థితుల్లో కూడా ఆయన ప్రతి బీరువాలో ఉన్న గ్రంథాల గురించి కంఠోపాఠంగా పరిచయం చేస్తున్న తీరు అబ్బురంగా తోచింది. మొదటి మూడు బీరువాల్లో తెలుగు సాహిత్య గ్రంథాలు అక్షర క్రమంలో అమర్చబడ్డాయి. పరిశోధనా గ్రంథాలు, జీవిత చరిత్రలు, సాయిబాబా సాహిత్యం, ఆధ్యాత్మిక సాహిత్యం (షిరిడీ సాయి బాబా అంటే ఆచార్యుల వారికి బాగా భక్తి.. గురి.. ఆయన నిర్మించిన ఇంటి పేరు కూడా సాయి కుటీరంగానే పిలుస్తారు). చరిత్ర బీరువా... భాగవత రామాయణాలకు ప్రత్యేక బీరువాలు, విశ్వనాథ రామాయణ కల్పవృక్షం నుంచి రంగనాయకమ్మ రామాయణ విషవృక్షం వరకు అందులో వరుసగా పేర్చబడి ఉన్నాయి. వైద్య గ్రంథాలకు ప్రత్యేక బీరువా. అందులో పసిపిల్లల వైద్యం దగ్గర నుంచి పశువైద్య గ్రంథాల వరకు ఉన్నాయి. సాహిత్య ప్రత్యేక సంచికలకు ఒక పొడుగాటి బీరువా. ఈ పుస్తకాలను ప్రధాన వనరుగా తీసుకునే అక్కడ ఒక విద్యార్థి "సంచికా వాఙ్మయం" పైన పిహెచ్.డి. చేస్తున్నారని ఆచార్యుల వారు సెలవిచ్చారు. అలా

35 బీరువాల్లో సుమారు అరవై వేల చిన్న, పెద్ద గ్రంథాలను అమర్చటం ఆచార్యుల వారి నిబద్ధతకు అద్దం పడుతుంది.

"త్వరలో ఈ గ్రంథాలయాన్ని ఇంకా విస్తరించాలని ప్రణాళిక రూపొందించాం. రాబోయే రెండేళ్ళలో ఇదే ప్రదేశంలో అతి పెద్ద భవంతిని నిర్మించాలని నేను, మా శిష్యుల సంకల్పం. ఈ భగీరథ ప్రయత్నానికి అందరి చేయూత కావాలి. త్వరలో నూతన భవన నిర్మాణ ప్రారంభానికి తెలుగు పత్రికా సంపాదకులందరిని ఆహ్వానిస్తున్నాం" అని ఈ సందర్భంగా కూరెళ్ళ వారు గ్రంథాలయ అభివృద్ధి గురించి వివరించారు.

**విశిష్ట విభిన్నత్వంతో విఠలాచార్య గ్రంథాలయం :**

ఆచార్య కూరెళ్ళ విఠలాచార్య... తెలంగాణ చైతన్యానికి జీవభూమిక అయిన గ్రంథాలయోద్యమానికి వెన్నెముకల్లో ఒకరుగా నిలిచిన మహర్షి. ఆయనను చూస్తే ఒక నడిచే గ్రంథాలయంలా కనిపిస్తాడు. నాలుగు దశాబ్దాల అధ్యాపకత్వంలో ఎక్కడ ఏ పాఠశాలలో పని చేసినా ఆ గ్రామంలో సొంత ఖర్చుతో లైబ్రరీని ఏర్పాటు చేసి నిర్వహించడం ఆయన ప్రత్యేకత. ఒకటా, రెండా... ఆరు ఎకరాల సొంత భూమిని పేద ప్రజలకు దానంగా పంచి తాను చిన్న ఇంట్లో నివాసముంటున్నారు. ఆయన అనేక గ్రామాల్లో సొంతంగా లైబ్రరీలను ఏర్పాటు చేసి పదవీ విరమణ అనంతరం తన సొంత ఊరు "వెల్లంకి"లో స్వయాన కూరెళ్ళ గ్రంథాలయాన్ని, దాన్ని నిర్వహించేందుకు "కూరెళ్ళ ఫౌండేషన్"ను ఏర్పాటు చేసి వేల కొలది విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచారు. 1954లోనే వెల్లంకి గ్రామంలో అంటే తన బాల్యంలో శ్రీ శంభులింగేశ్వర గ్రంథాలయాన్ని స్థాపించి తన గుండెల్లో 'ఇక గ్రంథాలయాల ఏర్పాటు ఒక ఉద్యమంగా ప్రతిజ్ఞ తీసుకున్న వారు ఆచార్య కూరెళ్ళ విఠలాచార్య...' ఊరూరా గ్రంథాలయం పేరుతో ఉద్యమం నడుపుతూ పల్లెసీమల్లో గ్రంథాలయాల స్థాపనకు కృషి సల్పిన అవిశ్రాంత పథికుడు ఆచార్య కూరెళ్ళ విఠలాచార్య....



1952లో విద్యార్థిగా తెలంగాణ తెలుగు ఉద్యమంలో పిడికిలి బిగించి ముందుకు సాగిన కూరెళ్ళ విఠలాచార్య 1969లో ఉద్యోగిగా మారి తెలంగాణ మలిదశ పోరాటంలో ఉవ్వెత్తున ఉద్యమించారు. నగరాలలో స్థిరపడి గ్రామాలను మరిచిపోతున్న చాలా మంది విద్యాధికులవలె కాకుండా తమ ఊరు వెల్లంకిలోని సొంత ఇంటిని 'సాయి సాహితీ కుటీరం'గ ఏర్పరచుకొని ఆచార్య కూరెళ్ళ గ్రంథాలయంగా తీర్చిదిద్ది సమాజానికి అంకితం చేసిన మహనీయుడాయన.

దానినే తన ప్రధాన కార్యక్షేత్రంగా చేసుకొని వివిధ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, విద్య, ఆధ్యాత్మిక మొదలగు సంస్థలు స్థాపించి పల్లెపట్టులలో విద్యావ్యాప్తికి సాహిత్య వ్యాప్తికి అహర్నిశలు కృషి సల్పుతున్న త్యాగమూర్తులు ఆచార్య కూరెళ్ళ విఠలాచార్య'.

**విశేష సందర్శకులు:**

వాస్తవానికి ఈ కూరెళ్ళ వారి గ్రంథాలయం వెల్లంకి గ్రామంలోనే ఉన్నా రెండు రాష్ట్రాల నుంచి సందర్శకులు రెగ్యులర్‌గా వస్తూనే ఉంటారు. గత వారమే 'ఆ నలుగురు' చిత్ర దర్శకులు చంద్ర సిద్ధార్థ తన మిత్ర బృందంతో కలిసి ఈ గ్రంథాలయాన్ని చూసి వెళ్ళారని ఆచార్య కూరెళ్ళ శిష్యరత్నం రెబ్బ మల్లికార్జున్ ఈ సందర్భంగా తెలిపారు. 'విఠలాచార్య విఠలేశ్వర శతకం' ఒక పరిశీలన అన్న అంశంపై ఆయన ఎం.ఫిల్ పరిశోధన పూర్తి చేశారు.

2014లో ఫిబ్రవరి 13న అప్పటి ఉమ్మడి నల్గొండ జిల్లా కలెక్టర్ శ్రీ చిరంజీవులు చేతుల మీదుగా ప్రారంభమైన కూరెళ్ళ గ్రంథాలయ నూతన భవనంలో ఎక్కడ చూసినా ప్రాచీన గ్రంథాలు, అపురూప పుస్తకాలే కనిపిస్తాయి. చాలా ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే వంద సంవత్సరాల నాటి పత్రికలు కూడా కొన్ని ఇక్కడ సేకరించబడి ఉన్నాయి. అంటే దాదాపు స్వాతంత్ర్యానికి పూర్వం వెలువడిన అనేక పత్రికలు గోలకొండ దగ్గర్నించి ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ తదితర అనేక పత్రికల సాహిత్య సంచికలు వరకు ఉన్నాయి. లైబ్రరీ ప్రారంభించే నాటికి ఐదు వేల పుస్తకాలు మాత్రమే ఉండేవని, రాష్ట్ర వ్యాప్తంగా 'గ్రంథ భిక్ష' పేరుతో పుస్తకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించడంతో ఈ రోజు అరవై వేల పై చిలుకు పుస్తకాలు సమకూరాయని కూరెళ్ళ వారు అన్నారు.

ఈ గ్రంథాలయాన్ని సందర్శించిన ప్రముఖుల్లో మాజీ మంత్రులు ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి, ఎలిమినేటి మాధవ రెడ్డిలతో పాటు భువనగిరి, రామన్నపేట శాసన సభ్యులుగా పనిచేసిన ప్రతి ఎం.ఎల్.ఎ. ఉన్నారు. స్వర్గీయ మాధవరెడ్డి ఎప్పుడు వెల్లంకి గ్రామానికి వచ్చినా, "గురువు గారున్నారా అని అడిగి" తప్పనిసరిగా లైబ్రరీని సందర్శించి వెళ్ళేవారు. నకిరేకల్ నియోజవర్గ గత శాసనసభ్యులు వేముల వీరేశం కూడా ఈ గ్రంథాలయాన్ని సందర్శించి తన వంతు కృషిగా భవన నిర్మాణానికి సహాయపడతానని మాట ఇచ్చినట్లు ఆచార్య కూరెళ్ళ వెల్లడించారు.

**ఆచార్యుల వారికి అడుగడుగునా కష్టాలే :**

గ్రంథాలయ సందర్శనం తర్వాత పక్కనే తాను నివాసముంటున్న చిన్న ఇంటికి మమ్మల్ని తీసుకెళ్ళారు ఆచార్యుల వారు. వారి శిష్యబృందం తయారు చేసిన కారపు అప్పచ్చులు, టీ సేవనం తరువాత మళ్ళీ వారి బాల్య స్మృతుల గురించి వివరించడం ప్రారంభించారు. '1938 జనవరి నెలలో నీరునెముల గ్రామంలో మా అమ్మమ్మ గారింట్లో నేను పుట్టాను. పుట్టిన నాలుగు నెలలకే మా నాన్న వేంకట రాజయ్య అకాల మరణం చెందడంతో అమ్మ కూరెళ్ళ లక్ష్మమ్మ గారు స్వయాన నన్నెత్తుకొని నా చిట్టి చేతులతోటే నాన్న

గారి చితికి నిప్పంటించిందట. ఆ రోజు నుంచి నన్ను కంటికి రెప్పలా చూసుకొన్న అమ్మ ఈ సుదీర్ఘ సాహితీ ప్రయాణంలో అడుగడుగునా ఆమె జ్ఞాపకాలే. నన్ను పెంచి పెద్ద చేసి, పెళ్ళి చేసి, మళ్ళీ నా పిల్లలకు కూడా ఆమె దగ్గరుండి అన్నీ అయి వారి పెళ్ళిళ్ళ వరకు వెంట ఉంది అంటే నేను ఎంత అదృష్టవంతున్ని" అని గద్గద స్వరంతో ఆ మాతృమూర్తి జ్ఞాపకాలను కూరెళ్ల వారు నెమరువేసుకున్నారు.

తాను చదివిన అనుభవాలతో నేర్చుకున్నది పది మందికి పంచాలన్న ఆశయమే కూరెళ్ల విఠలాచార్యను ఇన్ని దశాబ్దాల పాటు అకుంఠిత దీక్షతో నడిపించింది. మనం ఎంత సాంకేతిక విజ్ఞాన ప్రపంచంలోకి వెళ్ళిపోయినా పుస్తకమే మన జ్ఞానానికి పునాది అని బలంగా విశ్వసించిన వారు కూరెళ్ళ. తన తదనంతరం కూడా ఈ పుస్తక సాంప్రదాయం ఇలాగే కొనసాగాలని దానికి తన శిష్యులతో పాటుగా జూలూరి గౌరీశంకర్, డా॥ ఎస్. రఘు, కూరెళ్ళ శ్రీనివాసుల తోడ్పాటు కూడా కావాలని కళ్లు చెమరుస్తూ ఆయన చెప్పారు. మమ్ముల్ని 'వెల్లంకి' గ్రామానికి తీసుకెళ్ళిన కూరెళ్ళ శ్రీనివాస్ కేసి చూస్తూ, "చూడండీ! ఈ ఫౌండేషన్‌కు నేను అధ్యక్షుణ్ని అయితే మీతోపాటు వచ్చిన ఈ కూరెళ్ళ శ్రీనివాస్ ఉపాధ్యక్షుడు. కేవలం ఇంటి పేరు పోలిక తప్ప ఏ బంధుత్వం లేని మా మధ్య గత దశాబ్దం నుంచి పుస్తకాలే మమతానురాగాల బంధాన్ని పెంచాయి. కూరెళ్ళ శ్రీనివాస్ అద్భుత చిత్రకారుడు. ఆయన వేసిన కాళోజీ, దాశరథి, చిత్రపటాలే ఇవాళ ప్రతి తెలంగాణ ప్రేమికుడి దగ్గర ఉన్నాయి". అని ఆచార్యుల వారు వివరించారు. తన స్వగతాన్ని కొనసాగిస్తూ... నేను రామన్నపేటలో నాలుగో తరగతి నుంచి ఏడవ తరగతి వరకు ఉర్దూ మీడియంలో చదివాను. ఆ రోజుల్లో మా పాఠశాలలో ప్రార్థనా గీతంలో 'నిజాంని స్తుతిస్తూ, ఆయన నిజాం పాలన బావుండాలని విద్యార్థులతో గట్టిగా అనిపించేవారు' హై స్కూల్ చదువుల కోసం భువనగిరి లోని విశ్వకర్మ హాస్టల్‌లో చదివాను. ఆ హాస్టల్‌లో గది, బాత్‌రూం సౌకర్యాలు మాత్రమే ఉండేవి. ప్రతి విద్యార్థికి ఒక వీధి ఇచ్చేవారు. ప్రతి వారం వెళ్ళి ఆ వీధిలో ప్రతి ఇంటి దగ్గర వారు ఇచ్చిన బియ్యం, పప్పు, కూరగాయలు, ఉల్లిగడ్డలు తదితరాలు తెచ్చి హాస్టల్లో ఇస్తే వారు వండి పెట్టేవాళ్ళు. ఆ రోజుల్లో తెలంగాణాలో చదివిన ప్రతి పేద పిల్లవాడు "వారాలు" ఉండి చదువుకొని ఉన్నత ఉద్యోగాలకు ఎదిగిన వారే. ఇక్కడ ఒక ఆసక్తికర విషయాన్ని మీకు చెప్తాను. భువనగిరి హాస్టల్లో ఉన్న రోజుల్లో నాకు పుస్తకాలు కొనేందుకు డబ్బులు లేవు. పుస్తకాలు ఉన్న విద్యార్థుల వద్దకు వెళ్ళి వారిని ప్రాధేయపడితే వారు రాత్రి నిద్రపోయిన తరువాత పుస్తకాలు తీసుకొని రాత్రంతా చదివి తెల్లవారు జామున వారు లేచే సరికి ఆ పుస్తకాలను వారి తలగడ దగ్గర పెట్టేవాన్ని. ఇలా చేయటం వల్ల కొన్ని రోజులకు నా ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది. అయినా కొన్ని నెలల పాటు ఓపికతో చదివి ఒకేసారి పదో తరగతి పాసయ్యాను. పదో తరగతి పరీక్షలు వ్రాసి ఆ హాల్ టికెట్ చూపిస్తే రామన్నపేట తహశీల్ ఆఫీసులో "కాపీయిస్టు'గా తాత్కాలిక ఉద్యోగం ఇచ్చారు. కుటుంబ పోషణ కోసం ఆ ఉద్యోగంలో చేరాను.




### రిక్షావాలాకు 'త్రిపదల' పుస్తకం అంకితం :

1957లో నేను హెచ్ఎస్‌సి పరీక్షలను నిజాం కళాశాల ఎదురుగా ఉన్న ఆలీయా మదరసా పాఠశాలలో వ్రాసాను. చివరి పరీక్ష కాగానే సామాను సర్దుకొని భువనగిరి వెళ్లడానికి రిక్షాపై నాంపల్లి రైల్వే స్టేషన్ చేరుకున్నాను. ఇంతలోనే రైలు రానే వచ్చింది. గబగబా సామానులతో రైలు ఎక్కాను. రైలు కదిలింది. రిక్షా అతను నా దగ్గరికి రాలేకపోయాడు. నేనతని దగ్గరికి వెళ్ళలేక పోయాను. రిక్షా అతనికి నేను ఇవ్వవలసిన కిరాయి ఆనాటి నాణాలతో అర్థ బేడ అనగా దస్సాన ఇవ్వలేక పోయాను. ఇది చిన్నదే అయినా నా వల్ల రిక్షా అతనికి జరిగిన అన్యాయం సంఘటన ప్రతి రోజు గుర్తుకు వచ్చేది. ఇది జరిగి 60 ఏళ్ళు గడిచినా నాకు 80 ఏళ్ళు వచ్చినా నిత్యం అది నా మనసును తొలుస్తూనే ఉంది. నా ఋణభారం, హృదయ భారం తీర్చు కోవడానికి నా "దొందూ.. దొందే!!" అనే కావ్యాన్ని నా నిండు మనస్సుతో రిక్షా అతనికి అంకితం చేస్తున్నాను అని ఈ పుస్తకం ముందు మాటలో రాసానని కూరెళ్ళ వారు అన్నారు. ఈ పుస్తకంలో 108 ఖండికలున్నాయి. చిన్న పిల్లలకు చక్కగా అర్థమయ్యేలా మూడు లైన్ల పంక్తులతో అర్థవంతమైన 'త్రిపదలను' అందంగా మలిచి ఆనాటి బాలసాహిత్యానికి అందించారు కూరెళ్ళ వారు.

### నల్లగొండ యూనివర్శిటీ పేరుపై ఉద్యమం :

తెలంగాణ తొలి దశ పోరాటమైన 1952లో విద్యార్థిగా, తెలంగాణ మలిదశ పోరాటమైన 1969లో ఉద్యోగిగా కూరెళ్ళ విఠలాచార్య తన రచనలతో పాలుపంచుకున్నారు. 2001 నుంచి తెలంగాణ వచ్చే వరకు ప్రతి రోజు కవితగాని, త్రిపద గాని, సాహిత్య కార్యక్రమ నిర్వహణ, ఇతర సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలలో వయసును సైతం లెక్క చేయకుండా ఆయన తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. నల్గొండలో ఏర్పాటైన విశ్వ విద్యాలయానికి 'పోతన' పేరు పెట్టాలని బతుకమ్మ కళా బృందాన్ని స్థాపించి ఊరూరా ఉద్యమం చేసి చైతన్యం రేకెత్తించిన ఘనత కూరెళ్ళ ఆచార్యుల వారిది.

**కూరెళ్ళ ఫౌండేషన్ :**

తెలంగాణ వ్యాప్తంగా వేల కొలది సంఖ్యలో శిష్యులను కలిగి ఉన్న ఆచార్య కూరెళ్ళ విఠలాచార్య తన శిష్య బృందంతో కూరెళ్ళ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు రకాల పుస్తకాలను సేకరించే పనిని ఈ ఫౌండేషన్ ప్రతినిధులు చేపట్టారు. తన తదనంతరం కూడా ఈ గ్రంథాలయం చల్లగా సాగేందుకై ఈ ఫౌండేషన్ సభ్యులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తుంటారు. ప్రతి నెలా ఈ గ్రంథాలయ నిర్వహణకు తనకు వచ్చే 40 వేల రూపాయల పెన్షన్ మొత్తాన్ని అక్కడి ఉద్యోగుల జీతాలకే అందిస్తుండడం కూరెళ్ళ వారి విశాల హృదయానికి మచ్చు తునక. త్వరలో ఒక కోటి రూపాయల వ్యయంతో ఈ గ్రంథాలయాన్ని విస్తరించాలని ఆ ప్రాంగణానికి ఎదురుగా ఉన్న స్థలాన్ని కొని రీసెర్చి స్కాలర్స్ హాస్టల్, ప్రత్యేక లైబ్రరీ నిర్మించాలని కూరెళ్ళ వ్యాఖ్యానించారు.


**తెలంగాణ అభినవ పోతన :**


విఠలేశ్వర శతకం, తెలంగాణ కాగడాలు, కవితా చందనం, మధురకవి కూరెళ్ళ పీఠికలు, కూరెళ్ళ వ్యాసాలు, తెలుగులో గొలుసుకట్టు నవలలు (ఎం.ఫిల్), స్వాతంత్ర్యానంతర తెలుగు నవలలు (పి.హెచ్.డి, నానీ నేత్రాలు, తెలంగాణ ఉద్యమ కవితలు, వంద శీర్షికలు హైదరాబాద్ సంస్థానం, శిల్పాచార్యుల వంటి 30కి పైగా పుస్తకాలను విఠలాచార్య తెలుగు సాహిత్య ప్రపంచానికి అందించారు. ఎంతోమంది కవులను తెలుగు నేలకు అందించిన కూరెళ్ళ వారి సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులు, పురస్కారాలు దక్కాయి. ప్రజాకవి సుద్దాల హనుమంతు పురస్కారం, వాస్తుశిల్పి బియన్ రెడ్డి పురస్కారం, 1979లో ఉత్తమ ప్రధానాచార్య అవార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జీవన సాఫల్య పురస్కారం వంటి ఎన్నో అవార్డులను కూరెళ్ళ అందుకున్నారు. తెలంగాణ వేమన, అభినవ పోతన, నల్గొండ కాళోజీ, సుధీతిలక, సాహిత్య బ్రహ్మ, అక్షర కళా సామ్రాట్టు, కవిభూషణ, సాహిత్య ప్రపూర్ణ వంటి బిరుదులు అనేకం పొందారు.


**ఏవండీ! నేను మీ లలితను...**


కూరెళ్ళ విఠలాచార్య గారు భువనగిరిలో ఉద్యోగ ప్రారంభంలో 'ఒడాయిగూడెం' (ఇప్పుడు ఆ ఊరు సురేంద్రపురిగా మారింది) ఊరిలో ఏకోపాధ్యాయ పాఠశాలలో ఉద్యోగం చేస్తున్నప్పుడు ఆ ఊరిలో అందరు సంచార జాతుల వారు, దళితులే ఉండేవారు. పిల్లలను ఎవరూ బడికి పంపటం లేదు. దానితో కూరెళ్ళ వారు ముందుగా పెద్దలకు, మహిళలకు అక్షరాలు నేర్పించడం ప్రారంభించారు. వారి పేర్లుకూడా మంత్రగాళ్ళ పేర్లలా ఉండడం, మహిళల పేర్లుకూడా మైసమ్మ, ఎల్లమ్మ, ఉప్పలమ్మ వంటి పేర్లు ఉండడంతో వారందరిని ఒప్పించి వారి పేర్లను లలిత, గాయత్రి, సావిత్రి, సక్కుబాయి, పద్మ తదితర పేర్లను కూరెళ్ళ వారే పెట్టారు. ఆ తరువాత ఆయన బదిలీ కావడం దాదాపు 20 ఏళ్ళ తరువాత ఒకసారి బస్సులో వెళ్తున్నప్పుడు ఒక స్త్రీ ఆయనను పలకరించి గురువుగారు "నేను మీ లలితను" నన్ను గుర్తు పట్టారా, మాది ఒడాయి గూడెం అన్నప్పుడు ఎంతో సంతోషం కలిగిందని ఆ ఊరి ప్రజలందరు అక్షరాస్యులయ్యారని వాళ్ళ పిల్లలందరు ఉద్యోగస్తులయ్యారని ఆమె చెప్పినపుడు తన కళ్ళు చెమర్చాయని కూరెళ్ళ వారు గుర్తు చేసుకున్నారు. ఇలాంటి ఎన్నో విశేషమైన జ్ఞాపకాలను మూటగట్టుకుని నగరం బాట పట్టాము.

-కె.రామదాస్
m : 9866088883
e : drkramdas@gmail.com










చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో **బాలచెలిమి** ప్రచురించిన **'గాడిద తెలివి', 'అంతరిక్ష దొంగలు'** (2018 నవంబర్), **'గుల్లేరు బాలుడు', 'టంగ్ యంగ్'** (2018 డిసెంబర్) అనే నాలుగు కథల పుస్తకాలు వెలువడినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నాము. ప్రతులు కావల్సిన వారు ఈ క్రింది చిరునామా నుండి పొందవచ్చును.

విడి ప్రతి వెల: రూ.30/-
'Bhoopathi Sadan' 3-6-716, Street No.12, Himayathnagar, Hyderabad-500029, Telangana. Mob: 9030626288
మరియు
- Nava Telangana
- Manchi Pustakam
- Nava Chetana
- Navodaya Book House

బాల చెలిమి పిల్లల మాసపత్రిక 44 పేజీలు రంగులతో జూలై మాసం నుండి మీ చేతుల్లోకి.



# సాహిత్యమే బాలలకు బంగారు భవిష్యత్

## తెలుగు బాలల కథా సాహిత్యంపై కార్యశాల

సాహిత్యమే బాలలను విశిష్టమైన పౌరులుగా తీర్చిదిద్దుతుంది. బాలలను సమాజ నిర్మాతలుగా మలిచేది సాహిత్యమే. బాల సాహిత్యం లేకపోతే బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దలేమంటే అతిశయోక్తి కాదేమో. తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో వర్ధన సాహితీ సంస్థ నిర్వహణలో తెలుగు బాలల కథా సాహిత్యంపై నిజాంపేటలో కార్యశాల జరిగింది. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, ఎన్‌బీటీ బుక్ ట్రస్ట్ చైర్మన్ పత్తిపాక మోహన్, కథా రచయిత్రి విజయలక్ష్మీ, రచయిత కన్నెగంటి అనుసూయ, చొక్కాపు వెంకట రమణ పాల్గొన్నారు.

**పిల్లల నవ్వులు సూర్యోదయమై వర్ధిల్లుతాయి : అయాచితం శ్రీధర్**

ప్రతి జిల్లా, తాలూకా కేంద్రాల్లో గ్రంథాలయ సంస్థ భవనాలు ఉండటం గర్వకారణమని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఉండే తెలుగు శాఖలు, తెలంగాణ గ్రంథాలయ పరిషత్ అవన్నీ అంతర్గతంగా భావసారూప్యంగా ఉన్న సంస్థలు అని చెప్పారు. పిల్లల నవ్వులన్నీ వచ్చే కాలానికి సూర్యోదయమై వర్ధిల్లుతాయని చెప్పారు. పిల్లల అభిరుచి ప్రపంచ వ్యాప్తంగా ఒకే రకంగా ఉంటుందన్నారు. పిల్లలు కథల్ని ఆలకిస్తారు.. ఆనందిస్తారని తెలిపారు. పిల్లలకు మంచి కథలు చెప్పి, చెప్పించడం ద్వారా వారిని ప్రోత్సహించొచ్చన్నారు. ఆ చెప్పిన కథలు సామాజిక మాధ్యమాల్లో ఉంచడం.. ఇలా చిన్న చిన్న పాఠశాలల్లో ఉన్న పిల్లల చేత కథలు రాయించి వారిని చక్కగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రంథాలయ వ్యవస్థను పట్టించుకోవడం ప్రభుత్వాలు మర్చిపోవడం చాలా బాధాకరం అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రంథాలయ సంస్థకు పునరుజ్జీవనం లభించినట్లు తెలిపారు. ఇప్పుడు కూడా గ్రంథాలయాల్లో పిల్లల విభాగాలు పునరుజ్జీవనం చెందాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు ఎప్పుడు కూడా ప్రజల ఆదరణను చూస్తాయని, వాటిని ప్రజలు కోరుకుంటున్నారని ప్రభుత్వం ఆలోచించాలంటే తల్లిదండ్రులే ఆ బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత సాహిత్య కార్యక్రమాలకు, సంస్థలకు ఉచితంగా భవనాలు సమకూరుస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్విరామంగా జిల్లా కేంద్రాల్లో జరగాలన్నారు. పిల్లల కథలకు సంబంధించి ఏం చేస్తే బాగుంటుందో ఒక నివేదిక తయారు చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సాహిత్య సంస్థలు, సాంస్కృతిక సంస్థలు కీలక భూమిక పోషించాలన్నారు. పిల్లలకు ఆత్మస్థైర్యాన్ని కల్పించడం, ఆత్మహత్యలు చేసుకోకుండా నివారించడం, వాళ్లకు మార్గదర్శకత్వం కల్పించడం కోసం ప్రభుత్వ పరంగా ఏం చేద్దాం అనేదానిపై ఒక నివేదిక తయారు చేయగలిగితే తప్పనిసరిగా విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ ప్రధాన కార్యదర్శితో మాట్లాడే ప్రయత్నం చేస్తామన్నారు. పిల్లల చైతన్యానికి ఏం చేస్తే బాగుంటుందో ఈ కార్యశాల శ్రీకారం చుడితే ఇంకా బాగుంటుందన్నారు.

**శ్రీశ్రీ కవిత్వం వింటూ పెరిగాను : కథా రచయిత్రి విజయలక్ష్మి**

విశిష్ట అతిథిగా హాజరైన కథా రచయిత్రి విజయలక్ష్మి మాట్లాడుతూ ఏపీలో తాను గ్రంథాలయ సంస్థ నామినేటెడ్ మెంబర్‌గా ఉన్నప్పుడు ప్రముఖ రచయితల, పలువురు పెద్దల పుస్తకాలు, కథలను ఎంపిక చేయమనే పెద్ద బాధ్యతను తనపై పెట్టినట్లు తెలిపారు. తనకు చిన్నప్పటి నుంచి పుస్తకాలు చదవడం ఒక వ్యసనంగా ఉండేదన్నారు. శ్రీశ్రీ అభిమానిని.. శ్రీశ్రీ కవిత్వం వింటూ.. వ్యాసాలు రాస్తూ పెరిగినట్లు తెలిపారు. తమ ఇల్లే సాహితీ ఉత్సవాలకు, పుస్తకాల ఆవిష్కరణకు కేంద్రంగా ఉన్నట్లు తెలిపారు. పుస్తక కార్యక్రమాలు తమ ఇంట్లో నిర్వహించినట్లు తెలిపారు. అందరూ కూడా బాల సాహిత్య సృజనకు కృషి చేయడం గర్వకారణం అన్నారు.

**కథలు ఎంత చిన్నగా రాస్తే అంత అందంగా ఉంటాయి: చొక్కాపు వెంకట రమణ**

కథలు ఎంత చిన్నగా రాస్తే అంత అందంగా ఉంటాయని చొక్కాపు వెంకట రమణ పేర్కొన్నారు. ఒకానొక స్కూలు వద్ద ఒక పిల్లవాడు

ఒంటరిగా కూర్చున్నాడు.. ఆ పిల్లవాడు దగ్గరకు వెళ్లి నిన్ను తీసుకెళ్లడానికి మీ అమ్మ వస్తుందా అని అడిగినట్లు తెలిపారు. ఆ పిల్లవాడు అమ్మ లేదుగా అన్నారు. మీ నాన్న వస్తారా అని అడిగాను. మా నాన్న లేరుగా అన్నారు.. మరి ఎవరొస్తారు అని అడగగా మమ్మి, డాడి వస్తారు అని అన్నారు. ఇలా అయ్యింది తెలుగు భాష పరిస్థితి అని ఆవేదన వ్యక్తం చేశారు. "అనగా అనగా ఒక పిల్లి ఉంది. అ పిల్లి పక్క ఊరుకు చదువుకోవడానికి వెళ్లింది. దారిలో కుక్క ఎదురైంది. పిల్లి బావా! పిల్లి బావా! ఎక్కడికి వెళ్తున్నావు అని అడిగింది. అంకుల్ చదువుకోవడానికి వెళ్తున్నాను అని చెప్పింది. ఓస్ ఆమాత్రం దానికి పక్కవూరు వెళ్లాలా..! నా దగ్గర చదువుకోవచ్చు కదా అని చెప్పింది. అవునా.. అయితే నువ్ మ్యావ్ అను అంది. ఆ కుక్క వెంటనే బౌబౌ అంది.. నీకు మ్యావ్ అనడానికే చేతకాదు. నాకేం చదువు చెప్తావు అని వెళ్లిపోయింది. ఇంకొంచెం దూరం వెళ్లగానే కోడి ఎదురైంది. పిల్లి బావా! పిల్లి బావా! ఎక్కడికి వెళ్తున్నావు అంది. అంకుల్ చదువుకోవడానికి వెళ్తున్నాను అంది.. అయితే నా దగ్గర చదువుకోవచ్చు కదా అంది. అయితే నువ్ మ్యావ్ అను అంది. ఆ కోడి కోక్కో రోక్కో అని అంది. నిన్ను మ్యావ్ అన మంటే కోక్కోరోక్కో అంటున్నావు. మ్యావ్ అనడానికే చేతకాదు కానీ నాకు చదువుచెప్తావా అని ఇంకా ముందుకెళ్లింది. కొంచెం దూరం వెళ్లిన తర్వాత ఆవు కనిపించింది. పిల్లి బావా! పిల్లి బావా! ఎక్కడికి వెళ్తున్నావు అని ఆవు అడిగింది. చదువుకోవడానికి వెళ్తున్నాను అంది. ఆ మాత్రం దానికి పక్కూరుకు వెళ్లాలా.. నా దగ్గర చదువుకోవచ్చు కదా అంది. అయితే మ్యావ్ అనమని ఆవుకు పిల్లి చెప్పింది. అది అంబా..! అంబా..! అన్నది. నీకు మ్యావ్ అనడమే చేతకాదు.. నాకు చదువు చెప్తావా అని వెళ్లిపోయింది. ఇంకా ముందుకెళ్లి ముసలి పిల్లి దగ్గర చదువు నేర్చుకుంది". దీన్ని బట్టి మనకు ఏం అర్థమవుతుందంటే.. మాతృ భాషలో చదువు చెప్పితేనే వాళ్లకు అర్థమవుతుందన్నారు. కొత్త ఆలోచనలతో కథలు రాస్తే చాలా కొత్తగా ఉండి వాటికి మంచి పేరు వస్తుందన్నారు. ప్రస్తుత రోజుల్లో బాలసాహిత్యానికి ప్రాచుర్యం పెరిగిందన్నారు.

**కథల పుస్తకాల కోసం ద్వారబంధం పట్టుకొని ఎదురు చూశా: రచయిత కన్నెగంటి అనుసూయ**

చిన్నప్పటి నుంచి పుస్తకాలు చాలా చదివినట్లు రచయిత కన్నెగంటి అనుసూయ తెలిపారు. చిన్నప్పటి నుండి కథల పుస్తకాల కోసం పేపర్ అబ్బాయి ఎప్పుడొస్తారా అని ద్వారబంధం పట్టుకొని ఎదురు చూసేదాన్ని.. ఆ రకంగా పుస్తకాలతో అనుబంధం ఏర్పడినట్లు తెలిపారు. అలా పుస్తకాలవైపు తన జీవిత ప్రస్థానం మొదలైనట్లు వివరించారు. తర్వాత జీవితంలో ప్రతి సంఘటన తనను అలా ముందుకు నెడుతూ వచ్చినట్లు తెలిపారు. చదువు అయిపోయిన వెంటనే నెల్లూరు సీఆర్.రెడ్డి మహిళా కాలేజీలో ఉద్యోగంలో చేరినట్లు తెలిపారు. తర్వాత అక్కడే లైబ్రరీలో ఆరు పుస్తకాలు తన చేతిలో పెట్టి ఉద్యోగం చేయమన్నారని వివరించారు. దీంతో చాలా సంతోషం కలిగిందన్నారు. లైబ్రరీలో ఉంటూనే ఓపెన్ డిగ్రీ పూర్తి చేసినట్లు చెప్పారు. మంచి మంచి పుస్తకాలు చదవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆరు పుస్తకాలు నుంచి 60 పుస్తకాలు చదవడం ఎంతో మరుపురాని అనుభూతి అన్నారు. అనంతరం తాను 400 కథలు రాసినట్లు తెలిపారు. అందులో చాలా బహుమతులు, పురస్కారాలు వచ్చినట్లు తెలిపారు. బాలసాహిత్యం గురించి తాను పెద్దగా ప్రయత్నించలేదని అన్నారు. బాలసాహిత్యంలో కృషి చేస్తున్న వారి సేవలు అమోఘం అన్నారు. ఒక వ్యక్తి యొక్క జీవితాన్ని తీర్చిదిద్దేది బాలసాహిత్యం అన్నారు. ఇప్పటికీ చిన్న పిల్లల కథలు చదివేవారు చాలా ఇంట్రస్టుగా ఉంటారన్నారు. ఇంట్లో భర్త పెట్టిన ఇబ్బందులు లేదా తన అనుభవాలను కథల రూపంలో పిల్లలకు తల్లి వివరిస్తున్నట్లు తెలిపారు. అలా మొట్టమొదటిసారిగా పిల్లలకు బాలసాహిత్యంపై అవగాహన ఏర్పడుతుందన్నారు. అలా బాలసాహిత్య రచయితలుగా ఎదుగుతారని వివరించారు. నూటికి నూరుశాతం బాలసాహిత్యంపై కృషి చేయాలని ఉందని చెప్పారు. సాహిత్య అకాడమీ పుస్తకంలో బాలసాహిత్యంపై రాసిన తన కథ 22 భాషల్లో ప్రచురితమవడం చాలా సంతోషకరం అన్నారు. ఒక బాలల కథ ప్రతి ఆదివారం ఫేస్‌బుక్‌లో షేర్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ పత్రికలో ఆర్టికల్ వచ్చినా అందరూ చదవలేరు కాబట్టి సామాజిక మాధ్యమాల్లో పిల్లలకు చేరువ చేస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు సాహిత్యం పట్ల అభిరుచి కల్పించవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. పిల్లలకు సమాజంపై చక్కని అభిప్రాయం కలిగించాలన్నారు. చరిత్ర, సంస్కృతిపై పిల్లలకు చిన్నప్పటి నుండే మంచి అవగాహన కల్పించి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు పాటుపడాలన్నారు. కథలకు అద్భుతమైన మీడియా ఫేస్‌బుక్ అని, దానిని పిల్లలు, పెద్దలు ఉపయోగించుకోవాలన్నారు. బాలసాహిత్యంపై నాణ్యమైన కథలు రాయాలని ఆకాంక్షించారు.

**ఒక్కరోజులో రచయిత కాలేము: ఎన్‌బీటీ బుక్ ట్రస్ట్ చైర్మన్ పత్తిపాక మోహన్**

ఎంతో పట్టుదల, కృషి ఉంటే మంచి రచయితలుగా ఎదుగుతారని, ఒక్క రోజులో రచయిత కాలేరని నేషనల్ బుక్ ట్రస్ట్ చైర్మన్ పత్తిపాక మోహన్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావానికి ముందు, తర్వాత తెలంగాణ ప్రాంతంలో కార్యశాలలు చాలా అరుదుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఐదు సంవత్సరాల కాలంలో బడి పిల్లలు రాసిన పుస్తకాలు అచ్చు వేసినవి 167 వరకు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతి నెల ఒక కార్యశాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత పిల్లలకు కార్యశాల పెట్టమని అడిగారని, కానీ రచయితలకు కార్యశాల పెట్టడం శుభపరిణామం అన్నారు. కార్యశాల ఎందుకంటే ఒక్క రోజులో రచయిత కాలేమని, మనం మనకు తెలిసిన విషయాలను సాటి రచయితలతో పంచుకోవడానికి, ప్రస్తావించడానికేనన్నారు. మహారాష్ట్రలోని పూనాకు చెందిన ఎనిమిదో తరగతి చదివే లోకం బాను ప్రసాద్ రాసిన అద్భుతమైన కథ ఎంతో మందిని ఆకట్టుకున్నట్లు తెలిపారు. ఆ కథను మహారాష్ట్రలో ఎనిమిదో తరగతిలో పాఠ్యపుస్తకంలో పొందుపరిచినట్లు తెలిపారు. పిల్లలకు సంబంధించిన కథలను ఎక్కువగా ప్రోత్సహించి వారిని అద్భుతమైన రచయితలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం నేటి సమాజం, తల్లిదండ్రుల, ఉపాధ్యాయులపై ఉందన్నారు.

– నీరజ,
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# సరికొత్త కవిత్వానికి చిరునామా 'మెద'

నల్లగొండ జిల్లాకు చెందిన సుప్రసిద్ధ కవి మునాసు వెంకట్ రచించిన కవితా సంపుటి 'మెద'. ఇందులో 50 కవితలతోపాటు 'నీలి' అను దీర్ఘ కవిత కూడా ఉన్నది. తన కవిత్వం ద్వారా ప్రకృతిని చిత్రించడంలో దిట్ట వెంకట్. గతంలో వీరు రచించిన ఎన, వర్జి వెంకట్‌ను ప్రాకృతిక కవిగా నిలబెట్టాయి. తెలంగాణ నుడికారానికి పట్టం కట్టడంలో సిద్ధహస్తులు. భాషలో, అభివ్యక్తిలో స్థానీయతకు కట్టుబడి ఉండడం మూలంగానే కవికి ప్రకృతి సులభంగా అవగతమైంది. ఈ కవితా సంపుటిలోని ప్రతి కవిత దీనికి నిలువెత్తు దర్పణంగా నిలుస్తుంది. అద్భుతమైన భావచిత్రణ, ఆలంకారికత, వస్తువును కవిత్వీకరించే నైపుణ్యం వంటి అంశాలు వెంకట్‌ని మంచి కవిగా నిలబెట్టాయి. 'ఎక్కడి పత్తి ఏం పత్తి / మెత్తగా దిగే గుండెల్లో కమ్మ గూడాల కత్తి / రైతాలికి నేసింది తెల్లచీరె' అంటూ 'ముందుగాల్లనే చెబుతున్నాం' అను కవితలో పత్తి రైతుల దుస్థితిని కళ్ళకు కట్టినట్లుగా చిత్రీకరించడం జరిగింది.




ఫ్లోరోసిస్ విషభూతం వల్ల ఎందరి జీవితాలు నాశనమైపోతున్నాయో 'అవిటిపొద్దు' కవితలో ఇలా చెప్పారు. 'కాలం వంకరపోయిందో / కాల్లొంకర పోయినయో / బతుకు దూరం కన్నీళ్ళ అడుగులతో కొలిసె... బొక్కలు కులబడ్డ తోలు మూట / సచ్చినట్టో బతికినట్టో / మనిషిలా సాగదీస్తే బాగుండు (పుట సం.19). ఫ్లోరైడ్ ప్రాంత ప్రజలు గొంతులో విషం దాచుకున్న శివుళ్ళుగా అభివ్యక్తీకరించడం సమన్యయపాటిదో అర్థమౌతుంది. చెట్ల ప్రాధాన్యతను తెలియజేసి క్రమంగా చెట్లను నరికేయడం వల్ల పర్యావరణానికి ఎంతటి తీవ్ర విఘాతం కలుగుతుందో 'చెట్లకిందికి' కవితలో చెప్పారు. అందుబాటులో ఉన్న క్షణాలన్నీ / మొక్కలై చెట్లైపోతే బాగుండు / చెట్ల సాటు లేకుండ కాలం సిగ్గుకు చస్తుంది (పు.సం.25). చెట్లు లేకపోవడం వల్ల కాలమే సిగ్గుతో చస్తుంది అనడంలో మనిషి చెట్లకు ఎంతహాని తలపెడుతున్నాడో పరోక్షంగా తెలియజేశారు. చలి అంతటా వ్యాపిస్తుందని 'ఇగం' కవితలో చెప్పడం వాస్తవికతకు అద్దం పట్టేవిధంగా ఉంది. ఇగం మంత్రగత్తై బాయిలకు దూకుతుంది / చెర్ల ఈదుతుంది చెట్ల పాకుతుంది / పెయ్యిని పెనేసుకుంటుంది.... రాత్రి అయ్యిందంటే ఛాతి విరుచుకొని గస్తీ తిరుగుతుంది. (పు.సం.30); చివరికి గడియారంలో ముల్లుకూడా చలికి వణకుతుండడం వల్లనే తొందరగా తెల్లారడం లేదన్న విషయాన్ని అభివ్యక్తీకరించడంలో చలికాలం రాత్రి సమయం ఎక్కువగా ఉంటుందన్నది అర్థమయిపోతుంది.

గోరెంక కవితలో సూర్యోదయాన్ని అభివ్యక్తీరించిన విధానం బాగుంది– కండ్లతో తపస్సు తాగిన యోగిని / కాలం మీద ధ్యాన నడక / చీకటి పారబోసిన జగాన / పొద్దురేకుల ముద్దు మొకంది. (పు.సం.33); 'వానొచ్చిందల్లో' కవితలో పాకుతున్న పసరు తీగగా ఆవులమాసమును అభివర్ణించడం బాగుంది. రైతే వెన్నెముక అన్న రాజ్యంలో రైతుకు గోరిగట్టే దుస్థితి దాపురించింది. చేసినప్పులు తీర్చలేక ఎందరో రైతులు పిట్టల్లా రాలిపోతుంటే కవి హృదయం ద్రవించి 'కాలం కాలం చేసింది' కవిత రూపుదిద్దుకుంది. భూమిని చీల్చి గుండెలు నాటితే / శవాలు మొలకెత్తె / వడ్డీకి రైతు గడ్డికి ఎద్దు ఒడిసె / నెనరేది నెమరేది / పత్తి అంతా తలాపున ఎలిగిన ఒత్తి / పసుపు పసుపు కొమ్ములు తెంచింది / తెల్లని పత్తి పచ్చని పసుపు పగపట్టినట్లయింది (పు.సం.40); తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎందరో విద్యార్థుల బలిదానాల్ని కండ్లకు కట్టినట్లుగా 'దేవండ్లు' కవితలో ఇలా చెప్పారు. కమ్మకమ్మకు రగతమారబోసిన / తెలంగాణ వొయ్యి / గుండె అమ్మోరు బండై / పేగులారం ఏసుకుంది (పు.సం.48).

నిశితమైన పరిశీలనా దృక్పథంతోపాటు అద్భుతమైన కవిత్వీకరణ, ఆలంకారిక ప్రయోగం వీరి కవితల్లో అడుగడుగునా కనబడుతాయి. అమోఘమైన భావచిత్రీకరణకు పరాకాష్టగా 'పొన్నపువ్వు' కవితలో ఇలా చెప్పారు– తుమ్మకాయ కాటిక మధ్య / రెండు ఎన్నెల సెరువులు / తలుపు సాటుకు / పాయలు కట్టుకొని పారుతున్నయి (పు.సం. 57); తెలంగాణ ఉద్యమ సందర్భంగా రాసిన మరో కవిత 'చివరంచున' ఒకవైపు తెలంగాణ ఉద్యమం ఉధృతంగా కొనసాగుతుంటే మరొకవైపు సమైక్యాంధ్ర ఉద్యమం లేవదీసి తెలంగాణ ఉద్యమాన్ని నిర్వీర్యం చేసే కుట్రను ఈ కవితలో బహిరంగ పరిచారు. పిల్లాజల్లా ఉసురు తగిలి / పీట్కం లేకుండా పోతరు / కన్నీళ్ళకు ఆనకట్ట కట్టి / పదవులు పండిద్దామనుకుంటే / కడకు పాడెకట్టెలే మొలుస్తాయి / నువ్వు మైకు గొట్టంలో సమైక్యంగా ఊదుతుంటే / గుండెల్లో రాజుకున్న కొలిమి (పు.సం.67); సమైక్యాంధ్ర ఉద్యమం తెలంగాణ ప్రజల్లో మరింత ఉద్యమ స్ఫూర్తిని ఎలా రగిలించిందో తెలియజేశారు. శెక్కుడు సంచిని సొమ్ముల పొదగా అద్భుతంగా కవిత్వీకరించి ఇలా చెప్పారు– గుండెనే శెక్కుడు సంచిలా / శెక్కుకున్నట్లు ఉండేది / తలంచి తలాపున సంచి / లోన సీకటిని మింగిన జీడిగింజ తాయత్తు కట్టినట్లు (పు.సం.72); జీడిగింజ సీకటిని మింగడం అనే ప్రయోగం వినూత్నమైనది. విషయాన్ని కవిత్వీకరించి చెప్పడంలో అద్భుతమైన ప్రయోగాలు

చేయడం వెంకట్ సొత్తు.

వెంకట్ కవితల్ని చదువుతుంటే దృశ్యశ్రవణ సంబంధమై అద్భుతమైన చిత్రకారుడు గీసిన చిత్రంలా ప్రతి కవితలోని విషయం మన కండ్లముందు ఆవిష్కృతమౌతుంది. 'పరవశం' కవితలో విషయాన్ని ఇలా దృశ్యమానం గావించారు– భూగోళాన్ని మోస్తున్నట్లు మెల్లమెల్లగా / ఒడ్డుమీదినుండి తాంబేలు / నీళ్ళలోకి జారుకుంది / చాపలకు రెక్కలొచ్చినయా / కాదు పక్షులు ఎగరేసుకెల్లుతున్నయ్ (పు.సం. 81); పక్షులు చేపల్ని ఎగరేసుకుపోతున్న క్రమంలో చేపలకే రెక్కలొచ్చినట్లుగా దృశ్యమానము గావించారు. అదేవిధంగా 'ఇంటిని మోస్తున్న ఆడ యేసు'గా అమ్మను అభివర్ణించిన విధానం బాగుంది. తెగిన తల్లుల పేగుల తీగలతో తెలంగాణ గొంతుక మోగిందని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. గుండెలు మండుతుంటే / కన్నీళ్ళ ఎసరు కాగుతుంటే / గుండెలు ఉడికిపోయిన తలలు బోనం కుండలయ్యే / తెలంగాణ తల్లులకు పాదాభివందనాలు (పు.సం. 92); తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి తల్లుల తలలు బోనం కుండలుగా అభివ్యక్తీకరించడం జరిగింది. అదేవిధంగా పేగు తీగలాగితే అమ్మ తోడ మొలిచిన మొలకగా 'మేనచందమామ' కవితలో చెప్పారు. నీళ్ళల్ల వెన్నెల్ల జారిపడ్డది / భూమి చివరిసారిగా కౌగిలించుకుంది / తలపైకెత్తి చూస్తే తాటికమ్మల నెమలి / గొలపారుతుంటే లోన పురి ఇప్పింది / లొట్టిమీద నురుగు వెన్నెల కిరీటం వంటి కవితాత్మక ప్రయోగాలు ఈ కవితా సంపుటిలో కోకొల్లలు. 'నీలి' దీర్ఘకవితలో నెరిసిన కిరణాలతో / ముసలి పొద్దు మూలుగుతుంది అని సాయంకాల సమయాన్ని అభివ్యక్తీకరించిన విధానం బాగుంది.

ఇలా అచ్చమైన తెలంగాణ నుడికారంతో అద్భుతమైన శిల్పవైవిధ్యాన్ని కలిగిన సారవంతమైన కవితా సంపుటి 'మెద'ను సాహితీ లోకానికి అందించిన మునాసు వెంకట్ సరికొత్త కవిత్వానికి చిరునామాగా మారి సాహితీలోకం ఎదపై చెరగని ముద్రవేశారని చెప్పవచ్చు.

–డా॥ కృష్ణ కౌండిన్య తండు
m : 9704731346
e : drkrishnakoundinya@gmail.com

## త్వరలో జర్నల్ ఆఫ్ తెలంగాణ స్టడీస్

TELANGANA RESOURCE CENTRE

# TRC
# Journal of Telangana Studies

తెలంగాణ రిసోర్స్ సెంటర్ (TRC) ఆధ్వర్యంలో వస్తున్న 'టీఆర్సీ జర్నల్ ఆఫ్ తెలంగాణ స్టడీస్' త్రైమాసిక పుస్తకం త్వరలో రానుంది. ఈ పుస్తకానికి ఓయూ మాజీ ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ ఎడిటర్‌గా, తెలంగాణ రిసోర్స్ సెంటర్ చైర్మన్ మణికొండ వేదకుమార్ పబ్లిషర్‌గా ఉన్నారు. ఈ జర్నల్ తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ప్రచురితమవుతుంది. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సాహిత్యంపై ప్రముఖంగా వచ్చిన వ్యాసాలను ఈ జర్నల్‌లో ప్రచురిస్తారు. టీఆర్సీ జర్నల్ ఆఫ్ తెలంగాణ స్టడీస్ (TRC Journal of Telangana Studies)లో వివిధ రాష్ట్రాల నుండి ఎమినెంట్ స్కాలర్స్ రాసిన పరిశోధన పత్రాలను ప్రచురిస్తారు. మేధావులైన ఎడిటోరియల్ బోర్డు పర్యవేక్షణలో ఈ త్రైమాసిక పత్రిక అక్షర రూపంగా రూపుదిద్దుకుంటుంది. తెలంగాణ రాష్ట్ర చరిత్ర, ఆర్కియాలజీ, ఆర్ట్స్ అండ్ లిటరేచర్, హెరిటేజ్ మొదలైన సామాజిక అంశాలపై విస్తృతంగా, పరిశోధనాత్మకంగా వ్యాసాలను క్రోడీకరించి వాటిని ప్రపంచంలోని పలు యూనివర్సిటీలకు అందించేందుకు కృతనిశ్చయంతో ఉంది.

**Books for reviews may be sent to the postal address:**
**"BHOOPATHI SADAN"** 3-6-716, Street :12, Himayathnagar, Hyderabad-500029, Telangana.
Mob: +91 8686 66 4949 email: trcjts@gmail.com

**Subscription:**

- Individual (India) : Rs. 250/issue;
- Institution (India) : Rs. 400/issue;
- Foreign Individual : US$ 65/issue;
- Foreign Institution : US$ 70/issue;

- Annual Subscription Rs. 800/-
- Annual Subscription Rs. 1,500/-
- Annual Subscription US$ 260
- Annual Subscription US$ 280

**ACCOUNT DETAILS:**
*A/C Name :* Telangana Resource Centre
*Bank Name :* Telangana Grameena Bank
*A/c. No. :* 79009067970
*IFSC No. :* SBIN0RRDCGB;
*Branch Code :* 229



# రవీంద్రభారతిలో “గమనం” సాహిత్య సంపుటి ఆవిష్కరణ

నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం.. ఆత్మీయతకు మరో రూపం. అంతరిస్తున్న తన జాతి అస్థిత్వాన్ని నిలబెట్టేందుకు సాహిత్యంలో విభిన్న ప్రక్రియలకు శ్రీకారం చుట్టింది. ప్రొ. సూర్యాధనుంజయ్. సొంతూరు నల్గొండ జిల్లా మిర్యాలగూడెం సమీపంలోని భల్లూ నాయక్ తండా. సూర్యాధనంజయ్ బంజారా నానీలు, బంజారా సాహిత్యంపై రాసిన “ తాంగ్డి” వ్యాసాల సంకలనం తీసుకొచ్చారు. వీటితో పాటు ఎంఫిల్ థీసిస్ “రామాయణ ఆరణ్యకాండలోని ఆశ్రమాలు – శ్రీరాముని దర్శనాలు”, పీహెచ్‌డీ థీసిస్, నల్గొండ జిల్లా “బంజారా సాహిత్యం – జీవన చిత్రణ” గ్రంథాలను కూడా ఆవిష్కరించారు. జానపద, బంజార వివాహా సంప్రదాయాలు, వివిధ సందర్భాలలో రాసిన పలు వ్యాసాలను పుస్తకం రూపంలో నేటి తరానికి అందిస్తున్నారు.

మే 14 వ తేదీన రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఉజ్వల్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో డాక్టర్ సూర్యాధనుంజయ్ రచించిన సాహిత్య వ్యాస సంపుటి “గమనం” పుస్తకావిష్కరణ సభ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించి రచయిత్రిని అభినందించారు. ఈ పుస్తకాన్ని ఉస్మానియా వర్సిటీ తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య మసన చెన్నప్పకు అంకితమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ని ఘనంగా సత్కరించి తొలి ప్రతిని అందజేశారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో పాఠ్య ప్రణాళికా సంఘం అధ్యక్షులు వెల్దండ నిత్యానందరావు, మహిళా కళాశాల (కోఠి) ప్రిన్సిపాల్ ఎ.రోజారాణి పాల్గొని అభినందనలు తెలియజేశారు. కవి, విమర్శకులు డాక్టర్ ఎస్.రఘు పుస్తకాన్ని పరిచయం చేస్తూ అందులోని వ్యాసాలను లోతుగా విశ్లేషించారు. ఈ సందర్భంగా వ్యాసకర్త ఆచార్య సూర్యాధనంజయ్‌ను ఘనంగా సత్కరించారు.

**నందిని సిధారెడ్డి ( తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు ) :**

ఒక మాములు కుటుంబం మారుమూల తండా నుంచి వచ్చి ఇవాళ అత్యంత ఉన్నతమైనటువంటి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో తలమానికంగా ఉన్న తెలుగు శాఖకు అధ్యక్షురాలుగా ఉండటం అనేది అందరూ సంతోషించే విషయం. ఒక సామాన్య దశ నుంచి ఇక్కడిదాకా నడిచివచ్చినటువంటి ప్రయాణం ఏదైతే ఉందో అదికూడా గమనమేనన్నారు. ఆదిమానవుడి నుంచి ఆధునిక మానవుడిగా చేరడానికి పురోగమనమే కారణం అని అన్నారు. గమనమనేది రెండు రకాలని ఒకటి పురోగమనమైతే మరొకటి తిరోగమనం అంటూ మనల్ని ముందుకు నడిపించే పురోగమనమే గమనానికి సూచి అన్నారు. వ్యాససంపుటిలో 16 వ్యాసాలు ఉన్నాయని, రచయిత్రి జాషువా కన్నీటికథతో ఆరంభించి చివరగా వాక్కుకు వయసులేదుతో ముగించటం విశేషమన్నారు. ఈ వ్యాస సంపుటిని ప్రతి ఒక్కరూ చదవాలని ముఖ్యంగా నేటి తరం చదవాలని సూచించారు. సాహిత్యాభిమానులకు, విద్యార్థులకు ‘గమనం’ మార్గదర్శకమని తెలిపారు. వ్యాసకర్త ప్రతి వ్యాసంలోనూ సోదాహరణ చర్చ చేశారని వివరించారు.

**సూర్యాధనంజయ్ ( వ్యాసకర్త ) :**

తను ఈ స్థాయిలో ఉన్నాను అంటే పెళ్లి కాకముందు అమ్మ ప్రోత్సహం.. పెళ్లయిన తర్వాత ధనంజయ్ ప్రోత్సహమే కారణమని తెలిపారు. చదువు మీద శ్రద్ధతో అటు ఇంటి పనితోపాటు ఇటు చదువుకుంటు ఈ స్థాయికి రావడం నా జీవితంలో మర్చిపోలేని విశేషం. ఇప్పటికి తండా పరిస్థితులు అలాగే ఉన్నాయి. చిన్న చిన్న పిల్లలు తాగుడుకు బానిసలవుతున్నారు. విలువైన వారి జీవితాలు నాశన మవుతున్నాయి. వీళ్లను ఈ పరిస్థితి నుంచి ఎలాగైనా బయటపడేయాలని మాకు బలమైన కోరిక ఏర్పడింది. వీరిని ఆధ్యాత్మికత వైపు నడిపించాలని అనుకున్నాను.. అప్పటి నుంచి తండా వాసుల కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాను కాబట్టి చాలా వరకు మార్పులు తీసుకొచ్చాం. సాహిత్యంలో వ్యక్తిగతంగా నేను తక్కువగానే కృషి చేశాను. బంజారాలపైన ఎక్కువగా పరిశోధన చేశాను.. అందుకేనేమో నన్ను మొదటి జంజారా రచయిత్రి అంటారు. ఇది నాకు సంతోషమేనని తెలిపారు.

**ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి ( సాహితీవేత్త ) :**


తెలుగు భాషా పరిశోధనా తత్పరులకు ఈ సంపుటి ఉపయుక్తమని అన్నారు. అనేకమంది తెలుగుభాష మీద కృషిచేస్తూ తమ వంతు సహాకారంతో ముందుకు రాగలుగుతున్నారు. ఇలాంటి వారిలో సూర్యాధనంజయ్ ఒకరు. స్వయంకృషితో, పట్టుదలతో ఎంతో సాధించి ఉస్మానియా యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా చేయడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ సందర్భంగా గమనం పుస్తక సంపుటిలోని కొన్ని అంశాలను చర్చించారు.


ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, కుటుంబ సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.


– దక్కన్‌న్యూస్, m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

రకరకాల కారణాలతో తెలంగాణ ప్రముఖుల చరిత్రలు అంతగా వెలుగులోకి రాకుండా పోయాయి. ఆయా ప్రముఖులపై ప్రజలకు ఒక అవగాహన కల్పించేలా వివిధ వ్యాసాల సంకలనంతో మనిషి పేరిట తెలంగాణ రిసోర్స్ సెంటర్ కొన్ని పుస్తకాలను ప్రచురించింది.


















చరిత్ర, సాహిత్యం, వారసత్వం, పర్యాటకం, కళలు, సంస్కృతి, సామాజిక అంశాలు, తెలంగాణ ఉద్యమం.. ఇలా ఎన్నో అంశాలపై తెలంగాణ రిసోర్స్ సెంటర్ కొన్ని పుస్తకాలను ప్రచురించింది. ప్రచురించిన ప్రతి పుస్తకం కూడా ఆ రంగంలో లేదా విభాగంలో ఒక ఆణిముత్యంలా నిలిచింది.






































# "తొవ్వముచ్చట్లు" నాలుగవ భాగం ఆవిష్కరణ

ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు పరిచయం అక్కరలేని కవి, జానపద పరిశోధకులు. దాదాపు అర్థ శతాబ్దంగా సాహితీ క్షేత్రంలో అనేక ప్రక్రియల ద్వారా అక్షరాలు అలుకుతూనే కాలు నిలువనీయకుండా క్షేత్ర పర్యటనలకు మొగ్గు చూసే అరుదైన వ్యక్తి. మసకబారుతున్న కళారూపాలను, రాలిపోతున్న సాహితీ రత్నాలను దూరభారాలు లెక్కచేయకుండా వెదికి పట్టుకుని వెలిగించే వీధి దీపంతో ఆయన కృషిని పోల్చవచ్చు. ఆయన 'తొవ్వ ముచ్చట్లు" శీర్షిక ఎన్నో విలక్షణ విషయాల సందుగ. తిరిగి తిరిగి వచ్చిన తిరుమలరావు జబ్బ సంచిలోంచి పాఠకుల చేతిలో పెట్టే కారప్పూస అది.

వారం వారం ఓ కొత్త అంశంపై వ్యాసాన్ని, అదీ సమయానికి అందేలా చూడడం నిజంగా కత్తిమీద సామే. అన్ని పక్కనపెట్టి ఈ రచయిత "తొవ్వముచ్చట్లు" పెట్టక తప్పదు. అయినా ఎక్కడా విసుగూ, విరామం లేకుండా ఆదివారం రాగానే క్రితం రోజుల్లో తాను చేసిన ప్రయాణమో, కలసిన మనుషుల గురించో పాఠకులతో పంచుకున్నాక ఆయన వీకెండ్ అర్థవంతమవుతుంది. తొవ్వ ముచ్చట్లు లోని అంశాల్లో ఎంత విభిన్నత ఉందో అంతే జనఘోష ఉంది. సముద్ర గర్భంలో దాగిన బడబాలనాన్ని, అకాశంలో దాగిన భాస్కరులను తన గొంతుతో, తన ఆర్తితో, తనదైన ఆశావహ ముక్తాయింపుతో తెరపైకి తేవడంపై ప్రత్యేక శ్రద్ధ చూపినట్లు అనిపిస్తుంది.

'తొవ్వ ముచ్చట్లు' మొదటి భాగం 2011లో వచ్చింది. 2012,13 సంవత్సరాలలో రాసిన ముచ్చట్లులో రెండవ భాగం వచ్చింది. ఆ తర్వాత 2018 లో మూడవ భాగం కూడా వచ్చింది. ఇప్పుడు 2019 మే నెల 19 వ తేదీన నాలుగవ భాగం కూడా వచ్చింది. వ్యక్తిత్వం రొటీన్‌కు భిన్నమైనట్లే తిరుమలరావు రచనలు కూడా ఓ కొత్త చూపునందిస్తాయి. అరవైనాలుగు అంశాలపై ఈ పుస్తకంలో ఉన్న వ్యాసాల్లో సాహితీ, సాంస్కృతిక పురావైభవ అన్వేషణనే అధికంగా కనిపిస్తుంది. ఏ అంశంపై గురించి రాసినా అంతవరకు వెలుగులోకి రాని విషయాలు అందులో తప్పకుండా ఉంటాయి. తాను కూడబెట్టుకున్న గ్రంథసారాన్ని, సంచార పాదముద్రల్ని, పిడికిట్లో వారానికింత పెడుతున్న రచయిత "తొవ్వముచ్చట్లు" ఒడవని ముచ్చట్లుగా సాగాలి.

తొవ్వ ముచ్చట్లు నాలుగో భాగాన్ని అనతి కాలంలోనే తీసుకొని రావడం సంతోషకరమైన విషయం. మునుపటి మూడు సంపుటులకంటే ఈ సంపుటి ప్రత్యేకమైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తొలి పన్నెండు మాసాల్లో చెప్పిన ముచ్చట్లివి.. సుదీర్ఘ కాలపు తొలి మలి ఉద్యమాల తర్వాత సాధించుకున్న సొంత పాలనలో తమ కలలు సాకార మవుతాయనీ, కడగండ్లు తొలగిపోతాయనీ వలస పీడనలో కోల్పోయిన హక్కులు పునరుద్ధరణ అయి నిజమైన సంక్షేమ రాజ్యం వస్తుందనీ రాజ్యహింసకు ఏ స్థాయిలోనూ తావుండదనీ, ప్రజల ఆశతో యెదురు చూసిన కాలం అది. భౌగోళిక తెలంగాణ సామాజిక తెలంగాణగానో ప్రజా తెలంగాణగానో రూపొందుతుందని మేధావులూ ఉద్యమంలో సమస్త శక్తుల్నీ పణంగా పెట్టి పోరాడిన విద్యార్థులు, విద్యావంతులు, ప్రజాసంఘాలు బలంగా నమ్మిన కాలం. కాలిక స్పృహతో ప్రజల పక్షంగా నిలబడి పాలకుల దురాగతాల్ని ఖండించే తొవ్వ ముచ్చట్ల రచయిత తమ సొంత పాలన గురించి ఎటువంటి వైఖరి తీసుకుంటారా అని చాలామందిమి ఆసక్తిగానే ఎదురుచూశాం. ఆశించిన విధంగానే జయధీర్ తిరుమలరావు ప్రజా దృక్పథంలో మార్పేం రాలేదు. సహజంగానే జరిగిన జీవరసాయన చర్య పౌరసమాజంలో ఒక బాధ్యతాయుతమైన బుద్ధిజీవిగా, ప్రజా పక్షం వహించే ప్రగతిశీల పరిశోధకుడిగా, రచయితగా కొత్త ప్రభుత్వానికి ఆయన సాదరంగా సుహృద్భావంతో నిర్మాణాత్మకమైన దిశానిర్దేశం చేయడానికి ప్రయత్నించారు. రెండు రాష్ట్రాల ప్రజల మధ్య ప్రేమానురాగాలు సాహిత్య బాంధవ్యాలు కొనసాగాలని ఆశించారు. పాలకపక్షం ప్రతిపక్షం ఆలోచనల్లో ఆచరణలో ఎక్కడ తప్పున్నా ఎత్తిచూపడానికి ఎన్నడూ సందేహించలేదు. ప్రజావ్యతిరేక విధానాల పట్ల అసహనాన్ని ధర్మాగ్రహాన్నీ దాచుకోలేదు.

తరాల చరిత్రని గుండె సందుకల్లో భద్రపరచుకున్న సజీవ ఆర్కైవ్స్ కేశవపట్నం వైష్ణవ మఠం గురువుల సంచార సంప్రదాయం ఆగిపోయినందుకు, జానపద చారిత్రిక వీరుల కథా గేయాల్ని తంత్రులపై పలికిన కిన్నెర వాద్యం మూగపోతున్నందుకు, ప్రజా కళారూపంగా దోపిడీదారుల గుండెల్లో డైనమేట్లు పేల్చిన బుర్రకథ కనుమరుగు అవుతున్నందుకు, గుంజాల గోండి, కోయతూర్

లిపివ్యాప్తికి కొందరు ఆదివాసీలే అడ్డుపడుతున్నందుకు ఆవేదనతో వెలిబుచ్చిన ఆలోచనలు ఈ రచనల్లో మనల్ని ప్రశ్నిస్తాయి. సహజంగానే ఈ సారి తొవ్వ అడవి బిడ్డల గుండె లోతుల్లోకే పరచుకుంది. ఆదివాసీ కళలు సంగీత వాద్యాలు, నృత్యాలు, భాషా విజ్ఞానం పరాయికరణకి గురౌతున్న క్రమంలో వాటిని కాపాడుకోవాల్సిన అవసరాన్ని పదేపదే గుర్తుచేస్తుంది.

"తొవ్వ ముచ్చట్లు" నాలుగవ భాగాన్ని 'ఛాయ', 'ఎరుక', 'తెలంగాణ రచయితల వేదిక' సంస్థల ఆధ్వర్యంలో హైదరాబాద్ స్టడీ సర్కిల్ వేదికగా తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర ఎస్ చౌహాన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రచయిత ఏకే ప్రభాకర్, ఉస్మానియా వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్. రామచంద్రం, పాలమూరు విశ్వవిద్యాలయం ఆచార్యులు గూడూరు మనోజ, అమ్మఒడి సంపాదకుడు సామల రమేశ్‌బాబు, తెలిదేవర భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**జస్టిస్ ఎస్.చౌహాన్ (తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి):**

భారతీయ నాగరికత ఆదివాసీ, గిరిజన తండాల నుంచే మొదలైందని అన్నారు. ఆదివాసీ, గిరిజన ప్రాంతాలకు ప్రభుత్వ పథకాలు, రాజ్యాంగ ఫలాలు సంపూర్ణంగా అందాలని ఆకాంక్షించారు. భారతీయ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ నిర్మాణం తదితర అంశాలపై యువతరానికి అవగాహన అవసరమని చెప్పారు. అప్పుడే మన దేశం మరింత ముందుకు వెళుతుందని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ లో కొన్నాళ్ల క్రితం నక్సలైట్లు ఒక కలెక్టర్‌ను అపహరించారని, అందుకు కారణం ఆ ప్రాంతంలో పాఠశాల, ప్రాథమిక వైద్యశాల వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలనేదే వాళ్ల ప్రధాన డిమాండ్ అని చెప్పారు. రాజ్యాంగం కల్పించిన కనీస హక్కులను పొందేందుకు కూడా అంతలా పోరాడాల్సిన పరిస్థితి నెలకొని ఉందని వ్యాఖ్యానించారు. జానపద కళలు, ఆదివాసీల సంస్కృతి, జీవన విధానంపై తిరుమలరావుకు ఉన్న ప్రేమ, అంకితభావం, నిబద్ధతకు ప్రతిరూపమే తొవ్వముచ్చట్లు పుస్తకమని కొనియాడారు. వైవిధ్యమైన జీవితం సాహిత్యంలోకి తర్జుమా ఆయన అనుభూతిని తొవ్వముచ్చట్లు కలిగించిందన్నారు. విలువైన సమాచారం కలిగిన ఈ పుస్తకాన్ని హిందీ, ఇంగ్లీషు భాషల్లోనూ అందుబాటులోకి తేవాలని సూచించారు.

**జయధీర్ తిరుమలరావు ( రచయిత ) :**

శరీరం ఇక్కడ ఉంది కానీ, ఆలోచనలు మాత్రం తొవ్వలోకి పోతున్నాయి. ఇంతమంది మనుషులతో ఆత్మీయబంధాలు మలిచిన నగరంలో.. ఆ నగరం నుంచి దూరంగా పోయినప్పుడు అందరిని మరిపించేటటువంటి ఆత్మీయతల్ని చూశా. ఆత్మీయతనే కాదు వాళ్లు తమ సమాజాన్ని నడుపుకోవడానికి ఎన్ని ఇబ్బందులు వచ్చినా, పక్కవారిని బతికించేందుకు పడే ఆరాటం. ఇది ఊహించడానికి కూడా ఏ పుస్తకంలోనూ ఎక్కడ కూడా చెప్పలేదు. ఇంత గొప్ప మానవీయమైన సంస్కారం ఏ కార్యక్రమంలో కూడా కనిపించదు. ఎందుకు వాళ్లకి ఆ స్థానం మనం కల్పించలేకపోయాం. అందరిలాగానే పత్రికలు, గ్రంథాలు, రచనలు, తదితరాలను పట్టుకో లేక పోయాయి. అసలు అది రికార్డు కాలేదు చరిత్రలో అది విచిత్రం. ఇక్కడ ఉంటే పోరాడదామన్న పోరాటం తెలియదు.. ఇక్కడ ఉంటే కులమంటూ కూడా తెలియదు. ఇక్కడ ఉంటే వర్గం కూడా తెలియదు. కానీ మనం చర్చిస్తుంటాం. చర్చ చేయాల్సింది కానీ నీవు ఎక్కడ నుంచి చర్చిస్తున్నావు అనేది ముఖ్యం. నీవు ఎవరి గురించి రాస్తునావో వాళ్ల దగ్గర నుంచి ఆలోచించగలుగుతున్నావా.? వినగలుగుతున్నావా? చూడగలుగుతున్నావా..? అనేది చాలా ముఖ్యమైన విషయం. కాబట్టి ఈ తొవ్వ ఒక్కొక్క జ్ఞానాన్ని అందించిన ఎన్నో తొవ్వలు. వాళ్లు మాట్లాడినప్పుడు, వాళ్ల జీవితాలు, శరీర కదలికలు ఒక పాఠం చెపుతూ ఉంటాయి. ఇన్ని అనుభవాలు వంటివి మనకు ఇచ్చేది పుస్తకాలు కాదు. రచనలు కాదు. మనం ప్రధానంగా చదవాల్సింది మనుషులను. పుస్తకాలు చదవాలి. కానీ ఇందులో ఎంపిక చేసుకోవాల్సిన అవసరం ఉంది. కానీ ఏ మనిషిని కూడా ఎంపిక చేసుకోకుండానే ఒక గొప్ప గ్రంథంలాగా మనకి ఎన్నో పాఠాలు చెబుతారు. ఒక ముసలావిడి నుంచి చిన్న పిల్లల వరకు ఈ తొవ్వలకు కూడా ఉప దారులు ఉన్నాయి. రహదారులు ఉన్నాయి. కాలిబాటలు ఉన్నాయి. ఆ దారిలోనుంచి నడిపించి చూడండి మనుషులు కడిగిన ముత్యాలుగా కనిపిస్తారు. కానీ ఇప్పుడు చాలా వేగం పెరిగిపోయింది. ఈ వేగానికి అభివృద్ధి అనే పదం వచ్చి చేరింది. అసలు ఈ వేగంలో ఏది అభివృద్ధి. ఏది అభివృద్ధి కాదు వినడానికి కూడా, చెప్పడానికి కూడా కొంతమంది మాత్రమే ఉండగలగడం చాలా బాధకరం. ఎన్నో అంశాలపై ఒక కొత్త సమీక్ష, ఒక పుస్తకం రావాలి. ఒక ఆలోచన రావడానికి ఇది వేదిక కావడం సంతోషంగా ఉంది. ఇప్పుడు ఉన్న యువతరం గురించి ఆలోచించాల్సిన అవసరం చాలా ఉంది. ఆదివాసులకు ఏమి చేద్దాం అనే ఆలోచన జస్టిస్ చౌహాన్‌గారికి రావడం సంతోషకరమైన విషయం.

**ఆచార్య ఎస్. రామచంద్రం (ఉస్మానియా వర్సిటీ ఉపాధ్యక్షుడు) :**

తిరుమలరావు నాకు కొద్దికాలం క్రితం నుంచి పరిచయం. ఓ సభలో ఆయన కలవటం జరిగింది. ఎవరు నడవని దారుల్లో తిరుమలరావు నడుస్తున్నాడని నాకు అనిపిస్తుంది. చాలా తక్కువ మంది ఆ దారిలో నడుస్తారు. ఆయన చేసిన కొన్ని ప్రోగ్రామ్స్‌లో నేను కూడా పాల్గొన్నాను. ఇప్పటికి కూడా యూనివర్శిటీలో దాని గురించి మాట్లాడుకుంటారు. ఆయన అనుభవాలను, ఆలోచనలను చాలా చక్కగా ఈ తొవ్వముచ్చట్లులో తెలపటం చాలా సంతోషకరమైన విషయం. ఆయన రాసిన ఈ తొవ్వముచ్చట్లలో తెలంగాణ చరిత్ర, సాహిత్యం, సంస్కృతి, తెలంగాణ భాష, యాస, ఇతర అంశాలతోనే ముడిపడి ఉంటాయని అందరికి తెలిసిన విషయమే.

–ఆర్. పురుషోత్తం నాయుడు
m : 9573041226
e : janata.rpnaidu@gmail.com

# శిక్ష

ఊరిలోకి వచ్చేవాళ్లకి బురుజు స్వాగతస్తంభంలా నిలబడి ఆహ్వానిస్తుంటది. బురుజును ఆనుకొని జాండ చౌరస్తాలో జన సందడి. వచ్చిపోయేటోల్లకు చెత్తిరి పట్టినట్లు పేద్ద వేపచెట్టు. వేప చెట్టు నీడలో ఆటో స్టాండ్. ఊరి ప్రజలు ప్రతి పనికి దగ్గరలోని సిద్ధిపేటకు రాకపోకలు సాగుతుంటాయి.

నెత్తిమీద నింగిలోంచి నిప్పులు కురిపిస్తున్న సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఎండ పొయిమీది ఎసులల ఎసరు ఎల్లినట్లు ఇబ్బంది పెడుతుంది. ఎండలో వచ్చిన వాళ్లు వగరుకొడుతున్న గేదెలు నీళ్లమడుగుకు పరిగెత్తినట్లు వేపచెట్టు చల్లటి నీడ కిందకి వచ్చి నిలబడుతరు.



బెల్లం కొట్టిన రాయిలా ఆటోలు మంది నిండేదాక కదులవు. ఒక్కోసారి తలకు మించిన భారంతో అతి కష్టమ్మీది ఆటోలు నడుస్తుంటయి. సీటు దొరుకకపోతే ముండ్లమీద కూసున్న ట్లయితదని సీటుకోసం పంచాదులు పెట్టుకున్న సందర్భాలూ కలవు. చెట్లకొమ్మలకు వేలాడుతున్న గబ్బిలాలవలే కొందరు ఆటోకు వేలాడుతుంటరు.

అప్పటికే వెనుక సీట్లో నవాబోలే ఫోజుపెట్టి డబ్బఫోన్‌ల పాటలు వినుకుంట కూసున్నడు చంద్రయ్య. నిజానికి చంద్రయ్య వెనుక సీటులో కూర్చోడు. కాకపోతే ఎవరు లేరని కూర్చున్నడు.

నడిమింటి బుచ్చవ్వ తన కొడుకు పెల్లి పెట్టుకుంది. రోజూ ఏదో పెల్లిపని మీద సిద్ధిపేటకు పోతుంది. వస్తుంది. ఆ రోజు బట్టలకు దగ్గరోల్లని తీసుకొని గుంపుగా బయలుదేరి వెళ్లుతుండ్రు. ఆటోకాడికి పోయేవరకు ఆటోల చంద్రయ్య వున్నడు. చంద్రయ్యను చూడగానే "పొయి పొయి తొల్దొల్త మాదిగోడు ఎదురాయే" అని చంద్రయ్యకు వినిరాకుంట గుంపుతోటి గుసగుస పెట్టింది.

వీళ్ల అలికిడి విన్న చంద్రయ్య డ్రైవర్ పక్కన సీటుమీద లెఫ్ట్‌సైడ్ కూసున్నడు. బుచ్చవ్వ యారాలు "మాలోడు ఎదురైతే పమాదం గని మాదిగోడు మంచోడు పా" అని ఓదార్పు మాటలతో మెల్లగా జవాబిస్తుంది.

'నువ్వే అన్నవా' అన్నట్లు బుచ్చవ్వ దిక్కు చంద్రయ్య సూసిండు.

ఆ మాటలు వినంగనే చంద్రయ్య 'కుల శిక్షకు ఓదార్పు ఎక్కడిది?' అని మతిల గత అవమానాల్ని నెమరేసుకున్నడు. ఆ మాట ఎవరన్నరో అర్థం చేసుకున్నడు. 'అయ్యో పాపం!' అన్నట్లు ఒగ మొకం విచారం వ్యక్తం చేసింది.

లోపల మనసు కుంపటిలా రగులుతున్నా బయటికి మంచులా కురుస్తున్నాడు. "బుచ్చక్కా! అంటె అంటివితియి. నువ్వన్నదాంట్ల తప్పేమున్నది? నేను మాదిగోన్ని కాదా?" అన్నడు.

గుంపులోని మల్లక్క "ఔ, ఔ గంతేగని. కులం పేరు తప్పు చెప్పుకుంటే ఏమొత్తది? ఉన్నదున్నట్లు చెప్పిండు తమ్ముడు" అని చంద్రయ్యను ఉద్దేశించి అన్నది.

"అక్కా! దేవుడే తంతెలు తొక్కనియ్యక పాయే. ఇగ మనుషులు సమానంగా జూస్తరా? దేవుడు, మనుషులు మాదిగోల్ల నీడ వారనియ్యకపోయిరి. అప్పుడంటే బక్కాట్ని తింటిమి. ఇప్పుడు బందువెట్టిమి. ఇప్పటికి తినే తురుకోల్ల ఇంట్లకు రమ్మంటరు. మమ్ముల దూరం గొడుతరు. అప్పుడంటే తానం జెయ్యకపోతిమి. ఇపుడు శుభ్రంగా తానం జేసినా మమ్ముల దూరముంచవడ్తిరి. కుక్క కొంరెల్లి దేవుడాయే. కోతి హనుమంతు డాయే. పంది విశ్ను మూర్తి అని కొలుస్తూ పశు పచ్చుల్ని దగ్గరికి తీసినా మనుషుల్ని రోతలాగా సూత్తురి. మీ రాత పెన్నుతో రాత్తే మా రాత రోకలితో రాయెుచ్చునా?" అని ప్రశ్నలు వెదజల్లుతున్నడు.

"అక్క కూడా లేంది ఏంమనలే? ఉన్నదే అన్నది. పెండ్లి బట్టలకు పోవడ్తిమి. మా అక్కకు ఎల్లవ్వతల్లి, మల్లన్నపొడ వున్నది నీకెరుకలేదా? కొంరెల్లికాడ ప్రతి ఏడు అగ్గిగుండాలు తొక్కుతదాయే. దేవుడూగుతదని పట్టింపులు ఎక్కువ. ముక్కుమీద ఈగ వాలితే ముక్కుకోసుకునే రకం." అని బుచ్చక్కకు బూదక్క సపోర్టుగా మాట్లాడుతంది.

"ఔనులే అక్కా! నేనేం తప్పు పట్టుకుంటలే తియ్యి. నాకు దెల్వదా బుచ్చక్క గురించి ఊరంత ఎర్కే" అని చంద్రయ్య అన్నడు.

పమీలకు చంద్రయ్య గురించి పూర్తిగదెల్సు. 'వీడు కీలుకు వాతవెట్టే కటిక వకీలు. వీడన్నది సాగిచ్చుకుంటడు. పొయి పొయి బుచ్చక్క వీనితోటి జవుడానికి పోయే. ఏమైతదో ఏమో? వీని మాట బెల్లమోలె. చేతలు బెల్లంల కత్తోలే. ఎటు దిక్కు దిరిగినా ఓ దిక్కుంటడు.'అని పమీల మతిలో అనుకుంటుంది.

"మంది నిండింన్రు. పోదాం పాంన్రి. కులం ఎక్కడిదిపా" అంటూ కొంరయ్య ఆటోల కూసుండి స్టాట్ చేసిండు. గుర్రుమంటూ ఆటో ముందటికి కదిలింది. చంద్రయ్య ఆలోచనలు సుడిగాలిలా తిరుగుతున్నయి.

పెండ్లి తర్వాత పోషమ్మకు బోనాలు తీయడం సంప్రదాయం. చంద్రయ్యతో పాటు మరో ముగ్గురు పోషమ్మకాడికి తీసుక పోవడానికి డప్పులేసుకొని వచ్చింన్రు. బోనాలు పూదిస్తుంన్రు. ఆలస్యమవుతుందని

అట్ల కూసుండుమన్నరు. దప్పు కొట్టేవాళ్లు మంచినీళ్లడిగితే మామూలు నీళ్లు యిచ్చింద్రు. ప్లాస్టిక్ గ్లాస్‌లో నీళ్లు దారెత్తి తాగుతుంటే నోట్లోకి పోతలేవు.

"ఫిల్టర్ నీళ్లు తేలేదా అక్కా"అని మర్యాదగానే దప్పు బూమయ్య అడిగిండు.

"ఆ.. పెండ్లి పని పాతరపెట్టి మీకోసం ఫిల్టర్ నీళ్లు దెచ్చి పోత్తం. మాకు పనా? పాటా? ఏం నీల్గుడురో మాదిగి నీల్గుడు" అని బుచ్చక్క తోక తొక్కిన తాచుపాములా లేసింది.

సరిగ్గా అప్పుడే దప్పు సోదరులకు కోరస్ కలిపినట్లు పెండ్లి పందిట్ల గోడకు ఒరిగిచ్చిన దప్పులు ఎవరో తాకితే దప్పులు గుండెల్ని బాదుకుంటూ డమడమ కొట్టుకుంటూ బూమ్మీద పడ్డయి. సగం తాగిన నీళ్లను వెంటనే పుకిలించి దూరం జరిగి కాండ్రికించి ఉమ్మేసిండు చంద్రయ్య.

నిశ్శబ్దం అలుముకున్నది. బూమయ్యకే కాదు చంద్రయ్యకు మరో ఇద్దరికీ తలదీసినట్లు అయ్యింది.

చంద్రయ్య దప్పు బూమయ్యతో "సూసినావే గాలి ఏదేడ ఉంటదో కులం కూడ ఆడాడ ఉంటదే." అని చెప్పిండు.

''ఐదేల్లు ఒక్కతీరుంగ ఉన్నాయిరా బిడ్డా! మన బతుకే ఇంత. మనంతల మనముండాలే. ఎవల్నేం అనేది లేదు. భగవంతుడు పెట్టిందాయే?" అని బూమయ్య అన్నడు.

× × ×

దప్పులు కొడుతున్నప్పుడు బుచ్చక్క కొత్త పెళ్లి కూతురు బోనాలు ఎత్తుకున్నరు. బుచ్చక్క అచ్చు పోసిన దేవతోలెనే ఉంది. కొత్త కోడలు ఎల్లవ్వ తల్లి బిడ్డోలే ఉంది. ఆటంకం ఏం గావొద్దని కొబ్బరి కాయ కొట్టి బోనాలు ఎత్తుకున్నరు. తొవ్వొంటి సాగుతున్నరు. జాండ కాడికి రాంగనే ఏమి ఆసపడ్డదో ఏమో అర్థం కాలేదు. బుచ్చక్కకు దేవత పెయి నిండుకుంది.

శిట శిట దప్పు కొట్టేవరకు పెయంత జడ్డ ఇచ్చినట్లు అయ్యింది బుచ్చక్కకు. జల్లిక పప్పడం జల్లిక పప్పడం అంటూ కొడుతుంటే బుచ్చక్కకు తల్లి నిజానం పూనింది. ఈడిసి కీకే పెట్టింది. పెయి నిండుకుంది. ఆ... ఒ... అనుకుంట గుడ్లు ఉరిమి చూడవట్టే. నెత్తి మీద బోనం ఉండంగనే దప్పులోల్లు జెజ్జెనం జెజ్జెనం జెం అని ఏ తీరు దెబ్బ కొడితే ఆ తీరు ఎగురుతుంది. ఆ తీరుగ దుంకుతుంది.

చందురుగాడు "నువ్వు పోషవ్వ తల్లివైతే నా అంత ఎగురాలే. నువ్వు అగ్గొసంటి మల్లన్నవైతే ఈ ఎండల సిమెంటు రోడ్డు మీద అగ్గి గుండాలు తొక్కినట్లు దుంకాలే." అని ఆమిల్లు కరుస్తుండు.

బుచ్చక్క శివసత్తి గుడ్లు ఎల్లవెడ్తూ నేనేం తక్కువనారా? అన్నట్లు చూస్తుంది. నలుబైదు డిగ్రీల ఎండల ఒంటికాలు మీద ఆమె ఒంటికాలు మీద దుంకుతుంద్రు. బుచ్చక్కకు శెమటలు వరుదలై పారుతున్నయి. దూపా, దూపా అంటంది. సాక వోద్దామని తెచ్చిన లొట్టినిఎత్తి దించకుండ ఒక్క దమ్ముల తాగింది. తాకతి వచ్చింది. ఎప్పటోల్నే ఎగురుడు సురువు చేసింది.

'ఒసినీ వీనింట్ల పీనుగెల్ల నేను అప్పుడే అనుకున్న. ఈ చెందురుగాడు అన్నంత పని చేస్తడు. ఇల్లు పీకి పందిరి ఏస్తడు అని ఆనాడే అన్న. నా మాట ఎవలు కేర్ చెయ్యకపోయిరి.' పమీల అనుకొన్నది.

"బిడ్డా! ఇగ చాలు ఎగురనియ్యకుండ్రి. ఎగిరిన కాడ్కి సాలు పొండ్రి" అని బుచ్చక్క పెద్దకొడుక్కు చెప్పింది. సెవున పేను పారలేదు. ఇనలేదు. పమీల బాధను అర్థం చేసుకుంటలేరెవ్వరు.

చూపరులకు బుచ్చక్క చంద్రయ్య వాదం పాము ముంగీస కొట్లాటోలే కనవడ్తుంది.



''నువు మనుషుల అందరినీ సమానంగా చూసే దేవునివైతే ఎగురాలే. దుంకాలే. దేవునివా? దయ్యానివా? ఎగిరితే దేవునివి. ఎగురకపోతే దయ్యానివి.'' అని చంద్రయ్య రెచ్చగొడుతుండు.

బుచ్చక్క బల్మీటికి ఎగురుతుంది. కాల్లకు పొక్కులు పొడుస్తున్నయి. బుచ్చక్కకు కాళ్లు పీక్కపోతన్నయి. కండ్లు మూసుకపోతన్నయి. నాలుక పిడుచ కడుతుంది. బలహీనమవుతుంది. ఒక్క కాలుకు ఒక్కో ఇసుక బస్త కట్టినట్లు బరువైతుంది. ఇంత బతుకు బతికి ఇంటెనుక సచ్చినట్లు గావట్టే అని మనసులో అనుకుంటూ ఎగురుతనే ఉంది.


"ఏం ఒర్రుతున్నవ్రా? దప్పు కొట్టురా" అంటూ ఒక పెద్దమొఖం గద్దించింది.

బుచ్చక్కను గమనిస్తున్న బూదవ్వ దగ్గరికిపోయి నిలవడ్డది. బోనం తీసుకొమ్మని సైగ చేసింది. బోనం తీసుకుంది. దేవుడూగుడు శాంతమైంది. సేతి సైర జైసి రమ్మనంగనే వచ్చింది. బూదవ్వ మీద పడి "ఇగ నేను ఎగురనే. నడువనే బూది. జర బండిమీద ఎక్కిచ్చుక పొమ్మను. బోనం ఎత్తుకొమ్మను" అని చెప్పి బోనమెత్తింది. టూ వీలర్ బండి ఎక్కుతుంది

దప్పులు ఏగుతనే ఉన్నయి. బుచ్చక్కకు బూదక్కకు వినవడేటట్లు దప్పు కొట్టేది ఆపి "అక్కా! దేవునికి అందరు సమానమే. నువ్వొకటి. నేనొకటి కాదు. నేను దప్పు కొడుతనే దేవుడు వస్తది. నేను కొట్టక పోతే దేవుడే రాడు." చంద్రయ్య అన్నడు.

దప్పు బూమయ్య చంద్రయ్యతోటి పొట్టోని నెత్తి పొడుగోడు కొడితే, పొడుగోని నెత్తి పోషవ్వ తల్లి కొడుతది" అనుకుంటూ పోషమ్మకాడికి బోనాలు సాగుతున్నయి.

–డా॥ సిద్దెంకి యాదగిరి
m : 9441244773
e : sygiri773@gmail.com




# బాలసాహిత్యం - నా అనుభవాలు - సూచనలు

కాలానుగుణంగా మారుతున్న పిల్లల ఆలోచనా విధానంలో వస్తున్న మార్పులను గమనిస్తూ బాలలకు సంబంధించిన బాలసాహిత్యం రావాల్సిన అవసరం ఉంది. పిల్లల్లో మానసిక పరిణతిని పెంపొందిస్తూ ప్రజాస్వామిక భావాలను, వైజ్ఞానిక దృష్టిని కల్గించే రచనలు, కథలు రావాలి. చిన్నారులకు సృజనాత్మక సాహిత్యం తెలియాలంటే గ్రామీణ స్థాయి నుంచి బాల సాహిత్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు బాల సాహిత్యం గురించి, గురు శిష్యుల అనుబంధం గురించి తెలియాలి. అలాగే తెలంగాణ చరిత్ర కూడా ఇప్పటి పిల్లలకు తెలియాలి. అయితే ఇలాంటివి జరగాలంటే ఏమి చేయాలి..? ఏ విధంగా పిల్లలకు తెలియ చేయాలి..? గ్రామీణస్థాయి పిల్లలకు ఏవిధంగా తెలపాలి...? బాలసాహిత్యం అంటే ఎలా ఉండాలి...? బాల సాహిత్యంపై వర్క్‌షాపులు ఎలా నిర్వహించాలి..? తదితర అంశాలతో "బాలసాహిత్యం - నా అనుభవాలు - సూచనలు " అనే శీర్షికతో బాలచెలిమి పిల్లల వికాస పత్రిక, చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి నెల రెండవ శనివారం ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో " బాలచెలిమి ముచ్చట్లు" నిర్వహిస్తున్నారు. మే రెండవ శనివారం14వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓయు, మాజీ చరిత్ర శాఖాధిపతి ప్రొ॥ అడపా సత్యనారాయణ హాజరయ్యారు. బాలచెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రచయిత డాక్టర్ కె.బి.గోపాలం, రచయిత్రి మాడభూషి లలితాదేవి, జుగాష్‌విలి, డా॥ ఎస్.రఘు, ఉపాధ్యాయులు కె.ప్రభాకర్, కస్తూరి, వెంకటమ్మ, పి.నీరజ, వి.రేఖ, వేనేపల్లి పాండురంగారావు, బక్క బాబురావు, ఖైజర్, మోహన్‌లాల్, కో-ఆర్డినేటర్ కె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన "టంగ్ యంగ్" పుస్తకావిష్కరణ జరిగింది. ముందుగా విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించిన "సురభి" హిందీ షార్ట్ ఫిల్మ్‌ను ప్రదర్శించారు.

**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ : ఎం. వేదకుమార్ :**

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ పిల్లల చదువు, వారి సృజనాత్మకత గురించి పనిచేస్తోంది. 1986-87 ప్రాంతంలో పిల్లల పుస్తకాలపై రెండేళ్లపాటు చర్చలు జరిపాం. ఇతర దేశాల్లో పిల్లల పుస్తకాలు.. వాటి భాష ఎలా వస్తున్నాయో పరిశీలించాం. మన దేశంలోనూ అనేక భాషల్లో పిల్లల పుస్తకాలపై కూడా రీసెర్చ్ చేయడం జరిగింది. తెలుగులో ఎలాంటి పత్రికలు వస్తున్నాయి... ఎలాంటి రచయితలున్నారు.. వారి రచనలు ఎలా ఉన్నాయి... అనే అంశాలతో పాటు బెంగాలీ, హిందీ తదితర భాషల రచనలపై పరిశోధనలు చేశాం.. పిల్లలకు రచనలు ఎలా ఉండాలి..? పిల్లలకు అసలు ఏం చెప్పాలి..? ఏది చెప్పకూడదు.. అలా అనేక అంశాలపై వర్క్‌షాపులు నిర్వహించి... ఒక అవగాహనకు వచ్చాక.. అందుబాటులో ఉన్న మంచి రచయితలతో చర్చలు జరిపాం. 1990 అక్టోబర్‌లో 'బాల చెలిమి' పత్రికను తీసుకొచ్చాం.. 1991లో అనివార్య కారణాల వల్ల తేలేకపోయాం... ఆ తర్వాత కొన్ని సంవత్సరాలపాటు 16 పేజీలు, 8 పేజీలు, 4 పేజీలు కూడా నిర్వహించాం. వెబ్‌సైట్‌లు మొదలయ్యాక.. బాలచెలిమి వెబ్ సైట్ ప్రారంభించాం... రచనలన్నీ వెబ్‌సైట్‌లో ఇప్పటికీ చూడవచ్చు.. 2017లో ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. అందులో ఒక సెక్షన్ బాల సాహిత్యానికి కూడా కేటాయించడం జరిగింది. బాలసాహిత్య మిత్రులందరం కూడా కమిటీకి ప్రాతినిధ్యం వహించడంతో ఆ సెక్షన్‌లో బాలసాహిత్యం ఎలా ఉండాలి.. తెలుగులో ఎలాంటి రచనలు వస్తున్నాయి.. దేశంలో ఇతర భాషా రచనలు ఎలా వస్తున్నాయి.. ప్రపంచంలో మనం ఏ స్థానంలో ఉన్నాం.. స్కూలులో చదువులకు, బాలసాహిత్యానికి సంబంధం ఏమిటి... సినిమా, టెలివిజన్, రేడియో వీటి అన్నింటికి కూడా మాధ్యమంగా బాలసాహిత్యం తోడ్పడుతుందనే భావనతో చర్చలు జరపడం జరిగింది.



ఎం. వేదకుమార్

ప్రపంచ తెలుగు మహాసభలు బాలచెలిమిని మళ్లీ తేవడానికి ఉత్సాహాన్ని ఇచ్చాయి.. ముఖ్యంగా ఇంగ్లీష్‌లో తెస్తే ఎన్నడూ ఫెయిల్


కాం... పదివేల కాపీలైనా మాలాంటి చిన్న సంస్థ ద్వారా వాటిని మార్కెట్ చేయవచ్చు.. కానీ తెలుగులో అది కష్టమవుతుంది.. ఎంతో పెద్ద నెట్‌వర్క్ ఉంటే తప్ప తెలుగు పత్రికను సర్క్యులేట్ చేయలేం... అయితే ఇంగ్లీష్‌లో ఇప్పటికే చాలా విరివిగా బాల రచనలు వస్తున్నాయి.. అందుకే తెలుగును ఇష్టపడేవారిగా... మరియు గ్రామీణ పిల్లలకు కూడా అందివ్వాలన్నది ఉద్దేశం.. వారికి మంచి రచనలు ఇవ్వగలిగితే... కొత్త ప్రపంచాన్ని వాళ్లు చూడగలుగు తారు... అలా మంచి బాలసాహిత్యం అందించాలన్న లక్ష్యంతోనే బాల సాహిత్యంలో పనిచేసే వారిని, రచయితలను ఆహ్వానించి గత 13 నెలలుగా చర్చలు నిర్వహిస్తున్నాం. ఆ క్రమంలోనే పిల్లలకు రాసేవాళ్లనే కాకుండా, రచనలు చేసే నిష్ణాతులు, సైంటిస్టులు, ఆర్టిస్టులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు... ఇలా అందరి నుంచి పిల్లల రచనలు ఎలా ఉండాలనే దానిపై.... అభిప్రాయాలు, ఆలోచనలు తీసుకోవడం కొనసాగుతున్నది.



అడపా సత్యనారాయణ

విజయవంతంగా 14వ భాగంలోకి అడుగుపెట్టాం.. ఈ ముచ్చట్లులో నలుగురు బాలసాహిత్యం రాసేవాళ్లను పిలిస్తే.. ఇద్దరిని మాత్రం ఖచ్చితంగా పిల్లలకు సంబంధం లేని వాళ్లను పిలవడం జరిగింది. ఈ వేదికలో పిల్లల గురించి సంబంధంలేని వ్యక్తులను పిలిచినప్పుడు.. ఇక్కడకు వచ్చిన తర్వాత వాళ్ల చిన్ననాటి జ్ఞాపకాలను తెలపడంతో పాటు బాలసాహిత్యంపై అవగాహన గురించి తెలుసుకోవడం జరిగింది. జరుగుతుంది.

తెలుగు రాష్ట్రాల్లో ఉన్న బాల రచయితలు ఈ వేదిక మీద ఇప్పటికి సుమారు 100 మందికిపైగా మాట్లాడారు. వీటన్నింటిని కూడా రికార్డు చేస్తున్నాం. పిల్లలకు, విద్యుత్ లేని గ్రామంలోని పిల్లలకు, కుగ్రామాల పిల్లలకు తెలియాలి. పత్రికను చదువుకుంటే.... ప్రపంచంలో నేను దేనికి తీసిపోననే ధ్యేయాన్ని ప్రేరేపించే విధంగా బాలచెలిమిని ప్రారంభించడం జరిగింది. కొందరు రచయితలు బాల సాహిత్యానికి ఆదరణ లేదంటే.. వెంటనే ఇక్కడికి పిలిపించి.. చర్చించి వాళ్లతో మాట్లాడించి, రికార్డు చేసి, పుస్తకాలు తేవడానికి దోహదపడ్డాం. ఈ సంవత్సరంలో తెలంగాణలోనే దాదాపు 150 పిల్లల పుస్తకాలను ప్రచురించారు. అందరి ధైర్యంతోనే ఈ పత్రికను ముందుకు తీసుకొని రావడం జరిగింది. చిల్డ్రన్స్ అకాడమీ తన బాధ్యతగా పత్రికను తేవడంతో పాటు పుస్తకాలను వేయడం జరుగుతుంది. పుస్తకాలను వేయడానికి ఒక నెలలో 4 వేయవచ్చు... ఒక నెలలో 2 వేయవచ్చు.. కానీ పత్రిక అలా కాదు.. ఆ కాల పరిధిలో పత్రిక వచ్చేయాలి, అది చదవాలి.. తెలుసుకోవాలి. ఈ లోపల మళ్లీ పత్రిక రావాలి. ఇలా అందరం కలిసి పనిచేస్తేనే పత్రికను ముందుకు తీసుకురాగలుగుతాం.



డాక్టర్.కేబీ గోపాలం

**ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ :**

వేదకుమార్ ఏ పనిని చేపట్టినా నా వంతు సహకారం ఉంటుంది. వేదకుమార్ ఎన్నో రంగాల్లో తన వంతు కృషి చేస్తుంటారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత.. మన చరిత్ర, మన సంస్కృతి, మన ప్రత్యేకత, మన అస్థిత్వ అంశాల పట్ల సుదీర్ఘంగా చర్చలు జరిపారు. నేను ఒక బాలుడిగా, ఒక విద్యార్థిగా చూసినటువంటి, నేర్చుకున్నటువంటి అంశాలను ఇవాళ పిల్లలకు అందించాల్సిన అవసరం ఉంది. ఈ 'బాలచెలిమి' కార్యక్రమం చాలా విలువైంది. బాలచెలిమి సాహిత్యం చేరాల్సిన చోటికి ఇంకా చేరలేదు. ఇవాళ ఈ బాలచెలిమి ప్రధానంగా ఫోకస్ చేయాల్సింది గ్రామీణ ప్రాంతంలో. నేను ఊరులో పుట్టాను. గ్రామీణ స్కూల్‌లోనూ చదివినాను. మా ఊర్లలో మా టీచరు మాకు ఆదర్శం. మేము మా గురువుకి సేవలు చేసేవాళ్లం.. ఆ రోజుల్లో గురువు అనేవాడు తను వ్యక్తిగతంగా శిష్యులలో లీనమై అతని బాగోగులను చూసేవాడు. ఇవాళ దురదృష్టవశాత్తూ అలాంటి పరిస్థితి లేదు. గురువుకు శిష్యులకు సంబంధం లేకుండా యాంత్రికంగా నడుస్తున్నాయి. ఇలాంటి సందర్భంలో పిల్లలకు బాలసాహిత్యం, మన చరిత్ర, తదితర అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. పిల్లల్లో ఉన్న తెలివిని బయటకు తీసి దానిని పెంపొందించడానికి కృషి జరగాలి. ఈ బాలచెలిమి కార్యక్రమంలో పిల్లలను కూడా భాగస్వామ్యం చేయాలి. ఈ బాలచెలిమి కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతంలోకి తీసుకెళ్లి.. అక్కడ పిల్లలకు అందజేయాల్సిందిగా కోరుకుంటున్నాను. గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులకు సరైన విద్య లేకపోవడం మనం చూస్తున్నాం. వాళ్లకు ఈ బాలచెలిమి, సాహిత్యం, విద్య, చేరాల్సిన అవసరం ఉంది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కూడా గ్రామీణ ప్రాంతాల పిల్లలకు అర్థమయ్యే రీతిలో అందించాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థికి వాళ్లు ఎదుర్కున్న నిత్య జీవిత సమస్యలు, వాళ్ల అనుభవాలను కథల రూపంలోనూ లేకపోతే ఒక పాట రూపంలోనూ రాసి అందిస్తే .. అది వాళ్లకు నిజమైన కథలా గానీ, పాటలాగానీ ఉంటుంది. గ్రామీణ ప్రాంతంలోని చుట్టుపక్కల చరిత్రలను గురించి, ఆ ప్రాంతంలో ఉన్న పరిశ్రమల గురించి, ఇతర అంశాలపై ఇవాళ, పిల్లలకు చెప్పే పరిస్థితి లేదు. తెలంగాణ ఉద్యమం గురించి, ఈ ప్రాంత చరిత్ర గురించి, ఇతర ప్రాంతాల తెలంగాణ సాహిత్యం గురించి పోరాట ఘటనలు గురించి బాలచెలిమి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఉంది.

**డాక్టర్.కేబీ గోపాలం (సైన్సు రచయిత) :**

నేను చిన్నపిల్లలను దగ్గర పెట్టుకుని కథలు చెప్పేవాన్ని.. ఈ కథల్లో కూర్చున్న దగ్గరనే సింహాలను, పులులను ఊహించుకొని, అక్కడనే అనేక రకాలుగా నా ఆలోచనలను పిల్లలకు చెబుతూ, వాళ్ళతో సరదగా ఉండేవాడిని.. పిల్లల

మనస్సులను తెలుసుకున్న నేను.. పెద్దపెద్ద కంపెనీల మేనేజర్లను కూర్చొబెట్టి ఇతరులతో మాట్లాడడం ఎట్లాగా అనేవి నేర్పించేవాడిని. మనస్సులో ఉన్న ఆలోచనలను అర్థమయ్యేటట్లు చెప్పడం తెలుసుకోవాలి. లండన్‌లో ఓ పార్క్ ఉంది. ఆ పార్కుకు ఎవరైనా ఓ కుర్చీనో లేక బెంచి కానీ తీసుకెళ్లాలి. ఎందుకంటే ఆ కూర్చీపై నిలబడాలి... నిలబడితే చాలు ఇతని వద్ద ప్రపంచానికి ఇవ్వటానికి ఏదో సందేశం ఉందని అర్థం. ఈ సందేశం ఇవ్వడానికి నిలబడితే నీ చుట్టూ నలుగురు, ఐదుగురు నిలబడతారు. ఇదే విధానాన్ని నా స్నేహితుడితో మన దగ్గర నిర్వహించాలని చెప్పాను. ఎంత బాగుంది ఈ ఆలోచన.


మాడభూషి లలితాదేవి

బాల సాహిత్యం గురించి ఫిర్యాదులు ఎందుకు వస్తున్నాయి.? బాలసాహిత్యం లేదు అంటారు.. బాలసాహిత్యం రావడంలేదు అంటారు. మరి, మనం 150 పుస్తకాలు వేశాం అంటున్నాం.. ఈ 150 పుస్తకాలల్లో ఎన్ని పుస్తకాలు బాగున్నాయి...? మనకు ఒకప్పుడు గొప్ప ప్రచురణ సంస్థలు ఉండేవి. ఆ ప్రచురణకర్త ఎవరు రాసిన పుస్తకం అయినా, ఒక బాధ్యత తీసుకొని ముందు ఈ పుస్తకం బాగుందా.. పోతుందా.. దీనివల్ల ఎక్కడేనా ఒక ఖాళీ పూరించే అవకాశం ఉన్నదా.. లేక ఇలాంటి పుస్తకాలు ఇప్పటికే ఉండగా, ఈయన మళ్లా రాసినాడా.. ఇలాంటివి అన్నీ ఆలోచించి ఒక పద్ధతిలో పెట్టుకొని, ఏ రకమైన కాగితం ఉండాలి.. ఏ రకమైన కలర్ ఉండాలి.. ఎక్కడ బొమ్మలు ఉండాలి.. ఎక్కడ ఏది ఉండాలి.. తదితర అంశాలను నిర్ణయించి పుస్తకాన్ని తీసుకొని రావడం జరుగుతుంది.


జుగాష్విలి

బాలసాహిత్యం అనే దాంట్లో బొమ్మలు మాత్రమే చూడాల్సిన పిల్లల కోసం పుస్తకాలు.. కొంచెం తెలుసుకుని ఒక మాట కానీ, ఒక అక్షరం కానీ చదవగల పిల్లల కోసం పుస్తకాలు.. అక్కడ నుంచి విషయం మాత్రమే తెలుసుకోవాలి అన్న కోరిక మాత్రమే ఉండి ప్రపంచం కోసం పెద్ద దృష్టిలేని పిల్లల కోసం పుస్తకాలు, ఇంతో అంతో ప్రపంచంతో పరిచయం ఏర్పడుతూ పుస్తకాల వల్ల, గురువుల వల్ల, వాళ్లందరి కన్నా కుటుంబంలోని, తాము ఉన్న పరిసరాల్లోని వారి వల్ల విషయాలు గుర్తించే హైస్కూలు పిల్లల కోసం పుస్తకాలు ఉండాలి, రావాలి.

**మాడభూషి లలితాదేవి (రచయిత్రి) :**

నేను తెలుగు ఉపాధ్యాయురాలను.. 35 సంవత్సరాలు ఉద్యోగం చేశాను. ఇప్పుడు పిల్లలు నాలుగు వాక్యాలు చదవలేని, రాయలేని పరిస్థితిలో ఉన్నారు. మన మాతృభాష మీద శ్రద్ధ పిల్లలకు లేదు, తల్లిదండ్రులకు లేదు. ఇటువంటి పరిస్థితిలో ఇంట్లో పూర్వపు కథలు చెబితే.. ఇవి పాత కథలు అంటారు. మరి కొత్త కథలు రావాలంటే ఎవరైనా రాస్తానే రావాలి. నా ఉద్దేశంలో బాలసాహిత్యం అంటే బాలలు రాసిందే బాలసాహిత్యం. బాలల పేర్లతో పెద్దవాళ్లం మనం ఎన్ని రాసినా అందులో తేడా కనిపిస్తుంది. పిల్లల గురించి నేను ప్రతి సంవత్సరం వర్క్‌షాపులను పెట్టడం జరుగుతోంది. కథ అంటే ఏమిటి..? నాటకం అంటే ఏమిటి..? ఎట్లా రాయాలి..? ఇలా అనేక అంశాలపై పెద్దలను పిలిచి వర్క్‌షాపులను ఏర్పాటు చేయడం జరుగుతోంది. కథ అనేది ఎవరో రాయటం కాదు.. కథ రాయాలి అంటే పిల్లల మనసులోంచి పుట్టాలి. పిల్లల చేత కథలు రాయించడం వల్ల వాళ్లు మంచి కథలను రాయగలరు. పిల్లలు రాసిన కథలు చదివితే పిల్లల మనసు కూడా ఇంత లోతుగా ఉంటుందా అని అనిపిస్తుంది. వాళ్ల మనసులో కూడా ఇన్ని ఆలోచనలు ఉన్నాయా అనేది మనకు చాలా ఆశ్చర్యానికి కూడా గురి చేస్తుంది. పిల్లలను ప్రోత్సహిస్తే వారిలో సృజనాత్మకత పెరుగుతుంది.

ఇప్పటి పిల్లలు కూడా తెలుగులోనే కథలు రాయాల్సిన అవసరం ఉంది. పిల్లల భవిష్యత్‌లో ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభించి పిల్లలకు నేర్పించాల్సిన అవసరం ఉంది. ఇది ఒక చేతితో అయ్యే పనికాదు.. రెండు చేతులు కలవాలి. అంటే పెద్దలందరూ కలిసి బాలచెలిమి లాంటి వర్క్‌షాపులను నిర్వహించాలి. ఈ వర్క్‌షాపుల వల్ల ఏది ఎట్లా రాయాలి..? ఎట్లా చదవాలి..? అనేది పిల్లలకు అర్థమవుతుంది. అప్పుడే పిల్లలలో కొత్తదనాన్ని చూడగలగుతాం. పిల్లలకు బాలసాహిత్యంపై అవగాహన కల్పించి వాళ్ల చేతనే పుస్తకాలను తెలుగులో రాయించడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల బాధ్యత ఉంది. పిల్లలపై వచ్చే పుస్తకాలను కొనుక్కొని చదివించే విధంగా అవకాశం కల్పించాలి. పిల్లల కోసం బాలచెలిమి లాంటి కార్యక్రమాలు గ్రామీణ స్థాయిలో కూడా నిర్వహించాల్సిన అవసరం ఉంది.

**జుగాష్విలి (కవి):**

నేను బాలచెలిమి ముచ్చట్లకి, బాలచెలిమి పత్రికకు ఇన్‌సైడర్‌నే కానీ, అవుట్‌సైడర్‌ని కాను. ఈ 14 ముచ్చట్లలో నేను దాదాపు 10 కార్యక్రమాలలో పాల్గొన్నాను. దీంతో నేను చాలా తెలుసుకున్నాను.. నేర్చుకున్నాను. మా నాన్న ద్వారా చిన్నప్పుడే సోవియట్ బాల సాహిత్యంతో పరిచయం ఏర్పడింది. ఈ సాహిత్య పఠనం ఒక వ్యక్తిత్వం ఏర్పడడానికి దోహదం చేసింది. ప్రపంచపు తీరు తెన్నులపై అవగాహన యిచ్చింది. చిన్నప్పటి నుంచీ పుస్తకాలు ఎక్కువగా చదవటం వల్ల సాహిత్యంతో అనుబంధం, ఏర్పడింది. ఒక సృజనాత్మక సాహిత్య జీవిగా మార్చింది. ఇలా నా భావాలను మీతో పంచుకునే అవకాశం ఇచ్చినందుకు వేదకుమార్‌గారికి కృతజ్ఞతలు. ఈ బాలసాహిత్య ఉద్యమంలో నా వంతు కృషి ఎప్పుడూ ఉంటుంది.


కె.ప్రభాకర్

**కె.ప్రభాకర్, (ఉపాధ్యాయుడు) :**

తెలంగాణ ఏర్పాటుకు ముందు ఒక అద్భుతమైనటువంటి తెలంగాణ సమాజం కోసం ఒక దిక్సూచిలాగా పనిచేసిన కేంద్రం ఇది. అయితే తెలంగాణ వచ్చిన తర్వాత ఈ వేదిక పరిస్థితి ఏంటి అని

చాలాసార్లు ప్రశ్నించినప్పుడు తెలంగాణ వచ్చిన తర్వాత ఈ వేదిక చేయాల్సిన పని చాలా ఉందని వేదకుమార్ గారు చెప్పేవారు. తెలంగాణ వచ్చిన తర్వాత పిల్లలలో కానీ, టీచర్లలో కానీ కనీసం సాహిత్యం పట్ల, జీవితం పట్ల అవగాహన పెరుగుతుందని ఆశపడ్డవాళ్లలో నేను ఒకరిని.. ఈ ఆవేదనను వేదకుమార్‌గారితో చాలాసార్లు పంచుకోవటం జరిగింది. తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణ తరగతి గది ఎంత దారుణంగా తయారయిందంటే.. ఇవాళ ఫలితాలు వస్తున్నాయి అంటే తెలంగాణ భయపడుతోంది. పిల్లలు ఎవరైనా కథ ద్వారా, జీవితం ద్వారా, సాహిత్యం ద్వారా బతకటం ఎట్లాగో తెలియనటువంటి ఒక అంధకార తరగతి గది మధ్య మనం ఉన్నాం. కాబట్టి మార్పు కోసం వేదకుమార్ గారు చేస్తున్న కృషి పిల్లల్లో వెలుగునింపే విధంగా ఉంది. ఇప్పటి పిల్లలకు భూమి తెలియదు, బావి తెలియదు, ఈత తెలియదు ఇలా యువతరం తయారు అవుతోంది. ఇలాంటి పిల్లలకు సాహిత్యం పట్ల, తెలుగు భాష పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. వేదకుమార్ గారు చేస్తున్న ఈ ప్రయత్నం గ్రామీణ ప్రాంతాలకు కూడా చేరాలని కోరుకుంటున్నాను.

**డాక్టర్ ఎస్.రఘు (ప్రొఫెసర్) :**



డాక్టర్ ఎస్. రఘు

ఒక దీపం మరొక దీపాన్ని వెలిగించాలి అనేటట్టుగా ఒక సభ ద్వారా ఉత్తేజకరమైనటువంటి ఒక సందేశం అందాలి. ఇట్లాంటి సభలు ఇంకా జరగాలి. ఇక్కడ నుంచి జిల్లా స్థాయిలో కూడా నిర్వహించాలి. ఇట్లనే అనేక కార్యక్రమాలు ఆయా సాహిత్య సంస్థలు జరుపుకుంటే బాగుంటుంది. ముఖ్యంగా బాల సాహిత్యం అనేది బాలల కంటే ముందు రోజువారి తరగతి గదిలోని ఉపాధ్యాయులకు చాలా ముఖ్యమైంది. అంటే తన తరగతి గదిలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు అనేక గంటలు గడుపుతారు. ఈ సందర్భంలో ఏ పాఠ్యాంశంమైనా బాలసాహిత్యానికి సంబంధించి విలువైనటువంటి విషయాలతో అనువర్తింపజేసి మాట్లాడితే ఎంతో బాగుంటుంది. ఒక తెలుగు టీచర్‌నే కాకుండా ఇతర టీచర్లు కూడా బాల సాహిత్యంతో అనుబంధం ఉంటే విద్యార్థుల్లో చైతన్యం పెంచే అవకాశం ఎక్కువ ఉంటుంది. ఆ వాతావరణాన్ని తయారుచేయడానికి ఈ వేదిక ఉపయోగ పడుతుంది. దీనికోసం ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నాను.

**-ఆర్. పురుషోత్తం నాయుడు,**
m : 9573041226
e : janata.rpnaidu@gmail.com

ద



# అనేక దృశ్యాలు

గాలిని తినడానికి బయటికి వస్తే
అనేక దృశ్యాలు
నా కనురెప్పలపై కపోతాలై...

సగానికి కోసిన చెట్టుపై
ఆకాశాన్ని తాకే లేత రెమ్మల్లో
ఆత్మ విశ్వాసాన్ని చూశాను...

అడుగులో అడుగు వేస్తూ
కదులుతున్న వృద్ధాప్యంలో
నా భవిష్యత్తు నీటిబొట్టుపై పచ్చి నిజం

తలపై సముద్రాలు మోస్తున్నా..
కళ్ళలో మసి పట్టిన చీకటి
శరీరాల నుండి రాలుతున్న ఎర్రని వాసన

గుంపుగా తూగుతున్న పాదాల కింద
కార్పొరేట్ గాలి...

కాలాన్ని ఒక్కటి చేస్తాను
గాలిని మురికివాడల్లోకి వెదజల్లుతాను
సూర్యుడిని గుడిసెలో వెలిగిస్తాను

అప్పుడే అప్పుడే
తడి తడిగా గాలిని తింటాను...

**-లై,** m : 9491977190
e : writer.lie9@gmail.com

ద

## పాఠకులు, రచయితలకు శుభవార్త దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం


**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, వర్ధమాన రచయితలు, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింపజేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com **- ఎడిటర్**

# గల్మ గుండా కవన జలాలు!

గల్మ అంటే గుమ్మం. కవి గుమ్మం అనే అర్థంలో కాక వరి మొదలగు మడులకు నీళ్లు వెళ్లే దారిని గల్మ అంటాం కదా! దాన్నే ఆ అర్థాన్నే స్వీకరించి ఈ సంపుటానికి గల్మ అని అన్నాడనుకుంటా. ఆదర్శవంతమైన సమాజ సేద్యానికి నీళ్లందించే సంపుటమిది. నలభైతొమ్మిది కవితలు పంటపొలాలకు వెళ్లే నీటి కలువల్లాంటివే. గల్మ కవితా సంపుటం మానవీయ మనోభూమికి నీళ్లు పారించాలన్న దృష్టితో దృక్పథం గంభీరావుపేట యాదగిరి మనముందు దీన్ని ఆవిష్కరిస్తున్నందుకు ముందుగా నా అభినందన.

గ్రామీణ ప్రజలు శేషప్ప పద్యాలతో ఎలా మమేకమవుతారో యాదగిరి కవితలతో అలాగే మమేకమవుతారు. యాదగిరి కవితలు సరళమైనవి. డొంకతిరుగుడుతనం లేనివి. ఏ విమర్శకుని సహాయం లేకుండా అర్థం చేసుకోదగినవి. యాదగిరి కవిత్వం ద్వారా చెప్పదలుచుకున్న విషయం సామాజిక స్పృహతో నిండి ఉండటం వల్ల గ్రామీణ, పట్టణ ప్రజలు ఎవరి సహాయం లేకుండానే అర్థం చేసుకునే సులభమైన భాషలో చెప్పిన కారణంగా కవి కవిత్వం పాఠకుని హృదయంలోకి సరాసరి వెళ్లగలిగింది.



యాదగిరిలో సున్నితత్వం ఉన్నట్లే ఆయన కవిత్వానికి ఉంది. ఆయన నిరాడంబరుడు. ఆయన కవిత్వం నిరాడంబరమైందే. కవి స్వాప్నికుడు కావడం వల్ల అక్కడక్కడ కవి భావనాదృష్టిగల ప్రతీకలు పరిపక్వమై మన హృదయాలను పరవశింపచేస్తాయి. కవి సుప్రసిద్ధకవుల కవిత్వం చదివి రాయలేదు. తన చుట్టూ ఉన్న ప్రజల మనోభావాలనే తనదైన అనుభవసారంతోనే స్వీయ నడకలతోనే కవితలు అల్లి మనముందుంచాడు.

'అమాయకత్వం' కవితలో ఐదేళ్లకోసారి వచ్చే నాయకుల్ని నమ్మి మోసపోరాదంటాడు. ప్రజాస్వామ్య కవితలో స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా దున్నేవాడికి భూమి లేదు. చదువుకున్నవాడికి ఉద్యోగం లేదు. అన్నదాతకు ఆకలితీరలేదు. నోట్లకు రెక్కలొచ్చి ఓట్లను తన్నుకుపోయేవాడే ప్రజాస్వామ్యం. మన ప్రజాస్వామ్యమే బానిసత్వాన్ని అనుభవిస్తుందంటాడు. గ్లోబల్ విలేజివల్ల ఏమైంది. ప్రేమనదుల్లా జీవించాల్సిన మనుషులు లోహనదుల్లా ప్రవహిస్తున్నారు. సహజమైన జీవితం అదృశ్యమై యాంత్రిక జీవితం వల్ల లోలోపల జీవిస్తున్న మానవ బంధాలను యాంత్రిక రక్తబంధాలుగా రూపొందించుకుంటున్నాం కదా! అంటాడు కవి.

వ్యాపారం కరెన్సీ వసంత కాలానికి తలుపులు తెరిచింది. ఆఫర్ల దందాలవల్ల అమాయకపు వినియోగదారులు ఎలా బోల్తాపడుతున్నారో ఆషాఢ మాసం ఆఫర్ల లూటీ జూదానికి ఎలా దిగుతున్నారో మాయాలోకం కవిత కళ్లముందు ఉంచుతుంది. 'అన్వేషణ'లో కవి అన్వేషించి చెప్పింది యేంటంటే మనుషులు మానవీయ వ్యవస్థను ఆహ్వానిస్తేతప్ప మానవ విలువలు చిగురించవని.

వ్యవసాయం ముందంజలో ఉండాలంటే నదులపైన ప్రాజెక్టులు కట్టితీరాలి. రైతులకు భూతల స్వర్గం ప్రాజెక్టులే. రోగికి ఔషధం ఎంత ముఖ్యమో సేద్యానికి నీరంత ముఖ్యం. కవికి ఎంతో లోతైన భావన ఉండటం వల్ల ఇలా అంటాడు.

'రాత్రిని పగలువలే
వెలిగించే కరంటు సూర్యులు
అడుగడుగునా
తమను తాముకాల్చుకుని
కాంతిని వెదజల్లి
చీకటిని వెళ్లగొట్టటమేకాదు
గోదావరమ్మను మనదారి మరల్చి
తడారిపోతున్న భూములకు ప్రాణం పోసే అమృత నిలయాలు మన ప్రాజెక్టులంటాడు.

ప్రాజెక్టులు కట్టుకునే స్తోమత లేకపోతే చెరువులనైనా నిర్మించుకోవాలి. ఉన్న చెరువులను పునరుద్ధరించుకోవాలి. యాదగిరి తనవూరి చెరువును చూసి పరవశించిన తీరు పాఠకున్ని బాగా ఆకట్టుకుంటుంది. చెరువును విలక్షణంగా మనముందుంచాడు. 'పెదరాయని చెరువు' నిండు గర్భిణిలా ఉందంటాడు. బతుకమ్మ నిమజ్జనం రోజున చెరువు పూలవనమైపోతుందట. బేస్తవాళ్ల విన్యాసాలతో, ముత్యాల ముగ్గులతో చెరువు శోభిల్లుతుందట. అంతటి చెరువు ఇపుడేమైంది?

'వరుణ దేవుడు లోభిగా మారితే సూర్య భగవానుడు
పగబట్టి కాల్చితే
ఒళ్ళంతా నెర్రలు వారి
అన్నదాతల ఆత్మహత్యల్ని చూసి
గుండెలవిసేలా రోదిస్తుంది' అంటాడు.

భూగర్భ జలాలకు తానే ఊటగా మారిన చెరువును చూసి కవి పడిన దు:ఖం ఇంతా అంతాకాదు.

చెరువులు నిండుగా ఉండాలంటే వానలు కురవాలి. అన్నదాతలు 'తొలకరి' వానకు పరవశించిన తీరును కవి రాస్తూనే మబ్బులు కుమ్మరించిన అమృతభాండమే తొలకరి వాన కనుక పుడమి కడుపున పుట్టబోయే లేలేత మొక్కల సోయగాలను కవి తొలకరిలోనే చూడగలిగాడు. అసలు పడకపోతే 'మనోరథన'కు అంతే ఉండదు. కర్షకులు నేల మీద, వర్షం మీద ఆధారపడతారని అందరు కవులు

చెబుతారు గానీ మన యాదగిరి రైతులు గాలి మీద కూడా ఆధారపడతాడని విన్నవిస్తాడు. "గగన వీధిలో చల్లని మేఘాలు పర్వత పంక్తుల్లా కమ్ముకొస్తాయి. చల్లని చిరుగాలి బతుకు పోరుకు ఊపిరులూదుతుంది." అయితే రాకాసి గాలి దేగలా ఎగురొచ్చి కారుమేఘాలను కాలితో తన్నుకుపోవడంతో రైతు బతుకు మనోరథనకు గురవుతుం దంటాడు. కవికి సున్నితత్వం ఎక్కువ. వర్షాకాలంలో రాకాసి గాలుల దేగల్లా మేఘాల్ని తన్నుకుపోయే స్థితి పోవాలంటాడు.

యాదగిరి మనసు రైతు చుట్టే తిరగ డంవల్ల రైతు బతుకును బాగా చెప్పగలిగాడు. వర్షాలు కురవాలి, వానదేవుడు కరుణించాలి.. రైతు అతివృష్టిని ఎదుర్కొనక పోతే బాగుండు అతివృష్టి వల్ల నీటి దుప్పటి కన్నీటి దుప్పటిగా మారే దుస్థితిని కవి ఆర్ద్ర హృదయంతో వ్యక్తీకరించాడు. అతివృష్టివల్ల అంతా నీటిపాలే. తలలు తెగిన వృక్షాలు, ప్రాణాలు వొదిలిన పశువుల కళేబరాలను కవి దృశ్యమానం చేస్తూ ఇలాంటి జల గండాల వల్ల ఎదురయ్యే దుఃఖాన్ని సూర్యోదయమే ఆపగలదంటాడు. కవి భావన నన్ను బాగా కదిలింపచేసింది. చక్కటి వర్షాల వల్ల పంటపొలాలతో పల్లె శోభాయమాన మవుతుంది. 'శ్రావణ శోభ' కవితలో శ్రావణ మాసంలో ప్రకృతి శోభను అద్భుతంగా చెప్పాడు. శ్రావణ శోభ దేవతా పూజలతో, నోములతో, వ్రతాలతో పండుగ పరవశాన్ని కలిగిస్తుంది. మైమరిపించే ప్రకృతివల్ల మయూరాలు, చాతక పక్షులు నాట్య సంగీతాలతో అలరింపచేస్తాయి. సుసంపన్నమైన శ్రావణ శోభలో ప్రజలు జీవించాలని కాంక్షించే ఈ కవిని అభినందించకుండా ఉండలేక పోతున్నాను.

**యాదగిరి మనసు రైతు చుట్టే తిరగ డంవల్ల రైతు బతుకును బాగా చెప్పగలి గాడు. వర్షాలు కురవాలి, వానదేవుడు కరుణించాలి.. రైతు అతివృష్టిని ఎదుర్కొనక పోతే బాగుండు అతివృష్టి వల్ల నీటి దుప్పటి కన్నీటి దుప్పటిగా మారే దుస్థితిని కవి ఆర్ద్ర హృదయంతో వ్యక్తీక రించాడు. అతివృష్టివల్ల అంతా నీటిపాలే. తలలు తెగిన వృక్షాలు, ప్రాణాలు వొదిలిన పశువుల కళేబరాలను కవి దృశ్యమానం చేస్తూ ఇలాంటి జల గండాల వల్ల ఎదురయ్యే దుఃఖాన్ని సూర్యోదయమే ఆపగలదంటాడు.**

గల్మ సంపుటిలో చాలా కవితలు స్త్రీ హృదయాన్ని ఆవిష్కరించాయి. స్త్రీ పట్ల కవికున్న అభిమానం మరువలేనిది. శ్రమించే శ్రామిక స్త్రీలను కవి గుండెకు హత్తుకుంటాడు. పొద్దస్తమానం శ్రమించే గ్రామీణ స్త్రీలపట్ల కవికున్న దృష్టి బలమైనది అన్ని అవసరాలు తీర్చే స్త్రీలు నగరాలల్లో కూడా ఇంటి పనిలోనే కాదు కార్యాలయాల పనుల్లోనూ ఓర్పుతో సహనంతో బాధల్ని దిగమింగుతూ ఇంటికి దీపం ఇల్లాలుగా మారే ఈ కలల బొమ్మరిల్లు తెల్లవారితే చాలు మళ్ళీ జీవన గడియారపు ముల్లులా శ్రమిస్తూనే ఉంటుంది. కవి తన తల్లిని 'బ్రహ్మ గీసిన బొమ్మ'గా భావించాడు. అమ్మను చూసినకొద్దీ చూడాలనిపించే అద్భుత పటం అమ్మ అంటాడు. అమ్మే దేవత. జన్మ ప్రధాత అంటూ అమ్మను ఆరాధిస్తూ రాసాడు.

'ఆత్మఘోష' కవితలో వృద్ధాశ్రమంలో తల్లి ఆకాంక్షను, ఆవేదనను హృదయవిదారకంగా వ్యక్తీకరించారు. 'ఒక్కసారి వచ్చి నన్ను ఇంటికి తీసుకుపోరా కొడుకా! తీసికెళ్ళితే నీ ఇంట్లో అంట్లు తోముతూ బతుకుతా! పనిమనిషిలా కాక ప్రేమగా నీ పిల్లల్ని పెంచుతా! రానాన్నా. నేను అనాథను కానని లోకానికి చెబుతా' నసే తల్లి బాధను అక్షరాల్లో ఇమడ్చడంవల్ల హృదయం ద్రవీభూతమవుతుంది. శ్రామిక మహిళలనూ, కుటుంబ మహిళలతోపాటు స్త్రీల హృదయాలకు అద్దంపట్టే కవిత 'కౌముది'. ఆమె కలువరేడు కన్నకూతురు. యామిని. సౌధామిని. పున్నమి కౌముది. ఆమె వెలుగుల ప్రస్థానం. బహువిధ సున్నితత్వాన్ని, సుకుమార శోభను బహిర్గతం చేశాడు.

యాదగిరి కవిత్వాలు 'నిలువుటద్దం'గా నిలుస్తాయి. గ్రామీణ కవితలతోపాటు నగర జీవన కవితలు కూడా ఈ సంపుటిలో ఉన్నాయి. నగరం రాత్రికాగానే చీకటి దుప్పటి కప్పుకుందట. అల్లంత దూరాన అద్భుతమైన చుక్కలపందిరి మిలమిల మెరుస్తూ లెక్కకు మించిన లాంతరు దీపాలతో తప్పిపోయినదానికోసం వెతుకుతున్నాయట. మనసు మబ్బులేని ఆకాశంలా నిర్మలంగా ఉంటేనే ఇలా రాయగలుగుతారు. అక్షరపక్షులను కాగితపు ఆకాశంలోకి ఆహ్వానించి ఊహల రెక్కలు తొడిగి ఊరేగించే కవి మన యాదగిరి. మనసుకు పచ్చదనమబ్బి ఏకాంత గర్భగుడిని చేరిన పుష్పంలా ధన్యతనొందాలని ఊహల నిలువుటద్దాన్ని పాఠకుని ముందు పసందుగా ఉంచారు.

యాదగిరి గురువులను 'స్ఫూర్తిప్రదాత' అన్నారు. బండరాళ్ళకు బహుచక్కని రూపమిచ్చేది గురువే. త్రిమూర్తుల ప్రతిరూపం గురువుదేనంటాడు. గురువులతోపాటు తెలంగాణ గొడవల పితామహుడైన కాళోజీని స్మరిస్తూ జైలుగోడల్ని చూసి బెదరని చైతన్యమూర్తి, మనసోయికి స్ఫూర్తి ఆయనే అంటారు. యాదగిరి రక్తబంధాలకన్నా స్నేహానుబంధాల్ని మిన్నగా భావిస్తాడు. మిత్రులు వందలున్నా తక్కువే. శత్రువులు ఒక్కడున్నా ఎక్కువేనని స్నేహజీవన ఔన్నత్యాన్ని గుర్తుచేశాడు. కాలం 'దిక్సూచి' కవితలో కాలానికి మనిషికుండే బంధాన్ని ఎత్తిచూపాడు. దిక్సూచి ఇలా అడుగుతుంది. నన్ను మించినవారు నీకెవరున్నారు అని. అలసట యెరుగని పయనం నాది. ఆగితే సాగని జీవితం నీదంటూ కర్తవ్యాన్ని బోధించే విధంగా రాశారు. గడియారపు టిక్‌టిక్ ఆగినా గుండె లబ్‌డబ్ ఆగినా నష్టం మనిషికేనంటాడు.

యాదగిరి కవితా వస్తువులో వైవిధ్యముంది. వస్తు వైవిధ్యమున్న కవి. కాశిబుగ్గలో పటాసులు పేలి కాలిపోయిన పిల్లల హృదయాల్ని 'హృదయవిదారకం'గా చెప్పారు. మరణించిన పిల్లలమీదే కాదు బాల్య స్మృతుల్ని నెమరువేస్తూ 'తీయనైన బాల్యం' కవిత రాస్తూ మనల్ని బాల్యస్మృతుల్లోకి లాక్కుపోయేట్లు చేశారు. వర్షంలో తడుస్తూ కాగితపు పడవల్ని వరదల్లో వదలడం, ఆకాశంలోని చందమామ నాదంటే

నాదనే చిలిపితనాలను, రంగురంగుల కళ్ళజోళ్ళు, మెడలో బత్తీసల పేరు, పిల్లనగ్రోవి, పీచుమిఠాయితో కూడిన బాల్యస్మృతులు చదివిన ప్రతి పాఠకుడికి గుర్తొచ్చే విధంగా రాశారు. చిన్నపిల్లల మీదే కాదు మన మాధ్యమాల మీద కవిత్వం రాశారు. పత్రికలు, దూరదర్శన్ల మీద కవిత్వం చెబుతూ 'ఆలోచించండ'ని మనముందుంచుతాడు. మన టీవి సీరియల్స్ ద్వారా ప్రసారం చేసే ప్రాయోజిక కార్యక్రమాలు కావు అవి మన విలువైన సమయాన్ని ధ్వంసం చేసే అప్రయోజక కార్యక్రమాలుగా ఎద్దేవా చేస్తూ రాశారు.

యాదగిరి మనసు అందరి మనసులా లేదు, నేడు సెల్‌ఫోన్ మానవ సంబంధాలను మంటగలుపుతుందని చాలామంది కవిత్వం రాస్తుంటే మన కవి 'సెల్‌ఫోన్'ను ప్రేయసిగా భావించి తన హృదయాన్ని అదెలా మైమరపింపచేస్తుందో చెప్పారు. ఫోన్ చేతిలో మానవుడున్నాడా? మానవుని చేతిలో ఫోనుందా? యాదగిరి ప్రియురాల్ని అడగలేం గాని యాదగిరిని మాత్రం అడగగలం కదా!

యాదగిరి కవిత్వంలో చెప్పే కవితా వస్తువు ఇతర కవులు చెబుతున్నదే అయినా తనదైన దృష్టితో దృక్పథంతో విలక్షణతతో, విశిష్ఠతలతో చెప్పాడు. వాడిన పత్రికలు కొన్ని కొత్తగా ఉన్నాయి. ఊహల్లో నవ్యత ఉంది. కవిత్వం ద్వారా పాఠక హృదయాన్ని చూరగొనే తత్వం ఉంది. వస్తువును ఎన్నుకోవడంలో దాన్ని వ్యక్తీకరించడంలో నిరంతరం శ్రద్ధపెడితే సిద్ధిపేట నుంచి వస్తున్న కవుల్లో నిలదొక్కుకుని అడుగుతీసి అడుగేసే కవి అవుతాడనే నమ్మకం 'గల్మ' కలిగించింది.

**ప్రతులకు:** **గల్మ** (కవిత్వం)
**రచయిత:** గంభీరావుపేట యాదగిరి
**వెల:** రూ. 100
**ప్రతులకు :** 12-126/3, ఎన్జీఓఎస్ కాలనీ,
ప్రశాంత్‌నగర్, సిద్ధిపేట జిల్లా.
ఫోన్: 9440617611

-డా॥నాళేశ్వరం శంకరం
m : 9440451960
e : naleshwaramshankaram@gmail.com



## తాజా గజల్

కరకు రాతి గుండెలోన కరుణ దొరుకుతుందా
చెరకు రసం ఎప్పుడైనా విషం చిలుకుతుందా

నిప్పులనెగజిమ్మే విష తత్వమున్న మనిషికి
సరసు లాంటి చల్లనైన బతుకు దొరుకుతుందా

అందమైన హృదయానికి అడ్డు ఏది లేదులే
మొండితనానికి గుప్పెడు అండ దొరుకుతుందా

ఉద్యమమై హృదయమెపుడు ఉరకలు వేస్తుంటే
అడుగడుగున అలజడిలో శాంతి దొరుకుతుందా

ఉదయాన్నే ఆపాలని వెర్రి కలలు కంటుంటే
చీకటి బ్రతుకులలోన వెలుగు దొరుకుతుందా

అన్యాయం ఎన్నటికీ గెలవదులే 'తిరునగరీ'
అవినీతికి కొంచెమైనా విలువ దొరుకుతుందా

-తిరునగరి శ్రీనివాస స్వామి
m : 9440369939
e : thirunagari6666@gmail.com


**పత్రికలు - పరిచయం:**
గమనిక: ఈ శీర్షికలను ప్రచురించేందుకు ఆయా పత్రికలు, ప్రత్యేక సంచికల వివరాలను మాకు తెలియ జేయగలరు.

**తెలంగాణ**
**ప్రధాన సంపాదకులు :**
**అష్టకాల రామ్మోహన్**




**ఫోన్: 040-23310098**

**చంపక్**
**సంపాదకులు :**
**పరేష్ నాథ్**




**ఫోన్: 040-27896947**

**బాల చెలిమి**
**సంపాదకులు :**
**వేదకుమార్ మణికొండ**




**ఫోన్: 9030 6262 88**


**మోదుగుపూలు**
**సంపాదకులు :**
**భూపతి వెంకటేశ్వర్లు**




**ఫోన్: 040-27668027**



**సదాశివ కావ్యసుధ**
సంపాదకులు : కే. నారాయణ గౌడు
ప్రచురణ : తెలుగు సాహితీ సదస్సు
వెల : రూ. 150
ప్రతులకు : నవోదయ బుక్ హౌస్, విశాలాంధ్ర బుక్ హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్‌లలో లభించును




**అఖ్లన్ కన్ను (కథలు)**
అనువాదం : తుమ్మూరి రాంమోహన్ రావు
ప్రచురణ : నేషనల్ బుక్ ట్రస్ట్
వెల : రూ.25
ప్రతులకు : నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా నెహ్రూ భవన్, 5 ఇన్స్టిట్యూషనల్ ఏరియా, ఫేజ్-2, వసంత కుంజ్, న్యూఢిల్లీ.




**ఆలోకనం (తెలంగాణ జిల్లాల చరిత్ర)**
సంపాదకులు : డా. సాగి కమలాకర శర్మ
వెల : రూ. 500
ప్రతులకు : మూసీ మాసపత్రిక
2-2-1109/బికె-ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, భాగ్అంబర్‌పేట, హైదరాబాద్
ఫోన్: 9347971177



**గజల్‌సుమాలు**
సంపాదకులు : వాహెద్
ప్రచురణ : జ్యోతిర్మయి తెలుగు గజల్ అకాడమీ బుక్స్
వెల : రూ.200
ప్రతులకు : జ్యోతిర్మయి తెలుగు గజల్ అకాడమీ, విశాఖపట్నం, ఫోన్: 9959912541




**హరివిల్లు (కవిత్వం)**
రచన : సంకేపల్లి నాగేంద్రశర్మ
ప్రచురణ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
వెల : రూ.120
ప్రతులకు : ఇం.నెం.6-6-1031/1, శివాజ నగర్, కరీంనగర్-505001. ఫోన్: 0878-2220444



**నీళ్లగోస (కవిత్వం)**
సంపాదకులు : బైస దేవదాసు
ప్రచురణ : నేటి నిజం
వెల : రూ.150
ప్రతులకు : నేటి నిజం, తెలుగు డైలీ, ఎస్ఆర్‌టి-74, జవహర్ నగర్, హైదరాబాద్-20.
ఫోన్: 040-27662477




**జతగాళ్లు, కతగాళ్లు (కథలు)**
సంపాదకులు : కెం. మునిరాజు, గౌనోళ్ల సురేశ్‌రెడ్డి
ప్రచురణ : మంచి పుస్తకం
వెల : రూ.75
ప్రతులకు :12-13-439, వీధి నెం.1, తార్నాక, సికింద్రాబాద్-500 017
ఫోన్: 9490746614



**పయనపు దారుల్లో (యాత్రా సాహిత్యం)**
సంపాదకులు : పూదోట శౌరీలు
ప్రచురణ : మల్లవరపు వెలువరింతలు, బోధన్
వెల : రూ.100
ప్రతులకు : నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్ మరియు 1-2-740, హనుమాన్ మందిరం దగ్గర, రాకాసిపేట, బోధన్. ఫోన్: 9010153505



**ఉద్యమం ఉద్యమమే (కవిత్వం)**
రచన : డా॥ ఎస్వీ సత్యనారాయణ
ప్రచురణ : కన్నా-బన్ను ప్రచురణలు
వెల : రూ. 100
ప్రతులకు : నవచేతన బుక్ హౌస్, నవతెలంగాణ బుక్ హౌస్, విశాలాంధ్ర బుక్‌హౌస్, నవోదయ బుక్ హౌస్ (అన్ని బ్రాంచీలలో), ప్రధాన పుస్తక కేంద్రాలు.



**వీరుల పోరు గద్దె 'మేడారం' (చరిత్ర)**
సంపాదకులు: జయధీర్ తిరుమల రావు
ప్రచురణ: సాహితీ సర్కిల్
వెల: రూ.80
ప్రతులకు: 402, గరోండ అపార్ట్‌మెంట్స్, ఓ.యు. మెయిన్ గేట్ వద్ద, లేన్-1, డిడి కాలనీ, హైదరాబాద్.
ఫోన్: 9505661070. ప్రముఖ పుస్తక కేంద్రాలు



**కథలంటే మాకిష్టం**
ప్రచురణ : విజ్ఞాన ప్రచురణలు
వెల : రూ.75
ప్రతులకు : ప్రజా సైన్స్ వేదిక, ప్రచురణల విభాగం, 162, విజయలక్ష్మీనగర్, నెల్లూరు-524 004. ఫోన్: 9440503061



**షబ్నవీస్ జీవితం - సాహిత్యం**
సంపాదకులు : షబ్నవీస్ ఇందిరా రావు
ప్రచురణ : షబ్నవీస్ పబ్లికేషన్స్, హైదరాబాద్
వెల : రూ.100
ప్రతులకు : ఇం.నెం.34-39/3/4, వివేకానందపురం, సైనికపురి, సికింద్రాబాద్.
ఫోన్: 9989988226, 8547756042










*Photographer :*
**PAKIDE ARAVIND**


తెలంగాణలో ప్రముఖ చారిత్రక వెలుగులోకి తీసుకొచ్చిన ప్రముఖ చరిత్రకారుడు పకిడే అరవింద్. వరంగల్ జిల్లాలో ఉన్న అత్యంత పురాతన చారిత్రక ప్రదేశాల గురించి అధ్యయనం చేశారు. ప్రాచీన దేవాలయాలు, చెరువులను సందర్శించి అక్కడ లభించిన శాసనాలను కూలంకుషంగా పరిశీలించారు.

ఎంతో విలువైన సమాచారాన్ని సేకరించి శభాష్ అనిపించారు. తన పరిశోధనా క్రమంలోనే జన ప్రాచుర్యంలో లేని 100కు పైగా పురాతన కట్టడాలను, చారిత్రక ప్రదేశాలను గుర్తించారు. కాకతీయుల కాలంనాటి 50 ఆలయాలు, మెట్లబావులను గుర్తించి వాటి పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు.


























DECCAN LAND, Telugu Monthly Magazine 1st - June - 2019, ISSN 2581-3188
Postal Dates: 2nd & 3rd Every Month

RNI Regn. No. APTEL/2012/46784
Postal Permission, RNP/HD/1167/2018-2020


# ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ దశల ఎత్తిపోతల పథకం భారతదేశానికి గర్వకారణం – తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం బహుళార్థ సాధక ఎత్తిపోతల పథకం





శ్రీ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ గారు
గౌ॥ గవర్నర్, తెలంగాణ & ఆంధ్రప్రదేశ్



శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ గారు
గౌ॥ ముఖ్యమంత్రి, మహారాష్ట్ర



శ్రీ వైఎస్. జగన్మోహన్ రెడ్డి గారు
గౌ॥ ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్

ముఖ్య అతిథులుగా పాల్గొంటుండగా

**శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు** గారు

గౌ॥ ముఖ్యమంత్రి, తెలంగాణ గారి చేతుల మీదుగా

## కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నేడే ప్రారంభోత్సవం

తేది: 21 జూన్ 2019, సమయం : ఉదయం 10.30 గంటలకు
స్థలం: మేడిగడ్డ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.

తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి **శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు** గారు చేసిన భగీరథ ప్రయత్నం ఫలించి, బృహత్తర కాళేశ్వరం ప్రాజెక్టు నేడు ప్రారంభం కావడం తెలంగాణ ప్రజలందరికీ పండుగ రోజు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం నిర్మించిన రికార్డు సృష్టించడం భారతదేశానికి గర్వకారణం.

అంతర్రాష్ట్ర వివాదాలను స్నేహభావంతో పరిష్కరించుకుని, కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు సాధించి, అడ్డంకులన్నింటినీ చాకచక్యంతో అధిగమించి, కేవలం మూడేళ్ల అతి స్వల్ప వ్యవధిలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బహుళార్థక సాధక ప్రాజెక్టు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నేడే జాతికి అంకితం.



### కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా...

- 45 లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందుతుంది.
- ప్రతి ఇంటికి ప్రతి రోజు రక్షిత మంచినీరు అందించే 'మిషన్ భగీరథ' పథకానికి అవసరమైన నీటి సరఫరా జరుగుతుంది.
- కోటి జనాభా కలిగిన గ్రేటర్ హైదరాబాద్ మహానగరానికి ప్రతీ రోజు మంచినీరు అందుతుంది.
- రాష్ట్ర వ్యాప్తంగా వేలాది పరిశ్రమలకు కావాల్సిన నీటిని అందిస్తుంది.
- జల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం కలుగుతుంది.

### భారతదేశ నీటి పారుదల రంగం చరిత్రలో కాళేశ్వరం ప్రాజెక్టు సృష్టిస్తున్న కొత్త రికార్డులు

- ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా 139 మెగావాట్ల గరిష్ట సామర్థ్యం కలిగిన పంపులు.
- ప్రపంచంలోనే అతిపొడవైన 203 కిలోమీటర్ల సొరంగ మార్గం.
- ఒక రోజుకు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోయగలిగిన ప్రాజెక్టు మొత్తం ప్రపంచంలో కాళేశ్వరం ఒక్కటే. వచ్చే ఏడాది నుంచి మూడు టీఎంసీల నీటిని ఎత్తిపోయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.
- ఒకే ఒక ప్రాజెక్టు ద్వారా 45 లక్షల ఎకరాలకు సాగునీరు, వేలాది గ్రామాలకు మంచినీరు, వందలాది పరిశ్రమలకు నీరు అందించడం ప్రపంచంలో ఇదే ప్రథమం.
- గోదావరి నీటిని 92 మీటర్ల ఎత్తు నుండి వివిధ దశల్లో నీటిని ఎత్తిపోసి, ఎక్కడికక్కడ ఆయకట్టుకు నీరందిస్తూ, చివరికి 618 మీటర్ల ఎత్తు వరకు నీటిని పంపడం ఇదే ప్రథమం.

### 92 మీటర్ల నుంచి 618 మీటర్ల దాకా దశల వారీ ఎత్తిపోతలు

| ప్రాంతం | ఎత్తు (మీటర్లలో) | లిఫ్టు చేసే ఎత్తు (మీటర్లలో) | నీటి వినియోగం టి.ఎమ్.సి. |
|---|---|---|---|
| మేడిగడ్డ | 92 | | 16.7 |
| ఎల్లంపల్లి | 148 | 56 | 75 |
| మిడ్ మానేరు | 318 | 170 | 25.873 |
| శ్రీరాం సాగర్ | 332.54 | 14.54 | 200 |
| మలక్‌పేట్ | 432.50 | 127.5 | 8.6 |
| అనంతగిరి | 397 | 95 | 3 |
| రంగనాయక్ సాగర్ | 490 | 117 | 11 |
| మల్లన్న సాగర్ | 557 | 103 | 108 |
| కొండ పోచమ్మ సాగర్ | 618 | 120 | 29 |

జారీ చేసిన వారు : కమీషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం


Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, St.No.11, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar